# స్థిరమైన పునాది

పరిశుద్ధ గ్రంథంలోని దేవుని గురించి

ప్రతి ఒక్కరూ తెలుసుకోవలసిన సంగతులు

జేమ్స్ డబ్ల్యు. నాక్స్

# విషయసూచిక

ముందుమాట ..................................................................... 5
దేవుడు త్రిత్వమై యున్నాడు ..................................................... 9
దేవుడు ఆత్మయై యున్నాడు ...................................................... 19
నిత్యుడైన దేవుడు ............................................................... 30
మారని దేవుడు ................................................................... 42
దేవుని శక్తి ....................................................................... 52
దేవుని న్యాయం .................................................................. 64
దేవుని పరిశుద్ధత ................................................................ 73
దేవుని సన్నిధి, జ్ఞానము ....................................................... 82
దేవుని ప్రేమ ...................................................................... 93
దేవుని విశ్వసనీయత .......................................................... 103
దేవుని వాక్యం (మొదటి భాగం) ............................................ 113
దేవుని వాక్యం (రెండవ భాగం) ............................................. 123
దేవుని వాక్యం (మూడవ భాగం) ............................................ 133
దేవుని సృష్టి .................................................................... 143
దేవుని క్రమం .................................................................... 155
పరిశుద్ధాత్మ దేవుడు ........................................................... 167
మాంసయుక్తమైన దేహమందు దేవుడు (మొదటి భాగం) ................ 177
మాంసయుక్తమైన దేహమందు దేవుడు (రెండవ భాగం) ................ 187
మాంసయుక్తమైన దేహమందు దేవుడు (మూడవ భాగం) ................ 198
మాంసయుక్తమైన దేహమందు దేవుడు (నాలుగవ భాగం) .............. 208
క్రీస్తు మానవత్వం .............................................................. 219
దేవుని కృప ...................................................................... 228

# ముందుమాట

మనం అత్యంత మతభక్తిగల లోకంలో జీవిస్తున్నాం. నిజానికి, ప్రతి ఒక్కరూ తాము లెక్కచెప్పవలసిన ఒక సృష్టికర్త ఉన్నాడనే అవగాహన కలిగివుండేలా దేవుడు అందరినీ సృజించాడు (రోమా 1). మనుష్యులందరికీ జీవమును, ఊపిరిని అనుగ్రహించువాడే (అపో.కా.17:25) ప్రతి ఒక్కరికీ తమ సత్యాన్వేషణను ఆరంభించడానికి కావలసిన వెలుగును కూడా అందించాడు (యోహాను 1:9).

ఏదిఏమైనా, ఈలోకంలో ఎంతోమంది దేవతలు, ఎన్నో విగ్రహాలు, సత్యం వైపుకు నడిపిస్తాయని భావించే మరెన్నో స్వయం-ప్రకటిత మార్గాలు ఉన్నాయన్న వాస్తవాన్ని బట్టి ఎక్కడో ఏదో భయంకరమైన తేడా జరిగిందని మనకు ఇట్టే అర్థం అవుతోంది.

సమస్య చాలా చిన్నదే. మానవుడు పతనమైన ప్రాణి. తమ ఆది పితరుడైన ఆదాము నుండి అతడు చెడు స్వభావాన్ని వారసత్వంగా సంతరించుకున్నాడు. అంతేకాకుండ, నిజమైన, పవిత్రమైన, నీతివంతమైన సమస్తాన్ని తిరస్కరించే ధోరణిని కూడా పుణికిపుచ్చుకున్నాడు. ఎవడైనా దైవస్పృహను పతనమైన స్వభావంతో జతకలిపితే వచ్చే ఒక ఖచ్చితమైన ఫలితం తప్పుడు మతమే.

దేవుడు మనిషిని తన స్వరూపంలో సృజించాడని, ఆరోజునుంచి మనిషి దేవుని రుణం తీర్చుకోవడానికి ప్రయత్నిస్తూనే ఉన్నాడని ఎవరో చక్కగా చెప్పారు. అంటే, మనిషి తన అభిరుచులకు, జీవనశైలికి లేదా నమ్మకాలకు అనుగుణమైన దేవుణ్ణి కనిపెడుతున్నాడన్న మాట. అప్పుడు వారిని "మీరు దేవునియందు నమ్మకం కలిగివున్నారా?" అని అడిగితే, "అవును ఖచ్చితంగా నమ్ముతాం" అంటారు. మీరు దేవునికి ఇష్టమైన జీవితాలు జీవిస్తున్నారా అని ప్రశ్నిస్తే, 'ఆ, అలాగే జీవిస్తున్నాం" అని ఘంటాపథంగా చెప్తారు.

వాళ్లు అబద్ధాలు చెప్పడంలేదు. వాళ్లకు లేనిదల్లా, నిజమైన, సజీవుడైన బైబిల్ దేవుడు వారికి దేవుడుగా లేడు అంతే.

అమెరికా దేశపు మాజీ అధ్యక్షుడైన బిల్ క్లింటన్ రాసలీలలు బయటపడినప్పుడు అతడు టివి కెమెరాలవైపు చూస్తూ నిస్సిగ్గుగా పలికిన మాటలు మీకు గుర్తుండే ఉంటాయి. అతని వ్యభిచారము, పలికిన అబద్ధాలు అన్నీ తన కుటుంబానికి *తమ దేవునికి* మధ్య ఉన్న వ్యక్తిగత వ్యవహారమంటూ కొట్టిపారేశాడు. “దేవుని గురించి అతనికి ఏం తెలుసు?” అని దేశమంతా ఆక్రోశంతో ప్రశ్నించింది. అలా అడిగేవాళ్లంతా ఒక విషయం గ్రహించలేక పోతున్నారు. బిల్ క్లింటన్‌కి ఒక దేవుడున్నాడు, అతని భార్య హిల్లరీకి ఒక దేవుడున్నాడు. ఫిడెల్ క్యాస్ట్రోకి ఒక దేవుడున్నాడు. చార్లెస్ డార్విన్‌కి ఒక దేవుడున్నాడు. అడాల్ఫ్ హిట్లర్‌కి ఒక దేవుడున్నాడు. ఈ పుస్తకాన్ని చదివే ప్రతి ఒక్కరికీ కూడా ఒక్కో దేవుడున్నాడు.

బైబిల్‌ని నమ్మే క్రైస్తవ్యం తమ దేవుడుగా చెప్పుకుంటున్న దేవుడు ఎవరో అన్నది పరిశుద్ధ గ్రంథంలో నుంచి తేటగా చూపించడమే మా ఉద్దేశం. బ్యాప్టిస్ట్‌ల దేవుని గురించి తెలుసుకోవాలని మాకు లేదు. కేథలిక్ దేవుణ్ణి కూడా మేం తెలుసుకోవాలనుకోవడం లేదు. బుద్దిస్ట్, ముస్లిం, లేదా మోర్మాన్ల దేవుని గురించి కూడా మాకు తెలుసుకోవాలని లేదు. దేవుని వాక్యంలో ఉన్న దేవుని గురించే మేము తెలుసుకోవాలనుకొంటున్నాం.

ఈ పాఠాలలో మనం పరిశుద్ధ లేఖనాలను పరిశోధించి దేవుని గుణలక్షణాలుగా పిలువబడే వాటిని అధ్యయనం చేస్తాం. మన దేవుడు ఏమై యున్నాడో దానిని వివరించే గుణగణాలివి.

ఈ పుస్తకాన్ని ప్రచురించడంలో మాకు రెండవ ఉద్దేశం ఉంది.

దేవుడు అనే సిద్ధాంతం మీద, దేవుని లక్షణాలమీద ఎన్నో మంచి పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. అయితే ఈ పుస్తకాలతో రెండు సమస్యలున్నాయి: ఒకటి లాభాపేక్ష, రెండవది ఆ కారణంగా పెరిగిన ధరలు.

ఏ రచయిత అయినా, తన రచనకు తగిన పారితోషికం తీసుకోవడానికి అర్హుడే. ఏ పరిచర్య అయినా తన ప్రయాసకు అయిన ఖర్చులు రాబట్టుకునే హక్కు కలిగివుంటుంది. అయితే, వారి మెటీరియల్ ఎవరికి ఎక్కువగా అవసరమవుతుందో వాళ్లకే అందుబాటులో ఉండదు.

మా ఆశ ఏమిటంటే, జైళ్లలో, ఆసుపత్రులలో ఉండేవారికి అవసరమైన ఒక పుస్తకాన్ని తయారుచేయాలని, అది వారికి అందుబాటులో ఉండాలని, నిరుపేద దేశాలలో ఉన్న విశ్వాసులకు అవసరమైన పుస్తకం అందుబాటులోనికి

తేవాలని మా ఉద్దేశం. ఇలాంటి పుస్తకాలు రాసిన గ్రంథకర్తలు తమ పుస్తకాలను ఇతర భాషలలోనికి తర్జుమా చేయించడాన్ని తిరస్కరిస్తున్నారని (ఎందుకంటే వారి ఆదాయం పోతుంది కాబట్టి) తెలుసుకొన్న మేము అలాంటి పుస్తకాలను ముద్రించి, వాటిని వినియోగించేవారికి అందుబాటులోనికి తెచ్చి, నశించినవారికి సువార్త ప్రకటించడానికి, రక్షణపొందిన వారిని బలపరచడానికి పూనుకోవాలన్న ఒత్తిడి మాపై అధికమైంది.

ఈ పుస్తకాన్ని ప్రచురించడంలో మా మూడవ కారణం – రక్షణలేకుండా భక్తిగా జీవించేవారిని యేసుక్రీస్తు ప్రభువుయొక్క రక్షణజ్ఞానంలోనికి తీసుకురావడం. ప్రత్యేకించి నిజదేవుణ్ణి తెలుసుకోవాలని వెదికేవారికోసమే ఈ పుస్తకాన్ని రాశాం. అలాంటి అన్వేషకుడు లోకరక్షకుని కనుగొనడంలో ఈ పుస్తకం సహాయపడుతుంది.

ఇందుకోసమే దీని రచనా శైలి సూటిగా, సామాన్యంగా ఉండి, ప్రతి అధ్యాయం సువార్త విన్నపంతో ముగుస్తుంది. ఈ కారణం చేతనే ప్రతి అధ్యాయంలో తగినన్ని ఉదాహరణలు, వాదనలు ఇవ్వడానికి ప్రయత్నించాం. అయితే వీటిని అవసరమైన మేరకే పరిమితం చేసాం. ఇందులోని పాఠాలలో ఏదీకూడా విస్తారంగా ఉండదు గానీ, నిజాయితీగా చదివే పాఠకుని ఒప్పించడానికి తగినంతగా ప్రతి అధ్యాయం ఉంటుందని మా నమ్మకం.

అనేక సంవత్సరాల క్రితం, చైల్డ్ ఎవాంజలిజం ఫెలోషిప్‌వారి ప్రాంతీయ నాయకులతో కలిసి పనిచేస్తున్నప్పుడు, మా సంఘస్తులు సిఇఎఫ్ వ్యవస్థాపకులైన జె. ఇర్విన్ ఓవర్‌హోల్టజర్ రాసిన “ద డాక్ట్రిన్ ఆఫ్ గాడ్” అనే ఒక చిన్న పుస్తకాన్ని ఉపయోగించేవారు. ఈ చిన్నపుస్తకం ద్వారా దేవుని గుణలక్షణాల గురించిన బైబిల్ సత్యాన్ని బోధించేందుకు రూపొందించారు. దీన్ని ఎంత తేటగా, సామాన్యంగా రాసారంటే, చిన్నపిల్లలకు సహా ఈ బైబిల్ సత్యాలు ఇట్టే అర్థమవుతాయి.

ఈ పుస్తకం యొక్క సంక్షిప్త వివరణను ఉపయోగించడానికి నేను అనుమతి పొంది, దాన్ని ఆధారం చేసుకొని “ ద ప్రీచింగ్ ఆఫ్ ద క్రాస్” (సిలువ సందేశం) పేరిట 24 రేడియో కార్యక్రమాలను తయారుచేసాను. ఇప్పటివరకు వాటిని రేడియో ప్రసారాల ద్వారా, కేసెట్ల ద్వారా ఆరు ఖండాలలోని శ్రోతలు విన్నారు.

ఈ రికార్డింగ్‌లకు స్పందనగా, జైలు అధికారులు, సంఘకాపరులు, విదేశాలకు చెందిన బోధకులు వీటిని ముద్రణారూపంలో లభిస్తాయా అని అడగసాగారు.

రేడియో ప్రసారాలు, పుస్తక ప్రచురణ, చదువుకునే స్వేచ్ఛను సాధ్యం చేసిన అనేకుల ప్రార్థనలు, త్యాగపూరిత కానుకలను బట్టి వారందరికి ప్రత్యేక కృతజ్ఞతలు. వారివల్లనే ఈ పుస్తకాలు అందరికీ అందుబాటులోనికి వచ్చాయి.

సమస్త మహిమ దేవునికే చెల్లును గాక.

# దేవుడు త్రిత్వమై యున్నాడు

నేడు ప్రపంచంలో అనేకమంది దేవుడున్నాడని నమ్ముతారు. అనేకులు దేవుని సేవించేవారున్నారు. అయినప్పటికీ, విచారకరమైన విషయం ఏమిటంటే, వారి దేవుడు నిజమైన సజీవుడైన దేవుడు కాదు.

అన్ని రకాల మతాలు, మిథ్యల మధ్య ఏ దేవుడు నిజమైన దేవుడో మనకు ఎలా తెలుస్తుంది? అత్యంత ప్రాముఖ్యమైన ఆ ప్రశ్నకు జవాబునివ్వడానికే దేవుడు తన వాక్కును మనకు అనుగ్రహించాడు. పరిశుద్ధ గ్రంథంలో మనకు సాక్షాత్తు జీవముగల దేవుని మాటలున్నాయి. ప్రపంచవ్యాప్తంగా ఉన్న స్త్రీ పురుషులకు దేవుడు తనకు తానే బైబిల్లో ప్రత్యక్షపరచుకున్నాడు.

ఈ పాఠాల పరంపరలో, దేవుని గురించి నేను ఏమనుకుంటున్నానో అది మీకు చెప్పడం లేదు, అలాగే ఏదైనా ఒక సంఘానికి చెందిన ఆదేశాలన, లేక శాఖాపరమైన విశ్వాసప్రమాణాలనో నేను మీకు ఇవ్వబోవడంలేదు. అయితే నేను బైబిల్‌ని అనగా దేవుని వాక్కును తెరచిచూపిస్తాను, ఆ దేవుని వాక్యంలోనుంచే దేవుడు ఎలా వుంటాడో మనం చూడబోతున్నాం.

సాధారణంగా ఏ వ్యక్తియైనా కలిగివుండే ఆధ్యాత్మిక దృక్పథం అతడు దేవుని పట్ల కలిగివుండే భావనమీదే ఆధారపడివుంటుంది. చాల తరచుగా ఆ వ్యక్తి తన ఊహలకు అనుగుణంగానే ఒక దేవుణ్ణి సృష్టించుకుంటాడు. దేవుని గూర్చిన అతని ఆలోచనలన్నీ కొంతవరకు బైబిల్లోనుంచి, ఇతర వనరులనుంచి, మతాలనుంచి, ఒక విశ్వాసప్రమాణం నుంచి, తల్లి దండ్రులనుంచి, ఒక తెగ, జాతి ప్రభావంనుంచి కూడా పొందివుండవచ్చు. దోషసహితమైన రకరకాల మిశ్రమంగా చేయబడిన సత్యము లేక వివిధ అభిప్రాయాలతో కూడిన సత్యము అత్యంత ప్రమాదకరం.

దేవుడు ఎవరు, ఆయన ఎలా వుంటారు అనేది బైబిల్లో నుంచే నిర్ధారించడమే ఈ అధ్యయనాల ఉద్దేశం. దేవుడు ఉన్నాడు అని మేము నిరూపించడానికి ప్రయత్నించం. లేఖనాల ప్రకారం ఇది మనుషులందరికీ స్వతహాగా తెలిసిన

విషయమే. (రోమా 1, యోహాను 1:9 చూడండి). వాస్తవానికి, దేవుడున్నాడు అని నమ్మని ఒకే ఒక వ్యక్తి గురించి బైబిల్లో చెప్పబడింది. కీర్తనలు 14:1లో బైబిల్ ఇలా చెప్తుంది: దేవుడు లేడు అని బుద్ధిహీనుడు తన హృదయంలో అనుకున్నాడు.

ఆవిధంగా చూస్తే, నీవొక బుద్ధిహీనుడవు అయితే తప్ప, దేవుడున్నాడని నీకు తెలుసు, ఆ విషయాన్ని నీవు నమ్ముతావు. దేవుని ఉనికిని నిరూపించడానికి బైబిల్ ఏవిధమైన ప్రయత్నమూ చేయదు, ఎందుకంటే, మనుష్యులందరికీ తమ హృదయపు లోతుల్లో తెలుసు– దేవుడు ఉన్నాడు అని.

మా ప్రశ్నలు చాలా సామాన్యమైనవి. ఈ దేవుడు ఎవరు? ఆయన గుణ లక్షణాలు ఏవి? ఆయన గుణశీలం గురించి మనకు ఏం తెలుసు? మన గౌరవం, నివాళి, ఆరాధనకు ఆయన యోగ్యుడేనా?

1. దేవుడు ఒక్కడే ఉన్నాడు. బైబిల్లో ఉన్న దేవుడు తప్ప, తక్కిన దేవతలుగా పిలువబడుతున్న వాళ్లంతా కేవలం విగ్రహాలే. ఒకే ఒక సజీవుడైన దేవునికి చెందవలసిన నివాళిని మనుష్యులు కొన్ని వస్తువులకు, జీవులకు అవి వాస్తవమైనా, ఊహాజనితమైనా, వాటికి ఆపాదించారు. అంతమాత్రాన అవన్నీ దేవుడు కాలేవు.

యెషయా 44:6లో లేఖనము ఇలా సెలవిస్తోంది, “ఇశ్రాయేలు రాజు, అతని విమోచకుడు, సైన్యములకు అధిపతియునైన యెహోవా ఈలాగు సెలవిచ్చుచున్నాడు; నేనే మొదటివాడను, నేనే కడపటివాడను, నేను తప్ప వేరొక దేవుడు లేడు.” అదే అధ్యాయంలో 8వ వచనం ఇలావుంటుంది: “నీవు భయపడకు ము జడియకుము: ఆ కాలము నుండే నేను మీకు చెప్పలేదా, దానిని నేను మీకు ప్రకటించలేదా? మీరే నాకు సాక్షులు. నేను తప్ప వేరొక దేవుడున్నాడా? లేడు. నాకు తెలిసి ఎవ్వరూ లేరు.”

మనుష్యులే దేవుడిని తయారుచేస్తారు అనేవిషయం యెషయా 44వ అధ్యాయమంతటా మన గమనానికి పదేపదే వస్తుంది. వారు తమ హస్తాలతో వాటిని రూపిస్తారు. అయితే దేవుడు తనను తాను ఏకైక దేవునిగా, మొదటి, కడపటివానిగా పిలుచుకొంటూ, ఆయన తప్ప వేరొక దేవుడు లేడని ప్రకటిస్తున్నాడు. అవును, ఆయన తప్ప ఇంకెవరూ లేరు.

2. ఈ ఏకదేవుడు త్రిత్వమైయున్నాడు. అనగా, ఒకనియందే ముగ్గురు, ముగ్గురిలో ఒక్కరు.

ఈ గొప్ప అద్భుత సత్యాన్ని తెలిపే లేఖనాలన్నిటినీ మనం తీసుకోలేము

గాని, బైబిల్ ఒక్కసారి మాట్లాడితే చాలు. కాబట్టి, మనం ఒకటి కాదు, దేవుని వాక్యంలోనుంచి అనేక వచనాలను తీసుకొని, దేవుడు నిజంగా త్రియేక దేవుడై యున్నాడు మీకు చూపిస్తాం.

దేవుడు త్రిత్వమై యున్నాడనే పదజాలం పాఠకులలో అనేకులు వినివుంటారు. "త్రిత్వము" అనే పదం బైబిల్లో కనిపించకపోయినా, ఆ సిద్ధాంతం మాత్రం బైబిల్ పుటలలో ఖచ్చితంగా లభిస్తుంది. జేమ్స్.డబ్ల్యు.నాక్స్ అనే నా పేరు దేవుని వాక్యంలో కనిపించదు, అయినా బైబిలంతటా నేను కనిపిస్తాను.

"అందరూ పాపము చేసిన దేవుడు అనుగ్రహించే మహిమను పొందలేకపోతున్నారు" (రోమా 3:23). అది నేనే. "ఆయనను స్వీకరించిన వారందరికీ దేవుని పిల్లలుగా అయ్యే అధికారం ఆయన అనుగ్రహించాడు" (యోహాను 1:12). అక్కడ కూడా నేనే. ఫలానా పేరుతో నేను కనబడకపోవచ్చు గాని, బైబిల్ అంతటా నేనున్నాను. అదేవిధంగా, బైబిల్ ఆరంభం నుంచి అంతం వరకు దేవుడు త్రిత్వమని మనము కనుగొంటాం. అయితే ఆ పేరు లేఖనాలలో మనకు కనపడకపోవచ్చు.

1 యోహాను 5:7లో పరిశుద్ధ గ్రంథము ఇలా ప్రకటిస్తోంది: పరలోకంలో సాక్ష్యము చెప్పువారు ముగ్గురున్నారు, తండ్రి, వాక్యము, మరియు పరిశుద్ధాత్మ. అయితే ఈ ముగ్గురు ఒక్కటే.

ఇది చాల తేటగా ఉంది. వారిని లెక్కించండి: తండ్రి, ఒకటి: వాక్యము, రెండు; పరిశుద్ధాత్మ, మూడు. ఇప్పుడు వారిని కలపండి. ఒకటి ప్లస్ ఒకటి ప్లస్ ఒకటి కలిపితే మొత్తం ఒకటికి సమానం.

"ఇది నాకు పూర్తిగా అర్థం కాలేదు" అని మీరు అనొచ్చు. అదృష్టవశాత్తు దేవుడు తనని పూర్తిగా, సంపూర్ణంగా అర్థంచేసుకోమని మనల్ని అడగలేదు. ఆయన మాటను కేవలం నమ్మాలని, ఆయనగురించి బైబిల్ ఏం చెబుతుందో దాన్ని విశ్వసించాలని మాత్రమే ఆయన మనల్ని కోరుతున్నాడు.

ఇప్పుడు మరల ఆదికాండం 1వ అధ్యాయంలోనికి వెళ్లి, అక్కడ సృష్టి విషయంలో దేవుడు తనగురించి తాను ఏమని చెప్తున్నాడో చూడండి. 26వ వచనంలో దేవుడు ఇలా చెప్పాడు: **"మన** (గమనించండి, ఒక్కడైయున్న దేవుడు బహువచనంలో "మన" అంటున్నాడు) **స్వరూపమందు మన** (బహువచనం) **పోలిక** (ఏకవచనం) **చొప్పున నరులను చేయుదము** (బహువచనం)". ఆ తర్వాత 27వ వచనం ఇలా ఉంటుంది, **"దేవుడు** (ఏకవచనం) **తన** (ఏకవచనం)

**స్వరూపమందు నరుని సృజించెను; దేవుని స్వరూపమందు వాని సృజించెను; స్త్రీనిగాను, పురుషునిగాను వారిని సృజించెను."**

ఆవిధంగా, బైబిల్లోని మొదటి అధ్యాయంలోనుంచి గమనిస్తే, దైవత్వంలో ఒకరికంటె ఎక్కువమంది ఉన్నారని స్పష్టమవుతుంది.

ఇప్పుడు ఆదికాండం 3వ అధ్యాయం 22వ వచనాన్ని చూద్దాం. ఆదాము, అతని సతీమణి నిషిద్ధమైన ఫలం తినడం ద్వారా పాపం చేసిన తరువాత, **"అప్పుడు దేవుడైన యెహోవా** (ఏకవచనం) **ఇదిగో మంచి చెడ్డలను ఎరుగునట్లు, ఆదాము మనలో** (బహువచనం) **ఒకనివంటివాడాయెను."**

ఆదికాండం 11వ అధ్యాయంలో బాబెలు గోపురం సంఘటన మనకు కనబడుతుంది. దాని విషయమై బైబిల్ ఇలా చెబుతుంది: **"యెహోవా నరుల కుమారులు కట్టిన పట్టణమును గోపురమును చూడ దిగివచ్చెను. అప్పుడు యెహోవా ఇదిగో జనము ఒక్కటే; వారికందరికి భాష ఒక్కటే; వారు ఈ పని ఆరంభించియున్నారు. ఇకమీద వారు చేయదలచు ఏపనియైనను చేయకుండ వారికి ఆటంకమేమియు నుండదు గనుక మనము దిగిపోయి వారిలో ఒకని మాట ఒకనికి తెలియకుండ అక్కడ వారి బాషను తారుమారు చేయుదము రండని అనుకొనెను. ఆలాగు యెహోవా అక్కడనుండి భూమియందంతట వారిని చెదరగొట్టెను గనుక వారు ఆ పట్టణమును కట్టుట మానిరి."** (ఆది. 11:5-8).

గమనించండి, ఒక్కడైయున్న దేవుడు (ఏకవచనం) బైబిల్లోని మొదటి పదకొండు అధ్యాయాలలో మూడుసార్లు బహువచన రూపంలో మాట్లాడినట్లు చూస్తున్నాం. మానవుడిని సృజించడంలోను, తోటలోనుంచి వారిని తోలివేయడంలోను, భూమిమీద వారిని చెదరగొట్టడంలోను ఒకరికంటె ఎక్కువమంది ప్రస్తావన మనకు కనిపిస్తుంది.

"అది, పాతనిబంధన, ఎక్కడో ఆదికాండంలో ఉన్న విషయం" అని మీరు అనవచ్చు.

సరే, ఇప్పుడు క్రొత్త నిబంధనను ఒకసారి చూద్దాం.

మత్తయి 28:19లో యేసు క్రీస్తు ఇలా చెప్పాడు: "మీరు సర్వలోకమునకు వెళ్లి సమస్త జనులకు సువార్త ప్రకటించండి. తండ్రి కుమార పరిశుద్ధాత్మ నామములోనికి వారికి బాప్తిస్మమివ్వండి." ఈ మాటల అర్థాన్ని వివిధ రకాల "క్రైస్తవ" శాఖలవారు వేరువేరుగా తీసుకొనవచ్చు గాని, త్రిత్వము అనే సూత్రాన్ని మొదట ప్రవేశపెట్టింది దేవుని కుమారుడే అని మనం గ్రహించాలి.

మరల, మత్తయి సువార్తలోనే, యేసు ప్రభువువారి బహిరంగ పరిచర్య ఆరంభంలో మత్తయి 3:16లో బైబిల్ ఇలా చెప్తుంది: యేసు బాప్తిస్మము పొంది, నీటిలోనుండి బయటికి వచ్చినప్పుడు: ఆకాశములు తెరువబడుట, దేవుని ఆత్మ పావురమువలె ఆయన మీదికి దిగివచ్చుట చూచెను. మరియు ఈయన నా ప్రియకుమారుడు, ఈయనయందు నేను బహుగా ఆనందించుచున్నాను అని ఆకాశమునుండి ఒక స్వరము పలుకుట వినబడెను". ఇక్కడ ఆకాశము నుండి తండ్రి మాట్లాడుట, కుమారుడు నీటిలో ఉండుట, ఆత్మ పావురము వలె ఆయనమీదికి దిగివచ్చుట కనిపిస్తోంది.

మనకున్నది ఎవరంటే, ఒక్కడే దేవుడు తండ్రిగా, వాక్యముగా, మరియు పరిశుద్ధాత్మగాను బయలుపరచబడెను." (1యోహాను 5:7)

3. మొదటి పాయింటులో మనకు ఒక్కడే దేవుడు ఉన్నాడు అని చెప్పాం. ఇది లేఖనముల సాక్ష్యము అని చూసాం. తక్కినవారంతా విగ్రహాలు. మన రెండవ పాయింటులో, ఈ ఒక్కడైయున్న దేవుడు త్రిత్వమైయున్నాడని, త్రియేక దేవుడని, ఒక్కడే ముగ్గురుగా ఉన్నాడని చూసాం. దేవుడు మానవుని తన స్వరూపమందు సృజించాడని, మనిషి కూడా శరీరము, ప్రాణము, ఆత్మను కలిగి ఒక్కడే ముగ్గురుగా, ముగ్గురు ఒక్కడిగా ఉన్నాడని ఇప్పుడు మీకు విన్నవిస్తున్నాం.

ఒక విగ్రహము దేని రూపంలో చేయబడిందో దానివలె వుంటుంది కాని, అచ్చం అలాగే వుండదు. **"మన స్వరూపమందు మనపోలిక చొప్పున నరులను చేయుదము"** అని దేవుడు చెప్పాడని ఆదికాండము 1:26లో మనం గమనించాం. కాబట్టి, దేవుడు త్రిత్వమై వుంటే, మనిషి కూడా తనను సృజించిన దేవుని వలె త్రిత్వ రూపము కలిగివుండాలని బైబిల్లో మనం చూడగలం.

1 థెస్స 5:23లో బైబిల్ ఇలా ప్రకటిస్తోంది: "సమాధానకర్తయగు దేవుడు మిమ్మును సంపూర్ణముగా పవిత్రపరచునుగాక; మన ప్రభువైన యేసుక్రీస్తు రాకడ వరకు దేవుడు మీ ఆత్మను, ప్రాణమును, శరీరమును నిందారహితముగా కాపాడునట్లు నేను మీకొరకు ప్రార్థనచేయుచున్నాను." ఇక్కడ ముగ్గురు వ్యక్తులున్నారా? అవును ఒక్కడే అయున్న ముగ్గురున్నారు, ముగ్గురైయున్న ఒక్కడున్నాడు. అనగా దేవుని స్వరూపంలో చేయబడిన మానవుడు త్రియేకముగా వున్నాడని అర్థం.

మనుష్యులు బైబిల్ సత్యాన్ని తృణీకరించేలా సాతానుడు ఎంతోమందిని

మోసగించడం చూస్తుంటే ఆశ్చర్యంగా వుంటుంది. దేవునియందు విశ్వాసముంచేవారు ఎంతోమంది ఉన్నారు కానీ, వారిలో అనేకులు త్రిత్వ సిద్ధాంతాన్ని నమ్మరు. అయినప్పటికి, అదే వ్యక్తులు మనిషి ప్రాణము, ఆత్మ, దేహము కలిగియున్నాడనే బైబిల్ సత్యాన్ని గుడ్డిగా నమ్మి, మానవుడు దేవుని స్వరూపంలో సృజించబడ్డాడు అని నమ్ముతారు.

కొందరికి ఉంగరాల జుట్టు ఉంటే, మరికొందరికి గోధుమరంగు జుట్టు, ఇంకొందరికి నల్ల జుట్టు ఉండటం నేను గమనించాను. కొంతమందికి చర్మం తెల్లగా వుంటే, మరికొందరు నల్లగా, గోధుమ వర్ణంలో ఉంటారు. మగవాళ్ల శరీరాలు, ఆడవాళ్ల శరీరాలు చూస్తుంటాం. అయితే నేను అడిగే ప్రశ్న ఏమిటంటే, వీళ్లందరిలో దేవుని స్వరూపంలో సృష్టించబడినవాళ్లు ఎవరు? దేవుని స్వరూపమనేది భౌతిక రూపం గురించి మాట్లాడదు. కవల పిల్లలు సైతం ఆకారంలో వేర్వేరు భౌతిక వ్యత్యాసాలు, ప్రత్యేకతలు కలిగివుంటారని మీకు తెలుసు.

మానవులంతా దేవుని స్వరూపంలో చేయబడ్డారు అన్నప్పుడు శారీరక రూపం గురించి అది మాట్లాడుతుందని చెప్పలేము, కానీ సంపూర్ణ మానవుడు అనగా ఆత్మ, ప్రాణము, దేహము అనే మూడు భాగాలుగా ఉన్న ఒకే మనిషి గురించి అది మాట్లాడుతుంది. కాబట్టి మానవునికి దేవుని గురించి బయలుపరచే దేవుని సృష్టినుంచి మనం గ్రహించేదేమనగా దేవుడు త్రిత్వమై యున్నాడు.

4. దేవుడు జీవముగల దేవుడు, మరియు అన్నివిధాలుగా ఆయన ఒక వ్యక్తి. ఇది తండ్రి, కుమారుడు, పరిశుద్ధాత్మ – ఈ ముగ్గురు విషయంలోనూ సత్యము.

ఇచ్ఛయించడమూ, ప్రేమించడమూ అనేవి మన వ్యక్తిత్వంలో ఉండే అద్భుత లక్షణాలు. గనుక దేవుడు ఈ రెండూ చేస్తాడు. ఉదాహరణకు, అత్యంత ప్రఖ్యాతిగాంచిన, అనేకసార్లు ప్రస్తావించబడే బైబిల్ వచనం యోహాను 3:16: **"దేవుడు లోకమును ఎంతో ప్రేమించెను. కాగా తన అద్వితీయకుమారునియందు విశ్వాసముంచు ప్రతివాడును నశింపక నిత్యజీవము పొందునట్లు ఆయనను అనుగ్రహించెను."**

మరల, యోహాను 6:39లో బైబిల్ ఇలా సెలవిస్తోంది: "ఆయన నాకు అనుగ్రహించిన యావత్తులో నేనేమియు పోగొట్టుకొనక, అంత్యదినమున దాని లేపుటయే నన్ను పంపినవాని చిత్తమైయున్నది."

ఇక్కడ కూడా దేవుడు 'చిత్తము'ను కలిగివున్నట్లు కనబడుతుంది. బైబిల్‌ని యధార్థంగా చదివే ఎవరికైనా సరే, ఒక వ్యక్తికి ఉండే అద్భుత లక్షణాలన్నీ (చిన్నవి, పెద్దవి) దేవుడు కలిగివున్నాడని ఇట్టే అర్థమవుతుంది.

నిజంగా ఆయన ఒక వ్యక్తి. ఆయన ఒక కొయ్య లేక రాతి బొమ్మ కాదు. ఆయన చెక్కిన శిల్పం కాదు. ఆయన సూర్యుడిలా ఒక గ్రహం కాదు. ఆయన సూర్య చంద్ర నక్షత్రాలు, లేక చెట్లు, రాళ్లు కాదు. దేవుడు ఒక వ్యక్తి. నీవు మాట్లాడగలిగిన వ్యక్తి ఆయన. ఆరాధనకు యోగ్యుడు. తనతో నడిచి సహవాసం చెయ్యగల వ్యక్తి ఆయన. ఏ ఇతర వ్యక్తిలాగే ఆయనను నీవు అత్యంత సన్నిహితంగా ఎరగగలిగినవాడు. దేవుడు ఒక వ్యక్తి.

వాక్యానుసారమైన క్రైస్తవ్యం గురించిన అమోఘమైన విషయం ఇది. మేము విశ్వాస ప్రమాణాలను, లేదా చర్చీలను పూజించం. మేము విగ్రహాలను గాని, ప్రతిమలను గాని పూజించం. మేము తయారుచేసిన, లేక మేము కనిపెట్టిన లేక ఉనికిలో లేని మా ఊహాకల్పితాలను మేము పూజించం. మా దేవుడు ఒక వ్యక్తి. ఆయన మాకు వ్యక్తిగతంగా తెలుసు. మేమాయనతో మాట్లాడతాం, నడుస్తాం, ఆయనతో సహవాసం కలిగివుంటాం.

దేవుడు ఉన్నాడని ఒప్పుకుంటూనే, ఆయన మానవులకు బయలుపరచుకున్నాడు అనే విషయాన్ని తిరస్కరించడం కేవలం ఆయన మన విశ్వాసానికి నమ్మకానికి పాత్రుడు కాదు అని ఆయనను అవమానించడమే అవుతుంది. దేవుడు మనిషిని తన స్వరూపంలో సృజించాడని మనం బైబిల్ ద్వారా తెలుసుకున్నాం. తనతో సహవాసం చెయ్యాలనే ఒక ఆరాటాన్ని, ఆశను మనిషిలో పెట్టాడు దేవుడు.

ఒక మనిషిని సృష్టించి, ఆ మనిషిలో తన సృష్టికర్తను తెలుసుకోవాలన్న ఆశను కలిగించి, ఆ తరువాత, మనిషికి తనను తాను తెలియపరచుకోకుండా ఉండే దేవుడు ఏ రకమైన దేవుడైయుంటాడు? మేము దేవుణ్ణి వెతికి, అన్వేషిస్తున్నామని మనుష్యులు భావించవచ్చుగాని, దేవున్ని వెతికి, అన్వేషించి, ఆయనను కనుగొని తెలుసుకోవాలన్న ఆశ తమలో ఉండటానికి గల ఒకే ఒక కారణం దేవుడే ఆ ఆశను వారిలో పుట్టించడమే. దేవుని తెలుసుకోవాలన్న మనిషి ఆశ మనిషిని దేవుడు తెలుసుకోవాలన్న ఆశతోనే మొదలవుతుంది.

దేవుణ్ణి తెలుసుకోవాలన్న నీ ఆరాటం కంటే, నీవు ఆయనను తెలుసుకోవాలన్న దేవుని ఆరాటమే గొప్పది. మనిషికి దేవుని ప్రత్యక్షత బైబిలే.

కొందరు భావిస్తున్నట్లుగా, బైబిల్ సత్యమైనది, ఖచ్చితమైనది, గ్రహించగలిగినది కాకపోతే, దేవుడు నిజంగా తనను తాను బయలుపరచుకోలేదనే చెప్పాలి.

"నిజమే, దేవుడు ఉన్నాడు, కానీ మనం నిజంగా, వాస్తవికంగా ఆయనను తెలుసుకోగలిగే మార్గమేదీ లేదు" అని చెప్పేవాళ్లు అనేకులు ఉన్నారు. అయితే అలాంటి మాట పూర్తిగా అబద్ధం. దేవుడు మనకు కావలసిన సమస్తాన్ని పరిశుద్ధ గ్రంథంలోనే అనుగ్రహించాడు. మనుష్యులు బైబిల్‌ని విడచిపెట్టినప్పుడే, వారు సాంప్రదాయాలను, శిలాఫలకాలను, విగ్రహాలను, ప్రతిమలను, మతాలను నిలబెట్టడం చేస్తారు. మనిషి చేసిన ఈ వస్తువులన్నీ మనిషిని దేవుని వద్దకు నడిపించవు కానీ, దేవునికి మరింత దూరంచేసి, అధికమైన పాపంలోనికి, అధికమైన దుర్మార్గతలోనికి, వక్రమార్గంలోనికి, మరింత నరహత్యలలోనికి, మారణహోమానికి, మరింత జారత్వములోనికి నడిపిస్తాయి. ఇన్ని చేస్తూనే తాను దేవుణ్ణి వెతుకుతున్నానని చెప్పుకుంటూనే, తన మార్గాన్ని మరింత కఠినముగా, కష్టముగా చేసినందుకు అదే దేవుణ్ణి మనిషి నిందిస్తూ ఉంటాడు.

స్నేహితులారా, ఇది అబద్ధం. లేఖనాలను నిజాయితీగా, యథార్థ హృదయంతో చదవడానికి ప్రయత్నించిన ఎవరైనా వివేచించి గ్రహించగలిగే సామాన్య పదాలలో దేవుడు తన ప్రత్యక్షతను పరిశుద్ధ గ్రంథపు పుటలలో మనకు అనుగ్రహించాడు. నీవు ఆయనను తెలుసుకోవాలన్నదే దేవుని కోరిక. నీవు ఆయనను తెలుసుకొనే మార్గాన్ని దేవుడు ఏర్పాటుచేసాడు. దేవుణ్ణి నీవు తెలుసుకోగలిగిన మార్గం పరిశుద్ధ గ్రంథ పుటలలో దేవుడు తన గురించి ఇచ్చిన ప్రత్యక్షతే.

నీవు బైబిల్‌ని యథార్థంగా, నిజాయితీగా, విశ్వాసముగల హృదయంతో చదివినట్లయితే, నీవు తప్పక దేవుని కనుగొంటావు.

త్రిత్వము, దేవుని వ్యక్తిత్వము ప్రాథమికంగా ఎంతో ప్రాముఖ్యమైనవి. అనేకులు భావిస్తున్నట్లుగా దేవుడు కేవలం ఒక పనిముట్టు అయితే, లేక న్యూ ఏజ్ మతం ప్రధానంగా బోధిస్తున్నట్లు ఆయన ఒక శక్తి అయినట్లయితే, ఆయన ఎవరినీ ప్రేమించలేడు, ఎవరి ప్రేమకూ ఆయన నోచుకోలేడు. బైబిల్ సందేశం యొక్క విశేషమంతా పోయినట్టే. ఒకవేళ దేవుడు త్రిత్వం కానట్లయితే, యేసు శరీరధారియైన దేవుడు కాదు, పరిశుద్ధాత్మలో దేవుని గుణలక్షణాలు ఉండవు.

ఈ పుస్తకాన్ని మనం చదువుతూ ఉండగా, మనకు అర్థమయ్యే బైబిల్ సందేశం ఏమిటంటే, నిన్ను సృజించిన ఏ పాపమైతే నిన్ను తన సహవాసం

నుండి తనకు దూరం చేసిందో ఆపాపం నుండి నిన్ను రక్షించడం కోసం, తన సొంత కుమారుణ్ణి అనుగ్రహించాడు.

ఆ కుమారుడే మానవశరీరంలో ప్రత్యక్షమైన దేవుడు అని బైబిల్ చెప్తోంది. నీవు పాపం నుంచి రక్షించబడి, నీ సృష్టికర్తతో సహవాసం కలిగివుండే మార్గాన్ని చూపడం కోసం ఆయన వచ్చాడు. ఆయన నిత్య**జీవము**గా ఉండుటకే వచ్చాడు.

మీరు గమనించవలసిన విషయం ఏమిటంటే, యేసు క్రీస్తు ప్రభువు అనే వ్యక్తిని నమ్మండి అని మేము మిమ్మల్ని అడిగినప్పుడు ఒక మత నాయకునియందు విశ్వాసముంచుమని మేము మిమ్మల్ని అడగటం లేదు. ఓ గొప్ప బోధకునియందు మీ నమ్మిక ఉంచండి అని మిమ్మల్ని అడగటం లేదు. ఒక మహానుభావుని అడుగుజాడల్లో నడవండి అనికూడా మేము మిమ్మల్ని కోరడం లేదు. మేం మీకు చెప్తున్నదేమిటంటే, **నీ సృష్టికర్త** దిగివచ్చి, నీ పాపముల కోసం తన ప్రాణాన్ని బలిగా అర్పించాడని మాత్రమే. మృతులలో నుండి తిరిగి లేచినది కూడా **నీ సృష్టికర్తయే.** ప్రభువైన యేసుక్రీస్తు అను **నీ సృష్టికర్తయే** నిన్ను ఆహ్వానిస్తున్నాడు– నీవు దేవుడు అనుగ్రహించే శాంతిని తెలుసుకొని, దేవునితో నిత్యత్వమును అనుభవించాలని నిన్ను పిలుస్తున్నాడు, ఎందుకంటే నిజంగా ఆయనే నీ దేవుడు.

యేసుక్రీస్తు ప్రభువు యొద్దకు నీవు వస్తావా? మీలో అనేకులు చర్చికి వచ్చారు, భక్తిమార్గంలోనికి వచ్చారు, ఒక తరగతి గదికి వచ్చారు, ఓ నిర్ణయానికి వచ్చారు, అయినా ఇప్పటికీ, మీకు దేవుడు ఎవరో తెలియదు. నీవు యేసు క్రీస్తు వద్దకు వస్తావా, ఆయనే ఏకైక దేవుడు, నిజ దేవుడు అని ఒప్పుకొని, నీ రక్షకునిగా ఆయనను అంగీకరిస్తావా?

నీకు దేవుని గురించి తెలుసా లేక నీకు దేవుడు తెలుసా? నీవొక వ్యక్తిని తెలుసుకోవచ్చు. దేవుడు ఒక వ్యక్తి. దేవుడు ఒక్కడే. ఆయన త్రియేక దేవుడు – తండ్రి, వాక్యము, పరిశుద్ధాత్మ. ఈ ముగ్గురు ఒక్కరే. నీవు దేవుని స్వరూపంలో సృజించబడ్డావు. నీవు ఒక ఆత్మ, ప్రాణము, దేహము కలిగినవాడవు. దేవుడు జీవము గలిగిన దేవుడు. అన్ని విధాలుగా ఆయన నీలాగే ఒక వ్యక్తి; దేవుడు అనే ఆ వ్యక్తి నీతో అత్యంత సన్నిహితమైన, నిత్య సహవాసం కలిగివుండాలని కోరుతున్నాడు.

నీకు ఆయన్ని తెలుసుకోవాలనే కోరిక ఉందా? అలాగైతే, దీనుడవై మోకరించి, యేసుక్రీస్తు నీ దేవుడని హృదయపూర్వకంగా ఒప్పుకొని, నీ పాపములను క్షమించుమని, తన ప్రశస్తమైన రక్తముతో వాటిని కడిగివేయమని

అడిగి యేసుక్రీస్తును నీ వ్యక్తిగత రక్షకునిగా స్వీకరించి, నీ సృష్టికర్తతో నీ సహవాసాన్ని తిరిగి పునరుద్ధరించుమని ప్రాధేయపడు.

# దేవుడు ఆత్మయై యున్నాడు

దేవుడు ఆత్మయై యున్నాడు (యోహాను 4:24). ఆత్మ ఒక జీవముగల వ్యక్తిత్వం, మానవ నేత్రాలకు కనిపించని అదృశ్యరూపం.

మానవుడు మర్త్యుడు. గనుక మనిషి తన పరిమిత దృష్టితో దేవుణ్ణి చూడలేడు.

మన చుట్టూ ఎటుచూచినా భౌతికవాదమే కనిపిస్తుంది. అనేకులు తాము చూడగలిగిన వాటినే నమ్ముతా మంటారు. అయితే 2 కొరింథీ 4:18లో బైబిల్ ఇలా సెలవిస్తోంది: "మేము కనిపించువాటిని కాక కనిపించనివాటినే చూస్తున్నాము: కనిపించేవి తాత్కాలికమైనవి కాగా కనిపించనివి నిత్యమైనవి."

దీని అర్థం ఏమిటంటే, కంటితో చూడగలిగినవాటినే నమ్మేవాడు అశాశ్వతమైన వాటిని నమ్ముతున్నాడు. దేవుని నమ్మే మాలాంటివారు, మేము దేవుణ్ణి చూడలేకపోయినా, పరలోకం గురించి ఆయన చెప్పిన మాటలను బట్టి మేము నమ్ముతాం- అది మాకు కనపడకపోయినా సరే. తిరిగి జన్మించడం గురించి ఆయన ఇచ్చిన ప్రత్యక్షతను మేము నమ్ముతాం అది దేవుని అదృశ్య కార్యమైనప్పటికీ. మా విశ్వాస నేత్రాలతో మేము చూచేవి నిత్యమైనవి. అవి మానుండి ఎన్నటికీ తీసివేయబడవు. దేవునికి స్తోత్రం.

మోషే ఇలాంటి విశ్వాసాన్నే కలిగివున్నాడు. అతని గురించి హెబ్రీ 11:27లో లేఖనాలు ఏమి చెప్తున్నాయో జాగ్రత్తగా చూడండి. "అతడు రాజు ఆగ్రహానికి భయపడకుండ, విశ్వాసమును బట్టి ఐగుప్తును వదులుకున్నాడు: అదృశ్యమైనవానిని చూస్తున్నట్టుగానే అతడు ఆ శ్రమలను సహించాడు."

గమనించండి, అతడు అదృశ్యమైనవానిని విశ్వాసముతో చూసాడు.

దేవుడు మానవ దృష్టికి కనిపించడు. ఇది నిజం కాకపోతే, ఆయన నిత్యుడు కానేరడు. ఎందుకంటే కంటికి కనిపించనివి నిత్యమైనవి.

దేవుడు మన కంటికి కనిపించకపోయినా, సజీవుడైయుండి తాను సృజించిన విశ్వాన్ని పరిపాలిస్తున్నాడు. అదృశ్యుడైనప్పటికీ ఆయన ఎంతో అద్భుతరీతిలో

తనను తాను బయలుపరుచుకున్నాడు: తాను చేసిన వస్తువులద్వారా, బైబిల్ ద్వారా, వ్రాయబడిన వాక్యముద్వారా, మరియు దేవుని వ్యక్తిత్వాన్ని ప్రకటించడానికి లేదా బయలుపరచడానికి శరీరధారిగా వచ్చిన తన కుమారుని ద్వారా అనేకరీతులుగా బయలుపరచుకున్నాడు.

యోహాను 1:18 చదువుదాం. "ఏ మనుష్యుడూ ఎన్నడూ దేవుని చూడలేదు; తండ్రిరొమ్మున ఆనుకొనివున్న జనితైక కుమారుడే ఆయనను ప్రకటించెను."

ఈ లేఖనభాగము దాదాపు అన్ని తర్జుమాలలోనూ వక్రీకరించి వ్రాయబడింది. మాకు ఇష్టమైన బైబిల్ అంటూ ఏదీ లేదు. ఆథరైజ్డ్ కింగ్‌జేమ్స్ వర్షన్ అంటే ప్రత్యేక అభిమానమేమీ లేదు. ప్రపంచంలో ఇంగ్లీషు మాట్లాడేవారికి అందుబాటులో ఉన్న దేవునివాక్యముగా మేము దాన్ని గుర్తిస్తాము. మరిముఖ్యంగా, కొత్త తర్జుమాలలో జరిగిన పెనుమార్పులు, చేర్పులను బట్టి అలా భావిస్తాం. యోహాను 1:18ని కొత్త తర్జుమాలలో చాలావరకు ఈ వాక్యాన్ని "జనితైక దేవుడు" అని ఉంటుంది. యేసుక్రీస్తు వేరొక దేవుడు అనే అర్థం వచ్చేలా వుంటుంది ఆ అనువాదం. ఇది పూర్తిగా తప్పు అని గత పాఠంలోనే మనం నిర్ద్వందంగా నేర్చుకున్నాం.

కుమారుడు తండ్రిని ప్రపకటించడం అనేది ఎలా సాధ్యం? అదే అధ్యాయంలోని 1వ వచనం ఇలా వుంటుంది: ఆదియందు వాక్యమున్నది, వాక్యము దేవునియొద్ద ఉన్నది, వాక్యమే దేవుడైయుండెను." అదే అధ్యాయం 14వ వచనంలో ఇలా చదువుతాం. "ఆ వాక్యము శరీరముగా చేయబడి కృపాసత్య సంపూర్ణుడుగా మన మధ్య నివసించెను. (మనము ఆయన మహిమను చూసాం. తండ్రియొక్క జనితైక కుమారుని మహిమవలె ఆయనను చూసాం.)

దేవుడు అదృశ్యుడు. అయితే వాక్యమైన దేవుడు తన ద్వారా దేవుడు ప్రకటించబడునట్లు మాంసయుక్తమైన దేహాన్ని ధరించాడు. ఆయన ఆత్మ గనుక మనము ఆయన్ని చూడలేము. గనుక దేవుడు తనమీద ఒక మానవ శరీరమనే ముసుగును ధరించాడు. తద్వారా ఆయనను చూడగలిగే అవకాశాన్ని మనకు కల్పించాడు.

1. దేవుడు ఆత్మయై యున్నాడు.

యోహాను 4వ అధ్యాయంలో, యేసు బావివద్ద ఉన్న స్త్రీతో మాట్లాడుతున్నాడు. 22-24 వచనాలలో ఆయన ఇలా అన్నాడు, "మీరు తెలియనిదానిని పూజిస్తున్నారు: మేము ఎవరిని పూజిస్తున్నామో మాకు తెలుసు:

రక్షణ యూదులనుంచే కలుగుతుంది. అయితే ఒక సమయం వస్తుంది, అది ఇప్పటికే వచ్చింది, అప్పుడు నిజముగా ఆరాధించేవారు తండ్రిని ఆత్మలో సత్యములో ఆరాధిస్తారు: తండ్రి అలాంటివారికోసమే చూస్తున్నాడు. దేవుడు ఆత్మయై యున్నాడు: గనుక ఆయనను ఆరాధించేవారు ఆత్మలోను సత్యములోను ఆరాధించాలి."

కొత్త అనువాదాలలో దొర్లిన తప్పులను ఎత్తిచూపడం నాకు అస్సలు ఇష్టం లేదు కాని, అవసరమైనప్పుడు మనం ప్రమాద ఘంటలు మోగించాలి. ఆంగ్ల బైబిల్లో 'గాడ్ ఈస్ ఎ స్పిరిట్' అని వుంటుంది. ఇందులోని 'ఎ' అనేది ఇండెఫినెట్ ఆర్టికల్. దాని తర్వాత వచ్చే పదం యొక్క ప్రత్యేకతను వివరిస్తుంది. నూతన అనువాదాలలో అనేకం ఈ ఆర్టికల్ని తొలగించారు. అవి కేవలం "గాడ్ ఈస్ స్పిరిట్" అని అంటాయి. ఇది సరైన అనువాదం కాదు. 'గాడ్ ఈస్ ఎ స్పిరిట్. అనగా దేవుడు ఆత్మస్వరూపి. దూతలు ఆత్మలే – మంచి దూతలు, చెడ్డదూతలు, పడిపోయిన దూతలు. దయ్యాలు కూడా ఒకరకమైన ఆత్మలే.

కాబట్టి దేవుడు అలాంటి ఆత్మకాదు. ఆయన ఆత్మరూపి. అనగా ఆయన జీవముగల వ్యక్తి. (మానవనేత్రాలకు కనిపించకపోయినా) దేవుడు జీవమున్న వ్యక్తి గనుక ఆయన ఆత్మరూపి.

2. దేవుడు లేక దూతలు మనుష్యులకు ప్రత్యక్షమైనప్పుడు, వారు ఒక దర్శనాన్ని చూడటమో లేక బయల్పాటు చూడటమో జరుగుతుంది.

దర్శనములో దేవుడు మానవదృష్టి పైన ఒక అద్భుతాన్ని జరిగిస్తాడు. అప్పుడు నిత్యజీవులు, ఆత్మ జీవులు కనిపిస్తాయి. ఉదాహరణకు దానియేలు 9:20–21 వచనాలలో బైబిల్ ఇలా సెలవిస్తోంది: "నేను మాట్లాడుతూ ప్రార్థనచేస్తూ, నా పాపమును నా జనులైన ఇశ్రాయేలీయులు చేసిన పాపమును ఒప్పుకొంటూ నా దేవుని పరిశుద్ధ పర్వతము తరపున నా దేవుడైన యెహోవాకు నా మనవిని వినిపిస్తుండగా; అలా నేను ప్రార్థనలో మాట్లాడుతుండగా, నా దర్శనములో మొదట నేను చూచిన గాబ్రియేలు అను మనుష్యుడు త్వరపడి నాయొద్దకు వచ్చి, సాయంకాలపు అర్పణ సమయంలో నన్ను తాకెను."

ఇక్కడ దానియేలు చూచిన లేక దానియేలుకు కనపడిన ఒక దేవదూత ఉంది. ఆ దూతను గతంలో ఒక దర్శనంలో చూసానని దానియేలు చెప్పాడు.

అలాగే మీ బైబిల్లోని చివరి పుస్తకమైన ప్రకటన గ్రంథంలో (లేఖనములలోనుంచి మనం ఉటంకించగలిగిన అనేక స్థలాలలో ఇవి రెండు

మచ్చుకు). అక్కడ ఇలా ఉంది: **"ప్రభువు దినమున నేను ఆత్మలో ఉన్నప్పుడు నా వెనుకనుంచి బూరధ్వనివంటి ఒక స్వరం ఇలా చెప్పడం నేను విన్నాను. నేనే ఆల్ఫా మరియు ఓమేగా– మొదటివాడను, చివరివాడను: మరియు నీవు చూస్తున్నదానిని ఒక గ్రంథంలో వ్రాసి ఆసియాలో ఉన్న ఏడు సంఘాలకు అనగా ఎఫెసు, స్మూర్న, పెర్గమము, తుయతైర, సార్దీసు, ఫిలదెల్ఫియా మరియు లవొదొకియా అను ఏడు సంఘాలకు పంపించు; మరియు నాతో మాట్లాడిన స్వరం ఎవరిదో చూద్దామని నేను వెనక్కు తిరిగాను. వెనక్కు తిరిగినప్పుడు నాకు ఏడు దీపస్థంబాలు కనిపించాయి; ఆ ఏడు దీపస్థంబాల మధ్యన మనుష్య కుమారుని పోలిన ఒకడు పాదములవరకు దిగివున్న అంగీ ధరించి నడుముకు బంగారు దట్టీని కట్టుకొని ఉన్నాడు"** (ప్రకటన 1:10–13).

ఆయన ఆకారం గురించి యోహాను తదుపరి వచనాలలో వర్ణించాడు. 17వ వచనంలో ఇలా చెప్పాడు: **"మరియు నేనాయనను చూడగానే, చచ్చినవానివలె ఆయన పాదాలవద్ద పడిపోయాను."**

ఇంతకీ ఏం జరిగింది? యోహానుకు దేవుని గూర్చిన దర్శనం కలిగింది. యేసు క్రీస్తు ప్రభువు అనే దేవుని యొక్క దర్శనం చూసాడు.

బైబిలంతటిలో ఎన్నో దర్శనాలు నమోదు చేయబడివుండటం చూస్తాం. వాటన్నిటిలో ప్రస్ఫుటంగా కొట్టొచ్చినట్లు ఉండే దర్శనాలలో ఒకటి ప్రకటన 9:17లో ఉంది. "నా దర్శనములో నేను గుర్రములను చూసాను. వాటిమీద అగ్నితోను, ఎర్రని రత్నములతోను గంధకములతోను చేయబడిన మైమరువు ధరించి వున్నాడు: మరియు ఆ గుర్రముల తలలు సింహముల తలల వలె ఉన్నాయి; మరియు వాటి నోటనుండి అగ్ని, పొగ, గంధకములు వెలువడుతున్నాయి."

దర్శనము అనగా దేవుడు మానవ దృష్టిమీద ఒక అద్భుతము చేయడం ద్వారా నిత్యత్వమునకు చెందిన జీవులు కంటికి కనిపించడమే. వారు మంచి దూతలు కావచ్చు (దానియేలు 9), స్వయంగా దేవుడే కావచ్చు (ప్రకటన 1వ అధ్యాయం), లేక అవి దురాత్మలు (ప్రకటన 9) కావచ్చు, కానీ వీరందరూ ఒక దర్శనరీతిగానే కనిపిస్తారు.

రెండవ రకం ప్రత్యక్షత ఏమనగా ఎదురుగా కనిపించుట. ఇక్కడే, ఒక పరలోకపు జీవి కొన్ని నిముషాలవరకు, లేదా కొన్ని సంవత్సరాల వరకు మానవరూపం ధరించడం జరుగుతుంది.

బైబిలంతటిలో దేవదూతలు తరచుగా మనుష్య ఆకారంలో కనిపించారు.

ఉదాహరణకు, అలాంటి సంఘటన గురించి మనం న్యాయాధిపతులు 13:9-11 వచనాలలో చదువుతాం.

"మరియు దేవుడు మానోహ స్వరమును విన్నాడు; ఆ స్త్రీ పొలములో కూర్చొనియుండగా దేవుని దూత మరల వచ్చాడు. అయితే ఆమె భర్తయైన మానోహ ఆమెతో లేడు. అప్పుడామె త్వరపడి పరుగున వెళ్లి తన భర్తను చూసి ఇదిగో మునుపు నాకు కనిపించిన ఆ మనుష్యుడు నాకు మరల ప్రత్యక్షమయ్యాడు అని చెప్పింది. అప్పుడు మానోహ లేచి, తన భార్యతో కూడా వెళ్లి ఆ మనుష్యుని వద్దకు వచ్చి, 'నా భార్యతో మాట్లాడినది నీవేనా?' అని ఆ దూతను అడిగాడు. అందుకు ఆ దూత అవును 'నేనే' అని చెప్పాడు."

అలాంటిదే మరొకటి, ముఖ్యంగా నాకు బాగా ఇష్టమైన సంఘటన లూకా 24వ అధ్యాయంలో ఉంది.

అవిశ్వాసులైన శిష్యులు యేసు సిలువ వేయబడిన తర్వాత, మూడవ దినాన ప్రభువు సమాధి వద్దకు వెళ్లారు. అక్కడ వారిని ఇద్దరు దేవదూతలు కలిసారు. వారు ఆ శిష్యుల్ని సూటిగా ఒక ప్రశ్న అడిగారు: "సజీవుడైనవానిని మీరు సమాధులలో ఎందుకు వెతుకుతున్నారు?" (లూకా 24:5). 6వ వచనంలో వారొక దివ్యమైన ప్రకటన చేసారు: "ఆయన ఇక్కడ లేడు, సమాధిలోనుండి లేచాడు."

యేసుక్రీస్తు మృతులలోనుండి లేచాడనే గొప్పవార్తను ఇద్దరు దూతలు చెప్పారు (యోహాను 20:11-12).

దేవదూతలు ఆత్మలు (హెబ్రీ 1:13-14) కాబట్టి వారు కంటికి కనిపించరు (2కొరింథీ 4:18), అయితే వారు మానవరూపం ధరించడం వల్ల మనకు కనిపిస్తారు.

ఇప్పుడు మనం దేవుని గురించిన సిద్ధాంతం అధ్యయనం చేస్తున్నాం గనుక, ఈ సందర్భంలో దేవునిగురించి బైబిల్ ఏమి చెప్తున్నదో చూద్దాం. అదృశ్యుడైన దేవుడు ఎప్పుడైనా తనను తాను బయలుపరచుకున్నాడా?

మనం ఇంతకు మునుపే చూచిన యోహాను 1 ప్రకారం, ఆయన బయలుపరచుకున్నాడు అని బైబిల్ చెప్తున్నది.

1 తిమోతి 3:16లో బైబిల్ ఇలా సెలవిస్తోంది: "దైవభక్తిని గురించిన మర్మము గొప్పది. ఈ విషయంలో ఎలాంటి వివాదం లేదు: **దేవుడు శరీరధారిగా ప్రత్యక్షమాయెను."**

దేవుడు అదృశ్యరూపుడు; నిజమే. ఎవరైనా ఎప్పుడైనా దేవుణ్ణి చూసారా? దేవుడు ఆయనను బయలుపరచుకొన్నది తప్ప, బయలుపరచబడవలసింది ఏమిటి? బయలుపరచుట అనే క్రియారూపానికి అర్థం "స్పష్టంగా కనిపించేలా చేయుట". అదే మాటకు విశేషణార్థం "వెంటనే చూడదగినది". గనుక బైబిల్ ప్రత్యక్షత అంటే, ఒక పరలోకపు జీవి కొన్ని నిముషాలు, లేదా యేసువలె కొన్ని సంవత్సరాలు మానవరూపం ధరించడం అని అర్థం.

మానవుడు అదృశ్యుడైన దేవుణ్ణి **చూసాడు** అని పైన మనం ప్రస్తావించిన వచనం ద్వారా గ్రహించగలుగుతున్నాం. దేవుడు కనిపించాడు కానీ ముసుగులేని ఆయన మహిమరూపంలో కాదు గాని, మానవశరీరాన్ని ధరించి ఆయన మనకు కనిపించాడు.

సరేగాని, ఈనాటి ఆధునిక బైబిల్ అనువాదాలను మరొకసారి తన్నేద్దాం రండి. ***దేవుడు శరీరమందు ప్రత్యక్షమయ్యాడు.*** యేసుక్రీస్తు ప్రభువు నిజంగానే ఈ విశ్వమును సృజించిన సృష్టికర్తయైయుండి, మానవ రక్తమాంసములతో కప్పబడియున్నాడు అని చెప్పే ఒక స్పష్టమైన మహిమాన్వితమైన ప్రకటన. ఆధునిక అనువాదాలలో ఈ వచనం మార్పులు చేర్పులకు గురై ఇలా మారింది: ***"ఆయన సశరీరుడుగా ప్రత్యక్షపరచబడెను."*** అలాంటి ప్రకటన అర్థరహితం. మనలో ప్రతిఒక్కరూ శరీరంతోనే కనిపిస్తున్నాం. నీవూ నేను ధరించిన ఈ నరావతారంలో దైవభక్తి అనే మర్మమేమీ లేదు.

నా స్నేహితులారా, క్రైస్తవవిశ్వాసానికి చెందిన అమూల్యమైన ప్రాథమిక సిద్ధాంతాలన్నిటిపై దాడిచేసే ఏ పుస్తకమైనా అది క్రైస్తవ బైబిల్ కానేరదు. ఆధునిక అనువాదాలపై ఖచ్చితంగా దేవుని ఆమోదముద్రను కలిగివుండలేవు.

3. దేవుణ్ణి, దూతలను లేక పునరుత్థానం తర్వాత మనుష్యులకు కనిపించిన యేసును వర్ణించడానికి లేఖనాలు తరచుగా "ప్రత్యక్షమాయెను" అనే పదాన్ని ఉపయోగించాయి.

అయితే, ఈ సంఘటనలు ప్రత్యక్షతలైనా కావచ్చు లేదా దర్శనములైనా కావచ్చు, కాని "ప్రత్యక్షమగు" అనే పదం ఉపయోగించబడినచోట అది ప్రత్యక్షంగా కనిపించాడా లేక దర్శనమా అని నిర్ద్వందంగా చెప్పలేము.

నిర్గమకాండం 19లో సీనాయి పర్వతం మీద ప్రజలు ఇశ్రాయేలు దేవుణ్ణి చూసారు అని బైబిల్ చెప్తోంది. దేవుడు అక్కడ ప్రత్యక్షమయ్యాడు. అయితే దేవుడు అక్కడ మానవదృష్టిపై ఏదైనా అద్భుతం జరిగించాడా లేక అలాంటిదే

ఏమైనా జరిగిందా అనేది అక్కడ స్పష్టంగా చెప్పబడలేదు. అయితే ఆ రెండిటిలో ఏదో ఒకటి అయ్యుండాలని మనకు తెలుసు.

అలాగే, మత్తయి 17:1–3లో కూడా ఒక ప్రత్యక్షత ఉంది. ఈ సుందరమైన వాక్యభాగాన్ని చూడండి: "ఆరు రోజుల తర్వాత యేసు పేతురును, యాకోబును, యోహానును వెంటబెట్టుకొని వారిని ఒక ఎత్తైన కొండమీదికి తీసుకొచ్చాడు. వారియెదుట ఆయన రూపాంతరము చెందాడు: ఆయన ముఖం సూర్యునివలె ప్రకాశించింది, మరియు ఆయన వస్త్రములు వెలుగువలె తెల్లగా మారాయి. ఇదిగో అక్కడ వారికి మోషే ఏలియాలు ప్రత్యక్షమై వారితో మాట్లాడుతూ కనిపించారు."

యేసు రూపాంతరం చెందాడు. అనగా ఒక రూపం నుంచి మరో రూపంలోనికి మారాడు. అదృశ్యమైన, ముసుగుకప్పబడియున్న దేవుని మహిమ యేసుక్రీస్తు ప్రభువుద్వారా ప్రకాశిస్తోంది. దేవుడు తన మహాత్మ్యపు వెలుగును ప్రసరింపనిచ్చాడు.

ఇది ఒక ప్రత్యక్షతో లేక దర్శనమో మనకు చెప్పబడలేదు కాని దేవుడు తన మహిమలో మానవమాత్రులకు తనను తాను బయలుపరచుకున్నాడు.

దేవుడు అగపడిన లేక ప్రత్యక్షమైన సందర్భాలు మీకు బైబిల్లో అనేకచోట్ల కనిపిస్తాయి. అది ఒక ప్రత్యక్షతో లేక దర్శనమో మనకు అన్నివేళలా చెప్పబడలేదు గాని, దేవుడు ఆత్మయైయున్నాడు గనుక ఆ రెండిటిలో ఏదో ఒకటి అయివుంటుంది.

4. కుమారుడైన దేవుడు మాత్రమే కాదు, పరిశుద్ధాత్మ దేవుడు కూడా మనుష్యులకు అగపడ్డాడు/ప్రత్యక్షమయ్యాడు. పరలోకంలో ముగ్గురు ఉన్నారని, వారు తండ్రి, వాక్యము, పరిశుద్ధాత్ముడు అని, వారు ముగ్గురూ ఒక్కటేనని మనం ఇంతకుముందే చెప్పుకున్నాం గుర్తుంది కదూ. పరిశుద్ధాత్మ దేవుడు కూడా ప్రత్యక్షమయ్యాడు; అనగా అదృశ్యుడైన దేవుడు మానవమాత్రులకు కనిపించేవిధంగా ఆయన ఒక భౌతికరూపంలో కనిపించాడని అర్థం.

లూకా 3:21–22 వచనాలలో ఇలా చదువుతాం: "ప్రజలందరూ బాప్తిస్మం తీసుకొంటుండగా, యేసు కూడా బాప్తిస్మం పొందాడు. ఆయన ప్రార్థనచేస్తుండగా, ఆకాశము తెరువబడి, పరిశుద్ధాత్మ పావురం ఆకారంలో ఆయనమీదికి దిగివచ్చాడు."

బాప్తిస్మమిచ్చే యోహాను పరిశుద్ధాత్మ దేవుణ్ణి చూసానని చెప్పాడు (యోహాను 1:30–33). అతడు నిజంగా ప్రభువును చూసాడా? అవును, నిజంగానే

చూసాడు. అయితే ఒక శరీరరూపంలో కనిపించిన పరిశుద్ధాత్మ దేవుణ్ణి అతడు చూసాడు. ఈసారి మానవశరీరంతో కాదు, ఒక పావురం రూపంలో చూసాడు.

ఇక్కడ కొన్ని ఆచరణీయమైన సంగతులను పరిగణనలోకి తీసుకుందాం. దేవుడు ఆత్మస్వరూపియై యున్నాడని మాత్రమే కాక, ఆయనను మనము ఆరాధించాలని కూడా యేసు చెప్పాడు. అనేకసార్లు మనము ఆ సత్యాన్ని నొక్కిచెప్పడంలో విఫలమవుతున్నామేమో అనిపిస్తుంది. ఆయన గురించిన జ్ఞానాన్ని కాదు మనం పూజించాల్సింది, అలాగే ఆయనను సేవించేవారిని కూడా కాదు మనం పూజించాల్సింది, లేక ఆయన చేసిన మహిమాన్వితమైన క్రియలను కూడా కాదు మనం ఆరాధించాల్సింది. ఆయనను ఆరాధించేవారు ఆయననే ఆరాధించాలి.

ఆరాధన దేవునికే చెందాలి. దేవుడు ఆత్మయైయున్నాడు గనుక ఆయనను ఆరాధించేవారు ఆత్మతోను సత్యముతోను ఆరాధించాలి.

మరొక విషయాన్ని కూడా పరిగణనలోకి తీసుకోండి. నీవు దేవుణ్ణి ఆరాధించి వుండవచ్చు. బహుశ నీ చేతులతో, బహుశా మోకాళ్లమీద ఉండి, లేదా ఒక పాట పాడటం ద్వారానో, లేక నీ నోటి మాటల ద్వారానో లేక దేవుని గూర్చి మంచి మాటలు చెప్పడం ద్వారానో ఆయనను ఆరాధించివుండవచ్చు. అయితే నీవు దేవుని స్వరూపంలో సృష్టించబడ్డావు. నీవొక శరీరానివి (అది నీ భౌతిక స్థితిని సూచిస్తుంది), నీకు ప్రాణం వుంది (అనగా నీ శరీరంలో జీవిస్తున్న నిజమైన నీవు), నీవొక ఆత్మవు కూడా. మనము ఆత్మ ప్రాణము దేహములతో చేయబడ్డామని బైబిల్ చెప్తున్నది. (1 థెస్స 5:23).

ఇక్కడ ఒక ప్రశ్న: మీరెప్పుడైనా నిజంగా దేవుణ్ణి ఆత్మలో ఆరాధించారా, లేక భక్తిపరుడిగా వుంటూ నిన్ను పరలోకానికి తీసుకెళతాయని భావించే మాటలు మాట్లాడుతూ మతపరమైన కార్యాలు చేస్తున్నావా?

మేము ఒక అదృశ్యదేవునికి ప్రార్థన చేస్తాము. మేము ఒక అదృశ్య దేవుని ఆరాధిస్తాము. అందుకు సహాయకరంగా మాకు ఎలాంటి విగ్రహాలు అవసరం లేదు. మాకు విగ్రహాలు గాని, బొమ్మలుగాని, పటాలుగాని, పూసలుగాని, చల్లడానికి పవిత్ర జలంగాని, ఆభరణాలు, అలంకరణలు ఏవీ మా "ఆరాధనకు సహాయం" అక్కరలేదు.

నా స్నేహితుడా, సత్యం చెప్పు. నీవు చేసే ఆరాధన నిజంగా దైవారాధనేనా? అది ఆత్మసంబంధమైన ఆరాధనేనా లేక వేరేవన్నీ కనిపెట్టి వాటిని నీ ఆరాధనలో భాగంగా చేసుకున్నావా?

మనం దేవుణ్ణి ఆత్మతో ఆరాధించాలని, మన చేతులతో చేసిన వస్తువులతోగాని, ఇతర పదార్థాలతో గాని ఆరాధించకూడదని దేవుడు తన కుమారుని ద్వారా చెప్పాడు. మన ఆరాధన సత్యవంతంగా వుండాలంటే మనము ఆయన్ని ఆత్మలో ఆరాధించాలి.

రెండవదిగా, మేము చూడకుండానే విశ్వసిస్తాం. మేము సందేహించే తోమా లాంటివాళ్లం కాదు. మేము దేవుని లిఖితవాక్యాన్ని నమ్ముతాము. మేము దేవుని గొప్ప సాక్షి సమూహాన్ని నమ్ముతాము.

యోహాను 20:24–28 వచనాలలో బైబిల్ ఇలా సెలవిస్తోంది: అయితే యేసు వచ్చినప్పుడు పన్నెండుమందిలో ఒకడైన దిదుమ అనబడిన తోమా వారితో లేడు. మేము ప్రభువును చూసామని వేరొక శిష్యుడు తోమాతో అన్నాడు. ఆయన చేతులలో మేకుల గుర్తులను చూచి, నా వేలును వాటిలో ఉంచి, ఆయన ప్రక్కలో నా చేతిని పెట్టి చూస్తే తప్ప నేను మీ మాట నమ్మను. ఎనిమిది రోజుల తర్వాత శిష్యులు మరల ఆ గదిలో ఉండగా, తోమా కూడా వారితో ఉండెను. ఆ సమయంలో తలుపులు మూసివున్నాయి. అంతలో యేసు ఆ గదిలో ప్రవేశించి వారి ఎదుట నిలబడి, మీకు సమాధానం కలుగును గాక అన్నాడు. అప్పుడాయన తోమాను చూచి, నీ వేలు ఇటు చాచి నా చేతులను చూడు, నీ చేతిని ఇటు చాచి నా ప్రక్కలో పెట్టిచూడు: అవిశ్వాసివి కాక, నన్ను నమ్ము. అప్పుడు తోమా ఆయనను చూచి, నా ప్రభువా నా దేవా అని పలికాడు. తోమా నా ప్రభువా, నా దేవా అన్నాడు.

యేసుక్రీస్తు నిన్న, ఇప్పుడు, రేపు ఏమైయున్నాడు, ఆయన ఎవరు అనే ప్రశ్నే లేదు.

ఆ తర్వాత 29వ వచనంలో, యేసు ఇలా అన్నాడు: తోమా, నీవు నన్ను చూసావు గనుక నన్ను నమ్మావు: అయితే చూడకనే నమ్మినవారు ధన్యులు.

నీవు నమ్ముతావా? చూడకుండ నీవు నమ్మగలవా?

హెబ్రీ 11:6లో బైబిల్ ఇలా సెలవిస్తోంది: “అయితే విశ్వాసము లేకుండా ఆయనను సంతోషపెట్టడం అసాధ్యం. ఎందుకంటే దేవునియొద్దకు వచ్చేవారు ఆయన ఉన్నాడని, ఆయనను శ్రద్ధగా వెతికేవారికి ప్రతిఫలము ఇచ్చేవాడని నమ్మాలి.”

గుర్తుందికదా, దేవుడు ఆత్మయైయున్నాడు. ఆయన శరీరధారిగా ప్రత్యక్షము కావాలని భావిస్తే తప్ప ఆయన అదృశ్యుడుగానే ఉంటాడు. తన కుమారుని

రూపంలో ఆయన ముప్పయి మూడున్నర సంవత్సరాలు అందరికీ కనిపించాడు. ఆ తర్వాత లోకమంతటి పాపాలకొరకు మరణించి మృతులలోనుండి తిరిగి లేచిన తర్వాత, పరలోకంలోనికి ఆరోహణుడయ్యాడు. అవును ఆయన మరల వస్తున్నాడు. అయితే ఈ మధ్యలో నీవు యేసుక్రీస్తును చూడలేవు. ఆయన సిలువపై మరణించడాన్ని కళ్లార చూడలేవు. ఆయన మృతులలోనుండి లేచినది చూచిన ప్రత్యక్ష సాక్షివి కాలేవు. తండ్రియైన దేవుని కుడిపార్శ్వాన ఆయన ఆసీనుడైయుండటం నీకు కనిపించదు. ఆయన రక్తం నీ పాపాలను కడిగివేయడం నీవు చూడలేవు. పరిశుద్ధాత్మ నీలోనికి వచ్చి నీకు క్రొత్త జన్మను ప్రసాదించడం నీవు చూడలేవు. ఈ సంగతులన్నీ అదృశ్యమైనవి. వాటిని విశ్వాస సంబంధమైన సంగతులుగా స్వీకరించాలి. అటువంటి విశ్వాసం లేకుండ నీవు దేవునికి ఇష్టుడవై ఉండలేవు, నీవు పరలోకంలో ప్రవేశించలేవు.

ప్రతిమలను, విగ్రహాలను వెంబడిస్తూ దయచేసి నరకంలోనికి వెళ్లవద్దు. నీవు చూడగలిగే మానవ నిర్మితమైన దేవతను నమ్మేంత బుద్ధిహీనంగా మీరు దయచేసి వుండవద్దు.

తాను ఆత్మయై యున్నానని దేవుడు చెప్పాడు. తాను అదృశ్యుడనని ప్రకటించాడు. దేవుడు సిద్ధపరచిన అద్భుతమైన పరలోకంలో నీవు నిత్యత్వం గడపాలని ఎప్పుడైనా ఆశించినట్లయితే, నీవు ఆయనకు ఇష్టుడవై జీవించాలి. ఆయనను విశ్వసించి, ఆయనయందు విశ్వాముంచి, ఆయన మాటచొప్పున నీవు ఆయనను నమ్మగలిగితే అదే ఆయనకు సంతోషాన్ని కలిగిస్తుంది.

దేవుడు తానేమైయున్నానని చెప్పుకుంటున్నాడో అదంతా నీవు నమ్ముతావా? యేసు క్రీస్తు శరీరధారియైన దేవుడని, ఆయన నీ పాపం కొరకు మరణించడానికే వచ్చాడని నీవు నమ్ముతావా? శరీరధారియైన దేవుడు మృతులలోనుండి తిరిగిలేచాడని నీవు నమ్ముతావా? దేవుడు ఇప్పుడు సజీవంగా వున్నాడని, నీ ప్రార్థన వినడానికి ఎదురుచూస్తున్నాడని, నీ పాపం పట్ల పశ్చాత్తాపముతో చింతిస్తూ నీవు యధార్థంగా చేసే ప్రార్థన వింటాడని, నీవు పరలోకానికి వెళ్లగలిగేందుకు ఉన్న ఏకైక మార్గము కంటికి కనిపించని, అదృశ్యుడైన ఆ దేవుడే నిన్ను రక్షించి, యేసుక్రీస్తు ప్రభువు అను తన కుమారుని రక్తం ద్వారా నిన్ను శుద్ధీకరిస్తాడని నీవు నమ్ముతావా?

అదే రక్షణ మార్గము.

బైబిల్లో ఉన్న దేవుడు అదృశ్యుడైన ఆత్మ. ఆయన ఉన్నాడని నీవు విశ్వాసంతో నమ్మాలి; ఆయన అందించే గొప్ప ఐశ్వర్యాలను స్వీకరించడానికి నీవు ఆయనయొద్దకు రావాలి.

నీవు నమ్మితే, దేవునియొద్ద నిత్యజీవము, సంతోషము, ఆశీర్వాదము ఇక్కడే దొరుకుతాయి, పరలోకం నీకోసం వేచివుంటుంది, మానవుడికోసం ఆయన చేసిన ప్రతిదీ నీకోసం సిద్ధంగా ఉంటాయి. దేవుడు కోరుకునేది అదే. ఆయన ఆత్మదేవుడు, జీవముగల వ్యక్తి, నిత్యత్వమంతటా ఆయనతో సహవాసాన్ని నీవు అనుభవించాలని కోరుకుంటాడు.

నా స్నేహితుడా, నీవు కంటితో చూడగలిగేవాటికోసం పరలోకాన్ని పోగొట్టుకోవద్దు. కంటికి కనిపించని, అదృశ్యుడైన దేవునియొద్దకు రా. ఆయన యెదుట ప్రణమిల్లి ఒక మామూలు మనిషితో మాట్లాడినట్లు మాట్లాడు. నీవు పాపివని, ఆయన అనుగ్రహించే రక్షణ నీకు అవసరమని ఆయనతో చెప్పి, నీవొక మానవమాత్రుడవని, నీ జీవితాంతము సత్యవంతుడు, నిజమైన, జీవముగల, నిత్యుడైన అద్వితీయ నాధుడు, యేసుక్రీస్తు ప్రభువు అను నామమున ప్రత్యక్షమైన దేవునియందు విశ్వాసముంచు.

తన కృపచేత ఆయన నీకు రక్షణను అనుగ్రహిస్తాడు.

# నిత్యుడైన దేవుడు

ఈ పాఠంలో మేము దేవుని శక్తి, జ్ఞానం గురించి ధ్యానించాలనుకుంటున్నాం. దేవుని శక్తి, జ్ఞానము, మంచితనము, మరియు పరిశుద్ధత అనువాటిని కలిపి అధ్యయనం చెయ్యాలి.

దేవుడు సర్వశక్తిమంతుడైనప్పటికీ, ఆయన శక్తి ఎల్లప్పుడు ఆయన జ్ఞానము, మంచితనము, మరియు పరిశుద్ధత నిర్దేశించినట్టే పనిచేస్తుంది.

దేవుని పట్ల కొందరికి ఒకేవైపు దృష్టివుంటుంది. ఆయన జ్ఞానాన్ని పణంగా పెట్టి శక్తిని హెచ్చించడమో, లేక ఆయన పరిశుద్ధతను పణంగాపెట్టి ఆయన మంచితనాన్ని హెచ్చించడమో చేస్తుంటారు. అలాంటి తప్పులు ఏవైనా జరిగితే అటువంటి దృక్పథం కలిగిన వ్యక్తుల విశ్వాసంలోను జీవితంలోను తీవ్రమైన ఫలితాలను ఎదుర్కోవలసి వస్తుంది.

నిజంగా మనం దేవున్ని తెలుసుకుంటే, ఆయన అతి మనోహరుడుగా, పూజనీయునిగా వుంటాడు. ఆయనను యథాతథంగా చూడటంలో మనం విఫలమైనంత మాత్రాన ఆయన మనోహరుడు అనే వాస్తవంలో ఎలాంటి మార్పు ఉండదు గాని, ఆ దివ్యమైన సత్యము మనకు కనపడకుండా పోతుంది.

ఈ అంశాన్ని చాలా జాగ్రత్తగా విపులీకరించాలని మేము భావిస్తున్నాం. ఒకవేళ దేవుడు మహాశక్తిమంతుడైయుండి, పరిశుద్ధుడు కాకపోతే, తన శక్తిని మానవాళిని బాధించి, నాశనంచేయడానికి వినియోగించినట్లయితే మనిషి ఏం చెయ్యాగలడు?

గ్రీకు రోమను పురాణాలలో ఉన్న దేవతలవలె దేవుడు తన శక్తిని దుష్టత్వము, దుర్నీతి సంబంధమైన ఉద్దేశాలకు వినియోగించగలడు. కొందరు దేవతలు దొంగతనం, నరహత్య మరియు అన్నిరకాల లైంగిక జారక్రియలలో నిమగ్నమయ్యేవారని ప్రపంచంలోని కొన్ని జాతుల ప్రజలు తెలియజేస్తుంటారు.

బైబిల్‌లో ఉన్న దేవుడు అలాంటి దేవుడు కాదు. బైబిల్లో ఉన్న దేవుడు సర్వశక్తిమంతుడు, అయినా ఆయన పరిశుద్ధుడు, జ్ఞానముగల దేవుడు, ప్రేమగల

దేవుడు. కాబట్టి ఆయన శక్తిని ఎన్నడూ పాపపు, దుష్టత్వపు, దుర్నీతితో కూడిన ఏ ఉద్దేశాలకోసమూ వినియోగించడు. మన అధ్యయనాన్ని కొనసాగిస్తుండగా ఆ విషయాన్ని మనం విపులంగా చూస్తాం.

మొదట, దేవుడు సర్వశక్తిమంతుడు. ఆయన సర్వమును సృష్టించి వాటిని కాపాడువాడు. దేవునివాక్యంలోని మొట్టమొదటివాక్యమైన ఆదికాండము 1:1లో, బైబిల్ ఇలా సెలవిస్తోంది: 'ఆదియందు దేవుడు భూమిని ఆకాశమును సృజించెను'.

ఆకాశం ఎక్కడనుంచి వచ్చింది? దేవుడే దానిని సృజించాడు. భూమి ఎక్కడినుంచి వచ్చింది? దేవుడు దానిని సృజించాడు. దేవుడు దానిని ఎప్పుడు సృష్టించాడు? ఆదియందు. సర్వము దేవునితోనే ఆరంభమయ్యింది. దేవుని శక్తి అంటే అది.

కొలొస్సయులకు 1:15-17 వచనాలలో యేసుక్రీస్తు ప్రభువు గురించి మాట్లాడుతూ, బైబిల్ ఇలా సెలవిస్తోంది: "ఆయన అదృశ్యదేవుని ఆకారములో ఉన్నవాడు, సమస్త సృష్టిలో ప్రథమఫలమైనవాడు: పరలోకమందుకాని, భూమియందుగాని, దృశ్యమైనవిగాని అదృశ్యమైనవిగాని, సింహాసనములైనను, అధికారములైనను, రాజ్యములైనను, శక్తులైనను సమస్తము ఆయనచేతనే సృజింపబడినవి: సమస్తమును ఆయనచేత ఆయన కొరకు సృజింపబడినవి: (అంతేకాదు), ఆయన అన్నిటికంటె ముందుగా ఉన్నవాడు, సర్వము ఆయనయందే ఉన్నవి."

పూర్వము దేవుడు భూమిని ఆకాశమును వాటియందున్న సమస్తమును సృష్టించడమే కాదు, ఆయన ఇప్పుడు కూడా ఈ సమస్త విశ్వమును చురుకుగా తన ఆధీనములో ఉంచుకొని సమస్తమును చురుకుగా నిర్వహిస్తున్నాడు. ఆయన ద్వారానే సమస్తమును ఉన్నవి.

రెండవది, దేవుడు సమస్తమును సృష్టించడమే కాదు, వాటిని తన ఇష్టానుసారముగా ఉపయోగించుకొనగలడు. ఈ శీర్షిక క్రింద నేను మీతో కలిసి అనేక వాక్యభాగాలను చూడాలనుకొంటున్నాను, ఎందుకంటే అనేకసార్లు ప్రజలు దేవుణ్ణి ప్రశ్నించాలని లేక సందేహించాలని లేక ఆయనపై పిర్యాదులు చేయాలనే శోధనకు గురవుతుంటారు. అసలు సత్యమేమిటంటే, ఈ విశ్వము దేవునిది. నీవూ నేను దేవుడు సృష్టించిన ప్రాణులం కనుక మన విషయంలో ఆయన ఇష్టానుసారంగా ఏమైనా చెయ్యగల స్వేచ్ఛ ఆయనకుంది.

యోబు 42:1లో ఇలా చదువుతాం, “అప్పుడు యోబు- నీవు చేయదలచుకున్న సమస్తమును చేయగలవు అని యెహోవాతో అనెను...” ఎంత స్పష్టంగా ఉంది! ఈ విషయం నీకు తెలుసా?

యిర్మీయా 32వ అధ్యాయం 17వ వచనంలో ప్రవక్త ఇలా అంటున్నాడు: “ఓ దేవా యెహోవా! ఇదిగో నీ మహాశక్తిచేత, చాచిన బాహువుచేత నీవు భూమ్యాకాశములను సృష్టించావు, నీకు మరీ కష్టమైనది ఏదీలేదు.” శక్తి గురించి మాట్లాడండి!

మిమ్మల్ని ఒక ప్రశ్న అడగనివ్వండి. సృష్టిని మీరు గ్రహించగలరా? ఒక్క దేవుడు తప్ప “అది నాకు కష్టమైనదేమీ కాదు” అని దేనిగురించి అయినా చెప్పగలవాడు లేడు. మీరు ఈ విశ్వాన్ని నడిపించగలరా? ప్రచండమైన సముద్రపు అలలను ఆపగలరా? ఆయా కాలాలను బట్టి రుతువులను బట్టి వర్షాకాలాన్ని, శీతాకాలాన్ని, వేసవికాలాన్ని నీవు పుట్టించగలవా? నీవు వర్షాన్ని కురిపించగలవా? నీవు వర్షాన్ని ఆపగలవా? భూమిమీద మంచును కురిపించగలవా? నీవు సూర్యకాంతిని ప్రసరింపజేయగలవా?

అది నీవల్ల కాదు. దేవుడు చేయగలడు. ఆయనకు అసాధ్యమైనది ఏమీలేదు.

మత్తయి 19:26లో లేఖనము ఇలా ప్రకటిస్తోంది: “అయితే యేసు వారివైపు చూచి, వారితో ఇట్లనెను. మనుష్యులకు ఇది అసాధ్యమే; కాని దేవునికి సమస్తము సాధ్యమే.”

దేవుడు ఏం చెయ్యగలడు? సమస్తము. దేవునికి ఏది సాధ్యము? సమస్తము. దేవునికి సమస్తము సాధ్యమే. మనం మాట్లాడుకొంటున్న ఈ దేవుడు ఏదో ఒక సాంకేతిక పదంలా మీకు అనిపించవచ్చు. దేవుడు అంటే నీవు తరగతి గదిలో చదువుకున్న ఏదో పాఠంలా అనిపించవచ్చు. కానీ ఆయన ఒక వ్యక్తి, మరియు ఆయన ఒక వ్యక్తిగా సమస్తమును చేయగల సర్వశక్తిమంతుడు.

హెబ్రీ 6:17-18 వచనాలలో ఈ గొప్ప మాటలున్నాయి: “వాగ్దానానికి వారసులైనవారికి తన సంకల్పం మార్పులేనిదని స్పష్టం చేయడానికి దేవుడు ఒట్టుపెట్టుకోవడం ద్వారా తన వాగ్దానానికి హామీ ఇచ్చాడు. అందువల్ల వేటివిషయం దేవుడు అబద్ధం ఆడలేడో, మార్పుని ఆ రెండింటి ద్వారా ఆశ్రయం కోరి పరుగుతీసే మనయెదుట ఉన్న నిరీక్షణను మనం బలంగా పట్టుకోడానికి గట్టి ప్రోత్సాహంగా ఉండాలని అలాచేసాడు.”

ఒక్క నిమిషం ఆగండి. మొదట దేవుడు సమస్తం చేయగలడని, ఆయనకు

అసాధ్యమైనది ఏమీ లేదని మనం చూసాం, ఇప్పుడు దేవుడు అబద్ధమాడటం అసాధ్యం అని చదువుతున్నాం. ఆహా, మనం ఈ పాఠం ఆరంభంలోనే నిర్ధారించి చెప్పిన సూత్రం అదే కదూ.

దేవుని పరిపూర్ణమైన శక్తి దేవుని పరిపూర్ణ జ్ఞానము, మంచితనము, పరిశుద్ధతలతో కలిసి పనిచేస్తుంది. దేవుడు సమస్తము చేయగలడని ఆయన శక్తి అంటుంది. దేవుని పరిశుద్ధత– ఆయన పరిశుద్ధత మాత్రమే – ఏ మానవుడు, ఏ అపవాది, ఏ ఆత్మ, ఏ ఇతర శక్తులు కాదు– దేవుని పరిశుద్ధత మాత్రమే దేవుని శక్తికి పరిమితులను విధించగలుగుతుంది.

"నేను అబద్ధమాడలేను" అని దేవుని పరిశుద్ధత అంటుంది. "నేను సమస్తము చేయగలను" అని దేవుని శక్తి అంటుంది. దేవుడు మాత్రమే తన పరిశుద్ధత ద్వారా తన శక్తిని పరిమితం చేయగలడు. అద్భుతమైన దేవుడు ఈ బైబిల్లో ఉన్న దేవుడు!

దేవుడు సర్వశక్తిగలవాడు గనుక ఆయన వాగ్దానాలను నెరవేర్చగలడు. "కాబట్టి శరీరరీతిగా మన పితరుడైన అబ్రాహాముకు ఏమి దొరికింది అంటే ఏమని చెప్పగలము? అబ్రాహాము క్రియలచేత నీతిమంతుడుగా తీర్చబడివుంటే, అది అతని గొప్పతనమే అయ్యేది కాని; అది దేవుని యెదుట కాదు. లేఖనములు ఏమి చెప్తున్నాయి? అబ్రాహాము దేవుని నమ్మాడు గనుక అది అతనికి నీతిగా ఎంచబడింది. పనిచేసినవానికి ఇచ్చే ప్రతిఫలము దానముగా ఎంచబడదు గాని రుణముగానే ఎంచబడుతుంది. కానీ క్రియలు చేయకుండా దానికి బదులు భక్తిహీనుణ్ణి నీతిమంతునిగా తీర్చే దేవుని కేవలం విశ్వాసం వుంచే వ్యక్తియొక్క విశ్వాసాన్నే దేవుడు నీతిగా ఎంచుతాడు. అదేవిధంగా క్రియలు లేకుండా దేవుడు నీతిమంతుడుగా ప్రకటించిన మనిషి ధన్యుడని దావీదు కూడా చెబుతున్నాడు. ఎలా అంటే, తన అతిక్రమాలకు క్షమాపణ పొందినవాడు, తన పాపానికి ప్రాయశ్చిత్తం పొందినవాడు ధన్యుడు. ప్రభువు ఎవరి అపరాధం లెక్కలోకి తీసుకోడో అతడు ధన్యుడు. ఈ దీవెన సున్నతి ఆచరించే వారి గురించి చెప్పాడా, ఆచరించనివారి గురించి కూడా చెప్పాడా? అబ్రాహాము విశ్వాసం అతణ్ణి నీతిమంతుడుగా తీర్చింది అన్నాం కదా? అతడు ఏ స్థితిలో ఉన్నప్పుడు అది జరిగింది? సున్నతి చేయించుకున్న తరవాతా లేక సున్నతికి ముందా? ముందే కదా! సున్నతి లేకపోయినా నమ్మినవారికందరికీ అతడు తండ్రి కావడం కోసం వారికి నీతి ఆపాదించడానికై సున్నతి లేనప్పుడే, తాను కలిగి ఉన్న విశ్వాసం వలన పొందిన నీతికి ముద్రగా సున్నతి అనే గుర్తును పొందాడు. అలాగే

సున్నతి గలవారికి కూడా తండ్రి కావడానికి, అంటే కేవలం సున్నతి మాత్రమే పొందినవారు కాక సున్నతి లేనప్పుడు మన తండ్రి అబ్రాహాము విశ్వాసపు అడుగుజాడల్లో నడచినవారికి కూడా తండ్రి కావడానికి అతడు ఆ గుర్తును పొందాడు. అబ్రాహాము, అతని సంతానం లోకానికి వాసలులవుతారు అనే వాగ్దానం ధర్మశాస్త్ర మూలంగా కలుగలేదు. విశ్వాసం వలన ఏర్పడిన నీతి మూలంగానే కలిగింది. ధర్మశాస్త్ర సంబంధులు వారసులైతే విశ్వాసం వ్యర్థమవుతుంది. ఎందుకంటే ధర్మశాస్త్రం ఉగ్రతను పుట్టిస్తుంది. ధర్మశాస్త్రం లేనిచోట దాన్ని అతిక్రమించడం కూడా ఉండదు. ఈ కారణంచేత ఆ వాగ్దానం అబ్రాహాము సంతతి వారందరికి, అంటే ధర్మశాస్త్రం గలవారికి మాత్రమే కాక అబ్రాహాముకున్న విశ్వాసం గలవారికి కూడా కృపను బట్టి వర్తించాలని, అది విశ్వాసమూలమైనది అయ్యింది. ఆ అబ్రాహాము మనందరికీ తండ్రి. దీని గురించే, "నిన్ను అనేక జనాలకు తండ్రిగా నియమించాను" అని రాసి వుంది. తాను నమ్ముకున్న దేవుని సమక్షంలో, అంటే చనిపోయినవారిని బతికించేవాడు, లేనివాటిని ఉన్నట్టుగానే పిలిచేవాడు అయిన దేవుని ఎదుట అతడు మనకందరికీ తండ్రి. అలాగే నీ సంతానం ఇలా వుంటుంది అని రాసి వున్నట్టుగా తాను అనేక జనాలకు తండ్రి అయ్యేలా ఎలాంటి ఆశాభావం లేనప్పుడు సైతం అతడు ఆశాభావంతో నమ్మాడు. అతడు విశ్వాసంలో బలహీనుడు కాలేదు, సుమారు నూరు సంవత్సరాల వయస్సుగలవాడు కాబట్టి, తన శరీరాన్ని మృతతుల్యంగా, శారా గర్భం మృతతుల్యంగా భావించాడు. అవిశ్వాసంతో దేవుని వాగ్దానాన్ని గూర్చి సందేహించక విశ్వాసంలో బలపడి దేవుణ్ణి మహిమపరచాడు. దేవుడు మాట ఇచ్చినదాన్ని ఆయన నెరవేర్చడానికి సమర్థుడని గట్టిగా నమ్మాడు. అందుచేత దేవుడు దాన్ని అతనికి నీతిగా ఎంచాడు. దేవుడు ఆ విశ్వాసాన్ని ఆవిధంగా ఎంచాడని అతనికోసం మాత్రమే రాసిలేదు, మన ప్రభువైన యేసును చనిపోయినవారిలోనుండి లేపిన దేవునిలో విశ్వాసం ఉంచిన మనలను కూడా నీతిమంతులుగా ఎంచడానికి మనకోసం కూడా రాసివుంది. ఆయనను దేవుడు మన అపరాధాలకోసం అప్పగించి, మనలను నీతిమంతులుగా తీర్చడానికి ఆయనను తిరిగి లేపాడు (రోమా 4).

నేను చెప్తున్నాను కదా, ఈ అంశంలో ఉన్న అద్భుతాన్ని, మహిమను గ్రహించాలంటే మనం అధ్యాయమంతా చదవాల్సిందే. దేవుడు తానేమి చేస్తానని మాత్రమే కాదు, ఆయన చేస్తానని చెప్పింది చేయగల సమర్థుడు కూడాను. ఆయన తన వాగ్దానాన్ని నెరవేర్చగలవాడు.

ఇప్పుడు 1 తిమోతి 6వ అధ్యాయంలో, ఆయన పరిపాలన నిరపేక్షమైనది అని తెలుసుకుంటున్నాం. సర్వశక్తి గలదేవుడుగా ఆయన అధికారంతో ఏలుతాడు, పరిపాలిస్తాడు. ఆయనకు ఈ భూమ్మీద ఉన్న ఏ రాజుగాని, రాజ్యముగాని, ఏ శక్తిగాని, లేక ఏ సైన్యము గాని పరిమితి విధించలేరు. యేసు గురించి మాట్లాడుతూ బైబిల్ ఇలా చెబుతుంది: రాజులకు రాజును, ప్రభువులకు ప్రభువును, సర్వాధికారము గల దేవునికి స్తోత్రము కలుగును గాక" (1 తిమోతి 6:15).

మరే ఇతర రాజైనా ఉన్నాడా? ఆయనే మహారాజు. ఇంకెవరైనా ప్రభువు ఉన్నాడా? ఆయనే ప్రభువు. ఇంకెవరైనా సర్వాధికారి ఉన్నాడా? ఆయనే సర్వాధికారి. దేవుడు తప్ప మరొక రాజు గాని, మరొక పాలకుడుగాని లేరు. ఆయన సింహాసనాన్ని ఇంకెవరితోను పంచుకొనడు. ఆయన సంపూర్ణ అధికారంతో శాశ్వతముగా పరిపాలిస్తాడు.

సమస్త రాజ్యములు, రాజులు పాలకులందరూ ప్రభువైన యేసుక్రీస్తుకు లోబడివుండటమే కాదు, సృష్టికూడా ఆయనకు లోబడుతున్నది. "అయితే నేను మీతో చేప్పేదేమనగా, మీ శత్రువులను ప్రేమించండి, మిమ్మల్ని శపించేవారిని దీవించండి, మిమ్ములను ద్వేషించేవారికి మేలుచేయండి, మిమ్మల్ని హించించి మీగురించి చెడుగా మాట్లాడేవారికోసం ప్రార్థనచేయండి; ఆవిధంగా మీరు పరలోకమందున్న మీ తండ్రికి తగ్గ పిల్లలవుతారు: ఎందుకంటే, ఆయన మంచివారిమీద, చెడ్డవారిమీద తన సూర్యుడిని వెలిగింపజేసి, నీతిమంతులమీద, అన్యాయస్తులమీద ఒకేరీతిగా వర్షమును కురిపిస్తున్నాడు." (మత్తయి 5:44-45).

చూశారా, దేవుడు సర్వశక్తిగలవాడు, మరియు ప్రకృతి కూడా ఆయనకు లోబడుతుంది. సూర్యుని ఉదయింపజేసేది ఎవరో మీకు తెలుసా? దేవుడే. ఆయన సూర్యుని ఎలా ఉదయింపజేస్తాడో తెలుసా? అది ఆయన సూర్యుడు అని బైబిల్ చెబుతోంది. ఎలా వుందీ మాట?

వర్షాన్ని కురిపించేదెవరో మీకు తెలుసా? దేవుడు. ఆయన ప్రకృతిని పాలిస్తాడు. దేవుని శక్తి అంటే అది. మానవుడు, మానవుని విధి అంతా దేవుని చేతుల్లోనే ఉంది.

"విశ్వాన్ని, దానిలోని సమస్తాన్ని చేసిన దేవుడు తానే భూమికి ఆకాశములకు ప్రభువు కాబట్టి చేతులతో కట్టిన ఆలయాల్లో నివసించడు. ఆయనే అందరికీ జీవాన్ని ఊపిరినీ తక్కిన అన్నిటినీ దయచేసేవాడు. కాబట్టి తనకు ఏదో అక్కర

ఉన్నట్లుగా మనుష్యులు చేతులతో చేసే సేవలు అందుకోడు. ఆయన ఒక్క మనిషి నుండి లోకమంతటిలో నివసించే అన్ని జాతుల మష్యులను చేసి, వారికోసం కాలాలను నియమించాడు. నివసించే సరిహద్దులను ఏర్పరచాడు. అందుచేత వారు దేవుణ్ణి వెతికి తమకై తాము ఆయనను కనుగొనాలి. వాస్తవానికి ఆయన మనలో ఎవరికీ దూరంగా ఉండేవాడు కాదు. ఎందుకంటే, మనం ఆయనలో బతుకుతున్నాం, ఆయనలోనే మన కదలికలు ఉనికీ ఉన్నాయి. 'మనమాయన సంతానం' అని మీ కవులుకూడా కొందరు చెప్పారు." (అపొ.కా. 17:24-28).

27వ వచనాన్ని మీరు గమనించారా? దేవుడు మీ సృష్టికర్త అని చెప్పిన తరువాత, దేవుడు సమస్తాన్ని సృజించాడని చెప్పిన తరువాత, దేవుడు మీకు జీవాన్ని ప్రసాదించాడని చెప్పిన తరువాత, బైబిల్ చెప్పిన మాట ఏమిటంటే, దేవుడు మనలో ఎవ్వరికీ దూరంగా లేకపోయినా, మనుష్యులు దేవుణ్ణి వెతకాలని, కొందరు ఆయనను గుర్తించి ఆయనను కనుగొంటారని చెప్పడం మీరు గమనించారా? మరి దేవుడు మనకు దూరంగా లేనప్పుడు, మనలో కొందరు ఆయనను కనుగొనడానికి ఎందుకంత ప్రయాస పడుతున్నారు? ఎందుకంటే ఆయనను తవిడి చూస్తున్నారు. నా స్నేహితులారా, దేవుడు భూమిని సృజించాడు, అయితే నీవు భూమిని ప్రతిరోజూ తాకినప్పటికీ, భూమి దేవత కాదు. దేవుడు కొయ్యను, రాయిని, గాలిని, వాయువును, సూర్యకాంతిని– నీవు చూచి, రుచించి, తాకి, అనుభవించగల సమస్తాన్ని చేసాడు. దేవుడు వాటన్నిటిని చేసాడు. అయితే అవన్నీ దేవుడు కాదు. నువ్వు దేవుడివి కానట్టే అవి కూడా కాదు. దేవుని సృష్టిలో నీవు ఒక భాగమైనట్టే అవి కూడా కేవలం దేవుడు చేసిన వస్తువులే.

మరి, దేవుడు ఎక్కడున్నాడు? ఆయన నీకు దూరంగా లేడు.

మంచిది, ఆయన్ని నేనెలా కనుగొనగలను?

నీవు మోకాళ్లమీద కూర్చొని, "దేవా, నేను నిన్ను తెలుసుకోవాలనుకుంటున్నాను" అని ఆయనతో చెప్పాలి, అప్పుడు దేవుడు తనను తాను నీకు తెలియజేసుకుంటాడు.

1 సమూయేలు 2 లో మనిషి, అతని గమ్యం అంతా దేవునిచేతిలోనే ఉన్నాయని మనం స్పష్టంగా చూస్తున్నాం. "మనషులను సజీవులుగానూ, మృతులుగాను చేసేవాడు యెహోవాయే. పాతాళానికి పంపిస్తూ అక్కడినుండి రప్పించేవాడూ ఆయనే. యెహోవా దరిద్రతను, ఐశ్వర్యాన్ని కలుగజేసేవాడు,

కుంగిపోయేలా చేసేవాడు, లేవనెత్తేవాడు ఆయనే. దరిద్రులను అధికారులతో కలిసి కూర్చోబెట్టేవాడూ, మహిమగల సింహాసనంపై కూర్చునేలా చేసేవాడూ వారిని మట్టిలోనుండి పైకి ఎత్తేవాడు ఆయనే. పేదవారిని పెంటకుప్పపై నుండి పైకిలేపేవాడు ఆయనే. భూమి ఆధారస్థంబాలు యెహోవా ఆధీనంలో ఉన్నాయి. ఆయన లోకాన్ని వాటిపై నిలిపి ఉంచాడు." (1 సమూయేలు 2:6-8).

ఈ లోకంలో ప్రజలు ఏం కోరుకుంటారో నాకు తెలుసు. వాళ్లకి దేవుడు కంటె వస్తువులే కావాలి. పైన చెప్పిన వచనాన్ని గనుక నేను ఎవరికైనా వినిపిస్తే, వారి మనస్సులో ఇలా అనుకుంటారు. "ఓహో, దేవుడు పేదలను ధనవంతుల్ని చేస్తాడు. నాకు కావలసింది అదే. దేవుడు మంటిలోనుండి పేదలను తీసుకొంటాడు. ఆహా, అదే నాకు కావాలి." చూసారా, అందుకే మనుష్యులు దేవుణ్ణి కోల్పోతున్నారు. వాళ్లకి దేవుడు అక్కర్లేదు. వాళ్లకి దేవుడు చేసిన వస్తువులే కావాలి, దేవుడు ఇవ్వగలిగిన వస్తువులు కావాలి. దురాశతో కూడిన ఈ మనస్తత్వమే వారికి దేవుణ్ణి దూరంచేస్తుంది.

మనుష్యులు గొప్ప దేవాలయాలు, గొప్ప మందిరాలు కట్టి, వాటిమీద గొప్ప గోపురశిఖరాలను నిలబెడుతున్నారు. గోడలమీద బంగారు ప్రతిమలను, విగ్రహాలను, బొమ్మలను వేలాడదీస్తున్నారు. సేవకులు ధరించడానికి బ్రహ్మాండమైన దుస్తులు, ఆభరణాలు ఉన్నాయి. ఈ అన్యులు తాము కలిగివున్న వస్తువులన్నిటిని బట్టి ఏదోరకంగా దేవునికి సమీస్తులుగా ఉన్నారని భావిస్తారు.

నిజమే, బంగారాన్ని చేసింది దేవుడే. మనుష్యులు తమ మతపరమైన భవనాలు, నిర్మాణాలకోసం ఉపయోగించే కలప, రాళ్లు సమస్తమును చేసింది దేవుడే. మనుష్యులు తయారుచేసే ప్రతిమలు, విగ్రహాలకు ఉపయోగించే పదార్థాలన్నిటిని కూడా చేసింది దేవుడే. అయితే మనష్యులు తమ చేతులతో చేసినవి ఏవైనా అవి వస్తువులే, వాటిని తయారుచేసినవారు ఇంకనూ దేవునికోసం వెతుకుతూనే ఉన్నారు. అయినా దేవుడు వాళ్లకు దొరకడం లేదు.

ఉదాహరణకు మనం పై వాక్యభాగాన్ని చదువుతూ, మనుష్యులను సజీవులుగాను, మృతులుగాను చేసేవాడు ఆయనే. వారిని పాతాళానికి పంపిస్తూ అక్కడినుండి రప్పించేదీ ఆయనే అనే మాటలవద్దకు వచ్చామనుకోండి, మీరంటారు, "ఆ మాటలు వినండి. నేను చనిపోతానని నాకు తెలుసు, ఒకరోజున సమాధిపాలు అవుతానని నాకు తెలుసు. ఏదో ఒకరోజున దేవుడు నా ప్రాణం తీసుకుంటాడని, నేను తుదిశ్వాస విడుస్తానని నాకు తెలుసు. ఏదో ఒకరోజున

నన్ను సమాధిలో పెడతారు. కానీ, పాస్టరుగారూ, దేవుడు నన్ను సమాధిలోనుండి లేపుతాడు అనేనా మీరంటోంది?"

సరిగ్గా నేను చెప్తున్నది అదే. ఆ తర్వాత మనం ఏమి చదువుతున్నామో చూడు. "మహిమగల సింహాసనంపై కూర్చునేలా చేసేవాడు ఆయనే." ఆ మాటలు చూచి, నీవిలా అనవచ్చు, "అంటే, యేసుక్రీస్తు ప్రభువు తన సింహాసనం మీద ఆసీనుడైయుండి పరిపాలన చేస్తున్నప్పుడు నన్ను సమాధినుండి లేపుతాడు, నేను కూడా ఆయనతో కలిసి పరిపాలన చేస్తాను అనేనా మీ ఉద్దేశం? ఆహా, అలాగేతే, దేవునితో అలాంటి జీవితం నాకు కావాలి. దేవుని సన్నిధిలో నేను నిత్యత్వాన్ని అనుభవించాలనుకుంటున్నాను."

ఇప్పుడు మీరు సరిగ్గా ఆయనను కనుగొనగలిగే చోటుకు వస్తున్నారు.

చూడండి, మానవహృదయం మోసకరమైనది. అది ఘోరమైన వ్యాధికలది. దాన్ని ఎవరు గ్రహించగలరు? దేవుడు దాన్ని గ్రహించగలడు. దేవుని ఆత్మ దాన్ని గ్రహించగలడు. దేవునికంటె దేవుడు సృష్టించిన వస్తువులను నీవు ఎక్కువగా ఆశించినంతకాలము ఆయన్ని ఎన్నడూ కనుగొనలేవని ప్రభువుకు తెలుసు. అయితే నిన్ను ఆ వస్తువులలో ఏదీ, ఏవీ, ఎంత సమృద్ధిగా నీకున్నా నీ హృదయవాంచను, నీ మనస్సులోని ఆరాటాన్ని అవి తీర్చలేవని నీవు ఎప్పుడైతే తెలుసుకుంటావో అప్పుడు నీవు దేవుణ్ణి కనుగొనగలవు. నీలో ఆ గ్రహింపు కలిగినప్పుడు నీవు మోకాళ్లపై బడి, "దేవా, నేనీ వస్తువులతో విసిగిపోయాను. నాకు నువ్వే కావాలి. నన్ను రక్షించగల నీ శక్తి నాకు కావాలి. నా పాపాలను కడిగివేయగల నీ రక్తము నాకు కావాలి. నాకు నిత్యజీవాన్ని ప్రసాదించే నీ కృప నాకు కావాలి. ఏ శక్తితో నీ కుమారుడు సిలువపై ప్రాణాలర్పించాడో, ఏ శక్తితో మృత్యుంజయుడై తిరిగి లేచాడో, ఏ శక్తిచేత ఆయన పరలోకానికి ఆరోహణమైపోయాడో, ఏ శక్తిచేత నా పాపాలను క్షమించి, నన్ను పునర్జన్మింపజేసి, విశ్వాసముచేత నన్ను దేవుని బిడ్డగా చేయగలదో ఆ శక్తి నాకు కావాలి" అని అడుగుతావు.

స్నేహితుడా, నీ పాపములనుండి రక్షించి, నీకు నిత్యజీవాన్ని ప్రసాదించగల శక్తిని నమ్మగలిగేందుకు సిద్ధంగా ఉన్నప్పుడు, నీవు ఆయనను కనుగొనగలవు. దేవుడు సర్వశక్తిగలవాడు అయితే, ఆయన శక్తి ఆయన పరిశుద్ధతతో కలిసి సంపూర్ణ సామరస్యంతో పనిచేయగలదు. ఆ విషయాన్ని ఎన్నడూ మరువవద్దు.

మానవుడు, అతని గమ్యము మాత్రమే కాదు దేవుని చేతిలో ఉన్నది,

దేవదూతలు సహా ఆయన ఆజ్ఞలకు లోబడతారు. "రక్షణకు వారసులు అయ్యేవారికి సేవలు చేయడానికి పంపబడిన పరిచారక దూతలు కాదా వారు?" (హెబ్రీ 1:14).

బైబిల్ అనుసారంగా, దేవదూతలు దేవుని దాసులు. ఆయనయొద్ద కనిపెట్టుకొని, ఆయన ఆదేశాలకొరకు వేచివుండేవారు. అది ఒకవిధమైన అధికారం! దేవదూతలకు ఆజ్ఞాపించగల శక్తి, అధికారము దేవుడు కలిగివున్నాడు. బైబిల్లో ఉన్న దేవుడు అలా వుంటాడు.

ఇప్పుడు మీరు యోబు 1వ అధ్యాయం చూడండి. సాతానుడికి గొప్ప శక్తి వుంది అని చెప్పేవారి మాటలచేత ప్రపంచవ్యాప్తంగా నేడు అనేకమంది ప్రజలు ప్రభావితమౌతున్నారు. దయ్యము, చేతబడి, మంత్రగాళ్లు, క్షుద్రపూజలు చేసేవారు, భూతమాంత్రికులు, యాజకులు, ఆత్మలు మొదలైనవాటికి భయపడేలా చేస్తారు. ఇలాంటి దుష్టశక్తులకు గొప్ప శక్తి వుంటుందని మనకు చెప్తుంటారు.

ఫలితంగా, అనేకులు సాతానును సేవిస్తున్నారు. మీరిది నమ్మగలరా? మనుష్యులు సాతానుకోసం బ్రతుకుతున్నారు; ఇలాంటివి అసలు వూహించగలరా? లూసిఫరుకు శక్తులున్నాయని ఎవడో వారిని మోసం చేసాడు గనుక వారు లూసిఫరును పూజిస్తున్నారు..

అయితే, మీరొక విషయం తెలుసుకోవాలి, పరిశుద్ధ బైబిల్ గ్రంథం ప్రకారం, సాతానుడు చంపగలడు, వాడు తుఫానులు రప్పించగలడు, సైనిక దళాలను నడిపించగలడు, కానీ ప్రతి విషయంలో వాడు మొదట దేవుని సన్నిధిలోనికి వెళ్లి వాడు ఏదైనా చెయ్యడానికి ముందు దేవుని అనుమతి తీసుకోవాలి (యోబు 1, 2 అధ్యా)

అప్పుడు దేవుడైన యెహోవా సాతానుతో ఇలా చెప్పాడు: ఇదిగో అతనికి వున్నదంతా నీ అధికారంలో ఉంది; కేవలం అతనిమీద నీవు చెయ్యివేయకూడదు." (యోబు 1:12). అప్పుడు సాతానుడు వెళ్లిపోయి, యోబును తాకలేకపోయాడు. దేవుడు చెప్పాడు గనుక వాడు యోబుమీద చేయివేయలేకపోయాడు.

సాతానుడు దేవునితో ఇలా చెప్పాడు, "ఇప్పుడు నీచేతిని అతనిమీద వేసి అతని ఎముకలను, మాంసమును తాకు, అప్పుడు నీ ముఖంమీదే అతను నిన్ను దూషిస్తాడు. అందుకు యెహోవా సాతానుతో ఇలాగు చెప్పాడు, ఇదిగో అతడు నీచేతిలో ఉన్నాడు; అతని ప్రాణాలు తప్ప నీవు అతనికి ఏమైనా చెయ్యవచ్చు" (యోబు 2:56).

గనుక సాతానుడు వెళ్లి అతని దేహాన్ని ముట్టుకున్నాడు గాని అతని ప్రాణాలు తీయలేకపోయాడు.

సాతానుకు ఉన్న శక్తులను బట్టి నీవు వానిని పూజించాలని, లేక వానిని ఆరాధించాలని భావించినట్లయితే, నీవు దారుణంగా మోసపోయినట్టే. నేను చెప్తున్నాను కదా, మొదట దేవునియొద్దనుంచి అనుమతి తీసుకోకుండ వాడు ఏమీ చెయ్యలేడు.

దేవుడు అధికారము శక్తి కలిగివున్నాడు. ఆ అధికారము శక్తి ఆయన పరిశుద్ధతతో పరిపూర్ణ సామరస్యంతో కలిసి పనిచేస్తుంది. ఒకవేళ సాతానుడు దుర్మార్గపు, దుష్టత్వపు, అపవిత్రపు మలినమైన దయ్యపు పన్నాగాలు కలిగివుంటే, ఆ పని దేవుని పరిశుద్ధతతో పొసగనట్లయితే, వాని పన్నాగాలను అమలుపరచడానికి దేవుడు వానికి అధికారమివ్వడు. నేరుగా దేవుని హస్తాలనుండి వచ్చేది తప్ప (దాన్ని మోసుకొచ్చేది అపవాదే అయినాకూడ) ఏదీ నీవద్దకు రాదు. సంఘటనలు మంచివేగాని, చెడ్డవేగాని, వాటిని నియమించేది దేవుడే. నీవు పూజించాల్సిందే ఆ దేవుణ్ణే.

దేవుడు జ్ఞానముగలవాడు. ఆయన తన అధికారాన్ని శక్తిని తన జ్ఞానంతో కలిపి వినియోగిస్తాడు. కీర్తన 136:5 దేవుని గూర్చి మాట్లాడుతూ ఇలా అంటుంది: “జ్ఞానమును బట్టి ఆకాశములను సృష్టించినవానికి.” దేవుడు ఆకాశములను సృజించాడు, అయితే వాటిని తన జ్ఞానంతోనే సృజించాడు. “యెహోవా తన వివేకమును బట్టి భూమికి పునాదులు వేసెను” (సామెతలు 3:19).

దేవుడు మనిషిని సృష్టించకుండ మానుకునేవాడే. మనిషికి స్వేచ్ఛాచిత్తము లేకుండా చేసేవాడు, లేదా అతనిలో ప్రాణం లేకుండా చేసేవాడు. అయినా, ఆయన తన జ్ఞానము, పరిశుద్ధతలను బట్టి, దేవుడు మానవుడిని ఇప్పుడు ఉన్నట్టుగానే తయారుచేసాడు. దేవుని జ్ఞానాన్ని ఎవడు ప్రశ్నించగలడు?

మానవుణ్ణి ఇప్పుడు ఉన్నరీతిగా సృజించడం ద్వారా, దేవుడు స్వచ్ఛందంగా తన అధికారాన్ని పరిమితం చేసుకున్నాడు. ఆయన మానవుని ఉనికిని అంతం చేయలేడు, ఎందుకంటే మనిషిని ఒక శాశ్వతమైన ఆత్మతో సృష్టించాడు. మనిషి చిత్తాన్ని ఆయన అదుపుచేయడు ఎందుకంటే, ఎంపిక చేసుకోగల శక్తిని దేవుడు మనిషికి అనుగ్రహించాడు. ఆయన కేవలం మానవుడి చిత్తాని ప్రభావితం చేయడం ద్వారా మార్పు కలిగించి, అతనికి తీర్పు తీర్చి, బంధించి, తన ప్రణాళికలను అడ్డగించి, అతని చర్యలను పరిమితం చేయగలడు.

లోకంలో ఉన్న దారుణాలన్నిటికీ కారణం మానవుడి మొండితనమే తప్ప దేవుని శక్తిలోపం కాదు. మానవుడిని తన మొండితనం నుంచి తప్పించడం కోసం దేవుడు ప్రతి ఒక్క అవకాశాన్ని ఉపయోగించుకుంటున్నాడు.

నీవు నీ మొండితనం నుంచి తిరిగి యేసుక్రీస్తు ప్రభువును నమ్ముతావా? నీకు తెలిసిన ప్రతి కష్టమూ, మనోవేదన దేవుని చిత్తానికి, దేవుని మార్గానికి విరోధంగా వెళ్లాలని నీవు తీసుకున్న నిర్ణయంలోనుంచే పుట్టుకొచ్చినవే. నీవు ఆయన చిత్తానికి లోబడి, ప్రభువైన యేసుక్రీస్తు అను ఆయన కుమారునికి నీ జీవితాన్ని సమర్పించుకుంటే, దేవుని చిత్తానుసారంగా మాత్రమే రాగల సంతోష సమాధానాలను నీవు అనుభవించగలవు.

# మారని దేవుడు

ఈ పాఠంలో దేవుడు **నిత్యుడు మార్పులేనివాడు** అనే వాస్తవాన్ని అధ్యయనం చెయ్యాలనుకుంటున్నాం.

దేవుడు కాలానికి చెందిన సూత్రాలకు అనుగుణంగా పనిచేసినప్పటికీ, అనగా తన ప్రణాళికలను అమలుపరచడానికి సమయం పడుతుంది, అయితే, సమయాభావ మనేది ఆయనకు ఆటంకముగా మారే ప్రమాదం లేదు. ఎందుకనగా ఆయన పనిచేయడానికి నిత్యత్వమే వుంది.

ఎంతోమంది మహామహులు సైతం తమ శక్తులు క్షీణించిపోవడం వలన తమకు అత్యంత ప్రీతిపాత్రమైన ప్రణాళికలను వదిలివేయవలసి వచ్చింది. అయితే దేవుడు ఎన్నడూ ముసలివాడైపోడు. ప్రభువు ఎన్నడూ అలసిపోడు. యెహోవా ఎన్నడూ నిద్రపోడు. ఆయన ఉద్దేశాలు నిత్యసంకల్పాలు. వాటిని అమలుచేయడానికి నిత్యత్వమే ఆయనకు అందుబాటులో ఉంది.

ఈ కారణంచేతనే మనము ఆయన ప్రణాళికలను గ్రహించడంలో విఫలమవుతున్నాం. దేవుడు తన సృష్టిలో చేస్తున్న కార్యంలో మన జీవితమంతా చూచినా కేవలం ఒక అత్యల్పమైన భాగాన్ని మాత్రమే వీక్షించగలం గనుక మనము ఆయన కదలికలను మనం చూడలేకపోతున్నాం.

దేవుడు నిత్యుడు, మార్పులేనివాడు అనే అంశాలను ఇప్పుడు మనం వివరంగా చూద్దాం.

అన్నిటికన్నా ముందుగా, దేవుడు నిత్యుడు. బైబిల్ ఇలా సెలవిస్తోంది, "ప్రభూ తరతరాలుగా నువ్వే మాకు నివాసస్థానం. పర్వతాలు ఉనికిలోకి రాకముందే భూమినీ లోకాన్ని నువ్వు సృష్టించకముందే అప్పుడు ఇప్పుడు ఎప్పటికీ నీవే దేవుడవు." (కీర్తన 90:12). "ఆదియందు దేవుడు భూమిని ఆకాశమును సృష్టించాడు" అని లేఖనం సెలవిస్తోంది (ఆది. 1:1).

ఆకాశంలోని ఏ భాగంలోనుంచి దేవుడు వచ్చాడు? అని మీరు అడగవచ్చు. ఓ, లేదు లేదు లేదు! ఆకాశం దేవుని యొద్దనుండి వచ్చింది. "భూలోకంలో

దేవుడు ఎక్కడినుంచి వచ్చాడు?" అని ప్రజలు అడుగుతుంటారు. లేదు, లేదు, లేదు. భూమి దేవునియొద్ద నుండి వచ్చింది.

ప్రజలు చెట్లను, రాళ్లను పూజిస్తారు. లేదా రాళ్లు కొయ్యలు తీసుకొని ప్రతిమలుగా మలిచి వాటిని పూజిస్తారు. స్నేహితులారా, ఈ ప్రజలు తమను తాము ఎలా మోసపుచ్చుకొంటున్నారో చూసారా?

దేవుడు అంటే తన సృష్టిలో భాగమైన ఒకదాని ప్రతిరూపం కాదు. దేవుడు ప్రకృతిలో భాగం కాదు. దేవుడు ఒక మనిషికాదు, లేక మనిషిలాంటివాడు కాదు, లేక మనిషియొక్క ఆవిష్కరణ కాదు. అవన్నీ దేవునినుంచి వచ్చినవే. దేవుడు అనంతుడు. శాశ్వతకాలమునుండి శాశ్వతకాలము వరకు నీవు దేవుడవు అని బైబిల్ సెలవిస్తోంది. పర్వతములు, భూమి, లోకము పుట్టకమునుపే దేవుడు ఉన్నాడు. అప్పటినుంచి ఆయన ఏమైయున్నాడో ఇప్పుడూ అలాగే వున్నాడు. ఒకరోజు మోషే దేవుణ్ణి ఇలా అడిగాడు, 'నీ పేరు ఏమిటని ప్రజలు నన్ను అడిగితే నేను వాళ్లకేం చెప్పాలి? "నేను ఉన్నవాడను అనువాడను" అని దేవుడు ఆ ప్రశ్నకు బదులిచ్చాడు.

చూసారా, దేవుడు అనంతుడు.

క్రొత్తనిబంధనలో ఇలా వ్రాసివుంది: "అనంతుడైన రాజు, అమర్త్యుడు, అదృశ్యుడు, అద్వితీయుడైన దేవునికి మహిమ ఘనత ఇప్పుడును, యుగములకును సదాకాలము కలుగును గాక. ఆమేన్." (1 తిమోతి 1:17).

మన దేవుడు అదృశ్యునిగానే ఉన్నప్పటికీ, ఆయనే అద్వితీయ దేవుడు. ఎందుకనగా ఆయన తప్ప మరొక దేవుడు లేదు. నిజమైన దేవునికే సమస్త ఘనత మహిమలు చెందుతాయి. యుగయుగములకు సదాకాలము మహిమా ఘనతలు ఈ అ అద్వితీయ దేవునికే చెందుతాయి. ఎందుకంటే దేవుడు నిత్యుడైన మహారాజు అని బైబిల్ సెలవిస్తోంది.

మీరు ప్రపంచంలో ఏభాగంలో నివసిస్తున్నారో నాకు తెలియదు గాని, మీ ప్రాంతంలో రాజులు ఉండివుంటారు. ఏదో ఒక కాలంలో మీ ప్రాంతాన్ని రాజులు పరిపాలించివుంటారు. ఇప్పుడుకూడా మీకు ఓ రాజు ఉన్నాడేమో, లేక గతంలో పరిపాలించి ఇప్పుడు మరణించి వుండవచ్చు. అయితే ఇప్పుడు పరిపాలిస్తున్న రాజు, గత రెండు మూడు శతాబ్దాల క్రితం పరిపాలించిన రాజు ఒక్కరు కాదని మాత్రం మీకు తెలుసు. 2,000 సంవత్సరాల క్రితం పరిపాలించిన రాజు ఇతడు కాదని మీకు తెలుసు. 100 ఏళ్ల క్రితం పాలించిన రాజు ఇతడు

కాదు. ఆ రాజులంతా మనుష్యులు గనుక మరణించారు. వారి పరిపాలన, వారి ఉనికి అంతమైపోయాయి.

దేవుని విషయం అలా వుండదు. దేవుడు భూమికి ముందుగా రాజైయున్నాడు. లోకము పుట్టకమునుపు ఆయన రాజైయున్నాడు. పర్వతములు పుట్టకమునుపు ఆయన రాజుగా ఉన్నాడు. భూమి ఆకాశములు సమస్తము గతించిపోయినా దేవుడు రాజుగానే ఉంటాడు. ఆయన అనంతుడు, అమర్త్యుడు, అదృశ్యుడు, అద్వితీయుడు నైన మహారాజైన దేవుడు.

దేవుడు స్వయంభవుడు. మన జీవితానికి మూలం దేవుడే. స్త్రీ పురుషుల కలయిక అనేది ఉంటుంది గాని, స్త్రీ గర్భంలో జీవాన్ని పోసేది దేవుడే. దేవుడు లేకుండ ఏ ప్రాణి రూపించబడదు. కీర్తన 139 ఇలా అంటోంది, "నా తల్లి గర్భములో ఉన్నప్పటినుండి నీవు నన్ను ఎరిగియున్నావు" గమనించండి, పుట్టుకకు మునుపే నేను అనేవాడున్నాడు. ఆ జీవాన్ని దేవుడు ఆరంభిస్తున్నాడు.

దేవుని మహత్కార్యమును బట్టి తల్లిగర్భంలో శిశువు రూపించబడి వృద్ధిచెందుతుంది. అది పుట్టినతరువాత, తనకు ఊపిరినిచ్చిన దేవునియొద్దనుండి జీవమును శక్తిని పొందుకొంటుంది. మనము స్వయంభవులం కాదు, దేవుడు స్వయంభవుడు. దేవుడు తన జీవాన్ని నీ నుంచి పొందలేదు. ఆయన సజీవంగా ఉండేది నీవు అందించేవాటిని బట్టి కాదు. ఆయన వల్లనే మనం జీవిస్తున్నాం.

మోషే దేవునితో ఇలా అన్నాడు, "ఇదిగో నేను ఇశ్రాయేలు ప్రజలవద్దకు వెళ్లి, మీ పూర్వికుల దేవుడు నన్ను మీయొద్దకు పంపించాడని చెప్తాను; అప్పుడు వాళ్లు 'ఆయన పేరేమిటి' అని అడిగితే, నేను వాళ్లకు ఏం చెప్పాలి? అప్పుడు దేవుడు మోషేతో 'నేను ఉన్నవాడను అనువాడను. నీవు ఇశ్రాయేలీయులతో 'ఉన్నవాడు' నన్ను మీ యొద్దకు పంపించాడు' అని చెప్పమన్నాడు" (నిర్గమ 3:13-14).

"తండ్రి యేలాగు తనంతట తానే జీవముగలవాడై యున్నాడో ఆలాగే కుమారుడును తనంతట తానే జీవముగలవాడైయుండుటకు కుమారునికి అధికారము అనుగ్రహించెను. మరియు ఆయన మనుష్యకుమారుడు గనుక తీర్పుతీర్చుటకు (తండ్రి) అధికారము అనుగ్రహించెను." (యోహాను 5:26-27).

దేవునియందు జీవమున్నది. నీవు జీవాన్ని దేవునినుంచి పొందుతున్నావు- అధి భౌతికజీవమైనా, ఆధ్యాత్మిక జీవమైనా సరే. ఈ రెండిటిలో ఏదైనా దేవుని యొద్దనుంచి ఒక బహుమానంలా స్వీకరించాల్సిందే. దేవుడు తన జీవాన్ని ఎవరినుండీ పొందడు. ఆయన తనంతట తానే జీవము గలిగివున్నాడు.

దేవుడు తనంతట తానే జీవముగలిగివుండటవే కాదు, తాను ఇవ్వాలనుకున్నవారికి జీవాన్ని ఇవ్వగలడు కూడ. అంతేకాదు, తన కుమారుడైన యేసుక్రీస్తు ప్రభువునందు విశ్వాసముంచేవారికి నిత్యజీవాన్ని కూడా అనుగ్రహిస్తాడు.

శరీరధారిగా వచ్చిన దేవుడగు యేసుక్రీస్తుకు కూడా జీవమును ఇవ్వగల అధికారమున్నది. యోహాను 6:33లో యేసు ఇలా చెప్పాడు. "పరలోకమునుండి వచ్చినవాడే దేవుడిచ్చు ఆహారమైయున్నాడు. ఆయన లోకమునకు జీవమును అనుగ్రహించుచున్నాడు" మరల యోహాను 10:27-28లో యేసు ఇలా చెప్పాడు: "నా గొర్రెలు నా స్వరం వింటాయి. మరియు నేను వాటిని ఎరిగియున్నాను, అవి నన్ను వెంబడిస్తాయి. నేను వాటికి నిత్యజీవమును అనుగ్రహిస్తాను; అవి ఎన్నడూ నశించవు మరియు వాటిని నాచేతిలోనుండి ఎవరును అపహరించలేరు."

ఏ రాతిబొమ్మ, ఏ చర్చి, ఏ మతం, ఏ మనిషి, ఏ విగ్రహం తనంతట తానే జీవము కలిగియున్నది? ఏ ఒక్కటీ కలిగియుండలేదు. మరియు నా స్నేహితుడా, ఏ రాతిబొమ్మ, ఏ చర్చి, ఏ మతం, ఏ మనిషి, ఏ విగ్రహం తనంతట తానుగా నీకు నిత్యజీవమును శాశ్వతజీవమును అనుగ్రహించగలదు? ఏ ఒక్కరూ ఇవ్వలేరని నేను చెప్పగలను. అయితే యేసుక్రీస్తు ప్రభువునందు శరీరధారిగా ప్రత్యక్షమైన పరలోకమందలి దేవుడే, నిజమైన సజీవుడైన దేవుడు. ఆయనే తనంతట తాను జీవముగలవాడు. ఆయనే నిత్యజీవమైయున్నాడు. నీవు ఆయనను నీ వ్యక్తిగత రక్షకునిగా విశ్వసించినట్లయితే, నీకు నిత్యజీవమును ప్రసాదించగలవాడు ప్రసాదించువాడు ఆయనే.

దేవుడు మార్పులేనివాడు ఆయన (సారము) ఏమైయున్నాడో, ఆయన గుణశీలము (ఆయన ఏమి చెయ్యగలడో) ఏమైయున్నదో వాటిని మార్చలేము.

ఈ విషయాన్ని బైబిల్ ఎన్నోచోట్ల చక్కగా వర్ణిస్తోంది: శ్రేష్టమైన ప్రతి వరము, సంపూర్ణమైన ప్రతి వరము పైనుండి వస్తుంది, అది జ్యోతిర్మయుడగు తండ్రియొద్దనుండి వస్తుంది, ఆయనలో ఎలాంటి మార్పుగాని, చంచలత్వముగాని లేదు.(యాకోబు 1:17).

మనుష్యుల్లో తేడా వుంటుంది, వారి అభిప్రాయాలలో తేడా వుంటుంది, అవి రకరకాల రూపాలలో ఆకారాలలో వస్తాయి, కొన్ని రకాల సంగీతంలో కూడా ఎన్నో హెచ్చుతగ్గులుంటాయి. దేనిలోనైనా హెచ్చుతగ్గులుంటే, అది

భిన్నంగా ఉంటుంది, అది మారుతుంది; అది ఎల్లవేళలా ఒకేలా వుండదు; అది ఆరంభంలో ఉన్నట్టుగా అంతంలో ఉండదు. అయితే తండ్రియందు ఎలా హెచ్చుతగ్గులుగాని, మార్పులుగాని లేవని బైబిల్ చెప్తుంది. ఆయన మారడు.

మన పాతనిబంధనలోని చివరి పుస్తకంలో, దీనిని ఎంతో తేటగా, నీకు సులభంగా అర్థమయ్యేంత సరళంగా చెప్తున్నాడు. "యెహోవానైన నేను మార్పులేనివాడను" (మలాకీ 3:6).

"బైబిల్‌ని నేను అర్థంచేసుకోలేను" అని ప్రజలు అంటుంటారు.

అయ్యో, బైబిల్‌ని అర్థంచేసుకోవడంలో ఎలాంటి సమస్యలేదు. దేవుడు తన గ్రంథాన్ని ఎవరికైనా అర్థమయ్యేంత సరళంగా వ్రాసాడు.

పరలోకమందలి దేవుడు, ఈ విశ్వమును సృష్టించినవాడు, నిజమైన జీవముగల అద్వితీయ దేవుడు మార్పుచెందడు. పూర్వం దేవుడు పాపాన్ని ద్వేషించాడా? ఇప్పుడు కూడా ద్వేషిస్తాడు. ఆయన పాపాన్ని ఎప్పుడైనా శిక్షించాడా? అవును, శిక్షించాడు. ఈనాడు కూడా అలాగేచేస్తాడు. దేవుడు తన మాట నిలబెట్టుకుంటాడా? దేవుడు పాపాన్ని క్షమిస్తాడా? ఆయనకు మొర్రపెట్టి, ఆయనయందు నమ్మికయుంచిన వారందరికి విడుదల నిస్తాడా? విడుదలనిచ్చాడు, గనుక ఇప్పుడు ఇస్తాడు. ఆయన మారడు. ఆయన ఎన్నడూ మారలేదు. ఆయన ఎన్నడూ మారడు. నిజమైన దేవుడు ఇలాగే వుంటాడు.

"ఇశ్రాయేలును కాపాడేవాడు కునుకడు నిద్రపోడు" (కీర్తనలు 121:4). ఆయన మార్పు చెందడు. ఆయన నిత్యుడు. ఆయన ఎప్పటికీ ముసలివాడైపోడు. ఆయన ఎన్నడూ అలసిపోడు.

యెషయా 40వఅధ్యాయంలో దేవుడు మానవమాత్రుడు కాదు అని ఉంది. మనుష్యులు అలసిపోతారు. మనుష్యులు సొమ్మసిల్లిపోతారు. దేశాలు కూలిపోతాయి, పడిపోతాయి, మట్టిలో కలిసిపోతాయి, కానీ దేవుడు అనంతుడు, మార్పులేనివాడు, నిత్యుడు. ఆయన బలము, శక్తి, శౌర్యము, జ్ఞానము, మహిమ, సౌందర్యము, ఠీవి, ప్రేమ, కరుణ, కృప ఎప్పటిలాగే, ఇప్పుడు, ఎల్లప్పుడూ సంపూర్ణముగా, నిండుగా, బలంగా, శక్తివంతంగా నేటికీ అందుబాటులో ఉన్నాయి. బైబిల్ దేవుడు ఇలా వుంటాడు. ఆయన ఎట్టిపరిస్థితులలోనూ కాలానికి పరిమితమైనవాడు కాదు.

ఉదాహరణకు, కీర్తనలు 90:1-4 ఇలా అంటుంది: "దేవా తరతరాలుగా నీవే మాకు నివాసస్థలమైయున్నావు. పర్వతాలు పుట్టకమునుపు, భూమిని,

లోకమును నీవు రూపించకమునుపు, యుగయుగాలుగా నీవే దేవుడవు. నీవు మనుష్యులను నాశనముగా మారుస్తున్నావు. నరులారా తిరిగి రండని చెప్తున్నావు. వేయిసంవత్సరాలైనా నీ దృష్టికి నిన్నటివలె ఉన్నాయి. అవి కేవలం రాత్రిపూట గడిచిపోయిన ఒక జాములె ఉన్నాయి."

దేవుని దృష్టిలో వెయ్యేళ్లు ఎలా వున్నాయట? ఒక ఒక్కరోజుతో సమానం. పైన ఉపయోగించిన పదాలు అవే అర్థాన్నిస్తున్నాయి. ఆ భావం సరైనదో కాదో చూద్దాం రండి. 2 పేతురు 3:8లో (2పేతురులో భక్తిహీనులు అసహ్యించుకునేవి 3 ఉన్నాయని ఎవరో ఒకాయన ఈరోజు ఉదయాన్నే చెప్పడం నేను విన్నాను. ఆ మూడు ఏమిటంటే, 1వ అధ్యాయం, 2వ అధ్యాయం, 3వ అధ్యాయం! నాకైతే బైబిల్లోని 66 గ్రంథాలు ఎంత ఇష్టమో ఈ పత్రిక కూడా అంతే ఇష్టం.) బైబిల్ ఇలా సెలవిస్తోంది: "అయితే, ప్రియులారా, ప్రభువు దృష్టికి ఒక్కరోజు వెయ్యి సంవత్సరాలుగాను, వెయ్యి సంవత్సరాలు ఒక్కరోజుగాను ఉంటాయనే విషయంలో మీరు అమాయకంగా వుండొద్దు."

మనకైతే, ఒక్కరోజు ఒక్క క్షణంలా ఇట్టే గడిచిపోతుంది. వెయ్యేళ్లు అంటే పరిమితమైన మన ఊహలకు కూడా అందనంతగా కలలో కూడ గ్రహించలేనంత అనంతకాలంలా వుంటుంది. వెయ్యి సంవత్సరాలను మనం గ్రహించలేం. అయితే ఈ రెండు కాల వ్యవధులమధ్య దేవునికి పెద్ద వ్యత్యాసమేమీ ఉండదు. వెయ్యి సంవత్సరాల గురించి నీవూ నేను ఆలోచించేదానికీ, ఒక్క సెకను గురించి నీవు నేను ఆలోచించేదానికి ఎంతో వ్యత్యాసం ఉంటుంది. అయితే నీవు అనంతుడవు అనుకుందాం. యుగయుగాలుగా నీవు ఉన్నావు, నిరంతరము అలాగే ఉండేవాడవు అనుకుందాం. నీవు ఎన్నడూ మారనివాడవు, నీ బలము ఎన్నడూ ఉడిగిపోదు అనుకుందాం. నీవు ఎన్నడూ అలసిపోవు, నీకు ముసలితనం లేదు, ఎన్నడూ సొమ్మసిల్లకుండ, బలహీనతలేకుండ, శక్తిసామర్థ్యములు ఎన్నడూ సన్నగిల్లకుండా వుంటే ఎలావుంటుంది? అప్పుడు నీకు ఒక గంటకు, ఒక మిలియన్ సంవత్సరాలకు తేడా ఎలావుంటుంది?

యేసుక్రీస్తు నిన్ను ఆయనయొద్దకు ఆహ్వానించి నిత్యజీవమును పొందుమని చెప్పినప్పుడు లేదా నీవు ఆయనను తిరస్కరించినట్లయితే సదాకాలము అగ్నిగంధకములతో మండే గుండములో నరక యాతన అనుభవిస్తావని హెచ్చరించినప్పుడు, దాని ప్రాముఖ్యత ఏమిటో మనం గ్రహించలేం. ఎందుకంటే, మనం రోజులు, వారాలు, నెలలు, మహా అయితే సంవత్సరాల రూపంలోనే

ఆలోచిస్తాం. అయితే నిత్యుడైన దేవుడు తన అంచనా ప్రకారం వెయ్యి సంవత్సరాలకు, ఒక్కరోజుకు పెద్ద తేడా లేదని చెప్పినప్పుడు మనం దాన్ని పెడచెవిన పెట్టకూడదు. దేవుడు నీకేమి చెప్తున్నాడంటే, వేలకు వేలు సంవత్సరాలు అలా గడిచిపోతూ వుండగా నీవు ఆయన సిద్ధంచేసిన పరలోకపు మహిమను అనుభవిస్తూనైనా వుంటావు, లేదా ఆయనే సిద్ధంచేసిన నరకంలో యాతనలైనా అనుభవిస్తుంటావు. నీవు సదాకాలము నరకయాతనను శిక్షను అనుభవించడం కన్నా, నీవు నిత్యజీవము కలిగివుండాలని నిన్ను తన కుమారుడైన యేసు క్రీస్తు ప్రభువును అంగీకరించుమని దేవుడు నిన్ను ఆహ్వానిస్తున్నాడు.

ప్రియమైన స్నేహితుడా, దేవుడు నిన్ను ప్రేమిస్తున్నాడని అది రుజువుచేస్తోంది. నీవు రక్షణపొందాలని ఆయన నిన్ను హెచ్చరించి, బ్రతిమాలుతున్నాడు. నిత్యత్వము యొక్క తీవ్రతను ఆయనమాత్రమే అర్థంచేసుకొనగలడు. నిత్యత్వపు ఉనికిని దేవుడే గ్రహించగలడు, గనుక నీవు నిత్యశిక్షను తప్పించుకొని నిత్యజీవమును ఎంచుకోవాలని ఆయన నీకు పిలుపునిస్తున్నాడు.

దీనిని సంగ్రహంగా చెప్పాలంటే, దేవుడు

1. నిత్యుడు
2. స్వయంభవుడు
3. తనయందు తానే జీవముగలవాడే కాక, తనను స్వీకరించినవారికి నిత్యజీవాన్ని ప్రసాదిస్తాడు.
4. స్వభావములోను, గుణలక్షణాలలోను ఎన్నడూ మారనివాడు
5. మనకు తెలిసినరీతిగా ఆయన ఏవిధంగానూ కాలానికి చెందిన పరిమితులకు లోబడినవాడు కాదు. ఆయన దృష్టికి వెయ్యి సంవత్సరాలు ఒక రోజులా వుంటాయి.

నశించిపోతున్న లోకంలో జీవించే మనం అన్నీ పాతగిలిపోవడం చూస్తున్నాం. భవనాలకు, యంత్రాలకు, వస్తువులకు నిరంతరం మరమ్మతులు చేయాల్సివస్తుంది. మొక్కలు బలహీనపడి, వాడిపోయి, ఎండిపోతుంటాయి. ఇలాంటి పరిస్థితులలో నిత్యుడు, మార్పులేనివాడైన దేవుడు అనే భావనను గ్రహించడం మనకు ఎంతైనా కఠినంగా వుంటుంది. అయినా, మన ఆరాధనను కోరుకునే దేవుడు ఈయన తప్ప మరొకరు లేరు.

మీరేదైనా చెక్కతోనే, రాయితోనో ఒకటి తయారుచేసి దానికి దేవుడు అని

పేరుపెట్టి దానిని పూజించ దలిస్తే, కొంతకాలానికి ఆ విగ్రహమే వ్యర్థమైపోతుందని మీరు తెలుసుకోవాలి.

ఒకవేళ మీరు మహమ్మదు లేక బుద్ధుడు లేక పోపు, ప్రీస్టు, లేక బోధకుడు వంటి ఒక మనిషిని ఘనపరచి వారిని వెంబడించాలని తీర్మానించుకున్నావే అనుకో. అతడు వృద్ధుడై చనిపోతాడని, లేక ఇప్పటికే చనిపోయాడని నీకు తెలుసు. ప్రపంచంలోని అనేక ప్రాంతాలలో ప్రజలు చనిపోయిన తమ పూర్వీకుణ్ణి పూజిస్తారు. స్నేహితుడా, వారు పూజకు అర్హులైతే మరణించేవారు కాదు, వారిని విడిచిపోయేవారు కాదు. ఈలోకాన్ని విడిచిపోయిన మీ పూర్వికుడు మీ ఇంటిలో పెద్ద కుర్చీలో కూర్చొనివుంటాడని నిన్ను నీవు ఎంతగా ఒప్పింపజేసుకోవాలని ప్రయత్నించినా, నీవు వెళ్లి ఆ కుర్చీలో కూర్చుంటే నిన్ను అడ్డుకునేవాళ్లు ఎవరూ ఉండరు. అక్కడ ఎవ్వరూ లేరు. దేవుడు మాత్రమే నిత్యుడు. ఆయన అనంతుడు, ఆయనే రాజు.

మనుష్యులతో దేవుడు వ్యవహరించే క్రమంలో సాధ్యమైన ప్రతి విధానం ద్వారా తనను తాను వారికి బయలుపరుచుకునే ప్రయత్నంచేసాడు. సమస్య ఏమిటంటే, మనం నేర్చుకునే విషయంలో ఎంతో మందమతులం. సమస్య దేవుడు తనను తాను ప్రత్యక్షపరచుకోవడం గురించి కాదు. ఆయన అనుగ్రహించిన ప్రత్యక్షతను స్వీకరించగలిగే మన సామర్థ్యంలోనో లేదా ఆ ప్రత్యక్షతను స్వీకరించాలన్న సుముఖతలోనో సమస్య ఉంది.

భూమిమీద మనం జీవించే సమయం ఎంతో స్వల్పమైనది అనే వాస్తవాన్ని బట్టి దేవుడు ప్రతి తరంతోను నూతనంగా పనిచేయవలసిన అవశ్యకత ఏర్పడింది. ఎన్నో వేల లక్షల కోట్లమంది యేసుక్రీస్తును తిరస్కరిస్తున్నా, ఆయన మనుష్యులను ఆహ్వానించడాన్ని కొనసాగిస్తూనే వున్నాడు. ఆయన అనుగ్రహించే క్షమాపణ, ప్రేమ, కనికరాలనుంచి లెక్కలేనంతమంది దూరంగా వెళ్లిపోతూ నేరుగా నరకపు వేదనలవైపు పయనిస్తున్నా, వారిపాపాల కోసం క్రీస్తు మరణించాడని దేవుడు పాపులకు చెప్తూనే వున్నాడు.

నీ పాపపు శిక్షకు వెలను క్రీస్తు సిలువపై చెల్లించాడు. మూడు రాత్రులు, మూడు పగళ్లు అయిన తర్వాత ఇంతవరకు ఏ మతనాయకుడూ చేయలేని పనిని ఆయన చేసాడు. తన సొంతశక్తితో ఆయన సమాధిలోనుండి బయటికి వచ్చాడు. ఆయన సదాకాలము సజీవుడైయున్నాడు. ఆయన పరలోకమునకు ఆరోహణమైపోయి తన తండ్రి కుడిపార్శ్వమున కూర్చునియున్నాడు. నీ సమస్త

పాపములనుండి నిన్ను పవిత్రపరచి, నీ అతిక్రమములన్నిటిని క్షమించి నీకు నిత్యజీవమును ప్రసాదించడానికి ఆయన సిద్ధముగా, ఇష్టపూర్వకముగా ఉన్నాడు, అలాచేయడానికి ఆయన సమర్థుడు. నీవు కేవలము ఆయనయందు విశ్వాసముంచి ఆయనను నమ్మినట్లయితే, ఆయన నీ ఆత్మను రక్షిస్తాడు.

జీవానికి మూలము స్వయంభవుడైన దేవుడే అన్న వివరణ ఒక్కటే సరైనది. నీవు ఇక్కడ ఉన్నది యాదృచ్ఛికంగా కాదు. నీవు ఏదో కోతినుంచి పరిణామం చెందినవాడవు కాదు. నీవు నిత్యుడగు దేవునిగూర్చి తెలుసుకోవడమనేది కాకతాళీయంగా, విధివశాత్తుగా జరిగింది కాదు.

మానవుడు జీవాన్ని ఇవ్వలేడు, దాన్ని పొడిగించనూ లేడు. దేవుడే జీవప్రదాత. ప్రాణాన్ని తీసుకొనే హక్కు ఆయనకే వుంది. ప్రాణాలను ఇవ్వగలిగే హక్కు కూడా ఆయనకే వుంది. నీవు తుదిశ్వాస ఎప్పుడు విడుస్తావో నీకు తెలియదు. నీ శారీరక, మానవజీవితం ఎప్పుడు అంతమౌతుందో నీకు తెలియదు.

నిన్నొక ప్రాముఖ్యమైన ప్రశ్న అడగనివ్వు. నీకు భౌతిక జీవాన్ని ప్రసాదించిన దేవుడు ఈరోజున ఆ జీవాన్ని తీసుకోదలిస్తే, దానివిషయమై నీవేమి చేయగలవు? నువ్వు చేయగలిందేమీ లేదు! సరే, ఒకవేళ అదే జరిగితే, నీవు ఎక్కడికి వెళతావు? రెండే గమ్యాలున్నాయి: పరలోకము, నరకము.

నీవు నరకానికి ఎలా వెళ్తావు? ఏమీ చెయ్యనక్కరలేదు. కేవలం నీ పాపాలలోనే జీవించి చనిపోతే చాలు, నేరుగా నరకాగ్నిలో ప్రవేశిసస్తావు.

నీవు పరలోకానికి ఎలా వెళ్తావు? నీవు యేసు క్రీస్తు ప్రభువు వద్దకు వచ్చి నీవు పాపివని ఒప్పుకో. నీ హృదయపూర్వకంగా యథార్థంగా, నిజాయితీగా, సామాన్యమైన పదాలతో ఆయనకు ఇలా ప్రార్థించు: “దేవా, నీవు నా సృష్టికర్తవని నేను నమ్ముతున్నాను. నాకు ప్రాణమిచ్చింది నీవేనని నేను నమ్ముతున్నాను. నా పాపాలు క్షమించబడిన వెంటనే నాకు నిత్యజీవాన్ని ప్రసాదిస్తావని నేను నమ్ముతున్నాను. దేవా, ప్రభువా, నీవు ప్రభువైన యేసుక్రీస్తు రూపంలో శరీరధారివై ప్రత్యక్షమయ్యావని నేను నమ్ముతున్నాను. నా పాపాలకోసం వెలచెల్లించడానికి యేసు తన ప్రాణాలర్పించి, మృతులలోనుంచి తిరిగి లేచాడని నేను నమ్ముతున్నాను. నేను ఆయననే నమ్ముతున్నాను. నన్ను నేను నమ్ముకోను. ఏ మనిషినీ నేను నమ్మను. ఏ మతాన్నీ నేను నమ్మను. ఏ విగ్రహాన్ని కూడా నమ్మను. దేవా, నేను యేసుక్రీస్తును నమ్ముతాను. ఆయనను నా రక్షకునిగా నమ్ముతాను. విశ్వాసంతో ఆయననుంచి నేను నిత్యజీవాన్ని పొందుతాను.”

అది నీ హృదయంలో విశ్వసిస్తున్నావా? అలాగైతే, తాను ఏమి చేస్తానని చెప్పాడో ఆలాగు జరిగించుమని దేవునియందు విశ్వాసముంచు.

నా స్నేహితుడా, అదే రక్షణ మార్గము. నిన్ను నీవు రక్షించుకోలేవు. జీవమిచ్చేది దేవుడే. నిన్ను ప్రేమించి, నీగురించి చింతించే, నీ రక్షకుడు, తనతో నీవు నిత్యత్వాన్ని గడపాలని ఆశించే దేవుని నుంచి జీవము అనే వరాన్ని స్వీకరించాలి.

# దేవుని శక్తి

ఈ పాఠంలో దేవుడు తన శక్తిని వినియోగించే విధానం గురించి అధ్యయనం చెయ్యాలనుకుంటున్నాం. దేవునియందు విశ్వాసముంచేవారెవరూ దేవునిశక్తిని సందేహించరు కానీ, దేవుడు ఆ శక్తిని ఎలా వినియోగిస్తాడు? అనేకమంది మూర్ఖులు బుద్ధిలేని ఇలాంటి ప్రశ్నలువేసి వాదిస్తూ నేరుగా నరకంలోకి అడుగేస్తుంటారు. “దేవుడు సహితం ఎత్తలేనంత పెద్ద రాయిని దేవుడు సృష్టించగలడా?” లేక “దేవుడు అంతగొప్ప శక్తిమంతుడైతే, జరిగే యుద్ధాలన్నిటినీ ఆయన ఎందుకు ఆపలేదు?” ఇవీ, ఇలాంటివే కొన్ని వందల ప్రశ్నలు దేవుడు తన శక్తిని ఎలా వినియోగిస్తాడో తెలియని అజ్ఞానాన్ని బయటపెడుతుంటాయి.

దేవుడు తన అపరిమితమైన శక్తిని ఎల్లప్పుడూ తన జ్ఞానాన్ని అనుసరించి వినియోగిస్తుంటాడు. ఆయన తన శక్తిని ఎల్లప్పుడూ తన మంచితనము పరిశుద్ధతలకు అనుగుణంగానే వినియోగిస్తాడు.

నరులను తన స్వరూపమందు సృజించడం మంచిది అని దేవుడు తన అనంతజ్ఞానం, మంచితనంలో చూసాడు. మర్త్యమైన దేహంతో అమర్త్యమైన ఆత్మను దేవుడు సృష్టించాడు. దేవుడు మనిషికి కొంత స్వేచ్ఛాచిత్తాన్ని కూడా అనుగ్రహించాడు. అలాచేయడం ద్వారా మానవుని ఉనికిని అంతంచేయడం గాని, మనిషి ప్రవర్తన విషయంలో తన చిత్తాన్ని రుద్దడం గాని అసాధ్యమయ్యేలా చేసాడు దేవుడు. దేవుడు మనిషిని ఒక భౌతికదేహంలో నిత్యత్వముతో కూడిన ఆత్మగా చేసాడు. భౌతిక జీవాన్ని ఆయన ఎప్పుడైనా అంతం చేయగలడు. అయితే ఆత్మను సదాకాలము పరలోకంలోనైనా నివసింపనియ్యాలి, లేక ఆ ఆత్మను నరకంలోనికైనా వెళ్లగొట్టాలి.

మనుష్యులు పాపపు స్థితిలోనే పరలోకంలో ప్రవేశించడానికి వీల్లేకుండా దేవుని పరిశుద్ధత అడ్డుకుంటుంది. మానవుని పతనావస్థలోనుంచి విడిపించే శక్తి దేవునికి వున్నది గాని, దేవుడిచ్చే రక్షణను మానవుడు స్వచ్ఛందంగా స్వీకరించినప్పుడే పాపం మీద ఆయనకున్న శక్తి పనిచేస్తుంది.

అయితే, ఇప్పుడు మేము చెప్పిన మాటలతో విభేదించే అనేక వేదాంతపరమైన అభిప్రాయాలున్నాయి, కాని మా అభిప్రాయం చాలా సామాన్యమైనది. రోమా 3:4లో బైబిల్ ఇలా సెలవిస్తోంది: "నీ మాటల్లో నీవు నీతిమంతుడవుగా కనిపించడానికి, నీపై విచారణ జరిగినప్పుడు గెలవడానికి" అని రాసివున్న ప్రకారం మనుష్యులంతా అబద్ధికులైనా సరే, దేవుడు మాత్రం నీతిమంతుడే." ఏదైనా వేదాంత వ్యవస్థగాని, సిద్ధాంతాలుగానీ స్పష్టమైన దైవవాక్యంతో విభేదిస్తే, దేవుని కృపనుబట్టి మేము ఆ వ్యవస్థతోగాని, ఆ బోధనలతోగాని శాశ్వతంగా విభేదిస్తాం. మాకు దేవునివాక్యం ఉంది; మనుష్యుల మాటలు, బోధలు మాకు అవసరం లేదు.

దేవుని వాక్యానుసారంగా, దేవునిశక్తి ఎలావుంటుందో చూద్దాం.

1. దేవుని శక్తి ఆయన వాగ్దానాలకు అనుగుణంగా వుంటుంది. ఉదాహరణకు, ప్రకటన 22:17లో మనమిలా చదువుతాం: "ఆత్మ, పెండ్లికుమార్తె రమ్ము అని చెప్పుచున్నారు. వినేవాడు కూడా రమ్ము అని చెప్పాలి. దప్పిగొన్నవానిని రానిమ్ము. జీవజలమును ఉచితముగా తీసుకొమ్మని చెప్పాలి." మనుష్యులందరూ వచ్చి జీవజలాన్ని తీసుకోమని దేవుడు అందరినీ ఆహ్వానిస్తున్నాడు. అది పూర్తిగా ఉచితం. అది దేవుని వరం. దానిని ఎవరు పొందవచ్చు? ఎవరైనా సరే! దేవునిలో జీవమున్నది. ఆయనయొద్ద జీవజలమున్నది. ఆయన అందరినీ ఆహ్వానిస్తాడు గాని ఆ జీవజలాన్ని త్రాగుమని ఎవరినీ బలవంతపెట్టడు. ఈ అవకాశాన్ని స్వీకరించడమో తిరస్కరించడమో అనేది వ్యక్తిగత నిర్ణయం. దేవుని శక్తి తన వాగ్దానాలకు లోబడివుంటుంది.

రోమా 9:15-16లో బైబిల్ ఇలా సెలవిస్తోంది: "అందుకు దేవుడు మోషేతో ఇలా చెప్పాడు, నేను ఎవరిపై కనికరం చూపాలనుకుంటానో వారిపై కనికరం చూపిస్తాను. ఎవరిపై జాలి చూపాలనుకుంటానో వారిపై జాలి చూపిస్తాను. కాబట్టి ఒకరు ఆశించడం వలన గానీ, ఒకరు ప్రయాస పడడం వలన గానీ కాదు, దేవుడు కనికరం చూపడం వల్లనే అవుతుంది." కనికరం చూపడమే దేవుని చిత్తం. దయచూపడమే ఆయన కోరిక. ఆయన యొద్దనుండి ఎవరు స్వీకరిస్తారో వారికే దేవుడు తన దయ కనికరాలను చూపుతాడు.

తనయందు నమ్మికవుంచేవారి అవసరాలన్నీ దేవుడు తీరుస్తాడు. ఇలా చేయగల శక్తి దేవునికి ఉన్నది. నీకు జీవాన్ని ప్రసాదించడానికి, నీయెడల దయ కనికరాలను చూపి, నీ పాపాలను క్షమించడానికి దేవునికి శక్తివున్న మాట

ఎంత నిశ్చయమో, నీ ప్రతి అవసరతను దేవుడు తీర్చగలడన్నది కూడా అంతే నిశ్చయం. "అయితే క్రీస్తుయేసునందు తన మహిమైశ్వర్యము చొప్పున నాదేవుడు మీ ప్రతి అవసరమును తీర్చును" (ఫిలిప్పీ 4:19).

ఏదిఏమైనా, దేవునికి మన అవసరాలన్నీ తీర్చగల శక్తివున్నప్పటికీ, తన అధికారాన్ని పరిమితం చేసుకోవడానికే ఆయన ఇష్టపడ్డాడు. ఆయనకు అపరిమితమైన శక్తి వుంది కాని ఆ శక్తిని తన మంచితనము పరిశుద్ధతలకు అనుగుణంగానే వినియోగించడానికి ఇష్టపడ్డాడు. నీ అవసరమేంటో నాకు తెలియదు కానీ నీకు కావలసినదేమిటో తెలిసిన ఒక దేవుడున్నాడు, ఆయన నాకు తెలుసు. అంతేకాదు, నీకున్న ప్రతి అవసరాన్ని ఎరిగిన దేవుడు వాటన్నిటినీ తీర్చటానికి ఇష్టపడుతున్నాడని, అందుకాయన సమర్థుడని కూడా నాకు తెలుసు. "అలాగైతే, ఆయన అలా ఎందుకు చేయడు?" అని మీరు అడగవచ్చు. ఎందుకు చేయడంటే, నీవు ఆయనవద్దకు ఎన్నడూ రాలేదు, ఆయనను నమ్మలేదు, ఆయనయందు విశ్వాసముంచలేదు, ఆయనను నీ దేవునిగా అనుమతించలేదు గనుక. నీవు ఆయనయందు విశ్వాసముంచినప్పుడే నీపై ఆయన తన అధికారాన్ని వినియోగిస్తాడు.

దానికో చక్కని ఉదాహరణ: నీవు రక్షణ పొందాలా? అవును. దేవుడు నిన్ను రక్షించగలడా? అవును. నిన్ను రక్షించడానికి ఆయన ఇష్టపడుతున్నాడా? అవును. తన కుమారుడైన యేసుక్రీస్తు ప్రభువును నీవు నమ్మకపోతే ఆయన నిన్ను రక్షిస్తాడా? లేదు.

"మన రక్షకుడైన దేవుని దృష్టికి ఇది మంచిదిగాను అంగీకారయోగ్యముగాను ఉన్నది. అందరు (ఏ భేదము లేకుండా) రక్షణ (పాపక్షమాపణ) పొంది సత్యమును గూర్చిన జ్ఞానములోనికి రావాలన్నది ఆయన చిత్తము" (దేవుని చిత్తము) (1 తిమోతి 2:3-5). మనుష్యులందరూ రక్షణపొందారా? లేదు కదా! మనుష్యులందరూ సత్యమును గూర్చిన జ్ఞానములోనికి వస్తారా? అలా ఊహించుకోవడం కూడా కష్టమే! గనుక బైబిల్‌ను యధాతథంగా వదిలేస్తే, మానవాళిని రక్షించాలన్న దేవుని చిత్తమును ప్రభువైన యేసుక్రీస్తును తిరస్కరించాలన్న మానవచిత్తం కొట్టివేసినట్టుగా తెలుస్తుంది.

2. దేవుడు తన శక్తిని వినియోగించగలిగే సాధనాలను ఉపయోగిస్తాడు.

దేవుడు ప్రకృతి శక్తులను ఉపయోగిస్తాడు. ఆధ్యాత్మిక, ప్రభుత్వ హోదాలలో ఉన్న ఏర్పరచబడిన మనుష్యులను దేవుడు ఉపయోగించుకుంటాడు. దేవుడు

దూతలను ఉపయోగించుకుంటాడు. పరిశుద్ధాత్మ దేవుడు, కుమారుడైన దేవుడిని కూడా మనము చూస్తాము. తండ్రియొక్క సంపూర్ణ అధికారాన్ని వారు వినియోగిస్తారు.

పైన చెప్పిన విషయానికి వాక్యానుసారమైన రుజువు ఏమైన ఉన్నదేమో పరిశీలించి చూద్దాం. దేవుడు తన అధికారాన్ని శక్తిని వినియోగించడానికి ప్రకృతిశక్తుల్ని ఉపయోగించుకున్నట్టుగా పాతనిబంధనలోని తొలి పుటలలో కనిపిస్తుంది. సంఖ్యాకాండము 11వ అధ్యాయంలో ఇశ్రాయేలు ప్రజలు అరణ్యప్రాంతం గుండా వెళ్తున్నారు. బైబిల్ ఇలా సెలవిస్తోంది: "అప్పుడు యెహోవా సముద్రం నుండి గొప్పగాలి వీచేటట్టుగా చేసాడు. ఆ గాలి పూరేళ్లను ఆ ప్రాంతంలోకి విసిరాయి. వారి నివాసాల చుట్టూరా పూరేళ్లు ఎగిరాయి. నేల అంతా పూరేళ్లతో నిండి పోయేటన్ని ఉన్నాయి అవి. నేలమీద మూడు అడుగుల ఎత్తుగా పూరేళ్లు నిండిపోయాయి. ఒక మనిషి ఒక రోజున నడువగలిగినంత దూరం అన్ని దిశల్లో పూరేళ్లు ఉన్నాయి. ప్రజలు బయటకు వెళ్లి ఆ రాత్రి పగలు అంతా పూరేళ్లను ఏరుకొన్నారు. ఆ మర్నాడు అంతా వారు పూరేళ్లు పోగుచేసుకొన్నారు. తక్కువ కూర్చుకొన్నవాడు నూరు తూములుకన్నా ఎక్కువ పూరేళ్లను పోగుచేసుకున్నాడు. తర్వాత ప్రజలు ఆ పూరేళ్లను వారి గుడారాల చుట్టూ ఎండటానికి ఎండలో పరిచారు" (సంఖ్యాకాండము 11:31-32).

ఈ వాక్యభాగంలో దేవుడు అరణ్యంలో తన ప్రజలను మన్నాతో పోషిస్తున్నాడు. ఇప్పుడు వారికి తినడానికి పూరేళ్లను ఇవ్వాలని ఆయన నిర్ణయించుకున్నాడు. సముద్రము చుట్టు ఎన్నో పూరేడు పక్షులున్నాయి. దేవుడైన యెహోవా గాలిని పంపి ఇశ్రాయేలు ప్రజలు నివాసమున్న చోటికి ఆ పూరేళ్లను రప్పించాడు. దేవుని శక్తి వారిని పోషించింది. దేవుని శక్తి వారియొద్దకు పూరేడు పక్షులను రప్పించింది. గాలి అనే శక్తిద్వారా దేవుని శక్తి అభ్యాసం చేయబడింది.

నిర్గమకాండము 9:22-24 వచనాలు చూడండి. "నీ చేతులు గాలిలో పైకి ఎత్తు, "ఈజిప్టు అంతటా వడగళ్ల వాన ప్రారంభం అవుతుంది. ఈజిప్టు పొలాల్లో ఉన్న మొక్కలన్నిటి మీద, జంతువుల మీద, మనుష్యులందరి మీద వడగళ్లు పడతాయి" అని మోషేతో యెహోవా చెప్పాడు; కనుక మోషే తన కర్రను పైకి ఎత్తాడు, ఉరుములు, మెరుపులు వచ్చేటట్టు, భూమి మీద వడగళ్లు కురిసేటట్టు యెహోవా చేసాడు. ఈజిప్టు అంతటా వడగళ్లు పడ్డాయి; వడగళ్లు పడుతోంటే, ఆ వడగళ్లతో పాటు మెరుపులు మెరిసాయి. ఈజిప్టు ఒక రాజ్యంగా

ఏర్పడినప్పటి నుండి, ఈజిప్టును ఇంత దారుణంగా దెబ్బతీసిన వడగళ్ల వాన ఇదే.”

దేవుడు తన శక్తిని ఫరోపైన ఐగుప్తీయులపైన వినియోగించదలచినప్పుడు, ఆపని ఆయన ఎలాచేసాడు? తన తీర్పులను ఉరుములు పిడుగుల ద్వారా పంపించాడు. దేవుని శక్తి ప్రకృతి ద్వారా వినియోగించబడింది.

రెండవది, దేవుడు తన శక్తిని ఆధ్యాత్మిక స్థానాలలో ఉన్న ఏర్పరచబడిన వ్యక్తులద్వారా వినియోగిస్తాడని చెప్పాం. ఉదాహరణకు, అపొస్తలులకార్యములు 9వ అధ్యాయంలో 15వ వచనం చదివితే మనకు ఈ విషయం కనిపిస్తుంది: “అప్పుడు ప్రభువు అననీయతో, “వెళ్ళు! నా పేరు యూదులు కాని వాళ్ళకు, వాళ్ళ పాలకులకు, ఇశ్రాయేలు ప్రజలకు ప్రచారం చేయటానికి యితణ్ణి నేను ఒక సాధనంగా ఎన్నుకొన్నాను” అని చెప్పాడు.

దేవుడు తన నామం పేరిట సాక్ష్యాన్ని నిలబెట్టుకోగల సామర్థ్యం దేవునికి ఖచ్చితంగా ఉంది. అన్యులకు, రాజులకు, ఇశ్రాయేలు ప్రజలకు తనను తాను తెలియజేసుకునే సామర్థ్యం ఆయనకు ఖచ్చితంగా ఉంది. అయితే దేవుడు తన శక్తిని వినియోగించడానికి తన పరిశుద్ధాత్మచేత నింపబడిన వ్యక్తులను వాడుకోవడానికి ఇష్టపడ్డాడు.

ఈ సందర్భంలో దేవుడు తన అపొస్తలుడైన పౌలును ఏర్పరచుకొని సువార్తశక్తిని, సువార్త సందేశాన్ని ప్రకటించగల అధికారాన్ని అతనికి అనుగ్రహించాడు.

ఈ నియమం ఆధ్యాత్మిక మండలంలోనే కాదు, లౌకికపరమైన మానవ ప్రభుత్వాలలో కూడా సత్యమే అవుతుంది. రోమా 13:1-6 వచనాలలో బైబిల్ ఇలా సెలవిస్తోంది: ***“ప్రభుత్వాన్ని దేవుడే నియమించాడు కనుక ప్రతి ఒక్కడూ ప్రభుత్వం చెప్పినట్లు చెయ్యాలి. ప్రస్తుతమున్న ప్రభుత్వాన్ని కూడా దేవుడే నియమించాడు. అందువల్ల ప్రభుత్వాన్ని ఎదిరించిన వాడు దేవుని ఆజ్ఞను ఎదిరించిన వానితో సమానము. వాళ్ళు శిక్షననుభవించవలసి వస్తుంది. సక్రమంగా నడుచుకొనే వాళ్ళు పాలకులకు భయపడరు. తప్పు చేసిన వాళ్ళకే ఆ భయం ఉంటుంది. ప్రభుత్వానికి భయపడకుండా ఉండాలంటే, సక్రమంగా నడుచుకోండి. అప్పుడు ప్రభుత్వం మిమ్మల్ని మెచ్చుకుంటుంది. మీ మంచి కోసం ప్రభుత్వ అధికారులు దేవుని సేవకులుగా పని చేస్తున్నారు. కాని మీరు తప్పు చేస్తే భయపడవలసిందే! వాళ్ళు ఖడ్గాన్ని వృధాగా ధరించరు. దేవుని***

*సేవకులుగా వాళ్ళు తప్పు చేసిన వాళ్ళను శిక్షించటానికి ఉన్నారు. అందువల్ల శిక్షింపబడుతారనే కాకుండా మీ అంతరాత్మల కోసం కూడా అధికారులు చెప్పినట్లు చెయ్యటం అవసరం. అధికారులు దేవుని సేవకులు. వాళ్ళు తమ కాలాన్నంతా దీనికోసమే ఉపయోగిస్తున్నారు. అందువల్లే మీరు పన్నులు చెల్లిస్తున్నారు."*

దేవుడు ఈలోక ప్రభుత్వాలపై తన అధికారాన్ని వినియోగించగోరుతున్నాడని ఈ వచనాలు మనకు చెప్తున్నాయి. అయితే, ఆ పనిచేయడానికి ఆయన మానవులను తన సాధనాలుగా వాడుకుంటాడు. తాను ప్రభుత్వ స్థానాలలో ఉంచిన వ్యక్తులను ఉపయోగించుకుంటాడు. అనేకమంది దుష్టులైన నిరంకుశ అధికారులున్నారని, దుర్మార్గులు అవినీతిపరులైన పాలకులు అనేకులు మానవులపై అధికారం చెలాయిస్తున్నారని నేను గ్రహించాను. ఇది ఒక అనుమానితుణ్ణి దూషకుణ్ణి దేవుడు నిజంగా దయగలవాడు, ప్రేమగలవాడేనా అని ప్రశ్నించేలా చేస్తుంది. అయినప్పటికీ దేవుడు ప్రతి దేశానికి తగిన పాలకులను నియమిస్తాడని చరిత్ర మనకు చూపింది, నిత్యత్వం రుజువుపరుస్తుంది. ఏ దేశమైతే దేవుణ్ణి మరచిపోయి, విగ్రహాలను పూజిస్తూ, పాపంలో దుర్మార్గంలో, జారత్వంలో జీవిస్తుందో, ఆ దేశం ఖచ్చితంగా దైవభక్తిగల దయామయుడైన రాజును పొందడానికి అర్హురాలు కాదు, అలాంటి ప్రజలకు దేవుడు ఎన్నడూ అటువంటి పాలకుని అనుగ్రహించడు.

ఈలాంటి విషయాలను కేవలం మానవ తర్కంతోను, హేతువుతోను ఆలోచించేకన్నా ప్రార్థనాపూర్వకంగా పరిగణనలోనికి తీసుకోవడం మంచిది.

దేవుడు తన శక్తిని దేవదూతలద్వారా వినియోగిస్తాడని కూడా చెప్పాం. అలాంటి సందర్భాన్ని ఒకటి చూద్దాం. మత్తయి 26:52-53 లో (పేతురుతో మాట్లాడుతూ) ప్రభువు ఇలా అన్నారు: "నీ కత్తిని తిరిగి దాని స్థానంలో పెట్టు. కత్తిని ఉపయోగించేవారు కత్తిద్వారానే నశించిపోతారు. నేనిప్పుడు నా తండ్రిని వేడుకుంటే పన్నెండు సేనల దేవదూతలను నాకు అండగా పంపించడని నీవు భావిస్తున్నావా?"

మరొక సందర్భంలో యెరూషలేమును నాశనం చెయ్యాలన్న ఉద్దేశంతో ఒక సైన్యం యెరూషలేమును చుట్టుముట్టింది. వారు పొద్దుటే అల్పాహారం తీసుకునేలోపే కేవలం ఒక్క దేవదూత వచ్చి 185,000 మంది సైనికుల్ని హతమార్చాడు. ఈ కథనాన్ని మీరు 2 రాజులు 19:35లో చదువుకోవచ్చు.

దేవుడు తన సంకల్పాన్ని నెరవేర్చడం కోసం తన శక్తిని దేవదూతలకు అప్పగించినట్లుగా బైబిల్లో అనేక స్థలాలలో మనం చూడగలం.

యోహాను 14:26లో పరిశుద్ధాత్మ దేవుడు ఎంతో శక్తివంతంగా పనిచేయడం చూస్తాం: "తండ్రి నా పేరిట పంపనున్న ఆదరణకర్త, అంటే పవిత్రాత్మ, మీకు సహాయం చెయ్యటానికి వస్తాడు. ఆయన మీకు అన్నీ బోధిస్తాడు. నేను చెప్పిన వన్నీ మీకు జ్ఞాపకం చేస్తాడు."

అలాగే యోహాను 16:7-8 వచనాలలో ఇలావుంటుంది: " కాని నేను వెళ్ళటం మీ మంచి కోసమే. ఇది నిజం. నేను వెళ్ళకపోతే మీకు సహాయం చెయ్యటానికి ఆదరణకర్త రాడు. నేను వెళ్తే ఆయన్ని పంపగలను. ఆయన వచ్చాక పాపాన్ని గురించి, నీతిని గురించి, తీర్పును గురించి ప్రపంచాన్ని ఒప్పింప చేస్తాడు."

ఏ మానవుడైనా ఆదరించగలడా? మానవమాత్రుండైవరైనా సర్వసత్యములోనికి నడిపించగలరా? ఆదాము సంతానములో ఎవరైనా అన్నివిషయాలనూ జ్ఞాపకానికి తీసుకురాగలరా? నీవుగాని నేను గాని లోకాన్ని పాపమును గూర్చి నీతినిగూర్చి తీర్పును గూర్చి ఒప్పింపజేయగలమా? లేదు మిత్రమా, అది పరిశుద్ధాత్మ దేవునిద్వారా వినియోగించబడిన దేవుని మహాశక్తి.

యేసు క్రీస్తు ప్రభువుకూడా మానవశరీరంలో ఉన్నప్పటికి దైవశక్తిని కలిగివున్నాడు. యోహాను 6:38లో యేసు ఇలా చెప్పాడు: "నేను పరలోకం నుంచి దిగివచ్చింది నా చిత్తాన్ని నెరవేర్చడానికి కాదు గాని నన్ను పంపిన తండ్రి చిత్తాన్ని నెరవేర్చడానికే వచ్చాను."

కాబట్టి ఈ అధ్యాయంలో మనం ఇంతవరకు నేర్చుకున్న విషయాలేవంటే:

1. దేవుని శక్తి తన వాగ్దానాలకు అనుగుణంగా పనిచేస్తుంది.

2. దేవుడు కొన్ని పనులను చేస్తానని వాగ్దానం చేసాడు, ఆ వాగ్దానాలను నెరవేర్చే శక్తి ఆయనకుంది.

3. దేవుని శక్తి వినియోగించబడటానికి దేవుడు కొన్ని విధానాలను అవలంభిస్తాడు. అవి ప్రకృతి శక్తులు, ఆధ్యాత్మిక, ప్రభుత్వ స్థానాలలోనుండి ఏర్పరచబడిన మనుష్యులు, దేవదూతలు, పరిశుద్ధాత్మ దేవుడు మరియు ఆయన కుమారుడైన యేసు.

తర్వాత, దేవుడు తన శక్తిని తన న్యాయవిధులకు లోబడి విడుదలచేస్తాడనే విషయాన్ని పరిశీలిద్దాం. మరోవిధంగా చెప్పాలంటే, దేవుడు పరలోకంలో ఉండి

ఎప్పుడు ఎలా అనిపిస్తే అలా హడావిడి నిర్ణయాలు చేయడన్నమాట. దేవుడు ఈ విశ్వాన్ని ఆయన ఇష్టాయిష్టాలపై ఆధారపడి నడిపించడం లేదు. ఈ విశ్వాన్ని నడిపించడానికి వీలుగా ప్రభువు కొన్ని నియమాలను, విధులను, నమూనాలను నియమించాడు. అది ఒక క్రమబద్ధంగా, మర్యాదగా పనిచేస్తుంది. ఎందుకంటే దేవునికి సమస్తము చేయగల శక్తిఉన్నప్పటికీ, తాను నియమించిన సూత్రాలకు కట్టుబడి ఆయన శక్తి పనిచేస్తుంది. దీనికి నాలుగు ఉదాహరణలు చూపించనివ్వండి:

1. ఈ సూత్రాలలో మొదటిది కాలము అనే సూత్రం. దేవుడు తన సంకల్పాలను నెరవేర్చడానికి సమయం పడుతుంది. దేవుడు తన సంకల్పాలను ఏమాత్రం ఆలస్యం లేకుండా నెరవేర్చగలడు, అయితే ఆయన కాలము అనే సూత్రానికి లోబడి తన శక్తిని విడుదల చేయడానికి నిర్ణయించుకొన్నాడు.

యోహాను 5:17లో “నా తండ్రి పని చేస్తున్నాడు గనుక నేనుకూడ పనిచేస్తున్నాను అని యేసు వారితో చెప్పాడు” అని చదువుతున్నాం. యేసుక్రీస్తు వచ్చాడు, శ్రమించాడు, కష్టపడ్డాడు, శరీరమందు బాధఅనుభవించాడు, తన ప్రాణమర్పించాడు, ఆయన మరణించాడు, తిరిగిలేచాడు, పరలోకానికి ఆరోహణుడై వెళ్లాడు. అక్కడ 2,000 సంవత్సరాలుగా తండ్రి కుడిపార్శ్వాన కూర్చొనియున్నాడు. ఆయన సాధించినదంతా ఒక్క మాట సెలవిచ్చివుంటే అది నెరవేరివుండేది. అయితే తన శక్తిని విడుదల చేయడానికి ఆయన కాలము అనే సూత్రాన్ని అనుసరించడానికి నిర్ణయించుకున్నాడు.

మరల నిర్గమ 20:11 లో, దేవుని వాక్యము ఇలా సెలవిస్తోంది: “ఎందుకంటే, యెహోవా ఆరు రోజులు పనిచేసి ఆకాశాన్ని, భూమిని, సముద్రాన్ని వాటిలో ఉండే సమస్తాన్ని చేసాడు. ఏడో రోజున దేవుడు విశ్రాంతి తీసుకొన్నాడు. ఈ విధంగా ఏడవరోజును యెహోవా ఆశీర్వదించాడు. దాన్ని చాలా ప్రత్యేకమైన రోజుగా యెహోవా చేసాడు.”

అయితే ప్రజలు అక్షరార్థమైన ఆరు రోజుల సృష్టికి వ్యతిరేకంగా వాదించాలనుకుంటారు. దేవుడే గనుక చెయ్యదలచుకొనివుంటే, సమస్త సృష్టిని ఒక సెకనులో పదిలక్షలవ వంతు కాలంలోనే సృజించివుండేవాడు. మీరు ఇలా అనవచ్చు, “దేవుడు రోజులు, గంటలు, నిమిషాలలో ఎందుకు సృష్టించాడు?” అని. ఎందుకంటే ఆయన శక్తిని తన నియమాలకు లోబడి విడుదల చేయాలనుకున్నాడు కాబట్టి. వీటిలో మొదటిది కాలము అనే నియమం.

2. రెండవ నియమము వృద్ధి అనే నియమం. విత్తనాలు జల్లి, పంటకోసే సమయం. దేవుడు ప్రతిరోజూ ఉదయాన్నే నేలమీద ఆహారాన్ని కురిపించగలడు. ఇశ్రాయేలు ప్రజలు అరణ్యములో తిరుగుతున్న కాలంలో దేవుడు ఇలాగే చేసాడు. దేవుడు ఒక సంపూర్ణమైన ఎదిగిన తోటను నాటగలడు. ఆదాము హవ్వల విషయంలో చేసినట్లుగా మనుష్యులు కోరిన ఫలం తినగలిగే రీతిలో ఆ తోటను దేవుడు పుట్టించగలడు. అయినప్పటికి దేవుడు స్థాపించిన "ప్రకృతి" నియమాలకు అనుగుణంగానే పనిచేయడానికి నిర్ణయించుకున్నాడు.

ఉదాహరణకు, మార్కు 4:26-29 లో యేసు ఇలా చెప్పాడు: "దేవుని రాజ్యం ఈ విధంగా వుంటుంది. ఒక వ్యక్తి విత్తనాల్ని భూమ్మీద చల్లుతాడు. అవి రాత్రి, పగలు, అతడు పడుకొని ఉన్నా, లేచివున్నా మొలకెత్తి పెరుగుతూ ఉంటాయి. అవి ఏవిధంగా పెరుగుతున్నాయో అతనికి తెలియదు. భూమి తనంతట తానే ధాన్యాన్ని పండిస్తుంది. మొదట మొలకవేసి ఆ తర్వాత కంకువేసి, ఆ కంకి నిండా ధాన్యం పండుతుంది. పంటకాలం వరకు ఆ ధాన్యం పూర్తిగా పండిపోతుంది. వెంటనే రైతు కొడవలి పెట్టి కోస్తాడు."

బైబిల్ అంతటిలో ప్రభువు కోతకాలం గురించి ఎక్కువగా మాట్లాడారు. విత్తడం, కోయడం గురించి ఆయన మాట్లాడారు. విత్తనాలు వేయడం గురించి, మొక్కలు ఎదగడం గురించి ఆయన మాట్లాడారు. దేవుడు సమస్త శక్తిగలవాడు. ఆయన కోరుకుంటే ఎప్పుడైనా ఒక చనిపోయిన వ్యక్తిని బ్రతికించగలడు. అయితే తన పరిశుద్ధుల పునరుత్థానం కొరకు ఆయన ఒక కోతకాలాన్ని నియమించాడు. దేవుడు మన అవసరాలను తీర్చి మన భారాలను వీలైనంత త్వరగా ఎత్తివేయగలడు. అయితే చాలాసార్లు తన సహాయం కొరకు మనము కనిపెట్టుకునేలా చేస్తాడు- వ్యవసాయదారుడు పంట పండేవరకు, ధాన్యం వచ్చేవరకు ఎదురుచూచినట్లుగా (యాకోబు 5). ఆయన రాజ్యం గురించి చెప్తూ గోధుమలు, గురుగులతోను, విత్తువాడు విత్తనాలు చల్లడంతోను పోల్చి చెప్తాడు. మొక్కలు పెరిగి ఫలించడంతో విశ్వాసులను పోల్చి చెప్తాడు. విత్తనాలు చల్లుట, పంటకోయుట అనే దేవుని నియమానికి అనుగుణంగా పనిచేసే దేవుని శక్తి ఇది.

3. తర్వాతది, ప్రార్థన అనే నియమం. జవాబు పొందిన ప్రార్థనలో తరచుగా కాలం అనేది ఇమిడివుంటుంది. ఉదాహరణకు, మాత్తయి 7:7-8 వచనాలలో బైబిల్ ఇలా చెప్తుంది: "అడిగితే లభిస్తుంది. వెతికితే దొరుకుతుంది. తట్టితే

తలుపు తెరుచుకుంటుంది. ఎందుకంటే, అడిగిన ప్రతి ఒక్కనికి లభిస్తుంది. వెతికిన ప్రతి ఒక్కనికి దొరుకుతుంది. తట్టిన ప్రతి ఒక్కని కోసం తలుపు తెరుచుకుంటుంది."

ఈ తట్టడము, అది తెరుచుకునేదాక వేచివుండటము అనేవి వున్నాయంటే, అదంతా జరిగేవరకు కొంత సమయం గడిచిపోతుందని అర్థమవుతుంది. ఏదైన కనుగొనే ముందు వెతుకుట అనేది వుందన్నది సమయం గడిచిపోయింది అని భావించాలి. మనం అడగకమునుపే దేవునికి మన అవసరాలేమిటో తెలుసు. ఒక తలంపు ఇంకా మన హృదయంలో ఉండగానే, దానికి మాటలరూపం కల్పించి మన నోటనుంచి బయటికి రాకముందే దేవునికి తెలిసిపోతుంది. అయినప్పటికీ ఆయన ప్రార్థన అనే నియమాన్ని అనుసరించి పనిచేయడానికి ఇష్టపడతాడు. దానివల్ల తరచుగా వేచివుండటం అవసరమవుతుంది.

4. న్యాయము కరుణ అనే నియమం తరచుగా కనిపిస్తుంది. దేవుని ధర్మశాస్త్రాన్ని అతిక్రమించినవారికి కృప అనుగ్రహించబడుతుంది. అయితే పాపి స్థానంలో ప్రత్యామ్నాయంగా క్రీస్తు మరణించడం ద్వారానే అది సాధ్యమవుతుంది.

కీర్తనలు 89:14లో బైబిల్ ఈవిధంగా ప్రకటిస్తోంది: "సత్యం, న్యాయం మీద నీ రాజ్యం కట్టబడింది. ప్రేమ, నమ్మకత్వం నీ సింహాసనం ఎదుట సేవకులు." ఈ సత్యాన్ని మనస్సులో వుంచుకొని ఇప్పుడు రోమా 3:21-24 వచనాలు చదవండి: "కాని దేవుడు ఇప్పుడు ధర్మశాస్త్రం ఉపయోగించకుండా నీతిమంతులయ్యే విధానం మనకు తెలియచేసాడు. ఈ విధానాన్ని ప్రవక్తలు ముందే చెప్పారు. ఇది ధర్మశాస్త్రంలోనూ ఉంది. దీని ప్రకారం యేసు క్రీస్తులో మనకున్న విశ్వాసంవల్ల దేవుడు మనల్ని నిర్దోషులుగా పరిగణిస్తున్నాడని విదితమౌతుంది. ఆయనను విశ్వసించిన ప్రతి ఒక్కనికి ఈ విధానం వర్తిస్తుంది. అందరూ పాపం చేసారు, కనుక దేవుని తేజస్సు పంచుకోవటానికి ఎవ్వరికీ అరత లేదు. అందువల్ల ఈ విధానం అందరికీ వర్తిస్తుంది. వ్యత్యాసం లేదు కాని, దేవుడు వాళ్ళను తన ఉచితమైన కృపవల్ల నీతిమంతులుగా చేస్తున్నాడు. ఇది యేసు క్రీస్తు వల్ల కలిగే విముక్తి ద్వారా సంభవిస్తుంది."

నీ పాపాలను క్షమించే అధికారం దేవునికి ఉంది. నీమీద తన కృపను కుమ్మరించి, నీ పాపాలన్నిటిని కడిగివేయగల అధికారం దేవునికి ఉంది. అయితే దేవుడు తన అధికారాన్ని శక్తిని న్యాయము కనికరము అనే నియమాన్ని

అనుసరించి విడుదలచేస్తాడు. ఆయన న్యాయవంతుడు కనుక పాపానికి పరిహారం చెల్లించబడాలని కోరతాడు.

దేవుడు తన న్యాయము అనే నియమాన్ని ఉల్లంఘించకుండ తన కృపాసహితమైన శక్తిని ఎలా వినియోగిస్తాడు? తనంతట తానుగా మానవరూపం ధరించడం ద్వారా ఆ పనిచేయగలడు. ప్రభువైన యేసుక్రీస్తుగా ఆయన శ్రమపొంది, రక్తము చిందించి, చనిపోవడం ద్వారా నీ పాపములన్నిటికి పూర్తిగా పరిహారం చెల్లించాడు. కాబట్టి న్యాయము అనే నియమం నెరవేర్చబడింది, గనుక దేవుడు ఇప్పుడు నీవుచేసిన ప్రతి పాపమును క్షమించడానికి తన కృపాశక్తిని విడుదలచేయుటకు స్వేచ్ఛకలిగివుంటాడు.

ఓ ప్రియమైన పాఠకా, దేవుని ప్రియకుమారుడైన యేసు క్రీస్తు ప్రభువు తన రక్తముచేత జరిగించిన పాపపరిహారమునందు విశ్వాసముంచుట ద్వారా దేవునియొద్దకు వచ్చి ఆయన అనుగ్రహించే కృపాసహితమైన రక్షణను స్వీకరించావా? నీ పాపాలకు పరిహారము చెల్లించడానికి ఆయన పొందిన మరణం చేతనే నీవు దేవుని రక్షణను పొందగలవు.

దేవుడు ఏదైన అద్భుతకార్యం జరిగించినప్పుడు పదార్థానికి చెందిన ప్రకృతి నియమాలను ఆయన ఏంచేస్తాడు? కొంతకాలము వాటిని రద్దుచేయడానికి తీర్మానించుకుంటాడు. దేవుడు ఈ లోకంతో కృపాసహితంగా వ్యవహరించకపోతే ఏమవుతుంది? లోకాన్ని నాశనం చెయ్యడానికి, నరకంలో త్రోయడానికి, నిత్యశిక్షను, తీర్పును అమలుచేయడానికి తన అధికారాన్ని వినియోగించదలిస్తే, ఆయనను అడ్డుకోగలవాడెవడు?

నా స్నేహితుడా, దేవుడు ఒకరోజున సరిగ్గా అదే పనిచేస్తాడు. ఒకదినాన దేవుడు తన మహాశక్తిని ఉగ్రతను విడుదలచేసి, తన కృపను నిర్లక్ష్యం చేసినవారికి అగ్నిగంధకములతో మండే గుండములోనికి వెళ్లునట్లు శిక్షవిధిస్తాడు. ఈ దినాన ఈ సమయంలో దేవుడు తన న్యాయవిధులకు లోబడి పనిచేస్తున్నాడు. పాపానికి పరిహారం చెల్లించాల్సిందే. కల్వరి సిలువలో ఆ పరిహారం చెల్లించబడింది, కానీ రాబోయే ఉగ్రతను నీవు తప్పించుకోవాలంటే, నీవు ఆ పరిహారాన్ని అంగీకరించాలి. లేనట్లయితే, నీవే సొంతంగా ఆ పరిహారం చెల్లించాల్సివుంటుంది. నీ ఆత్మ సదాకాలము అగ్నిలో కాల్చబడుటయే ఆ పరిహారం.

కృపగల దేవుడు నిన్ను ప్రేమిస్తున్నాడు. దయామయుడైన దేవుడు నిన్ను

క్షమించగోరుతున్నాడు. పశ్చాత్తాపముతో హృదయపూర్వకంగా నీవు చేసే యథార్థమైన ప్రార్థనను వినడానికి ఆయన ఎదురుచూస్తున్నాడు. ఆయనను నీ ప్రభువుగా రక్షకునిగా ఉండుమని నీవు చేసే యథార్థమైన అభ్యర్థనకోసం ఆర్తిగా ఎదురుచూస్తున్నాడు. నీ ప్రతి పాపాన్ని క్షమించాలని ఆయన ఆశిస్తున్నాడు. ఈరోజు నీవాయనను నమ్ముతావా?

# దేవుని న్యాయం

దేవుని గుణం ఎంత పరిశుద్ధమైనదంటే, ఆయన పాపం చెయ్యలేదు, మరొకరిలోని పాపాని ఏ కోశానా సమర్థించడు. ఈ విషయంలో తన మహా ప్రేమను బట్టి ఆయన పరిశుద్ధతను అతిక్రమించలేడు. అదే జరిగితే, అది నిజమైన ప్రేమకాదు. ఒకవేళ దేవుడు మరొకవ్యక్తిలోని పాపాన్ని సమర్థిస్తే, ఆ పాపంలో ఆయనకూడా పాలుపంచుకొన్నట్టే అవుతుంది గనుక ఆయనకూడా పాపి అవుతాడు. ఆ పని ఆయన ఎన్నడూ చేయడు.

దేవుని ప్రమాణాలను పాటిస్తే ఈ జీవితంలో సహా, మనకు ఆశీర్వాదాలు కలుగుతాయని, అనుభవం వేయిరీతులుగా చెబుతోంది. దానినుంచి తొలగిపోతే జీవితం చెప్పలేనంత దుర్భరమవుతుంది.

దేవుడు ఎల్లప్పుడూ న్యాయమైనదే చేస్తాడు. దేవుడు సరైనవిధంగా చెయ్యలేదని మనుష్యులు భావించారంటే, ఆయన మార్గాలను వారు పూర్తిగా అర్థంచేసుకోలేదని అర్థం. వారు పూర్తిగా పొరబడ్డారని కాలమే నిరూపిస్తుంది.

నీవు ఈ నిజమైన సజీవుడైన దేవునియందు నమ్మికవుంచుతున్నావనే ఆశిస్తూ ప్రార్థనచేస్తున్నాను. ఈ పరిశుద్ధుడైన దేవుడు ఎన్నడూ తప్పుచేయడు. ఆయన ఎన్నడూ పాపము చేయడు, పాపాన్ని సహించడు.

దేవుని ప్రమాణాలను పాటించడం వల్ల నిజంగానే ఆశీర్వాదం కలుగుతుందని నీ సొంత వ్యక్తిగత అనుభవంతో నీవు కనుగొన్నావని ఆశిస్తున్నాను.

దేవుని పరిశుద్ధత ఉదాసీనంగా ఉండదు. ఆయన పరిశుద్ధత ఆయన స్వభావంలో చురుకుగా పనిచేస్తుంది. అయితే, ఈ విశ్వమునకు పరిపాలకునిగా, ఆయన ఇతరుల స్వభావానికి అనుగుణంగా పనిచేయవలసివుంటుంది. ఆయన నిర్ణయించవలసింది ఏది ఒప్పు ఏది తప్పు అన్నది మాత్రమే కాదు, ఎవరు తప్పు ఎవరు ఒప్పు అన్నది కూడా ఆయన నిర్ణయించాలి. ఆ తర్వాత, తప్పుచేసినవారిని ఏమి చెయ్యాలి, ఒప్పుచేసిన వారికి ఎలాంటి ప్రతిఫలమివ్వాలి అనేది కూడ దేవుడు నిర్ణయించాలి.

అంతేకాదు: తన ఆదేశాలు అమలయ్యేలా కూడా దేవుడు చూడవలసివుంది. ఆయన ప్రేమగల దేవుడు, అయినా ఆ ప్రేమ తన న్యాయాన్ని ఎన్నడూ ప్రక్కన పెట్టదు. తన న్యాయం శిక్షవిధించిన వారిపై ఆయన ప్రేమ కనికరం చూపితే, అలా చేయడానికి వీలైన ఒక నీతియుక్తమైన మార్గం కనిపెట్టాలి, లేదా ఆ ప్రేమ న్యాయానికి, తీర్పుకు తలవంచాలి.

దేవుడు న్యాయమూర్తియని భావించి ఆయన న్యాయాన్ని, తీర్పులను గూర్చి మనం ఆలోచిస్తుండగా, ఆరు విషయాలను మనం పరిగణనలోకి తీసుకోబోతున్నాం.

మొదటిగా, దేవునిలో పక్షపాతముగాని, బంధుప్రీతిగాని లేదు. 1 పేతురు 1:17లో దేవుడు ఇలా చెప్పాడు: పక్షపాతము లేకుండ ఎవరి క్రియలను బట్టి వారికి తీర్పు తీర్చే తండ్రికి మీరు మొరపెట్టినట్లయితే, ఇక్కడ మీరు గడిపే సమయాన్ని భయభక్తులతో గడపండి."

తండ్రి ప్రతివాని క్రియలచొప్పున తీర్పును అమలుచేస్తాడనే విషయాన్ని గమనించండి. ఇది ఎలాంటి పక్షపాతము లేకుండా చేస్తాడు. నీవు ధనవంతుడవా, లేక నిరుపేదవా, తూర్పుదేశస్తుడవా, లేక పాశ్చాత్యుడవా, విద్యావంతుడవా లేక పామరుడవా, పురుషుడవా లేక స్త్రీవా, భక్తిపరుడవా లేక భక్తిహీనుడవా అనేది దేవుడు పట్టించుకోడు. నీవెవరివి అనేదానితో సంబంధం లేకుండా దేవుడు తన నీతి, పరిశుద్ధతల ఆధారంగా నీకు తీర్పుతీరుస్తాడు.

రోమా 2:11లో మనం మరల ఇలా చదువుతాం. "ఎందుకంటే దేవునికి పక్షపాతం లేదు." నీవు దేవునికి లంచం ఇచ్చి పనిచేయించుకోలేవు, లేదా నీ వెవరివో అన్నదాన్ని బట్టి ఆయనను మెప్పించలేవు. భూమి ఆకాశములను, వాటియందున్న సమస్తమును సృజించిన వానిని (నిర్గమ 20:11, అపో.కా. 4:24) నీ క్రియలచేత త్రిప్పివేయలేవు.

దేవుడు ఏ పక్షపాతము లేకుండ తీర్పుతీరుస్తాడు, ఎందుకంటే ఆయన దృష్టికి ఉత్తమమైన వ్యక్తిని అని భావించే ప్రతివాడు వ్యర్థుడుగానే ఉంటాడు.

రెండవదిగా: దేవుడు మనుష్యుల బాహ్యక్రియలతో పాటు వారి అంతరంగములోని తలంపులను, రహస్యాలను కూడా విమర్శలోనికి తీసుకొస్తాడు.

రోమా 2:16 ఇలా చెప్తుంది, "నా సువార్త ప్రకారం దేవుడు యేసుక్రీస్తు

ద్వారా మానవుల రహస్యాలను విచారించే రోజున." దేవుడు తీర్పు తీర్చే రోజు ఒకటి రాబోతోంది. ఆరోజున నీవు మనుష్యుల ఎదుట చేసిన క్రియలకు, వారికి పడేలా పలికిన మాటలకు మాత్రమే కాదు, నీ హృదయ రహస్యాలకు సహా తీర్పు తీరుస్తాడు.

లూకా 12:1–3 వచనాలలో ఇలా చదువుతాం: "అంతలో వేలకొద్దీ ప్రజలు పోగయి ఒకరినొకరు తొక్కుకుంటూ ఉన్నారు. అప్పుడు ఆయన మొదట తన శిష్యులతో ఇలా చెప్పనారంభించాడు. పరిసయ్యుల పులిసిన పిండిన గురించి అంటే వారి వేషధారణ విషయం జాగ్రత్త పడండి. కప్పిపెట్టింది ఏదీ బట్టయలు కాకపోదు. రహస్యమైనదేదీ తెలియకుండా ఉండదు. అందుకని మీరు చీకటిలో మాట్లాడేవి వెలుగులో వినబడతాయి. గదుల్లో చెప్పుకునేవి ఇంటి కప్పుల పైన చాటిస్తారు."

నీవు దాగివుండలేవు. నీ ఆలోచనలు, మాటలు, క్రియలు, మరియు నీ చర్యలన్నీ దేవునికి తెలుసు. తీర్పు దినాన నీవు జీవించిన జీవితానికి నిన్ను లెక్క చెప్పమని అడుగుతాడు.

మూడవది: దేవుని ధర్మశాస్త్రము మనిషికి తన మనస్సాక్షి ద్వారాను, బైబిల్ ద్వారాను ప్రకటించబడింది. దానిని ఎప్పటికీ మార్చలేము.

మరల, రోమా 2:14–15 వచనాలలో బైబిల్ ఇలా చెప్తుంది: "ధర్మశాస్త్రం లేని యూదేతరులు స్వాభావికంగా ధర్మశాస్త్ర చెప్పినట్టు నడుచుకుంటే వారికి ధర్మశాస్త్ర లేకపోయినా, తమకు తామే ధర్మశాస్త్రం లాగా ఉంటారు. అలాంటి వారి మనస్సాక్షి కూడా సాక్ష్యమిస్తుంది. వారి ఆలోచనలు వారిపై తప్పు మోపడమో లేక తప్పులేదని చెప్పడమో చేస్తాయి. అలాంటివారి హృదయాలపై ధర్మశాస్త్రసారం రాసినట్టే ఉంటుంది."

సంశయవాదులు తరచుగా ఇలా అంటుంటారు: "మరి ఈ లోకంలో అసలు ఎన్నడూ బైబిలే లేకుండా పుట్టి చనిపోయినవారి సంగతేమిటి?"

దయచేసి గమనించండి, ఈ వచనాలు వెల్లడించే ఒక వాస్తవేమిటంటే, ఈ భూమిమీద పుట్టిన ప్రతి పురుషుడు, ప్రతి స్త్రీ తన హృదయాలలో పరిశుద్ధుడైన దేవుని వెలుగును కలిగివున్నారు (యోహాను 1:9). దేవుని వాక్కు రాయబడింది పుస్తకరూపంలోనే కాదు, ఆయన సృజించిన మనుష్యుల హృదయాలలో కూడా రాయబడింది. దేవుడు ఉన్నాడని నీ మనస్సాక్షికి తెలుసు. దేవుడు సర్వశక్తివంతుడు అని నీ మనస్సులో నీకు తెలుసు. దేవుడే నీ సృష్టికర్త అని నీ మనస్సాక్షికి

తెలుసు. ఏదో ఒక రోజున నీవు దేవుని యెదుట నిలబడాల్సి వస్తుందని నీ మనస్సాక్షికి తెలుసు. నీవు ఆయనకు విరోధంగా పాపం చేసావని కూడా నీ మనస్సాక్షికి తెలుసు.

అయితే ప్రశ్న ఏమిటంటే, దానిగురించి నీవేం చేయబోతున్నావు?

దేవుని పరిపూర్ణమైన ధర్మశాస్త్రము మానవునికి బైబిల్ పుటల ద్వారా కూడా ప్రకటించబడింది. “నేను ఖచ్చితంగా చెబుతున్నాను. ఆకాశం భూమి నశించేవరకూ ధర్మశాస్త్రమంతా నెరవేరేవరకు ధర్మశాస్త్రం నుంచి ఒక్క పొల్లు అయినా, ఒక సున్నా అయినా తప్పిపోదు.” (మత్తయి 5:18).

బైబిల్ లేనివారి సంగతేమిటి అని వాదించే బదులు, నీకున్న బైబిల్ చెప్పిన మాటలకు నీవు విధేయతచూపడం మంచిది. ఒకరోజున నీవు దేవుని ఎదుట నిలబడి వేరేవాళ్ల గురించి లెక్క చెప్పబోవడం లేదు. ఒకరోజున నీవు దేవుని యెదుట నిలబడి మరొక వ్యక్తి తరఫున వాదించబోవడం లేదు. ఒక రోజున నీవు దేవుని ఎదుట నిలబడబోతున్నావు, దేవుడు **నిన్ను** లెక్క అడుగుతాడు, వేరేవాళ్ల గురించి కాదు.

నాల్గవది: దేవుడు ధర్మశాస్త్రమును ప్రకటించడంతో పాటు, దాన్ని ఉల్లంచినవారికి వేసే జరిమానాను కూడా ప్రకటించాడు. ఆ జరిమానా నిత్య మరణం.

“ధర్మశాస్త్రం ఉండి పాపం చేసినవారు ధర్మశాస్త్రం ప్రకారం తీర్పు పొందుతారు. ధర్మశాస్త్రం లేకుండా పాపం చేసినవారు ధర్మశాస్త్రం లేకపోయినా నాశనం అవుతారు. (రోమా 2:12).

ఈ వచనాన్ని నీవు చదువుతుండగా అది నీగురించే మాట్లాడుతుందని నీకు తెలుసు గనుక ఈ మాటలు నీ మనస్సాక్షిలో ఇంకిపోనివ్వు.

ప్రియులారా, మనం వేరొకరితో పోల్చుకుని దేవునియొద్దనుంచి నీకు ఎంత వెలుగు వచ్చింది అన్నది ప్రశ్నకాదు. ప్రశ్న ఏమిటంటే, దేవుడు నీకిచ్చిన వెలుగు ప్రకారం దానికి నీవు సంపూర్ణంగా విధేయత చూపావా లేదా? నీకు తెలుసు, నీవు విధేయత చూపలేదని.

రోమా 3:23లో బైబిల్ ఏమని చెప్తుందంటే, “అందరూ పాపం చేసారు, గనుక దేవుని మహిమను అదుకోలేకపోతున్నారు.”

రోమా 6:23 ఇలా ప్రకటిస్తోంది: "పాపానికి జీతం మరణం; అయితే దేవుని కృపావరం మన ప్రభువైన యేసుక్రీస్తు ద్వారా నిత్యజీవం."

పాపానికి జీతం మరణమైయుండను కాదు, మరణమైవుంటుంది అని కాదు, కానీ పాపానికి జీతం మరణం.

పాపం అంటే ఏమిటి? దేవుని పరిశుద్ధతను ఉల్లంఘించడం. దానికి ఫలితంగా న్యాయవంతుడైన దేవుని తీర్పు వస్తుంది.

ఐదవది: ధర్మశాస్త్రంలో ఒక్క నియమాన్ని ఒక్కసారి ఉల్లంఘించినా, అదీ తన తలంపులలో ఉల్లంఘించిన సరే, జరిమానా చెల్లించాల్సిందే. "ధర్మశాస్త్రం విధించిన క్రియలపై ఆధారపడి జీవించేవాడు శాపగ్రస్తుడు. ఎందుకంటే, "ధర్మశాస్త్ర గ్రంథంలో రాసి ఉన్న విధులన్నిటినీ చేయడంలో నిలకడగా ఉండని ప్రతివాడూ శాపగ్రస్తుడు" అని రాసి ఉంది." (గలతీ 3:10). ప్రతివాడూ అంటే ఈ నియమానికి మినహాయింపులు ఏమీ లేవు. అన్నిటినీ అంటే, అనుకూలమైన సాకులు చెప్పడానికి ఏమీ లేవు. అన్నిటినీ చెయ్యాల్సిందే, అన్ని ఆజ్ఞలు పాటించాల్సిందే, లేఖనంలోని ప్రతి పొల్లు, సున్న, ప్రతి పదాన్ని నెరవేర్చవలసిందే లేదా దేవుని శాపం క్రిందికి వచ్చినట్టే. "ఎవరైన ధర్మశాస్త్రం అంతా పాటించి, ఏ ఒక్క ఆజ్ఞ విషయంలో అయినా తడబడితే, ఆజ్ఞలన్నిటినీ మీరిన అపరాధి అవుతాడు." (యాకోబు 2:10).

ఈ విషయాన్ని పదే పదే ప్రకటించాల్సివుంటుంది. ఎందుకంటే తమ సొంత నీతినిబట్టి తమకు తీర్పు తీర్చబడాలని నీతిమంతులుగా తీర్చబడాలని ఆశించేవాళ్లు ఎంతోమంది ఉన్నారు. దేవుని స్థాయి సంపూర్ణంగా పాపరహిత పరిపూర్ణత. ఎవరైన సరే, తమ జీవితకాలంలో ఒక్క ధర్మశాస్త్ర విధినైనా ఒక్కసారి కూడా మీరకూడదు.

ప్రియ పాఠకులారా, ఏ ఒక్కరు కూడా తన సొంత ప్రతిభమీద, పనులమీద, లేక క్రియల ఆధారంగా తన సొంత నీతి ఆధారంగా దేవుని తీర్పుపొందే అవకాశమే లేదని మీరు తేటగా చూడవచ్చు.

ఆరవది: దేవుని న్యాయాన్ని సంతృప్తిపరిచే వేరొక మార్గం వుంటే తప్ప నీవు చేసిన ఏ సేవ కాని, క్షమాపణకోసం అర్థించడం కాని నీకు విధించబడిన శిక్షను తొలగించలేదు. చూడండి, దేవుడు న్యాయవంతుడైన దేవుడు. ఆయన

తీర్పులు కఠినమైనవి. పాపానికి శిక్షను ఎవరైన అనుభవిస్తే తప్ప ఆయన పాపాన్ని క్షమించడు, క్షమించలేడు.

పాతనిబంధన ధర్మశాస్త్రంలో, నిర్గమకాండంలో ఈ సత్యం ఎంతో స్పష్టంగా ప్రకటించబడివుండటం మనం గమనిస్తాం. "యెహోవా అతని యెదురుగా అతణ్ణి దాటివెళుతూ, 'యెహోవా కనికరం, దయ, దీర్ఘశాంతం, అమితమైన కృప, సత్యం గల దేవుడు. ఆయన వేలాది మందికి తన కృప చూపిస్తాడు. అతిక్రమాలు, అపరాధాలు, పాపాలు క్షమిస్తాడు. అయితే దోషులను ఏమాత్రం శిక్షించకుండా ఉండడు. తండ్రుల దోష ఫలితం మూడు నాలుగు తరాలదాకా వారి సంతానం మీదికి రప్పించేవాడు' అని ప్రకటించాడు. వెంటనే మోషే నేలకు తలవంచి సాష్టాంగపడి నమస్కరించాడు."

మన దేవుడు కరుణామయుడు. మన దేవుడు కృపామయుడు. మన దేవుడు దీర్ఘశాంతముగల దేవుడు. ఆయన మంచితనము, సత్యము సమృద్ధిగా గలవాడు. మన దేవుడు అతిక్రమాలను, పాపాన్ని క్షమించే దేవుడు. అయితే దోషం చేసినవాడిని ఎంతమాత్రము నిర్దోషిగా ప్రకటించడు, ప్రకటించలేడు. చేసిన పాపానికి ఎవరో ఒకరు శిక్ష అనుభవిస్తే తప్ప దేవుడు ఆ పాపాన్ని ప్రక్కన పెట్టడు. దీన్ని బట్టి మనకు ఒక విషయం అర్థమవుతుంది. యేసు సిలువపై మరణించడానికి పూర్వం విశ్వాసముతో చనిపోయినవారు పరలోకం వెళ్లకపోవడానికి కారణం ఏమిటో ఇప్పుడు మనకు అర్థమవుతోంది. వాళ్లు మరి శ్రేష్టమైనదాని కోసం (హెబ్రీ 11:40) అనగా బందీలను స్వతంత్రులను చేయగల దానికోసం ఎదురుచూస్తూ (ఎఫెసీ 4:8) అబ్రాహాము రొమ్మున ఆనుకొని ఉన్నారు (లూకా 16). ఆ శ్రేష్టమైనది ఏమంటే, పాపానికి యేసు చెల్లించిన వెల. అది దోషాన్ని తొలగిస్తుంది.

"పాపం చేసినవాడే చనిపోవాలి" అని (యెహెజ్కేలు 18:14) "పాపానికి జీతం మరణం" (రోమా 6:23) అని బైబిల్ చెప్తుంది. అయినా, మనచుట్టూ ఎటుచూసిన పాపులు బ్రతికే వున్నారు. ఎందుకంటే దేవుడు కరుణామయుడు, కృపామయుడు గనుక. అయితే అలాంటివాళ్లు పశ్చాత్తాపపడతారేమో అని దేవుడు తన దీర్ఘశాంతంతో వేచిచూస్తున్నంతమాత్రాన వాళ్లు ఆయన శిక్షావిధి క్రింద లేరని భావించకు. వారి అపరాధం వారినుంచి కొట్టివేయబడాలి. ఇది కేవలం యేసుక్రీస్తు రక్తము చేత చేసిన ప్రాయశ్చిత్తమునందు విశ్వాసం ద్వారానే రాగలదు.

క్రొత్త నిబంధన లేఖనాలలో మనకు ఈ మాటలు కనిపిస్తాయి. "మనిషి

యేసుక్రీస్తులో విశ్వాసం ఉంచడం ద్వారానే దేవుడు నీతిమంతుడుగా తీరుస్తాడుగాని, ధర్మశాస్త్ర క్రియలవలన కాదు. ఆ సంగతి ఎరిగిన మనం కూడా ధర్మశాస్త్ర క్రియల వలన కాక క్రీస్తు పట్ల విశ్వాసం ద్వారానే దేవుని చేత నీతిమంతులుగా తీర్పుపొందడానికి యేస క్రీస్తులో విశ్వాసముంచాము: ధర్మశాస్త్ర క్రియలవలన ఎవరూ నీతిమంతుడని తీర్పుపొందడు గదా" (గలతీ 2:16).

మనిషి చేసిన ఏ క్రియలు కూడా దేవుని న్యాయాన్ని సంతృప్తిపరచలేవు. యేసు క్రీస్తు ప్రభువు నీ పాపానికి పరిహారం చెల్లించాడని బైబిల్ చెప్తుంది. యేసుక్రీస్తు ప్రభువు నీ అతిక్రమాలకు మూల్యం చెల్లించాడు. ప్రభువైన యేసుక్రీస్తు సిలువపై తన శరీరమందు నీ దోషములను భరించాడు. గనుక నీవు యేసు క్రీస్తు ప్రభువుపైన విశ్వాసము ఉంచినట్లయితే నీవు నీతిమంతునిగా తీర్చబడగలవు.

గలతీ 2:21 ఈ మాట చెప్తుంది: "నేను దేవుని కృపను నిరర్థకం చెయ్యను. నీతి ధర్మశాస్త్రం ద్వారా సాధ్యం అయితే క్రీస్తు అనవసరంగా చనిపోయినట్టే గదా." పాపులైన మనుష్యులు చేసే క్రియలు, పనులు, చర్యలు పాపానికి పరిహారం చెల్లించే పనైతే, యేసుక్రీస్తువారి మరణం అర్థరహితమైన పని అవుతుంది. అయితే, నా స్నేహితుడా, ధర్మశాస్త్రము ద్వారాను, కొన్ని నియమాలు, నిబంధనలు, ఆజ్ఞలు పాటించడం ద్వారాను నీతి రాదు అన్నది నిజంగా సత్యమే. అది సత్యమైతే, నీవు దేవునియెదుట నీతిమంతుని ఉండగలిగేది కేవలం దేవుని కృపద్వారా, యేసుక్రీస్తునందు విశ్వాసముంచడం ద్వారానే సాధ్యమవుతుంది. అలాగైతే, దేవుని కృపను నిరర్థకం చేయవద్దు. దేవుడు నిన్ను రక్షించాలనుకుంటున్నాడు. దేవుడు నిన్ను క్షమించాలనుకుంటున్నాడు. దేవుడు నీకు క్షమాభిక్షపెట్టాలనుకుంటున్నాడు. అయితే నీ పాపాలకు పరిహారం చెల్లించబడేవరకు ఆయన ఆ పనిచేయలేడు. యేసు క్రీస్తు నీ పాపాలకు పరిహారం చెల్లించాడు. నీవు ఆయనను నమ్ముతావా? ఆయన యందు నీవు విశ్వాసముంచుతావా? ఆయనను నీ వ్యక్తిగత రక్షకునిగా ప్రభువుగా స్వీకరిస్తావా?

ఉగ్రత, ప్రతీకారము అనేవి కేవలం దేవుని న్యాయాన్ని వ్యక్తపరచే పర్యాయ పదాలే. ఈ పదాలకు అర్థం ఎల్లప్పుడూ పాపానికి రావలసిన న్యాయమైన తీర్పునే సూచిస్తుంది. ప్రతీకారము అనే మాటను మనుష్యులు ఉపయోగించే విధంగా దేవునికి ఎన్నడూ ఆపాదించకూడదు. దేవుడు ఎన్నడూ పగతీర్చుకునేవాడు కాదు. దేవుడు స్వార్థంతో మనుష్యులమీద ప్రతీకారం

తీర్పుకొనదు. పాపాన్ని శిక్షించడంలో దేవుని ఉద్దేశం నీతిని నిలబెట్టడమే. ఎందుకంటే పరిపూర్ణమైన నీతిని జరిగించి దానిని నిలబెట్టినప్పుడే నిజమైన సంతోషము ఆనందము అనేవి ఉండగలవు.

ఈ కృపాకాలంలో దేవుడు మరణంతో పాటు అనేకమైన ఇతర తీర్పులను కూడా తెస్తాడు. అయితే అవి తాత్కాలికమైనవే గాని పాపానికి దేవుడిచ్చే అంతిమ తీర్పు కాదు. ఎన్నిసార్లు మనం ఇలాంటి మాటలు వినలేదు– మేము యుద్ధం వలన బాధలు పొందాము లేదా వ్యాధులు, లేక పేదరికము వల్ల తమ ప్రియమైనవారిని పోగొట్టుకున్నాము, వ్యక్తిగతమైన విషాదాలను భరించాము గనుక మా పాపాలకు శిక్షను ఇక్కడే అనుభవించాము, నరకం లాంటిదేమీ లేదు అని చెప్పడం మనం ఎన్నిసార్లు వినలేదు. నేను యుద్ధం కళ్లారచూసాను. అంతకంటే నరకం ఏముంటుందని, అనేకసార్లు వ్యాధులబారినపడ్డాను అదే ఒక నరకం అనీ, నేను ఈ శ్రమను అనుభవించాను, ఆ బాధలు అనుభవించాను అదే పెద్ద నరకం అనేవాళ్లు చాలామంది ఉన్నారు.

ఆ పరిస్థితులు దేవుడు పాపానికి వేసిన శిక్షయే కావచ్చు. లోకంలో పాపమే లేకుంటే ఆ పరిస్థితులు చోటుచేసుకుని ఉండేవి కావు. అయితే అవే నరకం మాత్రం కావు.

నరకం అనేది మండే అగ్నిగుండం (లూకా 16:23–24). నరకం అనేది వెలుపటి చీకటి (మత్తయి 25:30). నరకం అనేది ఏడ్పు, రోధన, పండ్లు కొరుకుట ఉండే ప్రదేశం. అక్కడ “పురుగు చావదు, అగ్ని ఆరిపోదు” (మార్కు 9:44–48).

నీవు సజీవంగా ఉండి, ఊపిరి పీల్చుకొంటూ వున్నట్లయితే, నీవు నరకంలో లేవు, నరకానికి ఇంకా వెళ్లలేదు. ఇంకా గొప్పవిషయం ఏమిటంటే, నీవు నరకానికి వెళ్లాల్సిన అవసరం లేదు. యేసు క్రీస్తును నమ్ముకొనుట ద్వారా నీవు రక్షణ పొందవచ్చు. యేసుక్రీస్తు ప్రభువును స్వీకరించే వ్యక్తికి మాత్రమే దేవుని తీర్పు నుంచి మినహాయింపు ఉంటుంది. చూడండీ, నీకు నచ్చినా నచ్చకపోయినా దేవుడు తాత్కాలికంగా విధించే తీర్పులు వాస్తవానికి ఆయన చూపే కరుణకు నిదర్శనాలు. సమయం మించిపోకమునుపే దేవుడు నిన్ను హెచ్చరించి, సరిదిద్దడానికి చేసే ప్రయత్నాలే ఆ చర్యలు.

నోవహు దినాలలో వచ్చిన జలప్రళయం వంటి తీర్పులో దుర్మార్గులు నశించిపోవడం ద్వారా నీతిమంతుల సంతానం కాపాడబడింది. సొదొమ

గొమొఱ్రాలపై దేవుడు అగ్నిని కురిపించినప్పుడు నీతిమంతులు రక్షింపబడ్డారు. పస్కా రాత్రి దేవుడు నాశనకారుణ్ణి ఐగుప్తులోనికి పంపినప్పుడు, అవిశ్వాసుల గృహాలలో ఉన్న ప్రతి పెద్ద కుమారుణ్ణి దేవుడు మొత్తినాడు. కానీ నీతిమంతులు తప్పించుకున్నారు.

దేవుడు పాపానికి తీర్పు విధిస్తాడు, కానీ నీతిమంతులను దేవుడు రక్షించి విమోచిస్తాడు. నీవూ నేను నీతిమంతులం కాదు. యేసుక్రీస్తే నీతిమంతుడు. మనం ఆయన యొద్దకు రావాలి. మనం ఆయనను స్వీకరించాలి. మనం ఆయనయందు విశ్వాసముంచి, మన ఆత్మల రక్షణ కోసం యేసునందు నమ్మికయుంచాలి.

నా స్నేహితుడా, నీవు పాపివని, న్యాయవంతుడైన దేవుని తీర్పును ఎదుర్కొనబోతున్నావనే విషయాన్ని గమనించావా? ఈ న్యాయవంతుడైన దేవుని వద్దకు వచ్చి, ఆయనతో యథార్థంగా ప్రవర్తిస్తావా? నీవు పాపివని ఆయనకు ముందే తెలుసు, కానీ ఈ పాపం విషయమై నీవు పశ్చాత్తాపపడాలని నీకోసం ఆయన ఎదురుచూస్తున్నాడు. ప్రభువైన యేసుక్రీస్తువారి పాదాలచెంత నీ ఆత్మను కుమ్మరించి, నిన్ను రక్షించుమని, నిన్ను క్షమించుమని ఆయనకు మొఱ్రపెట్టుకుంటే ఆయన తన నీతిని, నిత్యజీవమనే ఉచిత వరాన్ని అనుగ్రహించి, పాపానికి సంపూర్ణమైన ఉచితమైన క్షమాభిక్షను ప్రసాదిస్తాడు. ఈరోజు నీవు ఆపని చేస్తావా?

# దేవుని పరిశుద్ధత

దేవుడు మంచివాడు మాత్రమే కాదు, ఆయన పరిపూర్ణంగా మంచివాడు. ఆయన పరిశుద్ధుడైన దేవుడు. ఆయన కేవలం మనుష్యుల ప్రమాణాల ప్రకారమే మంచివాడు కాదు, మంచి అంటేనే ఆయన. మంచితనానికి ఆయనే ప్రామాణికం. మనుష్యులందరూ ఆయన ప్రమాణాలకు తగినంతగా ఉండాలి. ఎందుకంటే ఆయన ప్రమాణాలే ఉన్నతమైన పరిపూర్ణ ప్రమాణాలు.

ఆయన ప్రమాణాలకు అనుగుణమైన మంచితనం అపరిమితమైన అంతులేని ఆశీర్వాదాలను తెస్తుంది. వాటినుంచి ఏమాత్రం తప్పిపోయినా, అధికమైన బాధలు తెస్తుంది. అందుకే దేవుడు తన పరిశుద్ధత విషయమై రోషము గలిగి వుంటాడు. పాపం చేసేవారిలో ఎవ్వరూ నిజమైన శాశ్వత సంతోషాన్ని కలిగివుండలేరు, ఎందుకంటే పాపము అనేది లేశమాత్రము ఉన్నా అది పరిపూర్ణమైన పరిశుద్ధతనుంచి తొలగిపోవడమే అవుతుంది.

దేవుడు మనకు అనుగ్రహించిన పరిపూర్ణమైన లేఖనాలలో మనకోసం ఏర్పాటుచేయబడిన ఈ పరిపూర్ణమైన దేవుని పరిశుద్ధత గురించి ఈ అధ్యాయంలో ధ్యానం చెయ్యాలనుకుంటున్నాం.

మొదట: దేవుడు తన ప్రవర్తనలోనే కాదు, ఆయన గుణంలో కూడా పరిశుద్ధుడు. అనగా, దేవుడు కేవలం సరైనది చేయడం కాదు, ఆయన చేసే పనులలో మాత్రమే ఆయన సరైనవాడు అని కాదు, స్వయంగా ఆయనే నీతిమంతుడు. ఆయన గుణశీలము శాశ్వతముగా స్థిరమైనది, మార్పులేనిది.

“మన దేవుడైన యెహోవాను స్తుతించండి. ఆయన పాదపీఠం ముందర ఆరాధించండి. ఆయన పవిత్రుడు. మన దేవుడైన యెహోవా పవిత్రుడు. మన దేవుడైన యెహోవాను స్తుతించండి. ఆయన పవిత్ర పర్వతం యెదుట ఆరాధించండి.” (కీర్తన 99:5, 9). మన దేవుడైన యెహోవా పరిశుద్ధుడైన దేవుడు – ఆయన పరిశుద్ధుడు.

"దేవుడు వెలుగు. ఆయనలో చీకటి లేనే లేదు. దీన్ని మేము ఆయన దగ్గర విని మీకు ప్రకటిస్తున్నాం" (1 యోహాను 1:5). దేవుడు చీకటి వెలుగుల సమ్మేళనం కాదు. ఆయన అత్యధికమైన వెలుగు, తక్కువ చీకటి కాదు. లేదు మిత్రమా, దేవుడు వెలుగైయున్నాడు, ఆయనలో చీకటి ఎంతమాత్రము లేదు. యాకోబు 1:13 లో లేఖనము ఇలా చెప్తుంది: "శోధించబడినప్పుడు ఇది దేవు దగ్గరనుంచి వచ్చింది అని ఎవరూ అనకూడదు. ఎందుకంటే చెడు విషయంలో దేవుడు ఎప్పుడూ శోధనకు గురికాడు, ఎవరినీ చెడు ప్రేరణకు గురిచేయడు కూడా." దేవుడు పడిపోయిన పాపులైన మనుష్యులవలె పాపపు, మోహపు, దుర్మార్గపు శోధనలకు లోబడడు.

అలాగే మలాకీ 3:6లో దేవుడు ఇలా ప్రకటించాడు: "నేను యెహోవాను, మార్పులేనివాడను; కాబట్టే యాకోబు సంతానమైన మీరు నశించిపోలేదు."

దేవుని పరిపూర్ణమైన పరిశుద్ధతను గూర్చిన అధ్యయనంలో దేవుడు మార్పు లేనివాడని గమనించడం అద్భుతం. ఆయన నిన్న పరిశుద్ధుడైయున్నాడా? ఆయన నేడు పరిశుద్ధుడైయున్నాడా? అయితే రేపు కూడా ఆయన పరిశుద్ధంగానే వుంటాడు!

హెబ్రీ పత్రికలో, త్రిత్వములోని రెండవ వ్యక్తియైన దేవుని కుమారుని గురించి మాట్లాడుతూ, బైబిల్ ఇలా చెప్తుంది: "ఈ విధముగా దేవుడు తన సంకల్పము నిశ్చలమైనదని ఆ వాగ్దానమునకు వారసులైనవారికి మరి నిశ్చయముగా కనుపరచవలెనని ఉద్దేశించినవాడై, తాను అబద్ధమాడజాలని నిశ్చలమైన రెండు సంగతులనుబట్టి, మనయెదుట ఉంచబడిన నిరీక్షణను చేపట్టుటకు శరణా గతులమైన మనకు బలమైన ధైర్యము కలుగునట్లు ప్రమాణము చేసి వాగ్దానమును దృఢపరచెను." (హెబ్రీ 6:17-18).

యేసుక్రీస్తు నందు మీ విశ్వాసాన్ని, మీ నమ్మకాని, మీ నిరీక్షణను కలిగివున్నప్పుడు, అది ఒక వ్యర్థమైన, లేక శూన్యమైన నిరీక్షణ కాదు. మీరు మీ నిరీక్షణను మారని, మార్పుచెందని దేవునియందు, నిన్ను ఏవిధంగానూ నిరాశకు గురిచేయని దేవునియందు కలిగివుంటున్నావు.

హెబ్రీ 13:8లో బైబిల్ ఇలా అంటున్నది: "యేసుక్రీస్తు నిన్న నేడు సదాకాలము ఏకరీతిగా ఉన్నాడు." దేవుని గుణము శాశ్వతముగా స్థిరమైనది, మార్పుచెందనిది: ఆయన తన గుణములోను, స్వభావములోను పరిశుద్ధుడై యున్నాడు.

రెండవది: దేవుడు పరిశుద్ధుడు గనుక ఆయన స్వభావము ఎల్లప్పుడూ శాశ్వతకాలము సరైనదిగా ఉంటుంది. యోబు 34:10 చూడండి: “జ్ఞానముగల మనుష్యులారా, నా మాట ఆలకించండి దేవుడు అన్యాయము చేయుట అసంభవము. సర్వశక్తుడు దుష్కార్యము చేయుట అసంభవము.” దేవుడు దుష్కార్యము చేయడు. ఆయన దోష కార్యము చేయడు. మనుష్యులలో శ్రేష్టమైనవారు సహా పాపులే. అయితే దేవుడు దుష్కార్యము చేయడు; ఆయన దోషము చేయడు. దేవుడు నిన్న పాపం చేయలేదు, గనుక రేపుకూడా పాపం చెయ్యడు. ఆయన చెడ్డకార్యము ఎన్నడూ చేయడు. “యెహోవా తన మార్గములన్నిటిలో నీతిమంతుడు, ఆయన క్రియలన్నిటిలో పరిశుద్ధుడు” (కీర్తన 145:17).

ఈలోకాన్ని విడిచివెళ్లిన కొందరు మంచివాళ్లు ఉన్నారని నేను గ్రహిస్తున్నాను. గొప్ప బోధకులు, మతనాయకులు కొంతమంది ఉన్నారు, అనేక మతనాయకులను అనుసరించేవారు కోకొల్లలుగా ఉన్నారు. బుద్ధుడు ఎంతో మంచివాడని నేను ఊహిస్తున్నాను. మహ్మదు కూడా మనుష్యుల లెక్క ప్రకారం బహుశా మర్యాదస్తుడే అయ్యుంటాడు. యాజకులలో కూడా బహుశా కొందరు మంచివాళ్లుండగా మరికొందరు చెడ్డవాళ్లయివుంటారు. కన్ఫ్యూషియస్ కూడా చాలామంచి విషయాలు చెప్పాడు– అతడు సొలొమోను నుంచి, హీబ్రూ రచయితలు రాసిన పాతనిబంధన జ్ఞానాన్ని అతడు కాపీకొట్టనంతవరకు.

అయితే సత్యమేమిటంటే, వీళ్లందరిలో ప్రతి ఒక్కరూ తమ జీవితాలలో – అవి పవిత్రమైనవి కాకపోయినా – ఏవో కొన్ని మంచి పనులు చేసారు. వారిలో ఏ ఒక్కరూ పూర్తిగా నీతిమంతులు కారు. “ఎందుకనగా అందరూ పాపం చేసి దేవుని మహిమను అందుకోలేకపోయారు” (రోమా 3:23). “మనం పాపం లేనివాళ్లమని చెప్పుకుంటే మనల్ని మనం మోసం చేసుకున్నవాళ్లమవుతాం, మనలో సత్యం ఉండదు” (1 యోహాను 1:8).

గనుక, బైబిల్ దేవుడైన యేసుక్రీస్తు ప్రభువునందు విశ్వాసముంచుమని నేను మిమ్మల్ని ఆహ్వానించినప్పుడు, ఏ ఇతర మనిషికన్నా, ఆ మనిషి ఎంత మంచివాడైనా సరే, వారందరికంటే ఎంతో గొప్పవాడైన వ్యక్తిని నమ్ముమని చెప్తున్నాను. ఎవరి ప్రవర్తనైతే ఎల్లప్పుడూ శాశ్వతముగా నీతియుక్తంగా వుంటుందో ఆయనను నమ్మండి అని మిమ్మల్ని అడుగుతున్నాను.

మూడవది: దేవుడు మంచివాడు మాత్రమే కాదు, ఆయన మంచివాళ్లను ప్రేమిస్తాడు. చెడ్డవాళ్లు మనుష్యులకు హానిచేస్తారు గనుక ఆయన చెడ్డవారిని ద్వేషిస్తాడు. దేవుని కోపము అనేది పాపం పట్ల ఆయన వ్యక్తపరచే ద్వేషం. కొందరు నరకానికి పోవడానికి ఇష్టపడరు గాని వారు దేవుని మీద నేరం మోపుతారు. వాళ్లు దేవునిమీద ఎల్లప్పుడు పాపము అనే నేరాన్ని మోపుతారు. ఆ దైవదూషకులు ఏమంటారంటే, దేవుడు కోపిష్టి గనుక ఆయన ఉగ్రత, ఆయన అమలుపరిచే తీర్పులను బట్టి ఆయనమీద వారు పాపి అనే ముద్రవేయడానికి ప్రయత్నిస్తారు. అయితే దుష్టత్వాన్ని శిక్షించకుండా ఆయన వదిలివేస్తే, ఆయన పరిశుద్ధుడుగా ఉండలేడు.

ఒక క్రూరమృగం పెద్దగా గాండ్రిస్తూ, వాడియైన కోరలతో మీ పిల్లవానిమీద దాడిచేయడానికి పరుగున వస్తుంటే, నీవు ఆ మృగానికీ నీ బిడ్డకు మధ్యన నిలబడి దాన్ని కొట్టడం లేదా అవసరమైతే ఆ జంతువును చంపివేయడం పాపం అవుతుందా? నీ బిడ్డను కాపాడుకోవడం కోసం ఆ జంతువును చంపడానికి ఏమైన చేయడానికి సిద్ధపడటం ద్వారా బిడ్డపట్ల నీ ప్రేమను రుజువుచేసుకోవా? అది తప్పేమి కాదు. అది సరైన పని. నీ బిడ్డపట్ల నీ ప్రేమను వ్యక్తపరచడానికి అదే సరైన పని.

నిన్ను ఒక ప్రశ్న అడగనివ్వు: దేవుడు తీర్పును అమలుచేయడం తప్పు అవుతుందా? తన ప్రజలకు హానిచేయడానికి, నాశనం చెయ్యడానికి లేక హతమార్చడానికి ప్రయత్నిస్తున్న పాపులమీద దేవుడు తన నీతియుక్తమైన ఆగ్రహాన్ని, కోపాన్ని ఉగ్రతను కనుపరచడం తప్పు అవుతుందా? లేదు, దుష్టత్వం పట్ల దేవుడు కనుపరచే కోపం ఆయన పరిశుద్ధతలోని సౌందర్యాన్ని వెల్లడి చేస్తుంది. "దేవుడు నీతిమంతులకు తీర్పుతీర్చును, దుష్టులయెడల దేవుడు ప్రతిదినము కోపించును" (కీర్తన 7:11). "నీవు దుష్టత్వమును చూచి ఆనందించు దేవుడవు కావు చెడుతనమునకు నీయొద్ద చోటులేదు. డాంబికులు నీ సన్నిధిని నిలువలేరు పాపము చేయువారందరు నీకసహ్యులు" (కీర్తన 5:4-5).

హెబ్రీ 1:9లో ప్రభువైన యేసుక్రీస్తు గురించి మాట్లాడుతూ ఇలా చదువుకుంటాం. "నీవు నీతిని ప్రేమించితివి దుర్నీతిని ద్వేషించితివి అందుచేత దేవుడు నీతోడివారికంటె నిన్ను హెచ్చించునట్లుగా ఆనందతైలముతో అభిషేకించెను." చెడుతనాన్ని నిజంగా ద్వేషించకుండా మంచితనాన్ని నిజంగా ప్రేమించడం అసాధ్యం.

అన్నీ మంచివే అని చెప్పేవాళ్లు, అనగా అన్ని తలంపులు, మాటలు, క్రియలు చర్యలు మంచివని చెప్పేవాళ్లు పరిశుద్ధులు కారు. అలాంటివారు చెడిపోయినవారు. పరిపూర్ణమైన పరిశుద్ధతమ మంచిదాని పట్ల పరిపూర్ణమైన ప్రేమను చెడ్డదానిపట్ల పరిపూర్ణమైన ద్వేషాన్ని చూపాలని కోరుకుంటుంది. బైబిల్‌లో ఉన్న దేవుడు ఈ పరిపూర్ణ పరిశుద్ధతను కలిగివున్నాడు.

నాల్గవది: ఈ విశ్వంలో మంచీ చెడులకు ప్రమాణాలను దేవుడే నియమిస్తాడు. ఆయన దేవుడు. ఇది ఆయన విశ్వం. ఆయనే దానిని చేసాడు. ఆయన చిత్తానుసారంగా ఏమైనా చేయగల హక్కు ఆయనకు ఉంది. ఈ విశ్వానికి మంచి చెడుల ప్రమాణాలను నిర్దేశించేది ఆయనే. ఈ ప్రమాణాలు పరిపూర్ణమైనవి. వాటిని మెరుగుపరచడం అనేది నీవల్ల కాదు. వాటిని మార్చేందుకు చేసే ఏ ప్రయత్నమైనా చెప్పలేనంత బాధలు కలిగిస్తుంది.

మనిషితో ఉన్న సమస్య ఏమిటో సులభంగా చెప్పవచ్చు. ఈ విశ్వాన్ని నడిపించడానికి దేవుని పరిశుద్ధ నియమాలు సరైనవి, పరిపూర్ణమైనవి అని నమ్మడానికి అతని గర్వం అడ్డొస్తుంది. ఫలితంగా మానవుడు నిత్యము దేవుని చిత్తానికి విరోధంగా తిరుగుబాటు చేస్తూ, దేవుని ఆజ్ఞలను అతిక్రమిస్తున్నాడు. ఈ బుద్ధిలేనితనం వల్ల మనిషి తనమీదికి తాను, అలాగే ఈ భూగ్రహం మీదికి చెప్పలేనంత దుఃఖాన్ని, వేదనను, బాధలను కొనితెచ్చుకుంటున్నాడు.

మంచి చెడులకోసం దేవుడు స్థాపించిన ప్రమాణాలకు మానవుడు లోబడితే, ఇబ్బందులన్నీ (వేటికైతే దేవుడే కారణమని అతడు నిందిస్తాడో అవన్నీ) అదృశ్యమైపోతాయి! ఉదాహరణకు, యెషయా 8:20లో ఇలా వుంటుంది: “ధర్మశాస్త్రమును సాక్ష్యమును విచారించుడి: ఈ మాటప్రకారము వారు మాట్లాడనియెడల వారిలో వెలుగు లేదని గ్రహించవలెను.”

కీర్తన 33:4లో ఇలా చదువుతాం: “యెహోవా వాక్కు న్యాయమైనది. ఆయన క్రియలన్ని సత్యమునందు చేయబడినవి.”

నా స్నేహితుడా, నీవద్ద ఇంకా శ్రేష్టమైన ఆలోచన ఉందని నీవు భావించవచ్చు; నీవొక భిన్నమైన అభిప్రాయం కలిగివుండవచ్చు; నీవైతే ఇంకా బాగా చేయగలనని నీవు ఊహించుకుంటూ వుండవచ్చు. అయితే, అయ్యో, దేవుడు తన వాక్యంలో చెప్పిన మాటను జవదాటితే నీవు పొరబడ్డట్టే.

కీర్తన 19:7-10 ఇలా చెప్తున్నది: “యెహోవా ఉపదేశాలు పరిపూర్ణం.

అవి దేవుని ప్రజలకు బలాన్నిస్తాయి. యెహోవా ఒడంబడిక విశ్వసించదగింది. జ్ఞానం లేని మనుష్యులకు అది జ్ఞానాన్ని ఇస్తుంది. యెహోవా చట్టాలు సరియైనవి. అవి మనుష్యులను సంతోషపెడ్తాయి. యెహోవా ఆదేశాలు పరిశుద్ధమైనవి. ప్రజలు జీవించుటకు సరైన మార్గాన్ని చూపడానికి అవి కన్నులకు వెలుగునిస్తాయి. యెహోవాను ఆరాధించుట మంచిది. అది నిరంతరము నిలుస్తుంది. యెహోవా తీర్పులు సత్యమైనవి, న్యాయమైనవి. అవి సంపూర్ణంగా సరియైనవి. శ్రేష్ఠమైన బంగారంకంటె యెహోవా ఉపదేశాలను మనము ఎక్కువగా కోరుకోవాలి. సరాసరి తేనె పట్టు నుండి వచ్చే శ్రేష్ఠమైన తేనె కంటె అవి మధురంగా ఉంటాయి."

పరిశుద్ధ బైబిల్ గ్రంథంలో దేవుడు మనకు తన వాక్యాన్ని ఇచ్చాడు. పరిపూర్ణుడైన దేవుడు **ఎల్లప్పుడూ** న్యాయమైనదిగా ఉండే పరిపూర్ణమైన పరిశుద్ధమైన పాపరహితమైన వాక్కును కలిగివుండాలి. నీవు నీ సొంత అభిప్రాయాలు, నీ సొంత నియమాలు, నీ సొంత విధివిధానాల ప్రకారం జీవించడం మానేసి, దేవుని ప్రత్యక్షతను తీసివేసి వాటిస్థానంలో మనుష్యులు రూపొందించిన విశ్వాసప్రమాణాలను ఆచరించడం మానుకుంటే నీకు ఎంతైనా మేలు. దేవుని వాక్యాన్ని సంపాదించుకొని దాన్ని విశ్వసించి, విధేయతచూపి, దాని ప్రకారం జీవిస్తూ, అది చెప్పినట్లు చేయడం నీకు ఎంతో మేలు.

దేవుని వాక్యం గురించి బైబిల్ ఏమిచెప్తుందో మనము ఇంతకు మునుపే 19వ కీర్తనలో చూసాం. అది **పరిపూర్ణమైనది**. అది **నిశ్చయమైనది**. అది **న్యాయమైనది.** అది **పవిత్రమైనది**. అది **శుద్ధమైనది**. అది సదాకాలము **నిలిచివుంటుంది**. అది బంగారం కన్నా గొప్పది. తేనెకంటే తియ్యనైనది. దానితో పోల్చదగింది ఇంకా ఏమున్నది?

దేవుణ్ణి కేవలం తన వాక్యాన్ని బట్టి నమ్మితే కలిగే ఫలితాలేవి? ఇప్పుడే ప్రస్తావించిన వాక్యాల ఆధారంగా చూస్తే అవి నీ ఆత్మకు మార్పును కలిగించేవి; నీ అజ్ఞానం స్థానంలో కలిగే జ్ఞానం, నీ హృదయంలో సంతోషం, నీ కన్నులకు వెలుగు, మరియు సదాకాలం నిలిచివుండే జీవము. దేవుడు స్థాపించిన న్యాయప్రమాణాలకు అనుగుణంగా అతడు జీవించి, వాటిని విశ్వసించి అంగీకరించగలిగితే ఆ ధన్యకరమైనవన్నీ అతనికి ప్రాప్తించుతాయి.

ప్రభువైన యేసుక్రీస్తువారు ఇలా చెప్పారు: "నేను ధర్మశాస్త్రమును గాని ప్రవక్తలను గాని కొట్టివేయడానికి వచ్చానని అనుకోవద్దు: వాటిని కొట్టివేయడానికి కాదు, నెరవేర్చడానికే వచ్చాను. నేను మీకు ఖచ్చితంగా చెప్పేదేమంటే, భూమి,

ఆకాశం గతించిపోయేవరకు, ధర్మశాస్త్రమంతా నెరవేర్చబడే వరకు అందులోనుంచి ఒక సున్న అయినా పొల్లయినా తప్పిపోదు" (మత్తయి 5:17-18). యేసు ఈ లోకంలోనికి వచ్చినప్పుడు ధర్మశాస్త్రానుసారంగా జీవించాడు. దానికి జతచేయడానికిగాని, దానిలోనుంచి ఏదైనా తీసివేయడానికి గాని ఆయన రాలేదు. ఎందుకంటే అది పరిపూర్ణమైనది.

ఐదవది: మనుష్యులు దేవుని పరిశుద్ధతా ప్రమాణాలకు అనుగుణంగా తీర్పుతీర్చబడాలే తప్ప వారి సొంత తక్కువస్థాయి ప్రమాణాలతో కాదు. నీ హృదయంలో, మనస్సులో, చర్చిలో, మతంలో లేక సమాజంలో మంచిచెడులకు ప్రమాణాలు నిర్దేశించుకొని వుండవచ్చు. ఆ ప్రమాణాలకు అనుగుణంగా జీవిస్తూ, ఆ ప్రమాణాలను పాటించావు గనుక నీవు దేవుని కలుసుకోవడానికి సిద్ధంగా ఉన్నానని భావిస్తూవుండవచ్చు. అయినప్పటికీ, నీ ప్రమాణం దేవుని ప్రమాణం కాకపోతే, నీవు దేవుణ్ణి కలుసుకోవడానికి సిద్ధంగా లేనట్టే.

గలతీ 3:10 మనకు ఇలా చెప్తుంది: ''ధర్మశాస్త్ర క్రియలకు చెందినవారందరూ శాపం క్రింద వున్నారు: ఎందుకంటే, ధర్మశాస్త్రములో వ్రాయబడి ఉన్నవాటన్నిటినీ నెరవేర్చడంలో కొనసాగని ప్రతివాడు శాపగ్రస్తుడు అని వ్రాయబడివుంది."

దేవుడు నీకొక గ్రంథాన్ని ఇచ్చి, నీవు చేయాలిసినవి, చేయకూడనివి అన్నీ అందులో చెప్పి, ఒకవేళ్ల దేవుడు చెప్పినవన్నీ నీవు చెయ్యకపోతే, దేవుడు చెయ్యవద్దని చెప్పినవాటన్నిటినుంచి నిన్ను దూరంగా ఉండకపోతే, నీవు శాపగ్రస్తుడవే. "ఎందుకంటే, ఎవడైనా ధర్మశాస్రమంతా పాటించి, ఒక్క విషయంలో తప్పిపోతే, వాడు ధర్మశాస్త్రమంతటిని అతిక్రమించినట్టే." (యాకోబు 2:10)

దేవుడు ఎంతో పరిశుద్ధుడు, ఆయన పరిశుద్ధత ఎంతో పరిపూర్ణమైనది, పరిశుద్ధత విషయంలో ఆయన ఆశించేది ఎంతో ఉన్నతమైది గనుక, అతి స్వల్పమైన నేరం కూడా అతడు సమస్తము అతిక్రమించినట్లే పరిగణించ బడుతుంది. ఒక్క పాపం మనిషిని దేవుని పరిశుద్ధ ధర్మశాస్త్రం దేవుని న్యాయపీఠం ఎదుట దోషిగా, శాపగ్రస్తునిగా నిలబెడుతుంది.

మత్తయి 5:21-22 వచనాలు ఇలా సెలవిస్తున్నాయి: "పూర్వం 'హత్య చేయరాదు, హత్య చేసిన వానికి శిక్షపడుతుంది' అని ప్రజలకు చెప్పటం మీరు

విన్నారు.కాని నేను చెప్పేదేమిటంటే తన సోదరునిపై కోపగించిన ప్రతి వ్యక్తి శిక్షింపబడతాడు. తన సోదరుణ్ణి 'పనికిమాలినవాడా' అన్న ప్రతి వ్యక్తి మహాసభకు సమాధానం చెప్పవలసి ఉంటుంది. తన సోదరుణ్ణి 'మూర్ఖుడా!' అన్న ప్రతి వ్యక్తి నరకంలో అగ్నిపాలు కావలసి వస్తుంది."

చూశారా, అతి స్వల్పమైన ఉల్లంఘన, కేవలం ఒక్క ఉల్లంఘన, పరిశుద్ధమైనది కాని ఒక్క పని, ఒక్క క్రియ, ఒక్క తలంపు, ఒక్క చర్య నిన్ను దేవుని ఎదుట దోషిగా నిలబెడుతుంది.

యోహాను 12:47-48 వచనాలలో యేసు క్రీస్తు ఈ మాటలు పలికారు: "ఎవడైనను నా మాటలు విని వాటిని అనుసరించని వానికి నేను తీర్పు తీర్చను. ఎందుకంటే నేను ఈ ప్రపంచానికి తీర్పు తీర్చటానికి రాలేదు, కాని నేను రక్షించటానికి వచ్చాను. నన్ను, నా మాటల్ని ఇష్టపడక వ్యతిరేకించేవానిపై ఒక న్యాయాధిపతి ఉన్నాడు. నేను పలికిన మాటయే చివరి దినమున వానికి తీర్పు తీరుస్తుంది."

నా స్నేహితుడా, నీవు పాపివి. నీవు దేవుని ధర్మశాస్త్రాన్ని పాటించలేదు. దేవుని ఆజ్ఞలలో ప్రతిదానికి నీవు విధేయతచూపలేదు. నీవు పుట్టినప్పటినుంచి నీ ప్రతి ఆలోచనలో, మాటలో, క్రియలో లేక చర్యలలో నీవు పరిపూర్ణమైన పరిశుద్ధత కలిగి జీవించలేదు. కాబట్టి నీవు సర్వశక్తుడైన దేవుని యెదుట దోషిగా ఉన్నావు. నీవు ఏ వాక్యాన్నయితే ఉల్లంఘించావో ఆ వాక్యంచేతనే తీర్పు దినాన నిన్ను దోషిగా నిరూపిస్తుంది. మరి దానివిషయమై నీవు ఏం చెయ్యబోతున్నావు?

దేవుడు తన కుమారుడైన యేసుక్రీస్తు ప్రభువును ఈ లోకానికి పంపించాడని, ఆయన తన శరీమందు కల్వరి సిలువపై నీ పాపాన్ని తనపై వేసుకున్నాడని బైబిల్ చెప్తుంది. నీ అపరాధాన్ని ఆయన భరించాడు. నీ అతిక్రమాన్ని, దోషాన్ని ఆయన తీసుకున్నాడు. నీ స్థానంలో ఆయన మరణించాడు. నీ శిక్షను ఆయన భరించాడు. పరిశుద్ధుడైన దేవుని ఉగ్రతను కోపాన్ని శాంతింపజేయడం కోసం ఆయన నీ పాపాలకు పరిహారం చెల్లించాడు. ఆయన యొద్దకు వచ్చి, ఆయనను నమ్మి, దోషభరితమైన నీ ఆత్మను ఆయన పాదాలచెంత కుమ్మరించి, ఆయనలో కనికరమును, పాపక్షమాపణను పొందుమని నిన్ను ఆహ్వానిస్తున్నాడు. ఆయన నీ కోసం మరణించి, సమాధినుండి తిరిగిలేచాడని, నిన్ను రక్షించడానికి ఆయన ఇష్టపడుతున్నాడని, అందుకాయన సమర్థుడని విశ్వసించి, ఒక నేరస్తునివలె, నరకపాత్రునిగా ఆయనయొద్దకు వచ్చి నిన్ను రక్షించుమని యేసుక్రీస్తు

ప్రభువునందు విశ్వాసముంచు. అప్పుడు దేవుని పరిశుద్ధత సంతృప్తిచెందుతుందని బైబిల్ చెప్తుంది. ఎందుకంటే, నీ పాపానికి పరిహారం సంపూర్ణంగా చెల్లిస్తూ నీ స్థానంలో మరొకరు మరణించారు కాబట్టి. నీ స్థానంలో నీకు బదులుగా పరిశుద్ధుడైన రక్షకుడు తనను తాను బలిగా అర్పించుకున్నాడు గనుక పరిశుద్ధుడైన దేవుడు నిన్ను క్షమించవచ్చు.

నా స్నేహితుడా, నీవు వేరేవిధంగా ఎప్పటికీ రక్షణపొందలేవు. నీ పాపాలకు మూల్యం చెల్లించే రక్షకుని నీవు కనుగొనేవరకు నీవు నేరస్తునిగాను, శిక్షలో ఉన్నవానిగాను మిగిలిపోతావు. యేసుక్రీస్తు ప్రభువే ఆ రక్షకుడు.

ఆయన నీకు తెలుసా? ఆయనను నీవు నమ్ముతావా? ఆయన అర్హతలను, ఆయన మంచితనము, ఆయన కృపలను నీ ఆత్మకు ఆధారం చేసుకుంటావా?

బైబిల్ ఇలా సెలవిస్తోంది: నోటితో ఒప్పుకొనుట ద్వారా రక్షణ కలుగును: నీతికలుగునట్లు మనుష్యుడు తన హృదయములో విశ్వసించును. యేసుక్రీస్తువారి నీతియందు నేను విశ్వాసముంచుతున్నానని ఈరోజే నీవు ఒప్పుకుంటావా?

# దేవుని సన్నిధి, జ్ఞానము

ఈ పాఠంలో మనము దేవునియొక్క సన్నిధి, ఆయన జ్ఞానమును గూర్చి ధ్యానించబోతున్నాం. దేవుడు సర్వాంతర్యామి అని పరిశుద్ధ గ్రంథం బోధిస్తుంది. దేవుడు ప్రతిచోటా ఉన్నాడని చెప్పడానికి అదొక అందమైన మాట. ఈ వాస్తవము మనం అర్థంచేసుకోలేనంత అద్భుతమైనదే కాని నమ్మి నిరూపించడానికి ఎంతో సులభమైనది.

దేవుడు ఒక వ్యక్తి, ఆయన వ్యక్తిగత సన్నిధి తండ్రియైన దేవుని రూపంలో పరకలోకంలో ఉన్నది. అదేరీతిగా, భూమిమీద కొంతకాలం ఉన్న కుమారుడైన దేవుడగు యేసు ఇప్పుడు పరలోకంలో ఉన్నాడు. అయినప్పటికీ ఆయన ప్రతి విశ్వాసిలో నివాసముంటూ, ఆయన నామంలో ఎక్కడ ఇద్దరు ముగ్గురు కూడివుంటారో అక్కడ వారిమధ్య ఉంటానని వాగ్దానం కూడా చేసాడు. ఇలాంటి సంగతులు ప్రకృతిసంబంధియైన మనిషి ఆలోచనకు అందనంత అద్భుతవిషయాలే అయినప్పటికీ, ఒక విశ్వాసికి అవన్నీ పరిశుద్ధ గ్రంథంలో కనిపిస్తాయి. ఈ సత్యాన్ని దేవుని వాక్యంలోనుంచి మీకు చూపనివ్వండి.

ఈ మాటలు నమ్మశక్యం కానివిగా అనిపిస్తాయని నేను గ్రహించాను. యేసు క్రీస్తు కేవలం ఒక మానవుడు అయ్యుంటే బహుశా మనం ఆ మాటలు నమ్మి వుండేవాళ్లం కాదేమో. అయితే యేసుక్రీస్తు నిజంగా దైవ-మానవుడు. ఆయన సృష్టికర్త. యేసుక్రీస్తు గురించి కొలొస్సయులకు 1:27లో బైబిల్ ఇలా చెప్తున్నది: "భక్తులకు ఈ రహస్యంలోని గొప్ప మహత్యాన్ని తెలియచేసి, యూదులుకాని వాళ్ళకు చూపాలని ఆయన ఉద్దేశ్యం. మీలో ఉన్న 'క్రీస్తే' ఆ రహస్యం. ఆయన వల్ల మహిమను తప్పక పొందుతామనే ఆశ మనలో ఉంది."

ఒక వ్యక్తి యేసుక్రీస్తు ప్రభువును తన సొంత రక్షకునిగా అంగీకరించడం ద్వారా తిరిగి జన్మించినప్పుడు, వాస్తవానికి ఆ క్షణంలోనే దేవుని కుమారుడు ఆ విశ్వాసిలో జీవించడానికి వస్తాడని బైబిల్ సెలవిస్తోంది. ఇది అతనికి అర్థంకావలసిన అవసరం లేదు. కేవలం నమ్మమని దేవుడు నిన్ను అడుగుతున్నాడు.

మత్తయి 18:20లో యేసు తన సొంతవారికి ఈ వాగ్దానం చేస్తున్నాడు: "నా నామంలో ఎక్కడ ఇద్దరు లేక ముగ్గరు కూడుకుంటారో, అక్కడ వారిమధ్య నేను ఉంటాను." ఆహా, అదృశ్యుడైన ఆ అతిథికి స్తోత్రం కలుగునుగాక. అదృశ్యుడైన యేసుక్రీస్తు ప్రభువు వచ్చి మనతో కలిసివుంటాడనే ఆలోచన ఎంత థ్రిల్లింగ్‌గా వుంటుందో కదా!

అపొ.కా. 2వ అధ్యాయంలో నమోదు చేయబడినవిధంగా పరిశుద్ధాత్మ దేవుడు ఒక ప్రత్యేకమైన ఉద్దేశంతో పెంతెకొస్తు దినాన భూమిపైకి వచ్చాడు. పరిశుద్ధాత్మ రూపంలో సాక్షాత్తు యేసయ్యే విశ్వాసిలో నివసించడానికి వస్తాడు.

దేవుడూ, ఆయన సృష్టించిన ఇతర వస్తువులు ఒకరిలో ఒకరు భాగం కాదు. ఇది మానవుడికీ, ఇతర సృష్టించబడిన వస్తువులకూ వర్తిస్తుంది. దేవుడు అంటే చెట్లు, గడ్డి, గాలి, ఆకాశం, పక్షులు లేక పశువులు కాదు. ఇవి దేవుడు కాదు. అవి దేవుడు సృష్టించినవి, దేవుని వేరుగా వుండేవి. ఒక చిత్రలేఖనం చిత్రకారుడు కాదు. ఒక గ్రంథం గ్రంథకర్త కాదు. దేవుడు తన విశ్వంలో ఉన్నాడు అంటే, ఆయన అన్నిటిని చూస్తున్నాడు, అన్ని ఆయనకు తెలుసు, అన్నిటిని ఆయన కాపాడుతున్నాడు, ఆయన చిత్తానికి లోబడినంతవరకు ఆయన అందరిని నడిపిస్తున్నాడని అర్థం. రక్షణపొందనివారి హృదయాలలో ఆయన ఎట్టిపరిస్థితులలోనూ నివాసముండడు. ప్రభువైన యేసుక్రీస్తువారిని నీవు ఎన్నడూ వ్యక్తిగత రక్షకునిగా స్వీకరించివుండకపోతే, దేవుడు నీలో ఉండడు. మనిషి తిరిగి జన్మించితేనే తప్ప అతడు దేవుని జీవమును కలిగివుండలేడు; అలాగే సృష్టింపబడిన ఏదీ దేవుని జీవాన్ని కలిగివుండదు.

దేవుని సన్నిధి, ఆయన జ్ఞానమును గూర్చిన మూడు సత్యాలను ఇప్పుడు మనం పరిశీలిద్దాం.

1. దేవుని వ్యక్తిగత సన్నిధి పరలోకంలో ఉంది. బైబిల్ ఇలా సెలవిస్తోంది, "మనుష్యులు మీ సత్కార్యాలను చూచి పరలోకంలో ఉన్న మీ తండ్రిని మహిమపరిచేలా మీ వెలుగు మనుష్యుల ఎదుట ప్రకాశింపనివ్వండి" (మత్తయి 5:16). "నన్ను ముట్టుకొనవద్దు; నేనింకా తండ్రియొద్దకు ఎక్కిపోలేదు: అయితే నీవు నా సహోదరుల వద్దకు వెళ్లి, నేను నాతండ్రియొద్దకు, మీ తండ్రియొద్దకు, నా దేవునియొద్దకు మీ దేవునియొద్దకు వెళ్తున్నానని వారితో చెప్పమని యేసు ఆమెతో చెప్పాడు" (యోహాను 20:10). అపొ.కా. 7వ అధ్యాయంలో స్తెఫను

అప్పుడే ఇశ్రాయేలు జనాంగపు మత పెద్దల యెదుట తన గొప్ప ప్రసంగాన్ని ముగించాడు. ప్రభువైన యేసుక్రీస్తే నిజంగా వాగ్దానం చేయబడిన మెస్సీయ అని అతడు వారితో స్పష్టంగా తేటగా చెప్పాడు. రానైయున్న లోకరక్షకుడు వచ్చాడని అతడు ప్రకటించాడు. ఆయన తిరిగి లేచాడు అని ప్రకటించడానికి ముందు ఆయన మరణానికి కారకులు మీరే అని వారిమీద నేరం మోపాడు. అపొ.కా. 7:55-56 వచనాలలో స్తెఫను ఇలా చెప్పాడు: "అయితే అతడు పరిశుద్ధాత్మతో నిండి ఆకాశం వైపు తదేకంగా చూస్తూ, దేవుని తేజస్సును చూసాడు. దేవుని కుడిప్రక్కన యేసు నిలబడి ఉండటం చూసి, "ఆకాశం తెరుచుకోవడం, మనుష్యకుమారుడు దేవుని కుడి ప్రక్కన నిలిచి ఉండటం చూస్తున్నాను" అని పలికాడు. దీనిని బట్టి, దేవుని వ్యక్తిగత సన్నిధి పరలోకంలో ఉంది.

2. దేవుడు తన సొంత సన్నిధిద్వారాను, ఆయన ప్రతినిధులద్వారాను అంతటా ఉన్నాడు. ఈ ప్రకటనకు వివరణ బైబిల్‌నే ఇవ్వనిద్దాం. యిర్మీయా 23:23-24 వచనాలు ఇలా చెప్తున్నాయి: "యెహోవా చెప్పేదేమంటే, నేను దగ్గరలో మాత్రమే ఉన్న దేవుడినా దూరంగా ఉన్న దేవుణ్ణి కానా? నాకు కనబడకుండా రహస్య స్థలాల్లో ఎవరైనా దాక్కోగలరా? అని యెహోవా అడుగుతున్నాడు. నేను భూమ్యాకాశాల్లో ఉన్నాను గదా? ఇదే యెహోవా వాక్కు". దేవుడు ఒక ప్రశ్న అడిగి, దానికి జవాబు చెప్తున్నాడు. ఆ ప్రశ్న ఈరోజుకీ చెల్లుతుంది. నేను దగ్గరలో మాత్రమే ఉండే దేవుడనా లేక దూరంగా మాత్రమే ఉండే దేవుడనా? జవాబు ఏమిటంటే, నీవు దేవునికి కనబడకుండా దాగివుండగలిగే రహస్య స్థలం ఏదీ లేదు. దేవుడు నిన్ను చూడలేని స్థలం పరలోకంలో గాని భూలోకంలోగాని ఎక్కడా లేదు.

సామెతలు 15:3 లో లేఖనం ఇలా ఉంది: "యెహోవా కన్నులు లోకమంతా చూస్తుంటాయి, చెడ్డవాళ్లని, మంచివాళ్లని అవి చూస్తూవుంటాయి." నన్ను ఎవరూ చూడలేదు అని నీవు భావించిన ప్రతిసారీ నిన్ను ఒకరు గమనించారు. నేను తప్పించుకున్నానులే అని నీవు అనుకున్న పాపాలన్నిటిని – ఒకాయన గమనించాడు. ఏదో ఒక రహస్య ప్రదేశంలో నీవు జరిగించిన ఆ పనులన్నీ నీ సృష్టికర్తకు తేటగా కనిపించాయి. నా స్నేహితుడా, ఈ విశ్వమంతటిలో దేవుని కన్నుగప్పి నీవు వెళ్లగలిగిన ప్రదేశమంటూ ఏదీలేదు. దేవుడు నీవు చేసే ప్రతి

కార్యాన్ని చూడగలడు, ప్రతి ఆలోచనను తెలుసుకోగలడు, ప్రతి మాటను వినగలడు.

కీర్తనల గ్రంథంలో ఈ తలంపు మనకోసం చక్కని భాషలో వివరించబడింది: "నీ ఆత్మనుండి నేనెక్కడికి వెళ్లగలను? నీ సమక్షంలోనుండి నేనెక్కడికి పారిపోగలను? ఆకాశానికి ఎక్కి వెళ్దామంటే నువ్వు అక్కడ ఉన్నావు. పాతాళంలో దాక్కుందామంటే అక్కడకూడా నువ్వు ఉన్నావు. నేను ఉదయకాలం రెక్కలు కట్టుకుని ఎగిరివెళ్లి సముద్రపు లోతుల్లో దాక్కుంటాను. అక్కడ కూడా నీ చెయ్యి నన్ను నడిపిస్తుంది. నీ కుడిచెయ్యి నన్ను పట్టుకుంటుంది." (కీర్తన 139:7-10).

దేవుని దూరంగా పారిపోవాలని ప్రయత్నించడం అర్థరహితం. నువ్వు తప్పించుకోలేవు. నిన్ను నీ తలంపులను, లేక నీ క్రియలను దేవునికి కనపడకుండ దాచిపెట్టాలని ప్రయత్నించడం అర్థరహితం. అది జరిగే పనికాదు. ఆయన నిన్ను ఎంతగా ప్రేమించి నీగురించి చింతిస్తున్నాడో నీకు తెలిస్తే, నువ్వు ఆయననుంచి పారిపోవడం మానేస్తావు. దేవునితో సహవాసం చేసే జీవితం ఎంత అద్భుతంగా వుంటుందో నేను నీకు తెలియజేయగలిగితే, నీ పాపాల విషయమై నీవు పశ్చాత్తాపపడి వెంటనే ఆయన యొద్దకు వచ్చేస్తావు. నీవు ఆయన పాదాలపై పడి, నీ వ్యక్తిగత రక్షకునిగా ఆయనను ఉండనిస్తే సంతోషమంతా ఆరంభమవుతుంది.

కీర్తనలు 34:7 లో ఇలావుంటుంది: "యెహోవా అంటే భయభక్తులు గలవారిచుట్టూ ఆయన దూత కాపలా ఉండి వాళ్లను కాపాడుతూ వుంటాడు." అది బహుశా దేవుని పరిశుద్ధాత్మ ద్వారా కావచ్చు, దేవుని కనుదృష్టితో కావచ్చు, లేక దేవుని దూతద్వారా కావచ్చు, ఏదిఏమైనా, ఈ విశ్వంలో నీవు ఎక్కడున్నా సరే, దేవుడు అక్కడ వుంటాడు. ఆయన చూస్తాడు, తెలుసుకుంటాడు.

3. దేవుని జ్ఞానము అనంతం; దానికి హద్దులు లేవు. దానికి దేవుడు పెట్టిన పరిమితులు తప్ప వేరేవి ఏమీ వుండవు.

యోబు 37:16లో బైబిల్ ఇలా సెలవిస్తోంది: "మేఘాలను తేలజేయడం పరిపూర్ణ జ్ఞానం గలవాడి మహాకార్యమని నీకు తెలుసా?" నీ జ్ఞానం పరిపూర్ణమైనదేనా? కాదు. నా జ్ఞానం పరిపూర్ణమైనదా? కాదు. ఇప్పటివరకు జీవించిన మనుష్యులందరి జ్ఞానాన్ని కలిపినా, అది పరిపూర్ణ జ్ఞానం కాదు. అయితే దేవుడు పరిపూర్ణ జ్ఞానం కలిగిఉన్నాడు.

దేవుని జ్ఞానం గురించి మూడు వివరాలను పరిగణలోనికి తీసుకుందాం.

మొదట: ఆయన జ్ఞానము విశ్వముయొక్క దిగంతాల వరకు వ్యాపించి అతి సూక్ష్మమైన వివరాలను సహా పట్టించుకుంటుంది. మరల కీర్తనల గ్రంథాన్ని ఉటంకిస్తాను, ఈసారి కీర్తనలు 147:4: "ఆకాశంలో నక్షత్రాలను వాటి స్థానంలో ఆయనే నియమించాడు; వాటన్నిటికి పేర్లు పెట్టింది ఆయనే."

అదంతా బ్రహ్మాండంగా ఉంది. మీలో చాలమంది ఎంతో మారుమూల ప్రాంతాల్లో నివసిస్తుంటారు. అమెరికా దేశం చాలా జనసమ్మర్థమైన దేశం అయినప్పటికీ, నేను ఉండే ప్రాంతంలో తూర్పునుంచి పడమర వరకు ఎనిమిది మైళ్ల పరిధిలో కేవలం నాలుగు ఇళ్లే ఉండటం నిజంగా నేను ధన్యుణ్ణి అనే చెప్పాలి. దక్షిణం వైపుకు వెళితే పదిహేను మైళ్ల పరిధిలో కేవలం ఒక్కటే ఇల్లు ఉంది, ఇక ఉత్తరం వైపున అయితే ఏదైనా జనావాసం ఉన్న ప్రదేశం కనిపించడానికి ఎన్ని మైళ్ల దూరం ప్రయాణించాలో చెప్పలేను. రాత్రివేళ నేను బయటికి వెళ్లి, పైకి చూస్తే, కొన్నిసార్లు నెలపొడుపు రోజున లేదా అమావాస్య రోజుల్లో, ఆకాశం దాదాపు తెల్లగా వుంటుంది. ఆకాశంలో ఎన్ని నక్షత్రాలు ఉండేవంటే, మొత్తం ఆకాశమంతా తళతళ మెరిసిపోతుంటుంది. వాటిని లెక్కించడానికి నాకు ఒక రాత్రి, లేదా ఒక జీవితకాలం సరిపోదు అనిపిస్తుంది. అయినా సరే, దేవునికి వాటి ఖచ్చితమైన సంఖ్య ఎంతో తెలుసు, అంతేకాదు, వాటన్నిటిని ఆయన పేరు పెట్టి పిలుస్తాడని కూడా ఈ వచనం ప్రకటిస్తోంది. ఆకాశంలో ఎన్ని నక్షత్రాలున్నాయి అన్నది మాత్రమే కాదు, వాటన్నిటికి పేర్లు పెట్టింది ఆయనే, పైగా ఆ పేరేమిటో కూడా ఆయనకు తెలుసు.

నిశ్చయంగా దేవుని జ్ఞానం విశ్వముయొక్క దిగంతాలకు వ్యాపించడమే కాదు, వాటి సూక్ష్మమైన వివరాలు కూడా ఆయనకు తెలుసు. 5వ వచనంలో కీర్తనాకారుడు ఇంకా ఇలా అంటున్నాడు: "మన ప్రభువు గొప్పవాడు. ఆయన గొప్ప శక్తిసామర్థ్యాలు కలవాడు. ఆయన జ్ఞానం అనంతమైనది."

మత్తయి 10:29 లో ఒక అద్భుతమైన మాట కనిపిస్తుంది. "రెండు పిచ్చుకలు ఒక చిన్న నాణేనికి అమ్ముడవుతాయి గదా. అయిన మీ తండ్రి అనుమతి లేకుండా వాటిలో ఒకటికూడా నేల కూలదు." బయట అరణ్యంలో గాని, ఒక మహానగరం లో గాని, ఈ ప్రపంచంలో ఏ మూలనైనా గాని, దేవునికి తెలియకుండా నేలరాలే పిచ్చుక ఒక్కటికూడా ఉండదు.

చిల్లర తత్వవేత్తలు కొందరు చాలాకాలం క్రితమే ఒక ప్రశ్న వేసారు:

"అడవిలో ఒక చెట్టు కూలిపోతే, అది కూలిన శబ్దం వినడానికి అక్కడ ఎవరూ లేనట్లయితే, అది శబ్దం చేస్తుందా?" దానికి జవాబు? ఆ శబ్దం వినేవారు ఒకరున్నారు. అడవిని, చెట్లను, శబ్దాలను, అలలను సృజించిన దేవుడు అక్కడే ఉన్నాడు.

మత్తయి 10:30 లోఆయన ఇంకా ఇలా చెప్పాడు: "అయితే మీ తలలో ఎన్ని వెంట్రుకలున్నాయో అవన్నీ లెక్కించబడ్డాయి." ఈలోకంలో ఎంతమంది ప్రజలున్నారో అన్నది మాత్రమే కాదు, వాళ్లు ఎక్కడ ఉన్నారో, ఏం చేస్తున్నారో, ఏమి ఆలోచిస్తున్నారో, ఏమి చెప్తున్నారో, వారు చేసే పనుల వెనుక ఉద్దేశం ఏమిటో అన్నది మాత్రమే కాదు, ప్రతి తలమీద ఎన్ని వెంట్రుకలు ఉన్నాయో కూడా దేవుని దగ్గర లెక్క ఉంది.

నేనొక పుస్తకం రాయడం ముగించగానే, ఒక ప్రింటర్‌ని సంప్రదిస్తాం. ఆ పుస్తకాన్ని ముద్రించడానికి అయ్యే ఖర్చుమొత్తం దానిలో ఎన్ని పేజీలు ఉన్నాయి అనే దానిపై ఆధారపడివుంటుంది. ఉదాహరణకు వంద పేజీలున్నాయి అనుకుందాం. చదవడానికి యోగ్యమైన ఒక పుస్తకాన్ని ముద్రించాలంటే, ప్రింటర్‌కి ఆ పుస్తకంలో ఎన్ని పేజీలున్నాయో అనేది మాత్రమే కాక, ఏ పేజికి ఏ నంబరు ఉందో కూడా తెలియాలి. అప్పుడు మాత్రమే అతడు 11వ పేజికి ముందు 10వ పేజిని, 13వ పేజికి ముందు 12వ పేజిని ముద్రించగలడు. ఒక్కొక్క పేజికి ఒక సంఖ్య ఉంటుంది. అలాగే, మనం చదువుకున్న వచనం ప్రకారం, దేవునికి ప్రతి తలమీద ఎన్ని వెంట్రుకలు ఉన్నాయో అన్నదే కాక, ఒక్కో వెంట్రుక యొక్క సంఖ్య కూడా ఆయనకు తెలుసు.

నేను చెప్తున్నాను కదా, నిజంగా మన దేవుని జ్ఞానము అనంతమైనది.

రెండవది: దేవునికి మనం చేసే క్రియలు మాత్రమే కాదు, ప్రతి ఒక్కరి తలంపులు కూడా తెలుసు నని కూడా చూస్తున్నాం.

సామెతలు 5:21 చూస్తే, "మనుష్యుల ప్రవర్తన యెహోవాకు తెలుసు. వారి నడతలన్నిటినీ ఆయన గుర్తిస్తాడు" అని వుంటుంది. నీవు ఏం చేస్తున్నావో దేవుడు చూస్తున్నాడు, దాన్ని జాగ్రత్తగా గమనిస్తున్నాడు. ఓ మనిషీ, ప్రభువు నీ చర్యలన్నిటి గురించి ఆలోచన చేస్తున్నాడు.

మొదటి దినవృత్తాంతములు 28:9 ఇలా ప్రకటిస్తోంది: "సొలొమోనూ, నా కుమారుడా, నీ తండ్రి దేవుడైన యెహోవా అందరి హృదయాలను

పరిశీలిస్తాడు. ఆయన అందరి ఆలోచనలు ఉద్దేశాలు తెలిసినవాడు. నువ్వు ఆయన్ని తెలిసికొని హృదయపూర్వకంగా మనస్ఫూర్తిగా, ఆయన్ని సేవించు. ఆయన్ని కోరుకుంటే ఆయన నీకు ప్రత్యక్షమవుతాడు. నువ్వు ఆయన్ని విడిచిపెడితే ఆయన నిన్ను శాశ్వతంగా తృణీకరిస్తాడు." ఆయన మహాశక్తిగల దేవుడు! ఆయన నమ్మశక్యం కాని దేవుడు! ఏ మనుష్యుడూ అలాచెయ్యలేడు. ఏ మతనాయకుడు లేక విగ్రహము అలాంటి మాటలు చెప్పలేడు.

కీర్తనలు 139:2 లో మనకు ఇలా చెప్పబడింది: "నేను కూర్చోవడం, పైకి లేవడం అంతా నీకు తెలుసు." నువ్విప్పుడు కూర్చొని వున్నావో లేక పైకి లేస్తున్నావో నాకు తెలియదు, కానీ దేవునికి తెలుసు. నువ్వు విశ్రాంతి తీసుకుంటున్నది లేక పనిచేస్తున్నది, నీవు ఏదైన తొంగిచూస్తున్నది, నాకు తెలియదు. కానీ దేవునికి తెలుసు. అంతేకాదు, ఆయన ఇంకా ఏమంటున్నాడంటే, "నా నోట మాట రాకముందే అది నీకు పూర్తిగా తెలుసు." ఇప్పుడు నువ్వేమి ఆలోచిస్తున్నావో దేవునికి తెలుసు. నీ తలంపులు కూడా ఆయనకు తెలుసు.

తీర్పుదినాన నీవు ఇలాంటి దేవుని చేతికి చిక్కితే ఎలావుంటుందో ఎప్పుడైనా నిజంగా ఊహించావా? ప్రతి ఆలోచన ఎరిగిన దేవుడు, నీవు కూర్చుని వున్నావా లేక నిలబడివున్నావా చూడగలిగిన దేవుడు నీ అతిక్రమములను చూడలేకపోవచ్చు అని నీవు నిజంగానే అనుకుంటున్నావా?

నీవు తక్షణమే ప్రభువైన యేసుక్రీస్తువారి పాదాలచెంత పడి నీ పాపాలకు క్షమాపణ పొందడం ఎంతైనా మంచిది. నీకు మిగిలివున్న అవకాశం అదొక్కటే.

ఈ శీర్షిక క్రిందనే మరొక వచనాన్ని చూద్దాం: "వాళ్లు మొరపెట్టకముందే నేను వారికి జవాబిస్తాను. వాళ్లు ఇంకా మాట్లాడుతూ ఉండగానే నేను వింటాను." (యెషయా 65:24). అటువంటి మహోన్నతుడైన దేవుణ్ణి కలిగివుండటం ఎంత అద్భుతం. దేవుడు ఒకే క్షణంలో లక్షలాది ప్రజల ప్రార్థనలు విని ఆ ప్రార్థనలకు జవాబులు ఇవ్వగల సమర్థుడు.

నేను యౌవన క్రైస్తవుడిగా వున్న సమయంలో, ఆఫ్రికా దేశానికి చెందిన ఒకని గురించి నేను విన్నాను. అతడు చాలా వేకువజామునే, ఇంకా కోడి కూయక మునుపే లేచి ప్రార్థన చేసేవాడట. "ఆ సమయంలో నువ్వు ప్రార్థన చేయడానికి ఎందుకు లేస్తావు?" అని ఎవరో అతన్ని అడిగారు. అందుకు అతడిచ్చిన జవాబు "ఎందుకంటే, ఆ సమయంలో ఎక్కువమంది ఇంకా నిద్రలోనే ఉంటారు గనుక దేవుని శ్రద్ధ అంతా నామీదే వుంటుందని" నేను ఆ జాముున

ప్రార్థన చేస్తాను అని చెప్పాడు. అది చాలా మంచి ఆలోచనే, కాని ఆ ఆఫ్రికా దేశ భక్తునికి అది నిద్రా సమయం అయినప్పటికీ, ప్రపంచానికి మరోవైపున విరామం లేకుండా శ్రమించే వేలకొలది ఆత్మలకు అది మధ్యాహ్న సమయం. ఎక్కువమంది ప్రార్థనచేయని సమయం ఎప్పుడో చూచుకుని ఆ సమయంలో మన ప్రభువుకు మొర్రపెట్టడానికి వేచివుండాల్సిన అవసరం లేనంత మహోన్నతుడు, సర్వశక్తిమంతుడు మన దేవుడని గ్రహించడం మంచిది. మన దేవుడు ఈ భూమిమీద ఉన్న ప్రతి పురుషుడు, ప్రతి స్త్రీ చేసిన ప్రార్థనలన్నీ వినగలడు. అందరూ ఒకే సమయంలో ప్రార్థనచేస్తున్నా కూడా ఆయన వినగలడు, అర్థం చేసుకోగలడు, గ్రహించగలడు, ఏమాత్రం కష్టపడకుండా ఆ ప్రార్థనలలో ప్రతి ఒక్కదానికీ సునాయాసంగా జవాబు ఇవ్వగలడు. బైబిల్‌లో ఉన్న దేవుడు అలావుంటాడు.

అనేకసార్లు నేను ఎంతోమంది క్రైస్తవులు ఒకచోట చేరి ప్రార్థించే కూటాలకు హాజరవుతుంటాను. కొందరు మాట్లాడుతుంటారు, కొందరు కేకలు వేస్తుంటారు, కొందరు పెద్దగా ఏడుస్తుంటారు, కొందరు గుసగుసలాడుతుంటారు, ఇతరులు మౌనంగా ప్రార్థనచేస్తుంటారు. ఒకటి మాత్రం నేను ఒప్పుకోవాల్సిందే. ఆ కూటాలలో నా మాటలు నాకే వినపడవు. నా మనస్సు ఎటోవెళ్లిపోతుంది, గందరగోళానికి గురవుతుంది. తరచుగా నేను ఒకచోట కూర్చుని, దేవునిగురించి ఆలోచిస్తాను. దేవుడు అన్ని రకాల శబ్దాలను, స్వరాలను క్రమబద్ధీకరిస్తూ, ప్రతి విన్నపాన్ని తూచి చూస్తూ, ప్రతి హృదయాన్ని పరిశీలిస్తూ, ప్రతి ఫలితం గురించి ఆలోచిస్తూ, ఎవరికి ఎలాంటి జవాబు సరిపోతుందో ఆలోచించి మరీ వారి ప్రార్థనలకు జవాబులు ఇవ్వడం ఎంత ఆశ్చర్యకరం. అంత శక్తివంతమైన దేవుడు ఆయన.

1 యోహాను 5:14 లో ఆయన ఇలా అంటున్నాడు, “ఆయన దగ్గర మనకున్న ధైర్యం ఇదే, ఆయన చిత్తానికి అనుగుణంగా మనం ఏది అడిగినా, ఆయన మన విన్నపం వింటాడు.” నా స్నేహితుడా, నీవు దేవునికి ప్రార్థనచేస్తే, ఆయన నీ మనవి తప్పక వింటాడు అని నీవు ధైర్యంగా వుండవచ్చు. 15వ వచనంలో ఇలా వుంటుంది: “మనం అడిగిన విషయాలన్నీ ఆయన వింటాడని తెలిస్తే, మనం అడిగినవి మనకు కలిగాయని మనకు తెలుసు.” దేవుడు ప్రతి ఒక్కరి ప్రార్థనలు వినడం మాత్రమే కాదు, ఆయన ప్రతి ఒక్కరి ప్రార్థనకు జవాబు కూడా ఇవ్వగలడు.

మూడవది: దేవుడు ఎంతో సమర్థవంతంగా గుర్తుపెట్టుకోగలడు, మరచిపోగలడు కూడా. దేవుడు తన పరిపూర్ణ జ్ఞానం చొప్పున దేనినైనా పూర్తిగా తుడిచివేసి, దాన్ని పూర్తిగా మరచిపోదలిస్తే, అలా చేయగల శక్తి ఆయనకు ఉంది.

నీవు పాపివి. నేను పాపిని. మానవులందరూ పాపం చేసి దేవుడు అనుగ్రహించే మహిమను పొందలేకపోయారు. నీ తలంపులలో, నీ క్రియలలో నీవు చేసిన పాపాలన్నీ దేవునికి తెలుసు. నీ జీవితంలో ప్రతిరోజూ నీవు చేసిన పాపాలన్నీ ఆయనకు తెలుసు. ఆయన వాటన్నిటిని చూసాడు. అయినా, ఈ దివ్యమైన సత్యాన్ని వినండి: హెబ్రీ 8:12 లో బైబిల్ ఇలా సెలవిస్తోంది: "నేను వారి అవినీతి పనుల విషయమై కరుణ చూపుతాను, వారి పాపాలను ఇక ఎప్పటికీ జ్ఞాపకం చేసుకోను." మరల యెషయా 49:14-16 వచనాలలో ఇలా చదువుతాం: "అయితే సీయోను 'యెహోవా నన్ను విడిచిపెట్టాడు, ప్రభువు నన్ను మరచిపోయాడు' అంది. స్త్రీ తన గర్భాన పుట్టిన బిడ్డ మీద జాలిపడకుండా ఉంటుందా? తన చంటిపిల్లను మరచిపోతుందా? వాళ్లు మరచిపోవచ్చు గాని నేను నిన్ను మరచిపోను. చూడు, నా అరచేతుల్లో నిన్ను చెక్కుకున్నాను. నీ గోడలు ఎప్పటికీ నా యెదుట ఉన్నాయి." దేవుడు తాను మరిచిపోవాలనుకున్నది మరువగలడు, గుర్తుపెట్టుకోవాలనుకున్నది ఆయన గుర్తుపెట్టుకోగలడు.

దేవుడు నీ పాపాలను ఎప్పుడు మరచిపోతాడు? నీవు పాపివని ఒప్పుకొని యధార్థమైన దుఃఖముతో, పశ్చాత్తాపముతో ఆయన వద్దకు నీవు వచ్చి, నీ పాపాలకు ప్రాయశ్చిత్తార్థమైన బలిగా తన కుమారుడైన యేసుక్రీస్తు ప్రభువు తన రక్తముతో చేసిన పాప పరిహారమునందు నమ్మిక ఉంచినప్పుడు ఆయన నీ పాపాలను మరచిపోగలడు. "అదేమంటే యేసును ప్రభువుగా నీ నోటితో ఒప్పుకొని, దేవుడు ఆయనను చనిపోయినవారిలోనుండి సజీవంగా లేపాడని నీ హృదయంలో నమ్మితే, నీకు రక్షణ కలుగుతుంది. ఎలాగంటే మనిషి నీతికోసం హృదయంలో నమ్ముతాడు, పాప విమోచనకోసం నోటితో ఒప్పుకుంటాడు." అని బైబిల్ సెలవిస్తోంది (రోమా 10:9-10).

ప్రభువు నామంలో మనం ప్రార్థనచేసినట్లయితే, ఆయన మనల్ని రక్షించి మన పాపాలను క్షమిస్తాడు. క్షమించాక, వాటిగురించి మరచిపోతాడు. వాటినిక మీదట ఎన్నడూ జ్ఞాపకం చేసుకోడు. మనల్ని తన బిడ్డగా చేసుకున్న తరువాత మనల్ని ఎన్నడూ మరువనని చెప్తున్నాడు. మన పాపాల్ని మరచిపోతాడా? అవును.

ఆయన మరిచిపోతాడు. మనల్ని మరచిపోతాడా? ఓ, దేవుని నామానికి స్తోత్రం, ఆయన ఎన్నటెన్నటికీ మరువడు.

దేవుని జ్ఞానము అనంతమైనది, అది విశ్వముయొక్క దిగంతాలకు వ్యాపించి, అతి సూక్ష్మ వివరాలను సహా పరిశీలిస్తుంది. ఆయన ప్రతి ఒక్కరి తలంపులనే కాదు, వారు చేయబోవు క్రియలను కూడా ముందుగానే తెలుసుకోగలడు. ఒకే సమయంలో లక్షలాదిమంది చేసిన ప్రార్థనలను దేవుడు వినగలడు, వాటన్నిటికి జవాబు ఇవ్వగలడు; ఇంకా ఆయన సమర్థవంతంగా దేనినైనా మరచిపోగలడు, లేదా తనకిష్టమైనది జ్ఞాపకం చేసుకొనగలడు.

మూడు విషయాల గురించి ఆలోచిస్తూ ఈ అధ్యాయాన్ని ముగించుదాం. మేము వాటిని ఇక్కడ ప్రస్తావించి, మీ ధ్యానం కొరకు విడిచిపెడతాం.

1. దేవునికి మాత్రమే చెందిన నివాళిని ఏదైనా సృష్టింబడిన వస్తువుకో, వ్యక్తికో లేక ఒక దూతకో లేక ఒక ఆత్మకో చెల్లించడం భయంకరమైన పాపం. అది సాక్షాత్తు దేవుని ఉనికికే గొడ్డలిపెట్టు వంటిది. ఒక ప్రతిమను పూజించడం, అది దేవునికి ప్రాతినిధ్యం వహించేదైనా సరే, అది మహా పాపం, జారత్వము అవుతుంది.

2. దేవుడు అన్నిటికి చాలినవాడు, ఎంతగానంటే, మనకు అవసరం రాకముందే దానిగురించి ఎరిగినవాడు, దానిని సంపూర్ణంగా తీర్చగల శక్తిమంతుడు.

3. దేవుణ్ణి ఆయన ఉన్నట్టుగానే మనం ఎరిగినప్పుడు ఆరాధనతో ఆరంభమయ్యే ప్రార్థన విన్నపంతో ముగుస్తుంది. సంప్రదాయంగా చేసే ప్రార్థన, పదాలు వల్లెవేయడం, కంఠస్తం చేసిన ప్రార్థనలు చెప్పడం పూర్తిగా అర్థరహితం. దేవుడు ఒక వ్యక్తి. ఆయన మనల్ని ప్రేమిస్తాడు. మనగురించి శ్రద్ధవహిస్తాడు. మనం హృదయపూర్వకంగా ఆయనతో మాట్లాడుతుంటే వినాలని కోరుకుంటాడు. మన అవసరాలు తీర్చడం ద్వారా మన ప్రార్థనలకు జవాబిచ్చి, మన ఆరాధనను స్వీకరించాలని కోరుకుంటాడు.

నా స్నేహితుడా, ఇప్పుడే నీవు దేవుని యొద్దకు వచ్చి, నీ పాపాలు క్షమించబడాలన్న అవసరం ఆయనకు చెప్పుకుంటావా? ఆహా, నీవు ఆపని చేయగలిగితే, దేవుడు ఆ ప్రార్థన విని జవాబిస్తాడు. తన కుమారుడైన యేసుక్రీస్తు

ప్రభువు యొక్క రక్తంలో నీ పాపాలను కడిగివేస్తాడు. ఆయన నీకు నిత్యజీవం ప్రసాదిస్తాడు. అప్పుడు నీవు ఆయనతో నడవటం, మాట్లాడటం, ఆయనతో సహవాసం చెయ్యడం, ఆయనను తెలుసుకోవడం, ఆయనను ప్రేమించి ఆరాధించడం ఆరంభిస్తావు.

# దేవుని ప్రేమ

మనకు పరిశుద్ధుడు, నీతిమంతుడు, సత్యవంతుడు, న్యాయవంతుడు, మరియు ఆయన చేసే ప్రతి పనిలో పవిత్రుడునైన ఒక దేవుడు ఉన్నాడని తెలుసుకోవడం ఎంతో అద్భుతమైన విషయం. ఆయన మాట్లాడే ప్రతిమాట, చేసే ప్రతి పని, ప్రతి ఆలోచన పూర్తిగా పరిపూర్ణమైనవని మన చూసాం. అయితే, మన అధ్యయనంలో మరొక అడుగు ముందుకు వేస్తుండగా, ఆ దేవుని తీర్పులు, న్యాయం గురించి ఆలోచిస్తే, ఒకింత భయం కూడా కలుగుతోంది. ప్రభువైన యేసుక్రీస్తువారి బలియాగం ద్వారా మాత్రమే మనము ఆ తీర్పును తప్పించుకునే మార్గం దొరుకుతుందని, అది కూడా మనస్థానంలో ఒకరు తీర్పును అనుభవించినందుకే అన్న వాస్తవాన్ని కూడా మనం ఆలోచించాం.

ఆ త్యాగం వెనుక ఉన్న ప్రేరణ గురించి చర్చించాల్సిన సమయం వచ్చింది: అదే దేవుని ప్రేమ.

బైబిల్‌ని నమ్ముతూనే, దేవుని ప్రేమ అనే అంశాన్ని దాదాపుగా మొత్తాన్నీ విడిచిపెట్టే సాంప్రదాయ బోధకులు ఎంతోమంది ఉన్నారు. ఇలా ఎందుకు జరుగుతుందంటే, మరొక అంశం గురించి మాట్లాడని ఉదారవాద బోధకులు ఎంతోమంది ఉన్నారు. దేవుని ఉగ్రత, తీర్పు, పాపం పట్ల అసహ్యం గురించి ప్రస్తావించకుండా దేవుని ప్రేమ, దేవుని కృప, దేవుని దయ గురించి మాట్లాడటం తప్పు అనేది సత్యమే అయినప్పటికీ, కేవలం దేవుని ఉగ్రత, తీర్పు, పాపం పట్ల అసహ్యాన్ని గురించి మాత్రమే  మాట్లాడుతూ, దేవుని ప్రేమగురించి మాట్లాడే సమయమే లేకపోవడం కూడా అంతే తప్పు అవుతుంది.

ఈ పాఠాల గుండా మనం ముందుకు సాగిపోతూ, నిజమైన జీవముగల దేవుని గూర్చిన ప్రతి అంశాన్ని మనం పరిగణలోనికి తీసుకొంటుండగా, మనకు ఒక సమతుల్యమైన దృక్పథం ఏర్పడాలన్నదే నా ఆశ, ప్రార్థన.

ప్రేమ అనేది దేవుని పరిశుద్ధమైన గుణంలో ఒక భాగం. దేవుని ప్రేమ మనుష్యులు చూపే ఆప్యాయతలాంటిది కాదు. మానవ ఆప్యాయత చాలావరకు

స్వార్థపూరితంగా వుంటుంది; అదేమిటంటే, ఇతరులనుంచి నాకు ఏదైనా తిరిగి లభిస్తుంది అనే ఆశతోనే మనం ఎదుటివారి పట్ల ఆకర్షితులమవుతాం. మానవ ప్రేమ, ఆప్యాయతలు ఎక్కువభాగం స్వార్థపూరితమే.

దేవుని ప్రేమ పూర్తిగా నిస్వార్థమైనది. మానవుణ్ణి ప్రేమించడం ద్వారా దేవునికి ఒనగూడే ప్రయోజనం ఏమీలేదు. మానవుడు దేవునికి అదనంగా చేర్చగలిగింది ఏముంది? మానవుడు దేవునికి ఏమి ఇవ్వగలడు? మానవుడు ప్రేమించినందువల్ల దేవునికి తీరే కొరత ఏముంది? దేవుని ప్రేమ పూర్తిగా నిస్వార్థమైనది.

దేవుని ప్రేమ అందరికీ వ్యాపిస్తుంది – వారు ప్రేమించదగినవారైనా కాకపోయినా. మానవ ప్రేమ అలా ఉండదు. రక్షకుడైన యేసుక్రీస్తు మాత్రమే అందరినీ ప్రేమించడం కాదు, న్యాయవంతుడు, అందరికీ తీర్పుతీర్చే ఆ దేవుడు కూడా అందరినీ ప్రేమిస్తున్నాడు. పాపులు, తిరుగుబాటుదారులు అయిన మానవుల్ని ఆయన ఇంకా ప్రేమిస్తూనే ఉన్నాడు. తన ప్రేమచేత వారిని ఆకర్షించి, మనుష్యులందరూ సంతోషంగా ఆనందంగా, దీవించబడాలని ఆశిస్తున్నాడు. ఇదంతా ఆయన తన సర్వశక్తిగల ప్రేమతోనే జరిగించాలని చూస్తున్నాడు.

1 యోహాను 4:8 లో బైబిల్ ఇలా చెప్తున్నది, "ప్రేమలేనివాడు దేవుని ఎరుగడు, ఎందుకంటే, దేవుడు ప్రేమయైయున్నాడు." దేవుని గుణలక్షణమే ప్రేమ. దేవుని వ్యక్తిత్వమంతా వాస్తవానికి ప్రేమ అయ్యున్నది.

దేవుడు అందరినీ ప్రేమిస్తున్నాడు. ఆయన శత్రువులు సహా ఆయన ప్రేమను పొందినవారే.

యోహాను 3:16 లో మనకు ఇలా చెప్పబడింది, "దేవుడు లోకాన్ని ఎంతో ప్రేమించాడు" – లోకము అంటే పాపము, దుర్మార్గము, చెడుతనముతో నిండిన లోకమే కదూ? దేవున్ని తిరస్కరించి, తిరుగుబాటుచేసి, తనదారిన తాను వెళ్లిపోయిన లోకమే కదూ? అయినా సరే, "దేవుడు లోకాన్ని ఎంతో ప్రేమించి తన అద్వితీయ కుమారుని (తనవద్ద నున్న అతిపెద్ద నిధిలోనుంచి అతి గొప్ప బహుమానం ఇచ్చాడు.) యందు విశ్వాసముంచే ప్రతివారు నశింపక నిత్యజీవం పొందాలని ఆయనను అనుగ్రహించెను" (ఇది నిజమైన వాస్తవిక ప్రేమ: ఇవ్వడం) అని బైబిల్ చెప్తున్నది.

ఇది ప్రేమంటే. దేవుడే ప్రేమ! తన ప్రేమను బట్టి దేవుడు తన దగ్గ ఉన్న

అతి గొప్ప బహుమానం, తన జనితైక కుమారుణ్ణి పాపియైన మానవుడికోసం ఇచ్చేసాడు. తన కుమారుణ్ణి బహుమానంగా స్వీకరించే ఎవరైనా సరే, వారికి నిత్యజీవం కలిగి తమ సృష్టికర్తతో ఉండే భాగ్యం కల్పించాడు.

మత్తయి 5:43-45 వచనాలలో యేసుక్రీస్తు ఇలా చెప్తున్నాడు, "నీ పొరుగువాని ప్రేమించి, నీ శత్రువును ద్వేషించు మని చెప్పబడిన మాట మీరు విన్నారు గదా; నేను మీతో చెప్పునదేమనగా, మీరు పరలోకమందున్న మీ తండ్రికి కుమారులై యుండునట్లు మీ శత్రువులను ప్రేమించుడి. మిమ్మును హింసించు వారికొరకు ప్రార్థన చేయుడి. ఆయన చెడ్డవారిమీదను మంచివారిమీదను తన సూర్యుని ఉదయింపజేసి, నీతిమంతులమీదను, అనీతి మంతులమీదను వర్షము కురిపించుచున్నాడు." ఆ తర్వాత, 48వ వచనంలో ఆయన ఇలా అంటున్నాడు, "మీ పరలోకపు తండ్రి పరిపూర్ణుడు గనుక మీరును పరిపూర్ణులుగా ఉండండి."

దేవుని పరిపూర్ణ ప్రేమ అందరికి అందుబాటులోనికి వచ్చింది, వారు చెడ్డవారైనా, మంచివారైనా, న్యాయవంతులైనా, అన్యాయస్తులైనా సరే. తమను ప్రేమించేవాళ్లని ప్రేమిస్తూ, తమని ద్వేషించేవాళ్లను ద్వేషించేవారిలా మీరు ఉండవద్దని యేసు మనకు చెప్పాడు. మనం శత్రువులను సహా ప్రేమించే మన పరలోకపు తండ్రిలా ఉండాలి. నిన్ను ద్వేషించేవారిని సహా నీవు ప్రేమించాలి. ఇది దేవుని అద్భుతమైన ప్రేమ.

యెహెజ్కేలు 33:11 లో మనమిలా చదువుతాం: "కాగా వారితో ఇట్లనుమునా జీవముతోడు దుర్మార్గుడు మర ణము నొందుటవలన నాకు సంతోషము లేదు, దుర్మార్గుడు తన దుర్మార్గతనుండి మరలి బ్రదుకుటవలన నాకు సంతో షము కలుగును. కాబట్టి ఇశ్రాయేలీయులారా, మనస్సు త్రిప్పుకొనుడి, మీ దుర్మార్గతనుండి మరలి మనస్సు త్రిప్పు కొనుడి, మీరెందుకు మరణము నొందుదురు? ఇదే ప్రభు వగు యెహోవా వాక్కు."

ఎవరికైనా తమ బద్ధశత్రువు చచ్చిపోతే, దానివల్ల అతడు ఎంతోకొంత సంతోషించడం సహజం. ఇది సరైనది అని చెప్పలేదు. ఇది సహజం అని మాత్రమే చెప్పాను. తన గొప్ప శత్రువు చనిపోయినప్పుడు అతనికి కొంత సంతోషం కలుగుతుంది అంటే ఖచ్చితంగా మనం అర్థంచేసుకోవచ్చు (ఆమోదించలేము కానీ). అయితే అలాంటి మరణం, తనకు సంతోషం కలిగించదు అని దేవుడు చెప్పాడు. దుష్టుడు చనిపోవడం సర్వశక్తిగల దేవునికి

ఏమాత్రం సంతోషాన్నివ్వదు. అయితే ఆ దుష్టుడు తన దుష్టత్వాన్ని విడిచి బ్రతికినప్పుడే ఆయన సంతోషిస్తాడు. మా దేవుడు అలాంటివాడు. దేవుడు ప్రేమ అయియున్నాడు.

దేవుడు తన ప్రేమను కనుపరచే నాలుగు విధానాలను పరిగణలోనికి తీసుకుందాం:

మొదట, దేవుడు లోకసంబంధమైన ఆశీర్వాదాలను కుమ్మరించడం ద్వారా తన ప్రేమను వ్యక్తపరుస్తాడు. లోకసంబంధమైనవి అంటే శాశ్వతంగా ఉండనివి అని అర్థం. దేవుడు మంచివారిమీదికి, చెడ్డవారిమీదికి సమానంగా సూర్యుణ్ణి ఉదయింపజేస్తాడని మనం తెలుసుకున్నాం. దేవుడు మనుష్యులందరిమీదికి వర్షాన్ని కురిపిస్తాడని, వాళ్లు న్యాయవంతులైనా, అన్యాయస్థులైనా సరే. యాకోబు 1:17 లో ఈ మాటలు కనిపిస్తాయి: "శ్రేష్ఠమైన ప్రతియీవియు సంపూర్ణమైన ప్రతి వరమును, పరసంబంధమైనదై, జ్యోతిర్మయుడగు తండ్రియొద్దనుండి వచ్చును, ఆయనయందు ఏ చంచలత్వమైనను గమనాగమనములవలన కలుగు ఏ ఛాయయైనను లేదు."

చాలామంది తాము దేవుని పిల్లలమని, దేవుణ్ణి కలుసుకోవడానికి సిద్ధంగా ఉన్నామని భావిస్తుంటారు. ఎందుకంటే, వారు ఆశీర్వదించబడ్డారు, జీవితంలో వర్ధిల్లారు గనుక అలా భావిస్తారు. నువ్వు పీల్చుకోడానికి గాలి, చక్కగా ఆలోచించగలిగే సామర్థ్యము, మంచి శారీరక ఆరోగ్యము కలిగివుండి, ఈరోజు మంచి భోజనం చెయ్యగలిగావు, త్రాగగలిగావు, ఒంటిమీద బట్టలు, పండుకోవడానికి ఒక స్థలము నీకు ఉన్నాయంటే, దానికి బైబిల్ చెప్పే కారణం ఒకే ఒక్క కారణం – దేవుడు నిన్ను దీవించాడు.

బైబిల్ ఇంకా ఏం చెప్తున్నదంటే, దేవుడు నిన్ను దీవించింది నీవు మంచివాడవని కాదు. నీవు దుష్టుడవై యుండవచ్చు. నీవు న్యాయవంతుడవని కాదు దేవుడు నిన్ను దీవించింది. నీవు అన్యాయస్తుడవు అయ్యుండవచ్చు.

దేవుడు నిన్ను ఎందుకు దీవించాడు అంటే, ఆయన ప్రేమగల దేవుడు, తనను ప్రేమించనివాళ్ల పట్లకూడా తన ప్రేమను కనుపరచేవాడు గనుకనే.

దేవుడు నీపట్ల ఎంతో మంచిగా వున్నాడు గనుక నువ్వు మంచివాడివి అని భావించకు. లేదు, మిత్రమా, అట్టి దేవుని ప్రేమ నిన్ను మారుమనస్సువైపు నడిపించాలి. ఏ యోగ్యతలేని వ్యక్తిని దీవించడానికి దేవుడు ఇంతగా

కనికరించాడు అని ఒకడు గ్రహించినప్పుడు, నిజంగా అలాంటి గ్రహింపు అతనిలో పశ్చాత్తాపాన్ని మారుమనస్సును కలిగిస్తుంది.

రెండవది, దేవుడు తన దీర్ఘశాంతము, దయ ద్వారా తన ప్రేమను కనుపరుస్తాడు.

దీనికి ఉదాహరణ శతాబ్దాలుగా తనను పదే పదే తిరస్కరించిన యూదుల పట్ల దేవుడు వ్యవహరించిన తీరులో కనబడుతుంది. యేసు క్రీస్తును దూషిస్తూ, హేళనచేస్తూ, విస్మరించి తిరస్కరించే అనేకుల జీవితాలలో కూడా ఇలాంటి ప్రేమ కనిపిస్తుంది. దిన దినము, సంవవత్సరం వెంబడి సంవత్సరం ఆయురారోగ్యాలు, సిరిసంపదలతో దేవుడు వారిని దీవిస్తూనే ఉంటాడు.

దేవుడు అంత దుఃఖాన్ని, దూషణను భరిస్తూ, ఎన్నో శాపవచనాలు వింటూ, పాపులు, పతనమైన మానవులనుండి ఎంతో తిరస్కారాన్ని భరిస్తూ ఉండటమే దేవుని ప్రేమకు ఋజువు.

2 పేతురు 3:9లో దేవుని వాక్యం ఇలా సెలవిస్తోంది."కొందరు ఆలస్యమని యెంచుకొనునట్లు ప్రభువు తన వాగ్దానమును (ఇక్కడ సందర్భం ప్రపంచాన్ని నాశనం చేయడం) గూర్చి ఆలస్యము చేయువాడు కాదు గాని యెవడును నశింపవలెనని యిచ్ఛయింపక, అందరు మారుమనస్సు పొందవలెనని కోరుచు, మీ యెడల దీర్ఘశాంతముగలవాడై యున్నాడు."

పాపియైన మానవుణ్ణి దేవుడు ఎందుకు నాశనం చెయ్యలేదు? ఆయన తీర్పు దానిని కోరడం లేదని కాదు. అలా చేయనని ఆయన వాగ్దానం చేసినందుకు కాదు. ఆయన తన మాటను నెరవేర్చలేదని కాదు. కానీ, ప్రియులారా, దేవుడు దీర్ఘశాంతము గలవాడైనందుకే. నీవు నశించి నిత్యనరకాగ్ని పాలు కావడం ఆయనకు ఇష్టంలేదు. నీవు రక్షణపొందాలని ఆయన కోరుతున్నాడు. నీవు మారుమనస్సు పొంది, ఆయన అనుగ్రహించే నిత్యజీవాన్ని పొందుకోవాలన్నదే ఆయన కోరిక. అందుకే దేవుడు సహనంతో ఎదురుచూస్తున్నాడు.

చివరిగా ప్రభువు దినము ఎప్పుడు వస్తుందో మనకు తెలియదు. వేచివుండటం వల్ల ప్రయోజనం లేదు. మారుమనస్సును, రక్షణను ప్రక్కన పెట్టడం బుద్ధిహీనత అవుతుంది. అయితే, ఈ సంగతి ఎంత అద్భుతమో కదా, దేవుడు తన మహాప్రేమను బట్టి ఈ క్షణం వరకు తన తీర్పును నిలిపివేయడం.

యెషయా గ్రంథంలో ఇదేరకమైన మాటలు చదువుకుంటాం. "భక్తిహీనులు

తమ మార్గమును విడువవలెను దుష్టులు తమ తలంపులను మానవలెను వారు యెహోవావైపు తిరిగినయెడల ఆయన వారి యందు జాలిపడును వారు మన దేవునివైపు తిరిగినయెడల ఆయన బహుగా క్షమించును."

దేవుని ప్రేమ తన కృప, కనికరములలో వ్యక్తపరచబడుతుంది. నీవు ఎలాంటి పాపాలు చేసావో నాకు తెలియదు. సత్యము, నీతి అను మార్గం నుంచి నీవు దారితప్పి ఎంత దూరం వెళ్లావో నాకు తెలియదు. కానీ దేవునికి తెలుసు, అయినా ఆయన నిన్ను క్షమించడానికి ఇష్టపడుతున్నాడు. నీవు ఆయనయొద్దకు వస్తేచాలు, ఆయన నిన్ను శుద్ధిచేసి, నీకు క్షమాభిక్ష ప్రసాదించాలని ఎంతగానో ఎదురుచూస్తున్నాడు.

మూడవది, మనము భయంకరమైన పాపులమై యున్నప్పుడే మనకోసం మరణించడానికి క్రీస్తును పంపుట ద్వారా దేవుడు తన ప్రేమను వ్యక్తపరిచాడు. బైబిల్ అంతటిలో అతిగొప్ప ప్రకటనలలో ఒకటి రోమా పత్రిక ఐదవ అధ్యాయంలో కనిపిస్తుంది. "ఏల యనగా మనమింక బలహీనులమై యుండగా, క్రీస్తు యుక్తకాలమున భక్తిహీనులకొరకు చనిపోయెను. నీతి మంతునికొరకు సహితము ఒకడు చనిపోవుట అరుదు; మంచివానికొరకు ఎవడైన ఒకవేళ చనిపోవ తెగింప వచ్చును. అయితే దేవుడు మనయెడల తన ప్రేమను వెల్లడిపరచుచున్నాడు; ఎట్లనగా మనమింకను పాపులమై యుండగానే క్రీస్తు మనకొరకు చనిపోయెను" (రోమా 5:6-8). హల్లెలూయా.

యేసు క్రీస్తు మరణించింది మంచివారికోసమో, గొప్పవారి కోసమో లేక పరిపూర్ణుల కోసమో కాదు. నీలాంటి నాలాంటి ఎంతో బలహీనులు, పాపులు, పడిపోయినవారికోసమే ఆయన ప్రాణాలర్పించాడు. మనల్ని మనం రక్షించుకోలేని, పాపం చెయ్యకుండ మానలేని, పరలోకానికి అర్హత సంపాదించుకోలేని మనలాంటివారే ఆయన కృపకు పాత్రులు. మనం పాపులం, అయినా దేవుని మహాగొప్ప ప్రేమను బట్టి క్రీస్తు మనకోసం మరణించాడు. అలాంటి కృపను తిరస్కరించడం నీకెలా సాధ్యమవుతుంది? అలాంటి స్నేహితుని వద్దనుంచి ముఖం త్రిప్పుకొని నీవు ఎలా వెళ్లిపోగలవు?

1 యోహాను 4 లో ఆయన ప్రేమ వెల్లడియైన విధానం గురించి మనం చదువుకుంటాం: "ఆయనే మొదట మనలను ప్రేమించెను గనుక మనము ప్రేమించుచున్నాము. ఎవడైనను నేను దేవుని ప్రేమించుచున్నానని చెప్పి, తన

సహోదరుని ద్వేషించినయెడల అతడు అబద్ధికుడగును; తాను చూచిన తన సహోదరుని ప్రేమింపని వాడు తాను చూడని దేవుని ప్రేమింపలేడు" (1 యోహాను 4:19–20).

ఈ వాక్యభాగంలో దేవుడు మనకు బోధిస్తున్నదేమంటే, ఆయన నన్ను ప్రేమించడం ద్వారా అత్యంత కురూపియైన, ఏమాత్రం ప్రేమకు అర్హతలేనివారిని ప్రేమించాడు అన్న విషయాన్ని. అదే అధ్యాయంలో 9–10 వచనాలలో ఇలా చెప్తున్నాడు: "మనము ఆయన ద్వారా జీవించు నట్లు, దేవుడు తన అద్వితీయ కుమారుని లోకములోనికి పంపెను; దీనివలన దేవుడు మనయందుంచిన ప్రేమ ప్రత్యక్షపరచబడెను. మనము దేవుని ప్రేమించితిమని కాదు, (అది గొప్ప విషయం కాదు, ఎందుకంటే దేవుడు ప్రేమకు యోగ్యుడు. ప్రతి ప్రాణి దేవుని ఎందుకు ప్రేమించకూడదో చెప్పడానికి కారణం ఏమీలేదు), తానే మనలను ప్రేమించి, మన పాపములకు ప్రాయశ్చిత్తమై యుండుటకు తన కుమారుని పంపెను; ఇందులో ప్రేమయున్నది."

మనం దేవుని ప్రేమించామని కాదు, దేవుడే మనలను ప్రేమించాడు. ఇది అమోఘమైన సత్యం. తన కుమారుడైన యేసుక్రీస్తు ప్రభువును మనకోసం మరణించేందుకు పంపడంలోనే దేవుని ప్రేమ వెల్లడయింది. అనేకులు తమ పాపాలను తమంతట తాము శుద్ధీకరించుకోగలమన్న ఆశతో ఎంతో పోరాడుతూ, పశ్చాత్తాముతో ప్రయాసపడుతూ, ఉపవాసముంటూ, చిత్రహింసలకు గురవుతూ, ధర్మశాస్త్ర విధులను పాటిస్తూ ఉంటారు. అనేకులు తమ పాపాన్ని వదిలించుకొని దేవునిచేత అంగీకరించబడాలన్న ఆశతో తమను తాము నీతిమంతులుగా చేసుకోవడానికి విశ్వప్రయత్నాలు చేస్తున్నారు.

నేనొక మాట చెప్పనా, ఇది చాలా ఘనమైన పనే కాని, అది నిన్ను ఎప్పటికీ పరలోకానికి తీసుకెళ్లదు. పరిశుద్ధుడైన దేవుణ్ణి మెప్పించగలిగేంత మంచివాళ్లనుగా మనల్ని మనం ఎప్పటికీ మార్చుకోలేం. ఉన్నతుడు మహోన్నతుడగువాని ఆమోదాన్ని పొందగలిగేంతగా మనల్ని మనం ఎప్పటికీ శుద్ధి చేసుకోలేం. మనం పుట్టినప్పటినుంచి చనిపోయేవరకు దేవుడు మననుంచి పాపరహితమైన పరిపూర్ణతను కోరుకుంటాడు, అయితే అలా వుండటం ఎవరికీ సాధ్యం కాదు. అందుకే, దేవుని మహా గొప్ప ప్రేమను గురించి బైబిల్ చెప్పే మాటలు చూస్తే ఎంతో ఆశ్చర్యం కలుగుతుంది.

దేవుడు తన కుమారుడైన యేసుక్రీస్తు ప్రభువును నీ పాపాలకోసం

మరణించడానికి పంపాడు. నీ పాపాలన్నిటినీ నీవు వదిలించుకున్న తరువాత కాదు, నీవింకా పాపిగా ఉన్నప్పుడే ఆయన నీకోసం వచ్చాడు. క్రీస్తు పాపుల కోసం మరణించాడు. పాపపు శిక్షను చెల్లించడానికి ఆయన మరణించాడు. ఆయన పాపాలను క్షమిస్తాడు. ఆయన పాపులను రక్షిస్తాడు.

నాలుగవది, దేవుని ప్రేమ తనను ప్రేమించేవారిని మిక్కుటమైన ప్రేమతో ప్రేమించడంలో వెల్లడి అవుతుంది.

దేవుని ప్రేమకు స్పందించి, ఆయనను తిరిగి ప్రేమించేవారు ఆయననుంచి ఇప్పుడును, నిత్యత్వంలోను సమస్తమును ఉచితముగా పొందుతారు. "మనము దేవుని పిల్లలమని పిలువబడునట్లు తండ్రి మనకెట్టి ప్రేమ ననుగ్రహించెనో చూడుడి; మనము దేవుని పిల్లలమే. ఈ హేతువుచేత లోకము మనలను ఎరుగదు, ఏల యనగా అది ఆయనను ఎరుగలేదు." (1 యోహాను 3:1). ఆహా, దేవుని బిడ్డగా పిలువబడటం కంటే మించి, ఒక మానవమాత్రుడు తెలుసుకోగలగటం కంటే మించిన గొప్ప ప్రేమ ఏముంటుంది?

1 యోహాను 2:1 లో బైబిల్ ఇలా సెలవిస్తుంది. "నా చిన్నపిల్లలారా, మీరు పాపము చేయకుండుటకై యీ సంగతులను మీకు వ్రాయుచున్నాను. ఎవడైనను పాపము చేసినయెడల నీతిమంతుడైన యేసుక్రీస్తు అను ఉత్తరవాది తండ్రియొద్ద మనకున్నాడు"

రక్షణపొందిన, తిరిగి జన్మించిన ఒక దేవుని బిడ్డగా నాకోసం, స్వయంగా యేసుక్రీస్తు ప్రభువు తండ్రి కుడివైపున ఉండి, ఉత్తరవాదిగా దేవుని సింహాసనం ఎదుట నా తరఫున వాదిస్తున్నాడు.

ఎఫెసీ 2:4-7 వచనాలలో బైబిల్ ఈ మాటలు చెప్పున్నది: "అయినను దేవుడు కరుణాసంపన్నుడై యుండి, మనము మన అపరాధములచేత చచ్చినవారమై యుండినప్పుడు సయితము మనయెడల చూపిన తన మహా ప్రేమచేత మనలను క్రీస్తుతో కూడ బ్రదికించెను. కృపచేత మీరు రక్షింపబడియున్నారు. క్రీస్తుయేసునందు ఆయన మనకు చేసిన ఉపకారముద్వారా అత్యధికమైన తన కృపా మహదైశ్వర్యమును రాబోవు యుగములలో కనుపరచునిమిత్తము, క్రీస్తుయేసునందు మనలను ఆయనతోకూడ లేపి, పరలోకమందు ఆయనతోకూడ కూర్చుండబెట్టెను."

ఆహా, దీనిగురించి ఇప్పుడే కాదు, నిత్యత్వమంతా ఆలోచిస్తూ ఉండండి. దేవుని ప్రేమను స్వీకరించి, ఆయనయందు నమ్మికయుంచిన ప్రతి స్త్రీ, ప్రతి

పురుషుని ఆత్మను రక్షించాడు అనే వాస్తవమందు దేవుని ప్రేమ వెల్లడి అవుతోంది.

"యేసు ఒకడు నన్ను ప్రేమించిన యెడల వాడు నా మాట గైకొనును, అప్పుడు నా తండ్రి వానిని ప్రేమించును, మేము వాని యొద్దకువచ్చి వానియొద్ద నివాసము చేతుము" అని యోహాను 14:23లో చెప్పాడు.

దేవుడు ప్రేమ. ఆయన నిన్ను ప్రేమిస్తున్నాడు. లోకసంబంధమైన దీవెనలు నీకు ఇవ్వడం ద్వారా, తన దీర్ఘశాంతము, కనికరముల ద్వారా, నీ పాపాల కోసం మరణించడానికి తన కుమారుడైన యేసుక్రీస్తును పంపించడం ద్వారా దేవుడు తన ప్రేమను నిరూపించుకున్నాడు. నీవు ఆయన ప్రేమకు స్పందించి, ఆయన కుమారుణ్ణి నీ రక్షకునిగా స్వీకరించినట్లయితే, ఆయన తన మిక్కుటమైన ప్రేమతో సదాకాలము నిన్ను ప్రేమిస్తాడు. దేవుని ప్రేమ చివరికి ఆయనను ప్రేమించేవారు, ప్రేమించనివారి మధ్యనే బలవంతంగా ఒక ఎంపిక చేయవలసి వచ్చింది. ఆయనను ప్రేమించేవారికి పరిపూర్ణ శాంతిని అనుగ్రహిస్తానని దేవుడు వాగ్దానం చేసాడు. అయితే ఆయనను ప్రేమించనివారినుంచి వీరిని వేరుచేయడం ద్వారానే ఆయన ఈ పనిచేయగలడు. ఈ వేర్పాటు, దేవుని ప్రేమించనివారికి పూర్తి వినాశనంగా పరిణమిస్తుంది.

దేవుని తీర్పులు ఎంత న్యాయమైనవో ఆయన ప్రేమకూడా అంతే నిష్పక్షపాతంగా ఉంటుంది. అయితే, దాని స్థాయిలో వ్యత్యాసం ఉంటుంది. తన అద్వితీయ కుమారుడే ఆయన ప్రత్యేక ప్రేమకు పాత్రుడు. యేసుక్రీస్తునందు విశ్వాసము, నమ్మిక ఉంచి దేవుని బిడ్డలుగా మారినవారు కూడా దేవుని ప్రత్యేక ప్రేమకు పాత్రులవుతారు. దేవుని ఆశ్చర్యమైన ఈ ప్రేమే ఆయనను ఏ ఇతర దేవత, విగ్రహం, మనిషి, లేక మతనాయకుల కన్నా ప్రత్యేకంగా నిలుపుతుంది. దేవుడు ప్రేమయై యున్నాడు.

దేవుడు నిన్ను ప్రేమిస్తున్నాడు. నీవు ఆయనను ప్రేమిస్తున్నావా? నీవు ఆయను ప్రేమించినట్లయితే, నీవు ఆయనతో నేడు, రేపు, మరునాడు, సదాకాలము ఉండాలని ఆశపడతావు. అలా చేయగలిగే మార్గం నీకు ఒక్కటే ఉంది. దేవుడే ఆ మార్గం ఏర్పరచాడు. నీవు ఆ మార్గాన్ని కనుగొనాల్సిన పనిలేదు. నీ పాపశిక్షను భరించి, నీకోసం శ్రమపడి, రక్తం కార్చి, సిలువపై మరణించడం కోసం దేవుడు తన కుమారుడైన యేసుక్రీస్తు ప్రభువును ఈలోకానికి పంపించాడు. ఆయన మరణించి, సమాధిచేయబడ్డాడు, కాని మూడు పగళ్లు, మూడు రాత్రుల అనంతరం మరణాన్ని జయించి, పాపాన్ని ఓడించి విజయోత్సవంతో యేసుక్రీస్తు

ప్రభువు మృతులలోనుండి లేచాడు. నేడు ఆయన సజీవంగా ఉన్నాడు. పరలోక మహిమలో ఆయన తన తండ్రి కుడి పార్శ్వాన ఆసీనుడైయున్నాడు. నీ ప్రార్థన వినడానికి ఆయన ఇప్పుడు సిద్ధంగా ఉన్నాడు. నీవు ఆయన యొద్దకు వచ్చి, ఆయన నీ పాపాల కోసం మరణించి, మృతులలోనుండి తిరిగిలేచాడని నీవు నమ్ముతున్నావని ఆయనకు చెపితే వినాలని ఆయన నీకోసం ఎదురుచూస్తున్నాడు. నీ పాపాలను క్షమించి, నీ ఆత్మను రక్షించి, సదాకాలము ఆయనను నీ ప్రభువుగా ఉండుమని అడుగుతావని నీకోసం ఎదురుచూస్తున్నాడు.

నీవు చేయగలిగిన అత్యంత ప్రాముఖ్యమైన పని అదే. నిన్ను ప్రేమించే దేవుని విషయమై నీవు ఏం చేస్తావో అన్నదే, నిన్ను ప్రేమించే దేవుడు నిన్ను ఏం చేస్తాడో అనేదాన్ని నిర్ధారిస్తుంది. ఆయన నిన్ను పరలోకంలోకి రానిస్తాడా, లేక నరకంలోనికి త్రోసివేస్తాడా? పరలోకానికి ఉన్న ఏకైక మార్గం యేసుక్రీస్తు నందలి విశ్వాసం ద్వారానే.

# దేవుని విశ్వసనీయత

ఈ పాఠంలో మేము దేవుని విశ్వసనీయత గురించి చర్చించాలనుకుంటున్నాం. ఇదే అంశంపై క్రైస్తవ విశ్వాసంలో మనకు ఎన్నో అద్భుతమైన పాటలున్నాయి:

"జీసస్, జీసస్, హౌ ఐ ట్రస్ట్ హిమ్,
హౌ ఐ హేవ్ ప్రూవ్డ్ హిమ్ ఓవర్ అండ్ ఓవర్!
జీసస్, జీసస్, ప్రెషియస్ జీసస్!
ఓ ఫర్ గ్రేస్ టు ట్రస్ట్ హిమ్ మోర్!"

"ట్రస్ట్ అండ్ ఒబే,
ఫర్ దేరీజ్ నో అదర్ వే
టు బి హ్యాపీ ఇన్ జీసస్,
బట్ టు ట్రస్ట్ అండ్ ఒబే."

యేసునందు నమ్మిక ఉంచినవారందరూ, తమ నమ్మకానికి ఆయన ఎంతో యోగ్యుడు అని కనుగొన్నారనే సత్యాన్ని అనేక గొప్ప క్రైస్తవ గీతాలు ప్రకటించాయి. దేవుణ్ణి నమ్మినందుకు బాధపడినవారు ఇంతవరకు ఎవ్వరూ లేరు. మనుష్యులు నిన్ను నిరాశపరుస్తారు – అది మీరు ఈపాటికే తెలుసుకున్నారు. వారిలో కొందరు భక్తిపరులున్నారు, కొందరు మంచివాళ్లయుంటారు, ఇతరులు మీ సొంతవాళ్లే అయ్యుంటారు, అయితే "ప్రతివాడును కేవలము వట్టి ఊపిరి వలె ఉన్నాడు" (కీర్తన 39:5). కేవలం దేవుడు మాత్రమే మన సంపూర్ణ నమ్మకానికి యోగ్యుడు.

మనం ప్రభువుని పూర్తిగా నమ్మడానికి ముందు ఆయన మనకు అనుగ్రహించిన ప్రత్యక్షతను పరిగణలోనికి తీసుకోవాలి. మొదటిగా, ఆయన వాగ్దానాలు నమ్మదగినవేనా? దేవుడు తన వాగ్దానాలను నెరవేర్చగలడా? వాగ్దానం చేయడం ఒక ఎత్తయితే, ఆ వాగ్దానాన్ని నెరవేర్చగలగడం మరొక ఎత్తు. నీవొక

పని చేయబోతున్నావని చెప్పడం వేరు; ఆ పనిని చేయడం వేరు. దేవుడు తన వాగ్దానాలను నెరవేర్చగలడా? మన సమస్త విషయాలలో ఆయనను పూర్తిగా నమ్మగలమా? లోకసంబంధమైన మన జీవితాలను, ఈ లోక ఆస్థిపాస్తులను, మన నిత్యత్వపు ఆత్మను పూర్తిగా ఆయన చేతుల్లో పెట్టగలమా? మనకెంతో ప్రియమైన ఆశలు, కోర్కెలన్నీ నెరవేరునట్లుగా, మన గమ్యాన్నిచేరునట్లుగా దేవుడు కార్యం చేయగలడా?

ఆయన మనోహరుడా, ప్రేమింపదగినవాడేనా? మనం సురక్షితంగా ఆయనను ప్రేమించవచ్చా? దేవుని పట్ల మన భావాలను వ్యక్తపరిచేందుకు "ఆరాధన" అనే పదం సరైన పదం కాదా? పూజించడం అంటే మన ఆరాధనను వ్యక్తపరచడమే. అయితే మనం నమ్మలేని వ్యక్తిని ఆరాధించలేం.

ఈ శీర్షిక క్రింద ఐదు అంశాలను, వాటికి సంబంధించిన లేఖన భాగాలను పరిగణలోనికి తీసుకోవాలనుకుంటున్నాం.

1. దేవుడు అద్భుతమైన వాగ్దానాలు ఎన్నో చేసాడు, అవన్నీ ఎంతో ఆలోచించే చేసాడు. వాటిలో ఏ ఒక్కటీ వీసమెత్తు కూడా విఫలం కావు.

ఈ వాగ్దానాలు, ఆలస్యం కావచ్చు, అయితే అది మనష్యుల దృష్టిలో ఆలస్యమే. గత పాఠాలలో ఒక విషయం మనం నేర్చుకున్నాం, అదేమిటంటే, ఆయన కాలము అనే నియమాన్ని అనుసరించి పనిచేసేవాడైనప్పటికీ, ఆయన కాలానికి బందీ కాదని, మరి ముఖ్యంగా, మనం అనుకున్న సమయానికి ఆ పనిచేయవలసిన అవసరం ఆయనకు లేదన్నదే ఆ విషయం. గనుక, మరొకసారి నన్ను ఈ మాటచెప్పనివ్వండి. దేవుడు ఎన్నో అద్భుత వాగ్దానాలు చేసాడు, అన్నీ ఆలోచించే చేసాడు, అవి నెరవేరడానికి ఆలస్యం అయినప్పటికీ, వాటిలో ఏ ఒక్కటీ వీసమెత్తుకూడా విఫలం కావు.

మీ పాత నిబంధనలోని ఐదవ గ్రంథంలో, మనకు ఈ మాటలు కనిపిస్తాయి: "కాబట్టి నీ దేవుడైన యెహోవా తానే దేవుడనియు, తన్ను ప్రేమించి తన ఆజ్ఞల ననుసరించి నడుచుకొనువారికి తన నిబంధనను స్థిరపరచువాడును వేయి తరములవరకు కృపచూపువాడును నమ్మతగిన దేవుడు ననియు, తన్ను ద్వేషించువారిలో ప్రతివానిని బహిరంగముగా నశింపచేయుటకు వానికి దండన విధించువాడనియు నీవు తెలిసికొనవలెను." (ద్వితీ. 7:9)

దేవుని గురించి బైబిల్ గ్రంథకర్త ఏమంటున్నాడో గమనించండి: ఆయన

నమ్మదగినవాడు. ఆయన అన్యాయస్తుడు కాదు. ఆయన దుష్టుడు కాదు. ఒకవేళ దేవుడు మాట్లాడితే, దేవుడు ఒక నిబంధన చేస్తే, ఏదైనా చేస్తానని దేవుడు వాగ్దానం చేస్తే, ఆయన తన మాట నిలబెట్టుకుంటాడు.

బైబిల్ మధ్యభాగంలో ఇలా చదువుతాం: "ఈ దేవుడు సదాకాలము మనకు దేవుడై యున్నాడు మరణము వరకు ఆయన మనలను నడిపించును." (కీర్తనలు 48:14). నీ జీవితాన్ని దేవునికి అప్పగించి, నీ జీవితంలో నిన్ను నడిపించి, నీకు మార్గనిర్దేశన చేసి, నిన్ను నడిపించాలని నీవు దేవున్ని నమ్మితే, నీవు పొరపాటు చేస్తున్నావా? లేదు, దేవుడు ఆ నమ్మకానికి యోగ్యుడు. ఆయన మన మరణ దినము వరకు, ఆ తర్వాత కూడా నడిపిస్తాడని, ఆయన సదాకాలము మన దేవుడై యుంటాడని కీర్తనాకారుడు చెప్తున్నాడు.

ఆయన నిబంధనలను వేయి తరాలవరకు స్థిరపరచేవాడని ద్వితీయోపదేశకాండములోను, సదాకాలము ఆయన నమ్మదగిన దేవుడుగా ఉంటాడని కీర్తనల గ్రంథంలోను మనం నేర్చుకున్నాం.

నూతన నిబంధనలో ఒక మహా అద్భుతమైన ప్రకటన ఉంది. "ఆ నిత్యజీవమును అబద్ధమాడనేరని దేవుడు అనాదికాలమందే వాగ్దానము చేసెను" (తీతు 1:2).

దేవుడు తన గురించి మనకు అందించిన రాతపూర్వకమైన ప్రత్యక్షతను (ఒక సున్నయైనను, పొల్లయినను తప్పుగా నిరూపితం కానిది) అనుసారంగా చూస్తే, దేవుడు అబద్ధమాడలేడు. ఆయన నీ నమ్మకానికి యోగ్యుడేనా? ఆయన నమ్మదగినవాడు అని నేను ఖచ్చితంగా విశ్వసిస్తాను.

ఈ వచనాన్ని వివరించే చక్కని విధానం ఇలా వుంది. నీవు పురుషుడవైయుండి, స్త్రీవి కాకపోయివుంటే (శారీరకంగా మాట్లాడుతున్నాం), నీవు ఒక పురుషుడిగా పిల్లలను కనలేవు. ఒక బిడ్డను నీ గర్భంలో ధరించే సామర్థ్యం నీకు లేదు. నీవొక బిడ్డను కనడం అనేది పూర్తిగా అసాధ్యం. అదేరీతిగా, దేవుడు అబద్ధం చెప్పలేడు. అలా చెప్పడానికి అవసరమైన తత్వం ఆయనలో లేదు. ఆయన పరిశుద్ధుడు. ఆయన సత్యవంతుడు. ఆయన అత్యంత నీతిమంతుడు. ఆయన అబద్ధం చెప్పలేడు.

2. ఎన్నో శతాబ్దాలు గడిచిన తరువాత కూడా దేవుని వాగ్దానాలు నెరవేర్చబడిన తీరుకు ఉదాహరణలు ఎన్నో చదవడం ఎంతో హాయిగా అనిపిస్తుంది. మనం

ఇప్పుడు చదువుకోబోతున్న కొన్ని వచనాలు ఆశీర్వాదానికి బదులు తీర్పును వాగ్దానం చేస్తున్నప్పటికీ, అవి మన హృదయాలకు ఆశీర్వాదరకంగానే ఉంటాయి, ఎందుకంటే, దేవుడు ఇచ్చిన మాట నిలబెట్టుకుంటాడు అని అవి మనకు బోధిస్తాయి.

ఉదాహరణకు, యెహెజ్కేలు 26:4-5 వచనాలలో ఇలా చదువుతాం. "వారు వచ్చి తూరుయొక్క ప్రాకారములను కూల్చి దాని కోటలను పడగొట్టుదురు, నేను దానిమీదనున్న మంటిని తుడిచి వేయుదును, దానిని వట్టిబండగా చేసెదను. సముద్రము దాని నావరించును, అది వలలు పరచుటకు చోటగును, నేనేమాట యిచ్చితిని, ఇదే ప్రభువగు యెహోవా వాక్కు అది జనములకు దోపుడు సొమ్మగును."

మరల, యెషయా 13:19-20 వచనాలలో ఇలా చూస్తాం: "అప్పుడు రాజ్యములకు భూషణమును కల్దీయులకు అతిశయాస్పదమును మాహాత్మ్యమునగు బబులోను దేవుడు పాడుచేసిన సొదొమ గొమొఱ్ఱాలవలెనగును. అది మరెన్నడును నివాసస్థలముగా నుండదు తరతరములకు దానిలో ఎవడును కాపురముండడు అరబీయులలో ఒకడైనను అక్కడ తన గుడారము వేయడు గొఱ్ఱలకాపరులు తమ మందలను అక్కడ పరుండ నియ్యరు."

ఈనాడు, ఈ మాటలు పలుకబడిన దాదాపుగా మూడువేల సంవత్సరాల తరువాత, తూరు అనే ప్రదేశంలో ప్రజలు తమ వలలు ఆరబెట్టుకుంటున్నారు. పురాతన బబులోను ఉన్న ఆ ప్రదేశంలో ఏ గొర్రెల కాపరీ తన గుడారాన్ని వేసుకోవడం లేదు. "అలా ఎందుకు?" అని మీరడగవచ్చు. ఎందుకంటే, అలా జరుగుతుందని దేవుడు చెప్పాడు కాబట్టి. ఒక విషయంలో ఇలా జరుగుతుంది అని దేవుడు చెప్పాడంటే, ఆ విషయంలో సరిగ్గా అలాగే జరిగితీరుతుంది. అది నెరవేరుతుంది. నీవు దేవుని నమ్మవచ్చు.

3. ఏ అత్యవసర పరిస్థితిలోనైనా తనను నమ్మినవారిని దేవుడు ఎన్నడూ మోసం చెయ్యలేదు. అలా ఎప్పటికీ చెయ్యడు, ఆయన ఇంకను దేవునిగానే ఉంటాడు. ఆయనను మనం రక్షణకోసం నమ్మవచ్చు, మనకు అవసరమైన ప్రతిదానికోసమూ నమ్మవచ్చు.

యెహోషువ గ్రంథంలో ఒక అద్భుతమైన వచనం కనిపిస్తుంది. "యెహోవా ఇశ్రాయేలీయులకు సెలవిచ్చిన మాటలన్నిటిలో ఏదియు తప్పియుండలేదు, అంతయు నెరవేరెను." (యెహోషువ 21:45). ఆహా, ఇది అద్భుతమైన వచనం కాదంటారా!

కీర్తనలు 27:10 లో లేఖనం ఇలా చెప్తున్నది: "నా తలిదండ్రులు నన్ను విడిచినప్పుడు, యెహోవా నన్ను చేరదీయును." మనకు పరలోకపు తండ్రిగా ఉంటానని ఆయన వాగ్దానం చేసాడు. తన హస్తాలతో మనలను మోస్తానని ఆయన వాగ్దానం చేసాడు (ద్వితీ. 33:27), పాలు తాగే బిడ్డను తల్లి గుర్తుంచుకొన్నట్లుగా ఆయన మనలను గుర్తుంచుకుంటానని వాగ్దానం చేసాడు (యెషయా 49:15). ఒక సహోదరునికంటె హత్తియుండు స్నేహితునిగా ఉంటానని ఆయన వాగ్దానం చేసాడు. ఆయన మనలను ఎన్నడూ విడువను ఎన్నడూ ఎడబాయను అని వాగ్దానం చేసాడు (హెబ్రీ 13:5).

ప్రపంచం నలుమూలలనుండి ప్రతి వారం మాకు వందలాది ఉత్తరాలు వస్తుంటాయి. వాటిలో అనేకం మా పుస్తకాలను ఎవరి ద్వారానో పొందినవారి నుంచే వస్తుంటాయి. ఇప్పుడు నేను ఎవరిని ఉద్దేశించి మాట్లాడుతున్నానో నాకు తెలియదు, కాని మతం అనేది ద్వేషాన్ని పెంచిపోషిస్తుందని నాకు ఖచ్చితంగా తెలుసు. బైబిలును విశ్వసించే క్రైస్తవ్యం ప్రేమను పెంచుతుంది, కానీ మతం ద్వేషాన్ని పెంచుతుంది. మీలో అనేకులు మతపరమైన ద్వేషాల మధ్య పెరిగారు. ఆ విషయం నాకెలా తెలుసో నేను చెప్తాను. ఒకవేళ మీరు యేసుక్రీస్తు ప్రభువును మీ సొంత రక్షకునిగా అంగీకరించవలసి వస్తే, బైబిల్ దేవుణ్ణి మీరు నమ్మి ఆయనను మీ దేవుడుగా చేసుకొని, ఆయన మీకు అందించే నిత్యజీవము అనే వరాన్ని మీరు స్వీకరించినట్లయితే, మీ నాన్న, మీ అమ్మ నిన్ను ఇంటినుంచి బయటికి గెంటేస్తారు.

కొన్ని ప్రాంతాలలో మీవాళ్లు నీకు దహనసంస్కారాలు/ సమాధికార్యక్రమాలు నిర్వహించవచ్చు. మీరు మీ గ్రామంనుంచి వెలివేయబడటమో, సామాజికంగా మీ స్థానాన్ని కోల్పోవడమో జరుగుతుంది. వేరేవాళ్లయితే, ఇప్పుడు మీరు తిరిగి జన్మించి, పరిశుద్ధ గ్రంథ కట్టడలను అనుసరించి జీవించడం ఆరంభించినట్లయితే, ప్రస్తుతం మీరు ఏ సంఘానికి హాజరవుతున్నారో ఆ సంఘంలోనే మీరు హింసలకు, వేధింపులకు గురయ్యే అవకాశం ఉంది. మీలో కొందరు మీకున్న ఆస్తులన్నిటినీ కోల్పోవచ్చు. నిజమైన క్రైస్తవునిగా మారినందుకు మీ ప్రాణాలను సహా కోల్పోయే ప్రమాదం ఏర్పడవచ్చు. ఇదంతా నాకు తెలుసు. ఇవన్నీ కూడా మతసంబంధమైన ఫలాలు. మతం చంపుతుంది! మతం ద్వేషిస్తుంది! మతం అపవాది సంబంధమైనది!

అయితే బైబిలును విశ్వసించే క్రైస్తవ్యంలో దేవుడు మానవుడిని ప్రేమిస్తాడు,

అతనికోసం ప్రాణమర్పించిన ప్రభువైన యేసుక్రీస్తు వద్దకు ప్రేమతో ఆకర్షించి నీవు రక్షణపొందేలా చేయడం జరుగుతుంది. బైబిలును విశ్వసించే క్రైస్తవ్యం అంటే, నీవు దేవునికి మొర్రపెట్టినప్పుడు, దేవుడు తన ప్రేమను బట్టి నీ పాపాలను క్షమించి, నిన్ను తన బిడ్డగా చేసుకోవడం జరుగుతుంది.

నీవు యేసుక్రీస్తు ప్రభువును నమ్మితే, కీర్తన 27:10 లోని అందమైన వాగ్దానం నీ సొంతమవుతుంది. నీవు దేవుని నమ్మి, నీ రక్షణకోసం ఆయన కుమారునియందు విశ్వాసముంచినందుకు, ఒకవేళ మీ నాన్న నిన్ను వదిలేసినా, మీ అమ్మ నిన్ను విడిచిపెట్టినా, ప్రభువు నిన్ను చేరదీస్తాడు. ఆయన నీకు తండ్రిగా ఉంటాడు. ఆయన నీ తల్లికంటే ఎక్కువగా నిన్ను చేరదీస్తాడు. ఒక సహోదరుడు, ఒక స్నేహితుని కంటె ఆయన ఎక్కువే. ఆయనే నీకు సర్వస్వం అవుతాడు.

నీ గురించి శ్రద్ధవహించేలా నీవు దేవుణ్ణి నమ్మవచ్చు. నిన్ను ప్రేమించి, కాపాడి, నిన్ను భద్రపరచి, నిన్ను దీవించడం కోసం నీవు దేవుణ్ణి నమ్మవచ్చు.

ఫిలిప్పీ 4:19 లో, నీ ఆత్మను రక్షించడానికి మాత్రమే కాదు, యేసుక్రీస్తు ద్వారా నీ ప్రతి అవసరం తీర్చబడడానికి కూడా నీవు దేవుని నమ్మవచ్చు అని చూస్తున్నాం. ఆ అద్భుత వచనం ఇలా సెలవిస్తుంది. "కాగా దేవుడు తన ఐశ్వర్యము చొప్పున క్రీస్తుయేసునందు మహిమలో మీ ప్రతి అవసరమును తీర్చును."

ఆయన ఐశ్వరాన్ని బట్టే దేవుడు నీ అవసరాలు తీరుస్తాడు. నీ అవసరాలు తీరే మార్గం మరొకటి నీకు కనిపించకపోవచ్చు, అయితే దేవుని తెలుసుకొని, ఆయనవైపు చూచి, ఆయనను నమ్ముకోవడం ఎంతో అద్భుతం, ఎందుకంటే, ఆయన ఐశ్వర్యం అనంతమైనది. ఆయన భూమ్యాకాశములను తన చేతులలో పట్టుకొని ఉన్నాడు. దేవునికి ఏ కొరత లేదు. నీవు ఆయనను నమ్మవచ్చు.

4. న్యాయమైన ప్రతి కోరిక తీరాలని, మనము సర్వోత్తమంగా, శాశ్వతంగా సంతోషించాలన్నది మనపట్ల దేవుని ఉద్దేశము, ప్రణాళికగా ఉన్నది.

ఇదే తలంపును వెల్లడించే అనేక వచనాలను నేను మీకోసం ప్రస్తావించాలనుకుంటున్నాను:

''జీవమార్గమును నీవు నాకు తెలియజేసెదవు నీ సన్నిధిని సంపూర్ణసంతోషము కలదు నీ కుడిచేతిలో నిత్యము సుఖములుకలవు." (కీర్తనలు 16:11)

"నేనైతే నీతిగలవాడనై నీ ముఖదర్శనము చేసెదను నేను మేల్కొనునప్పుడు నీ స్వరూపదర్శనముతోనా ఆశను తీర్చుకొందును." (కీర్తనలు 17:15)

"వాడు యెహోవావలన ఆశీర్వాదము నొందును తన రక్షకుడైన దేవునివలన నీతిమత్త్వము నొందును." (కీర్తనలు 24:5)

"దేవా, నీ కృప యెంత అమూల్యమైనది, అందుకే నరులు నీ రెక్కల నీడను ఆశ్రయించుచున్నారు. నీ మందిరముయొక్క సమృద్ధివలన వారు సంతృప్తి నొందుచున్నారు. నీ ఆనంద ప్రవాహములోనిది నీవు వారికి త్రాగించుచున్నావు." (కీర్తనలు 36:7-8). ఎవరు వీళ్లు. 7వ వచనాన్ని మరల చదువుదాం. "దేవా, నీ కృప యెంత అమూల్యమైనది... అందుకే నరులు నీ రెక్కల నీడను ఆశ్రయించుచున్నారు." నీవు దేవుని నమ్మగలవా? నీవు దేవుని నమ్ముకుంటావా? తల్లి కోడి రెక్కలక్రింద వెచ్చదనాన్ని భద్రతను అనుభవించడానికి పరుగున వచ్చే కోడి పిల్లలా నీవు దేవునియొద్దకు రాగలవా? సర్వశక్తుడైన దేవుని రెక్కల నీడను నీవు ఆశ్రయించగలవా? నీవు ఆయన యందు విశ్రమించి, ఆయనలో నిలిచివుండగలవా?

లోకం నీకు ఏమి ఇవ్వగలదు? మీలో కొందరు ఎన్నడూ క్రైస్తవులుగా మారలేదు. మీరు యేసుక్రీస్తును తిరస్కరించారు. ఏదో ఒక చిన్న అలవాటును, ఓ చిన్న సుఖాన్ని, చిన్న పనిని వదులుకోవడం ఇష్టం లేక నీవు ఆయనను త్రిప్పి పంపించావు.

నీవు మోసపోయావు. నీవు పొరబాటు చేసావని ఏమాత్రం సంకోచం లేకుండా చెప్పగలను. దేవుడు నీకు సంపూర్ణమైన ఆశీర్వాదాన్ని, నిత్యసుఖాన్ని, సంపూర్ణ శాంతిని, సంపూర్ణ సంతోషాలను, సంపూర్ణ సంతృప్తిని అనుగ్రహిస్తాడు. ఈ లోకంలో నీవు ఎన్ని పనులు చేసినా, ఎన్ని వస్తువులు కలిగివున్నా, ఎన్ని సుఖాలను అనుభవించినా, నీకు ఆలాంటి సంతృప్తిని కలిగించలేదని నీకు తెలుసు. వస్తువులు ఎన్నడూ తృప్తిపరచలేవు. ఆహా, దేవుడు నిన్ను ఎంతగా దీవించాలనుకుంటున్నాడో, కేవలం నీవు ఆయనను నమ్మితే చాలు.

దేవునియందు నమ్మిక ఉంచినవారికి ఆయన చేసిన మరొక గంభీరమైన వాగ్దానం చూడండి. "ఆయన వారి కన్నుల ప్రతి బాష్పబిందువును తుడిచివేయును, మరణము ఇక ఉండదు, దుఃఖమైనను ఏడ్పైనను వేదనయైనను ఇక ఉండదు, మొదటి సంగతులు గతించి పోయెనని సింహాసనములోనుండి వచ్చిన గొప్ప స్వరము చెప్పుట వింటిని."

అదీ, నా భవిష్యత్తు. ఇది నీ భవిష్యత్ కూడానా? నన్ను మరల చెప్పనివ్వండి. మనపట్ల దేవుని ప్రణాళిక, ఉద్దేశము ఏమంటే, న్యాయమైన ప్రతి కోరిక నెరవేర్చబడాలి, మనము సర్వోత్తమంగాను, శాశ్వతంగాను సంతోషంగా ఉండాలి అన్నదే. మనం దేవుని నమ్మగలిగితే చాలు, ఆయన ఇదంతా నెరవేరుస్తాడు.

5. ఆయనను బాగా ఎరిగినవారికి, ఆయన పదివేలలో ప్రముఖుడుగాను, అతి కాంక్షణీయుడుగాను ఉంటాడు. ఈ మాటలు మీరు చదవాలని నాకోరిక. అవి పరమగీతములు 5వ అధ్యాయంలో ఉన్నాయి. మొదటిగా 10వ వచనం చూడండి: "నా ప్రియుడు ధవళవర్ణుడు, రత్నవర్ణుడు, పదివేలమంది పురుషులలో అతని గుర్తింపవచ్చును." ఇప్పుడు అదే అధ్యాయంలో 16వ వచనం చూడండి. "అతని నోరు అతి మధురము. అతడు అతి కాంక్షణీయుడు. యెరూషలేము కుమార్తెలారా, ఇతడే నా ప్రియుడు ఇతడే నా స్నేహితుడు."

అవును, అతడు అతి కాంక్షణీయుడు. నీవు దేవుణ్ణి ఎంతగా నమ్మితే, ఎంతగా నీవు ఆయన మాటపై నమ్మకం ఉంచితే, అంతగా ఆయన నీకు అతి కాంక్షణీయుడుగా కనబడతాడు.

నీవొక పనిచేయాలని నేను నిన్ను అడగబోతున్నాను. నీ సంశయాలను, సందేహాలను ప్రక్కనపెట్టి, నీ హృదయపూర్వకంగా నీవు దేవుని నమ్మగలవా? ఆయన నీ నమ్మకానికి పాత్రుడా కాదా అని తెలుసుకునేందుకు నీవు ప్రయత్నించవా?

ఒకసారి ఒకతను ఓ పెద్దావిడ చేతిలో ఉన్న బైబిల్‌ని తీసుకున్నాడు. అందులో ఉన్న వందలాది వచనాల ప్రక్కన రెండు అక్షరాలు రాసి వుండటం అతడు గమనించాడు. అనేక వచనాల ప్రక్కన "టి" అనే అక్షరాన్ని రాసుకుంది. మరికొన్ని వచనాల దగ్గర ఆ "టి" ప్రక్కన "పి" అని రాసుకుంది. బైబిల్ అంతటా రాసివున్న ఆ రెండు అక్షరాలకు అర్థం ఏమిటి అని ఎవరో ఆమెను అడిగారు. దానికి ఆమె ఇలా బదులిచ్చింది, "బైబిల్‌లో ఏదైన వచనాన్ని నేను చూచినప్పుడు, అది నాకు అవసరమైనది అనిపిస్తే, నేను దేవుని వద్దకు వెళ్లి ప్రార్థన చేస్తాను. ఆ లేఖనభాగంలో ఉన్న వాగ్దానాన్ని దేవుడు నెరవేర్చాలని దేవున్ని నమ్ముతాను. అలా చేశాక, ఆ వచనం ప్రక్కనే "టి" అని రాస్తాను. దానర్థం నేను "పరిశోధించాను" (ట్రైడ్) అని.

అనేకసార్లు, కొన్నిరోజులలోపే, నా కలం తీసుకొని, ఆ "టి" ప్రక్కనే "పి" అనే అక్షరం రాయగలుగుతాను. 'టి' అంటే 'పరిశోధించాను' అని, 'పి' అంటే

(ప్రూవెన్) 'ఋజువయ్యింది' అని అర్థం. నేను నా దేవుణ్ణి 'పరిశోధించాను', ఆయన సత్యవంతుడని తానే 'ఋజువుపరచుకున్నాడు.'

ప్రతి సందర్భంలో మానవులు దేవుని మంచితనాన్ని ప్రశ్నిస్తూనే ఉంటారు. అలాంటివాళ్లందరికీ నిజంగా అవసరమైంది ఏమిటి అంటే, ఆయన్ని తెలుసుకోవడమే. దేవుని వ్యక్తిగతంగా ఎరిగినవారందరు ఆయన్ని బాహాటంగానే స్తుతిస్తారు. దేవుణ్ణి సంపూర్ణంగా నమ్మి, తీవ్రమైన కష్టాలమధ్య ఆయన వాగ్దానాలపై ఆధారపడుతూ ఉండేవాళ్ల మనమధ్యనే ఎంతోమంది జీవిస్తున్నారు, వారి సాక్ష్యాన్ని మనం పట్టించుకోకుండ ఉండలేం. దేవుడు నిజమైనవాడు అన్నదే వారి సాక్ష్యం. దేవుడు నీతిమంతుడు. దేవుడు మన విశ్వాసమునకు పాత్రుడు.

కొన్నిసార్లు దేవుడు తన హతసాక్షుల విషయంలో చేసినట్లుగా, భౌతిక శ్రమనుంచి, లేక మరణం నుంచి తప్పించడు, కానీ, అలాంటి శ్రమలు అనుభవించినవాళ్లందరూ అంగీకరించే ఒక విషయం ఉంది. ఎంతో మహాశ్రమల గుండా వెళ్తున్నప్పటికీ దేవుని మహాకృపవారికి తోడుగా ఉండి, ఆ శ్రమలే వారికి దీవెనలుగా మారిడి తమ విమోచకునితో సహవాసం చెయ్యగలిగిన గొప్ప అనుభూతి చెందినట్లుగా వారందరూ సాక్ష్యమిస్తారు.

ఒక మనిషిని, మతనాయకుణ్ణి, ఒక బోధకుణ్ణి లేక ఉపదేశకుణ్ణి నమ్ముమని దేవుడు నిను అడగటం లేదు. వీళ్లందరు మనలాంటి బలహీనులు, దుర్బలులే. లేదు, ప్రియ పాఠకా, స్వయంగా తననే నమ్ముమని దేవుడు నిన్నడుగుతున్నాడు. ఆయన అబద్ధమాడలేడు. ఆయన తన నిబంధనలు స్థిరపరుస్తాడు. ఏది చేస్తానని చెప్పాడో అది ఆయన తప్పకుండ చేస్తాడు.

నమ్మదగినవానిని నమ్ముమని మాత్రమేకాదు, అన్నిటికంటే సులభమైన అతి చిన్న పని చేయుమని దేవుడు నిన్ను అడుగుతున్నాడు.

దేవుడు నిన్ను తనకోసం పనిచేయమని అడగటం లేదు. విశ్వాసిగా మారాక ఆయనకోసం పనిచేయడమే నీకు మహా ఆనందమనిపిస్తుంది, అది వేరే విషయం.

దేవుడు నిన్ను బహుమానాలివ్వమని, తన సేవకు కానుకలు ఇవ్వమని అడగటం లేదు. అయినా, ఒకసారి ఆయనను తెలుసుకున్నాక, ఆయన సేవకు ఎప్పుడెప్పుడు ఇద్దామా అని ఆరాటపడతావనుకోండి.

నీ సొంత జీవితాన్ని మార్చుకోమని ఆయన నిన్ను అడగటం లేదు. తన గొప్ప శక్తిచేత నిన్ను పూర్తిగా ఆయనే మార్చేస్తాడు.

వాగ్దానాలు చేయడం ఒక ఎత్తు, వాటిని నెరవేర్చగలగటం మరొక ఎత్తు.

నేనొకటి చేయబోతున్నాను అని చెప్పడం ఒక ఎత్తు, దాన్ని చేయడం పూర్తిగా మరొక విషయం.

దేవుడు తన వాగ్దానాలను నెరవేర్చగలడా? మన సమస్తమును ఆయనను నమ్మి అర్పించగలమా? మన జీవితాలను, ఈలోక ఆస్తులను, మన నిత్య ఆత్మలను పూర్తిగా ఆయన హస్తాలకు అప్పగించగలమా? మనకు ఎంతో ప్రీతిపాత్రమైన ఆశలు తీరునట్లుగా, దేవుడు మనల్ని గమ్యాన్ని చేర్చగలడా?

ఎన్నో ఏళ్లుగా క్రైస్తవ జీవితం జీవించిన నేను ఖచ్చితంగా చెప్పగలను, మన పరలోకపు తండ్రి తన మాటను పూర్తిగా నెరవేరుస్తాడని. ఆయన వాగ్దానాలన్నిటినీ, హాయిగా, సురక్షితంగా నమ్మవచ్చు.

ఈ ఆశీర్వాదాలన్నీ, నీవు చేయగలిగిన అతి స్వల్పమైన పనిద్వారానే వస్తాయి. దేవుడు నిన్ను అడిగిన అతి తేలికైన, అతి సామాన్యమైన పని – ఆయనను నమ్మడం. బైబిల్ ఇలా సెలవిస్తుంది: "ప్రభువైన యేసునందు విశ్వాసముంచుము, అప్పుడు నీవును నీ యింటివారును రక్షణపొందుదురు" (అపొ.కా. 16:31). ఆయన తన అద్వితీయకుమారునిగా పుట్టినవానియందు విశ్వాసముంచు ప్రతివాడును నశింపక నిత్యజీవము పొందునట్లు ఆయనను అనుగ్రహించెను" అని బైబిల్ చెప్తున్నది (యోహాను 3:16). "యేసు ప్రభువని నీ నోటితో ఒప్పుకొని, దేవుడు మృతులలోనుండి ఆయనను లేపెనని నీ హృదయమందు విశ్వసించిన యెడల, నీవు రక్షింపబడుదువు" అని బైబిలు చెప్తున్నది (రోమా 10:9).

నీవు పాపివి. నీవు రక్షణ పొందాలి. నీవు ఆయనయొద్దకు వచ్చి, నీ పాపాలను ఒప్పుకొని, నిన్ను రక్షించుమని ఆయనను వేడుకుంటే, ఆయన నిన్ను రక్షిస్తాడని దేవుడు తన వాక్యంలో చెప్పాడు.

నీవు ఆయనను విశ్వసిస్తావా? నీవు ఆయనను నమ్ముతావా? ఆయన మాత్రమే నీ నమ్మకానికి పాత్రుడు?

# దేవుని వాక్యం

## (మొదటి భాగం)

పాత, క్రొత్త నిబంధనలు రెండూ దేవుని వాక్యంగా కలిసే నిలబడతాయి, లేక పడిపోతాయి. క్రొత్త నిబంధనలో నమోదైన విషయాలను పాత నిబంధన ముందుగానే ప్రస్తావించగా, క్రొత్త నిబంధన తరచుగా పాత నిబంధనలోనుండి ఉటంకించడం పరిపాటి. గనుక పాతనిబంధన దేవుని వాక్యమని మనం రుజువుచేయగలిగితే, మన పని పూర్తయినట్లే.

ఇప్పుడు మన చేతిలో ఉన్నట్టే, యేసు, అపొస్తలులు పాతనిబంధనను కలగియుండి, దానిని చదువుకున్నారు, ఉపయోగించారు. లేఖనాల గురించి యేసు ఇచ్చిన సాక్ష్యం ఎంతో ప్రాముఖ్యమైనది కాగా, ఆయన పునరుత్థానం తరువాతి సాక్ష్యం మరిముఖ్యమైనది. ఈ అధ్యాయంలో మనం దాని గురించి అధ్యయనం చేద్దాం.

1. ప్రభువైన యేసుక్రీస్తు దేవుని వాక్యంగా బైబిల్లో నుంచి స్వేచ్ఛగా ఉటంకించారు, మరిముఖ్యంగా ఏ గ్రంథాలైతే అధికంగా ప్రశ్నించబడ్డాయో వాటిలోనుంచే ఆయన ఎక్కువగా ప్రస్తావించాడు. దీనికి నేను అనేక ఉదాహరణలిస్తాను.

మొదటిగా, యోహాను 3వ అధ్యాయంలో యేసు నీకొదెము అనే ఒక మతనాయకుడితో మాట్లాడుతున్నాడు. పరిసయ్యుల వర్గానికి చెందిన ఇతడు యేసును ప్రశ్నించడానికి రాత్రివేళ వచ్చాడు. 14, 15 వచనాలలో యేసు అతనితో ఇలా చెప్పాడు, "అరణ్యములో మోషే సర్పమును ఏలాగు ఎత్తెనో, ఆలాగే విశ్వసించు ప్రతివాడును నశింపక ఆయన ద్వారా నిత్యజీవము పొందునట్లు మనుష్యకుమారుడు ఎత్తబడవలెను."

ఇశ్రాయేలు ప్రజలు వాగ్దానదేశంలోనికి వెళ్లే మార్గంలో అరణ్యప్రాంతంలో సంచారం చేసిన వివరాలు మనకోసం సంఖ్యాకాండములో నమోదు చేయబడివున్నాయి. అయితే ఇది నిజమైన గ్రంథం కాదని పండితులు,

విమర్శకులు దాడిచేస్తుంటారు. ఇశ్రాయేలీయుల పాపాన్ని బట్టి దేవుడు తాపకరమైన సర్పాలను వారి మధ్యకు పంపగా, అవి ప్రజలను కాటువేసాయి. ఫలితంగా, ప్రజలు తండోపతండాలుగా అరణ్యంలో రాలిపోయారు.

దేవుడు మోషేతో మాట్లాడి ఒక ఇత్తడి సర్పాన్ని తీసుకొని ఒక స్తంబానికి కట్టి, పాము కాటుకు గురైనవాళ్లు దాన్ని చూడగలిగేలా ఆ స్తంబాన్ని గాల్లోకి ఎత్తుపట్టుకోమన్నాడు. ఎవరైతే ఆ సర్పాన్ని చూస్తారో వాళ్లు బ్రదుకుతారు. దేవుని ఆజ్ఞలకు విధేయతచూపేంతగా వారు ఆయనను విశ్వసించినప్పుడు వారు రక్షింపబడ్డారు.

స్తంబానికి కట్టిన పాము తనకు సాదృశ్యంగా ఉందని యోహాను 3 లో, ప్రభువైన యేసుక్రీస్తు బోధించాడు. మనుష్యులందరి కొరకు ఆయన మరణించబోతున్నాడని, పాపమనే సర్పం కాటుకు గురైన ఎవరైనా ఆయనవైపు చూస్తే చాలు బ్రదుకుతాడు అని ఆయన చెప్పాడు.

ఈవిషయాన్ని యేసుక్రీస్తు బోధించడం మాత్రమే కాక, ఆ విధంగా చేయడం ద్వారా పాతనిబంధనలోని సంఖ్యాకాండములోని విషయాలు సత్యము అని కూడా సాక్ష్యమిస్తున్నాడు. యేసు చెప్పిన మాటలను బట్టి అది నిజంగా, దేవుని వాక్యమే.

మత్తయి 22:30-32 లో మనమిలా చదువుతాం: "పునరుత్థానమందు ఎవరును పెండ్లిచేసికొనరు, పెండ్లి కియ్య బడరు్మ వారు పరలోకమందున్న దూతలవలె ఉందురు. మృతుల పునరుత్థానమునుగూర్చి- నేను అబ్రాహాము దేవుడను, ఇస్సాకు దేవుడను, యాకోబు దేవుడనై యున్నానని దేవుడు మీతో చెప్పినమాట మీరు చదువలేదా?"

అక్షరార్థంగా, భౌతిక, శారీరక పునరుత్థానాన్ని నమ్మనివాళ్లు ఉన్నారు. వారు పొరబడుతున్నారని యేసుక్రీస్తు ప్రభువు చెప్పాడు. నిజంగానే అక్షరార్థంగా, భౌతిక, శారీరక పునరుత్థానం ఉంటుందని, పునర్జన్మ కాదని, ఆత్మలలోకంలోనికి ఎక్కిపోవడం కాదని, తీర్పుదినాన దేవుని యెదుర్కొనేందుకు శరీరంతో పునరుత్థానం చెందుతారని ఆయన చెప్పాడు.

యేసుక్రీస్తు ప్రభువు ఈ మాటలు చెప్పి, పాతనిబంధన లేఖనాలు నిజమని రుజువుపరచడమే కాదు, అలా చేయడం ద్వారా నిర్గమకాండము సత్యమని సాక్ష్యమిచ్చాడు.

అనేక శతాబ్దాలుగా, పండితులు విమర్శకులు బైబిల్లోని రెండవ గ్రంథమైన నిర్గమకాండంపై దాడిచేసారు. నిర్గమకాండంలో పస్కా పశువు గురించి, మన

రక్షణకోసం ప్రభువైన యేసుక్రీస్తు మరణించడానికి సాదృశ్యంగా ఆ పస్కాపశువు రక్తాన్ని చిందించడం గురించి చదువుకుంటాం (1కొరింథీ 5:7). ఇశ్రాయేలు ప్రజలు ఎర్రసముద్రాన్ని దాటిపోవడం గురించి చదువుతాం. ఇది మన బాప్తిస్మానికి గుర్తుగా ఉన్నది. (1కొరింథీ 10:1-4). దేవుడు తన ప్రజలకు ధర్మశాస్త్రాన్ని, కట్టడలను, ఆజ్ఞలను ఇవ్వడం గురించి మనం నిర్గమకాండంలో చదువుకుంటాం.

కాబట్టి, విమర్శకులు, సంశయవాదులు నిర్గమకాండం గ్రంథంపై దాడిచేస్తున్నప్పుడు వారు దానిలో ఉన్న గొప్ప సత్యాలను  చిన్నచూపు చూస్తున్నారు. కానీ, నా స్నేహితుడా, యేసు క్రీస్తు ప్రభువు నిర్గమకాండం నుంచి ఉటంకించడం ద్వారా, అది అప్పుడు, ఇప్పుడు ఎల్లప్పుడు పరిశుద్ధమైన పరిపూర్ణ దైవవాక్కు అని రుజువుచేసాడు. నీవు యేసయ్యను నమ్మితే, నిర్గమకాండాన్ని కూడా నమ్మాలి సుమా.

మత్తయి 19 లో, యేసు మరొకసారి పరిసయ్యుల భరతం పడుతున్నాడు. 3, 4 వచనాలను జాగ్రత్తగా గమనించండి. "పరిసయ్యులు ఆయనను శోధింప వలెనని ఆయనయొద్దకు వచ్చి ఏ హేతువుచేతనైనను పురుషుడు తన భార్యను విడనాడుట న్యాయమా? అని అడుగగా ఆయన-సృజించినవాడు ఆదినుండి వారిని పురుషునిగాను స్త్రీనిగాను సృజించెనని మీరు చదువలేదా? అనెను."

ఇక్కడ యేసు క్రీస్తు ప్రభువు పరిణామసిద్ధాంత అబద్ధమని నిరూపించడమే కాక, ఆదికాండము సత్యము అని సాక్ష్యమిస్తున్నాడు.

బైబిల్లో అతి తరచుగా దాడికి గురై, దూషించబడిన గ్రంథం ఆదికాండమే. అయితే యేసు అలా ఎన్నడూచేయలేదు. ప్రభువు మాటలను బట్టి, ఆదికాండము స్వచ్ఛమైన సంపూర్ణమైన దేవుని వాక్యం. భూమ్యాకాశములను, వాటియందలి సమస్తమును సృష్టించిన వివరాలతో కూడా తొలి అధ్యాయాలతో సహా ఆ గ్రంథాన్ని నమ్మాలి.

ఈనాడు మన ప్రపంచం దేవుణ్ణి ద్వేషించేవారితో నిండిపోయింది. మన సంఘాలు, సెమినరీల నిండా మతప్రభోదకులు, బోధకులు, వక్తలు, సేవకులు, ప్రవక్తలు, యాజకులు, సువార్తికులతో నిండిపోయాయి. వారు దేవుణ్ణి అబద్ధికునిగా పిలుస్తున్నారు.  ప్రియులారా, వీళ్లు ఆదికాండం గ్రంథంపై దాడిచేస్తున్నారు. అందులో ఉన్నదంతా అబద్ధమే అని వాళ్లంటున్నారు. అది కేవలం పుక్కిటి పురాణం అంటారు. అది కేవలం నీతి కథల సంపుటి మాత్రమే

నంటారు. అది మోషే ద్వారానో మరొకరి ద్వారానో కల్పించబడినది అని వాళ్లు దానిపై నిందలువేస్తారు.

అయితే, ఆదికాండము సత్యమని శరీరధారియైన దేవుడు, యేసు క్రీస్తు ప్రభువు చెప్పాడు. అది సరైనదని ఎంచి, తన కాలంలోని మతనాయకులు దానిని చదివి నమ్మనందుకు యేసు వారిని గద్దించాడు. మత్తయి 19:8లో ఆయన ఇంకా ఇలా అన్నారు. ''ఆయన మీ హృదయకాఠిన్యమునుబట్టి మీ భార్యలను విడనాడ మోషే సెలవిచ్చెను, గాని ఆదినుండి ఆలాగు జరుగలేదు."

ఆదికాండములోని సత్యానికి యేసు సాక్షిగా నిలిచాడు.

మత్తయి 12 లో, వాళ్లు మరలా వచ్చారు. (ఎప్పుడూ వాదిస్తూ, చర్చలకు దిగాలని చూసేవాళ్లుంటారు జాగ్రత్త!) 38-41 వచనాలు చూడండి: ''అప్పుడు శాస్త్రులలోను పరిసయ్యులలోను కొందరు-బోధకుడా, నీవలన ఒక సూచకక్రియ చూడగోరు చున్నామని ఆయనతో చెప్పగా ఆయన ఇట్లనెను. -వ్యభిచారులైన చెడ్డ తరమువారు సూచక క్రియను అడుగుచున్నారు. ప్రవక్తయైన యోనానుగూర్చిన సూచక క్రియయే గాని మరి ఏ సూచక క్రియయైనను వారికి అనుగ్రహింపబడదు. యోనా మూడు రాత్రింబగళ్లు తిమింగిలము కడుపులో ఏలాగుండెనో ఆలాగు మనుష్య కుమారుడు మూడు రాత్రింబగళ్లు భూగర్భములో ఉండును. నీనెవెవారు యోనా ప్రకటన విని మారుమనస్సు పొందిరి గనుక విమర్శ సమయమున నీనెవెవారు ఈ తరమువారితో నిలువబడి వారిమీద నేరస్థాపన చేతురు. ఇదిగో యోనాకంటె గొప్పవాడు ఇక్కడ ఉన్నాడు."

భక్తిహీనులు మీకు ఏమి చెప్తారో నాకు తెలుసు! ఒక తిమింగలం యోనాను మింగే అవకాశమే లేదు అని వాళ్లంటారు. యోనా గ్రంథం ఒక కథ, ఒక పురాణగాథ లేక కల్పితగాథ తప్ప మరేమీ కాదు అంటారు.

అది "అసాధ్యం" అని దారితప్పిన ఆదాము సంతానం అంటారు. కానీ, మిత్రమా, మనుష్యులకు అసాధ్యమైనవి దేవునికి సాధ్యమే. అవిధేయుడైన ప్రవక్తను క్రక్కివేయడం కోసమే దేవుడు ప్రత్యేకంగా సిద్ధపరచిన ఒక మహా మత్స్యము యోనాను మింగింది అని యోనా గ్రంథం మనకు బోధిస్తుంది. అది మహా మత్స్యము అని యేసుక్రీస్తు ప్రభువు చెప్పారు. అయితే యోనా గ్రంథం ఒక కల్పిత కథ లేక పురాణగాథ, లేక ఒక అబద్ధమని నీకు ఎవరు చెప్పారో నాకు తెలియదు గాని, నేను చెప్పేదేమిటంటే, ప్రభువైన యేసుక్రీస్తు యోనా గ్రంథాన్ని నమ్మాడు.

ఆదికాండం కాక, బైబిల్లోని మరే ఇతర గ్రంథం కూడా దానియేలు గ్రంథాన్ని

మించి దుర్వినియోగపరచబడలేదు. అయితే, యేసు ఎంత నిశ్చయంగా మాట్లాడుతున్నాడో మత్తయి 24:15-16 వచనాలను చూస్తే అర్థమవుతుంది: "కాబట్టి ప్రవక్తయైన దానియేలుద్వారా చెప్పబడిన నాశనకరమైన హేయవస్తువు పరిశుద్ధస్థలమందు నిలుచుట మీరు చూడగానే (చదువువాడు గ్రహించుగాక:) యూదయలో ఉండువారు కొండలకు పారిపోవలెను." రాబోయే మహా శ్రమల కాలంలో ప్రజల జీవితాలు దానియేలు గ్రంథాన్ని వారు నమ్మేదానిపై ఆధారపడివుంటాయి - ప్రభువు చెప్తున్న మాటలను బట్టి.

కాబట్టి, ఒకటవ పాయింట్‌ని మళ్లీ చెప్తాను: ప్రభువైన యేసుక్రీస్తు దేవుని వాక్యంగా బైబిల్లో నుంచి స్వేచ్ఛగా ఉటంకించారు, ముఖ్యంగా ఏ గ్రంథాలైతే అధికంగా ప్రశ్నించబడ్డాయో వాటిలోనుంచే ఆయన ఎక్కువగా ప్రస్తావించాడు.

2. పాత నిబంధన లేఖనాలలోని ప్రవచనాల ఆధారంగా తానే మెస్సీయనని యేసు ముందుగానే చెప్పాడు.

లూకా 24 లో ప్రభువైన యేసుక్రీస్తువారు ఎమ్మాయి మార్గంలో ఇద్దరు శిష్యులతో కలిసి నడుస్తున్నారు. ఈ శిష్యులు చాలా విచారంగా ఉన్నారు. వాళ్లు ఎందుకంత విచారంగా ఉన్నారో అని యేసు అడిగినప్పుడు, ఎవరినైతే తమ మెస్సీయగా ఉంటాడని ఆశించారో ఆయన సిలువవేయబడ్డాడు అని చెప్పారు. ఆ రోజు ఉదయాన్నే కొందరు సమాధి వద్దకు వెళ్లిన కొందరు సమాధి ఖాళీగా ఉన్నట్టు కనుగొన్నారని, యేసు దేహం అక్కడ లేదని వారు చెప్పారు. ఆయన దేహం ఏమైపోయిందో తెలియక మేము బాధపడ్డాం అని ఆ శిష్యులు ఆయనతో అన్నారు.

25-27 వచనాలలో ప్రభువు ప్రతిస్పందనను గమనించండి: "అందుకాయన- అవివేకులారా, ప్రవక్తలు చెప్పిన మాటలనన్నిటిని నమ్మని మందమతులారా, క్రీస్తు ఈలాగు శ్రమపడి తన మహిమలో ప్రవేశించుట అగత్యము కాదా అని వారితో చెప్పి మోషేయు సమస్త ప్రవక్తలును మొదలుకొని లేఖనములన్నిటిలో తన్నుగూర్చిన వచనముల భావము వారికి తెలిపెను."

బైబిల్ ప్రకారం చూస్తే, మోషేయు (బైబిల్‌లోని మొదటి ఐదు గ్రంథాలు - ఆదికాండము, నిర్గమకాండము, లేవీయకాండము, సంఖ్యాకాండము, ద్వితీయోపదేశకాండము) ప్రవక్తలందరు (పాతనిబంధనలోని యెహోషువ నుంచి మలాకీ వరకు) యేసుక్రీస్తు గురించే మాట్లాడుతున్నారు, రాస్తున్నారు, సాక్ష్యమిస్తున్నారు.

44వ వచనంలో మనమిలా చదువుతాం: "అంతట ఆయన-మోషే ధర్మశాస్త్రములోను ప్రవక్తల గ్రంథములలోను, కీర్తనలలోను నన్నుగూర్చి వ్రాయబడిన వన్నియు నెరవేరవలెనని నేను మీయొద్ద ఉండినప్పుడు మీతో చెప్పిన మాటలు నెరవేరినవని వారితో చెప్పెను." యేసు మాటలను బట్టి, మోషే ధర్మశాస్త్రము, కీర్తనలు, ప్రవక్తల రచనలు అన్నీ దైవావేశము వలన కలిగిన దేవుని వాక్యమని, అవి ప్రభువైన యేసుక్రీస్తువారి గూర్చి సాక్ష్యమిస్తున్నాయని అర్థమవుతోంది.

45, 46 వచనాలలో ఇలా ఉంది: "అప్పుడు వారు లేఖనములు గ్రహించునట్లుగా ఆయన వారి మనస్సును తెరచి- క్రీస్తు శ్రమపడి మూడవ దినమున మృతులలోనుండి లేచునని... చెప్పెను".

ఇదే సువార్త సందేశం- "నాకియ్యబడిన ఉపదేశమును మొదట మీకు అప్పగించితిని. అదేమనగా, లేఖనముల ప్రకారము క్రీస్తు మన పాపముల నిమిత్తము మృతిపొందెను, సమాధిచేయబడెను, లేఖనముల ప్రకారము మూడవ దినమున లేపబడెను." (1 కొరింథీ 15:3-4). ధర్మశాస్త్రము, ప్రవక్తలు, కీర్తనలు దేవుని వాక్యమని, వాటిని మనం విశ్వసించాలని ప్రభువైన యేసుక్రీస్తు చెప్పారు. తానే నిజముగా లోకరక్షకుడని, దేవుని కుమారుడని, తప్పిపోయిన పతనమైన మానవాళిని వెదకి రక్షించడానికి శరీరధారిగా వచ్చిన దేవుడనని యేసు నిరూపించదలచినప్పుడు, ఆయన కేవలం రాయబడిన దేవుని వాక్యాన్ని ఎత్తి చూపాడు.

ప్రియులారా, యేసు క్రీస్తును మీ వ్యక్తిగత రక్షకునిగా తెలుసుకోవాలని మీరు కోరితే, బైబిల్ తనగురించి తానే ఇలా చెప్తున్నది: "దేవుని కుమారుని నామమందు విశ్వాసముంచు మీరు నిత్యజీవముగలవారని తెలిసికొనునట్లు నేను ఈ సంగతు లను మీకు వ్రాయుచున్నాను." (1యోహాను 5:13). మనము దేవుని ఎరుగునట్లును, ఆయనను ఎరిగి నిత్యజీవము పొందునట్లును దేవుడు మనకు తన వాక్కును అనుగ్రహించాడు.

3. లేఖనాలలో ముందుగా చెప్పబడినవన్నీ నెరవేరుతాయని యేసు నొక్కివక్కాణించాడు. మత్తయి 5:17-18 వచనాలు చదువుదాం: "ధర్మశాస్త్రమునైనను ప్రవక్తల వచనములనైనను కొట్టి వేయవచ్చితినని తలంచవద్దు; నెరవేర్చుటకే గాని కొట్టివేయుటకు నేను రాలేదు. ఆకాశమును భూమియు గతించిపోయిననే గాని ధర్మశాస్త్రమంతయు నెరవేరువరకు దానినుండి

యొక పొల్లయినను ఒక సున్నయైనను తప్పి పోదని నిశ్చయముగా మీతో చెప్పుచున్నాను.”

దేవుడు పాపరహితుడు. దేవుడు పరిశుద్ధుడు. దేవుడు సత్యవంతుడు, నీతిమంతుడు. దేవుడు ఈ భూమిమీదికి వచ్చాడు. మాంసయుక్తమైన దేహంలో ఆయన ప్రత్యక్షమయ్యాడు. ధర్మశాస్త్రము, ప్రవక్తలు, కీర్తలు అను లేఖనాలు నిజం కాకపోతే, ప్రభువైన యేసుక్రీస్తువారు తన ఆమోద ముద్రను వాటిపై ఖచ్చితంగా వేసేవాడు కాదు అని గుర్తించడానికి ఒక మేథావి అవసరం లేదు కాని, ఒక యథార్థవంతుడు చాలు. యాజకులు చెడిపోయారు. యేసు వారిని ఖండించాడు. ఏర్పరచబడిన ప్రజలు దారి తప్పారు. యేసు వారి దోషాలను ఎత్తిచూపాడు. ధర్మశాస్త్రోపదేశకులు ప్రజలను తప్పు త్రోవ పట్టించారు. యేసు వారి దుర్మార్గాలను వివరించి చెప్పాడు. లేఖనాలు మనుష్యుల చేత మైలపరచబడి, చెడిపోయి వుంటే, ఆ విషయం ప్రభువు చెప్పివుండేవారు. అయితే, దేవుని వాక్యంలోనుంచి ఒక సున్నయైనను, పొల్లయినను తప్పిపోవాలంటే దానికి ముందు భూమి ఆకాశములు గతించిపోవాలని చెప్పాడు. వ్రాయబడిన లేఖనములు సరైనవి కాకపోతే, భూమి ఆకాశం గతించినప్పుడు కూడా వాటిని క్షేమంగా భద్రపరుస్తానని చెప్పివుండేవాడు కానేకాదు. దేవుని వాక్యము సరిగ్గా ఎలా వుండాలో అలాగే ఉన్నట్టు ప్రభువైన యేసుక్రీస్తువారు కనుగొన్నారు. అది సరిగ్గా ఏమి చెప్పవలసి వుందో అదే చెప్తున్నట్లు ఆయన కనుగొన్నారు. దేవుని వాక్యాన్ని నమ్మడం నీకు ఎంతైనా క్షేమం.

4. యేసు క్రొత్త ప్రవచనాలను కూడా ప్రకటించాడు. వాటిలో గంభీరమైన ప్రవచనం కొట్టొచ్చినట్లుగా నెరవేరింది. మార్కు 13:1-2 వచనాలు చూడండి. “ఆయన దేవాలయములోనుండి వెళ్లుచుండగా ఆయన శిష్యులలో ఒకడు-బోధకుడా, యీ రాళ్లేలాటివో యీ కట్టడములు ఏలాటివో చూడుమని ఆయనతో అనెను. అందుకు యేసు-ఈ గొప్ప కట్టడములు చూచుచున్నావే; రాతిమీద రాయి యొకటియైన ఇక్కడ నిలిచియుండకుండ పడద్రోయబడునని అతనితో చెప్పెను.”

ఆయన యెరూషలేము వెళతానని, అక్కడ ప్రధానయాజకుల చేతికి తాను అప్పగింపబడతానని, వారు ఆయనను చంపివేస్తారని ఆయన ప్రకటించాడు. ఆయన శ్రమపడి, రక్తము చిందించి, అత్యంత భయంకరమైన, హింసాత్మకమైన రోమా సిలువపై మరణిస్తానని చెప్పాడు. ఆయన దేహము ఒక సమాధిలో

మూడు పగళ్లు, మూడు రాత్రులు ఉంటుందని, ఆయన భూమికి మధ్యలో ఉంటాడని కూడా చెప్పాడు. తాను నిజంగా మృతులలోనుండి లేస్తాడని, పరలోకంలో ఉన్న తన తండ్రి కుడిపార్శ్వానికి ఆరోహణమై వెళ్లిపోతానని కూడా చెప్పాడు.

వీటన్నిటిని ఆయన అక్షరాలా నెరవేర్చాడు.

ఆయనయొద్దకు వచ్చి ఆయనను విశ్వసించినవారిని ప్రతి పాపమునుండి రక్షిస్తానని ఆయన ప్రకటించాడు. ఇది ఆయన ప్రతి రోజూ చేస్తూనే ఉన్నాడు.

ఆయన తిరిగి వస్తానని చెప్పాడు, నా స్నేహితులారా, పాత నిబంధన లేఖనాలు ఎంత నిశ్చయంగా నెరవేర్చబడ్డాయో, దేవుడు శరీరధారియై ఈలోకానికి మొట్టమొదటిసారి ఎలా వచ్చాడో, అంతే నిశ్చయంగా, ఆయన చెప్పినట్లు మరల వస్తాడు.

పాపానికి వెల చెల్లించడం కోసం మరణించేలా దేవుడు తన కుమారుణ్ణి ఈ లోకానికి పంపింది ఎంత నిశ్చయమో, నీవు ఆయనకు మొర్రపెడితే, ఆయన నీ పాపాలను క్షమించి, నిన్ను రక్షిస్తాడనేది కూడా అంతే నిశ్చయం.

5. యేసు భూమిమీద జీవించి ఉన్నప్పుడు ఆయన జ్ఞానం పరిమితమైనదని, కావున ఆయన సాక్ష్యానికి పెద్ద విలువ ఉండదని కొందరు భావించారు. అయితే ఆయన లేఖనాలను ఎంతో నిశ్చయంగా బలపరచింది తన పునరుత్థానం తరువాతనే గనుక, తన విజయమొందిన స్థితిలో ఆయనకు అనంత జ్ఞానం ఉందనడంలో ఎలాంటి వాదన లేదని ఘంటాపథంగా చెప్పవచ్చు.

పాత నిబంధన లేఖనాలు సత్యమని ఆయన పరిమిత జ్ఞానంతోనే చెప్పాడు (గతంలోమనం లూకా 24లో చదువుకున్నట్లుగా). ఆ లేఖనాలలోనుంచే తన్నుగూర్చిన సంగతులను ఆయన తన శిష్యులకు వివరించి చెప్పారు.

యేసు క్రీస్తు దైవత్వం, అనగా, యేసుక్రీస్తు ప్రభువు రూపంలో దేవుడు శరీరధారి అయ్యాడనే సత్యము, మరియు బైబిల్ దేవుని వాక్యము అనే వాస్తవము రెండూ కలిసి నిలబడతాయి లేదా కలిసి పడిపోతాయి. యేసుక్రీస్తు లేఖనాలను బలపరిచాడు; ఆయన రక్తమాంసాలతో ఉన్న దేవుడైతే, అదే లేఖనాల అధికారాన్ని స్థిరపరుస్తుంది. దేవుడు భూమిమీదికి వచ్చి, రాసివున్న లేఖనాలు తన వాక్కులు అని ప్రకటిస్తే, మానవమాత్రులమైన మనం దానికి భిన్నంగా బోధించడానికి ఎంత ధైర్యం ఉండాలి!

బైబిల్లో కొంతభాగాన్ని దేవుని వాక్యంగా అంగీకరించి, తక్కిన భాగాన్ని తిరస్కరించడానికి వీల్లేదు. అయితే బైబిల్ అంతా దేవుని వాక్యమైయుండాలి,

లేదా అందులో ఏదీ దేవుని వాక్యం కాదు. అది ఒకదానితో ఒకటి ఎంతలా మమేకమై వుంటుందంటే, ఒక భాగం మరొక భాగాన్ని బలపరుస్తూ ఉంటుంది. గనుక అది మొత్తం సమగ్రమైనది దానికి విచ్ఛిన్నం చేయలేము అని నిరూపిస్తుంది.

లేఖనాలకు ఏదైన కలపడం లేక దానినుంచి తీసివేయడం గురించి మనకు ఒక గంభీరమైన హెచ్చరిక చేయబడింది. తండ్రియైన దేవుడు మానవునితో మాట్లాడిన చివరి మాట వినండి: “ఈ గ్రంథమందున్న ప్రవచనవాక్యములను విను ప్రతి వానికి నేను సాక్ష్యమిచ్చునది ఏమనగా–ఎవడైనను వీటితో మరి ఏదైనను కలిపినయెడల, ఈ గ్రంథములో వ్రాయబడిన తెగుళ్లు దేవుడు వానికి కలుగజేయును; ఎవడైనను ఈ ప్రవచన గ్రంథమందున్న వాక్యములలో ఏదైనను తీసివేసినయెడల. దేవుడు ఈ గ్రంథములో వ్రాయబడిన జీవవృక్షములోను పరిశుద్ధపట్టణములోను వానికి పాలులేకుండ చేయును” (ప్రకటన 22:18–19).

ప్రియ పాఠకా, దేవుడు తన వాక్యాన్ని అంతగా గౌరవిస్తాడు. తన నామం కంటే ఉన్నతంగా తన వాక్యాన్ని ఆయన ఘనపరిచాడు (కీర్తన 138:2). దేవుడు తన వాక్యాన్ని లోకంలో అత్యున్నత స్థానానికి హెచ్చించాడు. నా స్నేహితుడా, నీవు దేవుని నమ్ముతూ తన వాక్యాన్ని నమ్మకపోవడం జరుగదు. యేసు క్రీస్తును నమ్మకుండా ఆయన వాక్యాన్ని విశ్వసించలేవు. ఎందుకంటే, తన కుమారుని గురించిన వివరాలు తెలిపే గ్రంథం ఇదే మరి.

తనను నమ్మమని దేవుడు నిన్ను అడుగుతున్నాడు. ఆయన నమ్మదగినవాడు. ఆయనను విశ్వసించుమని దేవుడు నిన్ను అడుగుతున్నాడు. తనయందు విశ్వాసాన్ని నమ్మకాన్ని పోగొట్టే పని ఆయన ఇంతవరకు ఎన్నడూ ఏమీ చేయలేదు. బైబిల్ దేవుడు సత్యవంతుడు దేవుని బైబిల్ సత్యము.

దేవుడు తన వాక్యమును నీకిచ్చాడు. నీవు పాపివని, అయినా నిన్ను ప్రేమిస్తున్నానని తన వాక్యంలో ఆయన నీకు చెప్పాడు. తన పరిశుద్ధతను, తన ప్రమాణాలను, అనగా సంపూర్ణంగా పాపములేని పరిపూర్ణుడు, అయినను, కృపా కనికరముల సంపన్నుడైన ఆయన పరిశుద్ధతను నీవు అతిక్రమించావని ప్రకటించాడు.

దేవునితో నీవు పరిపూర్ణమైన, దివ్యమైన సామరస్యంతో పరలోకంలో నివసించాలని ఆయన కోరుతున్నాడు. ఇప్పుడు నీ జీవితాన్ని నీవు అనుభవించాలని, సమాధికి ఆవల నీవు అనంతమైన నిత్యజీవాన్ని కలిగివుండాలని ఆయన కోరుకుంటున్నాడు.

పాపాన్ని బట్టి, నీ బలహీనతను బట్టి, నీ దుర్బలత, నీ పాపస్వభావాన్ని బట్టి నీవు ఎప్పటికీ పరలోకం చేరలేవని దేవునికి తెలుసు. ఆ ధన్యకరమైన ప్రదేశంలో ఏ పాపమూ ప్రవేశించలేదు. ఏ విధమైన బలహీనత, ఏ దోషము, ఏ అతిక్రమము కూడా పరలోకంలో ప్రవేశించలేదు. గనుక తన శరీరమందు సిలువపై నీ పాపాన్ని భరించడానికి దేవుడే మానవరూపం ధరించాడు. ఆయన శ్రమపడి, రక్తం చిందించి, మరణించి, తిరిగిలేచాడు. నీవు ఆయనయందు విశ్వాసముంచితే చాలు, నీకు అనంతమైన శాశ్వతజీవాన్ని ప్రసాదిస్తాడు.

నీ వ్యక్తిగత ప్రభువుగా, రక్షకునిగా ఆయనను నమ్మితే చాలు, ఆయన నీ పాపాలను క్షమించి, నీకు నిత్యజీవం అనుగ్రహిస్తాడు. నా స్నేహితుడా, ఆ వరాన్ని కొనలేవు. దాని వెల నీవు చెల్లించలేవు. దాన్ని నీవు సంపాదించలేవు. నీవు దానికి అర్హుడవు కావు. అది కృపామయుడు, ప్రేమామయుడు, కరుణాసంపన్నుడైన దేవుడు అనుగ్రహించే వరం. ఆయన నీకు శాశ్వతజీవాన్ని ప్రసాదించాలనుకుంటున్నాడు.

నిన్ను నీవు తగ్గించుకొని, ఆయనయొద్దకు వచ్చి, ఆయన ఇచ్చే గొప్ప వరాన్ని నీవు తీసుకుంటావా? దేవునితో యథార్థంగా ప్రవర్తిస్తే చాలు; ఎవరియొద్ద నుంచి అయినా నీవు అలాంటి గొప్ప బహుమానాన్ని ఆశించినప్పుడు వారితో నీవు ఎలా మాట్లాడతావో అలాగే మాట్లాడు. ఆయన నీ దేవుడని గుర్తుంచుకో. ఆయన నీ సృష్టికర్త. వినయముతో భయభక్తులతో ఆయన యొద్దకు వచ్చి, యధార్థమైన విశ్వాసంతో యేసుక్రీస్తు ప్రభువును నీ వ్యక్తిగత రక్షకునిగా నమ్మితే, ఆయన నిజముగా నీ పాపాలన్నిటిని కడిగి శుద్ధీకరిస్తాడు.

# దేవుని వాక్యం

## (రెండవ భాగం)

మేము ఈ పుస్తకంలో బోధించే విషయాలన్ని నేరుగా బైబిలు గ్రంథంలోనుండి తీయబడినవి. ఒక ఐదు ప్రశ్నలను మనము పరిగణలోనికి తీసుకుందాం:

1. మనము బైబిలును ఎక్కడనుండి పొందుకున్నాము?
2. బైబిల్ దేవుని వాక్కు అని నిరూపించడానికి మనకు ఆధారమేమి ఉన్నది?
3. బైబిల్‌లోని అన్ని భాగాలు ప్రేరేపించబడినవేనా?
4. బైబిల్ ఎంతోకాలం క్రితం వ్రాయబడినదైతే, అది వ్రాసినప్పుడు ఎలా ఉందో, ఇప్పుడునూ అలాగే ఉందని మనకి ఎలా తెలుసు?
5. అది దేవుని వాక్యమేనా?

పైన చెప్పబడిన ప్రతి ప్రశ్నకు ఎంతో ప్రాముఖ్యత ఉన్నది. మనము, ఈ ప్రతి ప్రశ్నకు సంబంధించిన జవాబు ద్వార ఒప్పించబడితేనే తప్ప, బైబిలు మనకు అంతగా అర్థము కాదు. బైబిల్లో నుండి దేవుని గురించి నేర్చుకొన్న విషయాలన్నీ నిజము కావచ్చు లేదా కాకపోవచ్చు.

నా స్నేహితుడా, బైబిలు దేవుని వాక్కు. కాలము దాన్ని నిరూపించింది. బైబిల్ సత్యము కాదు అని నీవు భావించినట్లయితే, కాలం గడుస్తున్న కొలది, మానవులు, పండితులు, దయ్యములు, మతరహితులు, మరియు నాస్తికులు బైబిల్ పైన దాడి చేసినట్లయితే, అది క్రమక్రమముగా దాని శక్తిని, పలుకుబడిని, అధికారమును కోల్పోతుంది. అంతగా ద్వేషించబడిన ఏ సాహిత్యమైనా, దేవుని హస్తం దాని పైన లేనట్లయితే, అది క్రమక్రమంగా భూమిమీదనుండి అదృశ్యమవుతుంది. అయినప్పటికీ, అది ఎంతగా దాడికి గురైననూ, ద్వేషించబడిననూ మరియు ఎంతగా అవిశ్వాసులు దానికి వ్యతిరేకముగా మాట్లాడిననూ, దాని వెలుగు మరింత ప్రకాశవంతంగా వెలుగుతుంది. దాని శత్రువులు దానికి వ్యతిరేకంగా ఎంతగా ఆగ్రహిస్తారో, దాని శక్తి అంతగా నిరూపించబడుతుంది.

1. మనము బైబిల్‌ను ఎక్కడనుండి పొందుకున్నాము?

విస్తృతంగా విస్తరించబడిన భూభాములోని అన్ని రంగాలకు చెందిన కనీసం 36 మంది చేత బైబిలు గ్రంథం రచించబడింది. వీరు 16 శతాబ్దాల కాలంలో దానిని రచించారు. వారు 66 వివిధ పుస్తకాలను ఉత్పత్తి చేసారు. ఇందులోని చాలామంది ఒకరినొకరు కలుసుకొనలేదు. చాలామంది ఒకే శతాబ్దానికి చెందినవారు కారు.

అయినప్పటికీ, ఈ 66 పుస్తకాలు కలిపి పరిపూర్ణమైన సామరస్యం కలిగిన సందేశముగానూ పరిపూర్ణమైన సిద్ధాంతము గల ఒక పుస్తకంగాను ఉన్నట్లు మనము చూడవచ్చు. దాని 66 పుస్తకాలలోనైనను లేదా దాని సందర్భాలలోనైననూ, ఒక వైరుధ్యమైనను, నిరూపించబడిన ఒక లోపమైననను లేని గ్రంథముగా బైబిలు ఉన్నది. దానిలోని ప్రతీ పుస్తకము మరియు అన్ని పుస్తకము, ఒకదానితో ఒకటి పరిపూర్ణముగా సమ్మతిస్తుంది. వివిధ గ్రంథములు అన్ని కలిపిననూ, వాటన్నిటికంటే మించి, మంచి కొరకై ప్రపంచమును ప్రభావితము చేసిన, సామరస్యముగల సందేశమును, సిద్ధాంతమును కలిగిన ఈ గ్రంథములో ఏ రహస్య ఒప్పందమైననూఇ మోసమైననూ లేదు. అది మానవుల యొక్క ప్రణాళిక ఉద్దేశము కానేరదు. ఎందుకంటే వారు ఒకరినొకరు ఎరిగి ఉండలేదు.

హెబ్రీ 1:1 లో సెలవిచ్చిన విధంగా, దేవుడు నానా సమయములలో , నానా విధములుగా, నానా ప్రవక్తలద్వారా మాటలాడినాడు. దేవుడు మానవులతో మాటలాడినాడు. వివిధ వ్యక్తులతో, వివిధ రకాలుగా, వివిధ సమయాలలో మాటలాడినాడు. కానీ, అదే సర్వశక్తిగల దేవుడు ఆయన మాటలను మనుష్యులతో మాటలాడినాడు.

2. అది దేవుని వాక్కు అని నిరూపించడానికి మనకు ఆధారము ఏమి ఉన్నది?

ఈ వ్యక్తులు ఎవరైతే బైబిలును రచించారో, వారు ప్రతి సందర్భములో పరిశుద్ధ వ్యక్తులుగా ఉన్నారు. అయినప్పటికీ వారి పరిశుద్ధత బైబిలుకు మూలం కాదు.

2 పేతురు 1:21 లో చూసినట్లయితే, “ప్రవచనము మనుష్యుని ఇచ్ఛవలన కలుగలేదు కాని, పరిశుద్ధాత్మ వలన ప్రేరేపించబడినవారై దేవుని మూలముగ

పలికిరి” అవును, వారు పరిశుద్ధమైన వ్యక్తులే కాని, దేవుడు ఈ పరిశుద్ధ వ్యక్తు యొక్క రచనలు తీసికొని ఒక గ్రంథముగా క్రోడీకరించలేదు. దానికి బదులుగా, దేవుడు పరిశుద్ధ వ్యక్తులను తీసికొని, వారికి ఆయన వాక్కులను ఇచ్చి, వ్రాయించి, భద్రపరిచేలా చేసాడు.

బైబిల్ పేతురు వాక్కు కాదు. లేదా యాకోబు వాక్కు, యోహాను వాక్కు, యెషయా వాక్కు, యిర్మీయా వాక్కు, దావీదు వాక్కు, మోషేవాక్కు కాదు. బైబిల్ దేవుని వాక్కు. దేవుడు దావీదు, మోషే, సమూయేలు, పేతురు, మత్తయి, మరియు లూకా లాంటి పరిశుద్ధమైన వ్యక్తులను ఎన్నుకొన్నాడు. దేవుడు పలికిన ప్రతి మాటను భద్రము చేయడానికి ఈ వ్యక్తులను ఎన్నుకొన్నాడు. బైబిలు మిక్కిలి ఆధ్యాత్మికత గల వ్యక్తులచేత రచించబడిన మతపరమైన గ్రంథము కాదు. బైబిలు దేవుని వాక్కు.

2 తిమోతి 3:16-17 లో ఉన్న విధముగా, దైవజనుడు సన్నద్ధుడై ప్రతి సత్కార్యమునకు పూర్ణముగ సిద్ధపడియుండునట్లు దైవావేశము వలన కలిగిన ప్రతి లేఖనము, ఉపదేశించుటకును, ఖండించుటకును, తప్పు దిద్దుటకును, నీతియందు శిక్ష చేయుటకును ప్రయోజనకరమైయున్నది.

మరొకమారు గమనించవలసినది ఏమిటంటే దేవుడు ఈ పరిశుద్ధ వ్యక్తులను ప్రేరేపించలేదు కాని లేఖనములను ప్రేరేపించాడు. ఈ పరుశుద్ధ వ్యక్తులు కేవలం దేవుని చేత ప్రేరేపించబడిన లేఖనములను భద్రపరిచారు. ఇందులో చాలామంది వారు బోధించిన సత్యాలను బట్టి తీవ్రంగా బాధించబడ్డారు. చాలామంది బలి అయ్యారు. కానీ, ఏ ఒక్క సందర్భంలో కూడా వారు ఆయన యొక్క బోధలనుండి వెనుకకు పోలేదు. ఎందుకంటే, వారు లోకమునకు తెలియజేసినవి, ప్రకటించినవి, దేవుని వాక్కులని వారికి తెలుసు గనుక.

వీరిని గూర్చిన ఒక ఉదాహరణ హెబ్రీ 11:32-39 లో చూడవచ్చు. “ఇకను ఏమి చెప్పుదును? గిద్యోను, బారాకు, సమ్సోను, యెఫ్తా, దావీదు, సమూయేలను వారిని గూర్చియు, ప్రవక్తలను గూర్చియు వివరించుటకు సమయము చాలదు. వారు విశ్వాసము ద్వారా రాజ్యములను జయించిరి; నీతి కార్యములను జరిగించిరి; వాగ్దానములను పొందిరి; సింహముల నోళ్లను మూసిరి. అగ్ని బలమును చల్లార్చిరి; ఖడ్గధారను తప్పించుకొనిరి; బలహీనులుగా ఉండి బలపరచబడిరి; యుద్ధములో పరాక్రమశాలురైరి; అన్యుల సేనలను

పారదోలిరి. స్త్రీలు మృతులైన తమ వారిని పునరుత్థానము పొందగోరి విడుదల పొందనొల్లక యాతన పెట్టబడిరి. మరికొందరు తిరస్కారములను కొరడా దెబ్బలను, మరి బంధకములను ఖైదును అనుభవించిరి. రాళ్లతో కొట్టబడిరి, రంపములతో కోయబడిరి, శోధింపబడిరి, ఖడ్గముతో చంపబడిరి. గొర్రెచర్మములను మేక చర్మములను వేసికొని దరిద్రులైయుండి శ్రమపడి హింస పొందుచు, అడవులలోను కొండలమీదను గుహలలోను సొరంగములలోను తిరుగులాడుచు సంచరించిరి. అట్టివారికి ఈ లోకము యోగ్యమైనది కాదు. వీరందరు తమ విశ్వాసము ద్వారా సాక్ష్యము పొందినవారైనను, మనము లేకుండ సంపూర్ణులు కాకుండు నిమిత్తము, దేవుడు మన కొరకు మరిశ్రేష్టమైన దానిని ముందుగా స్థిరపరచెను గనుక వీరు వాగ్దాన ఫలము అనుభవించపలేదు.

ఈ వ్యక్తులు, వారికి దేవుని వాక్కులు ఉన్నాయని వారి హృదయాంతరంగాల్లో ఖచ్చితంగా ఉండి, దేవుడు వారికిచ్చిన సత్యాల ప్రకారం జీవించుటకు వారివారి స్థిరాస్తులను, ఆస్తులను, భవిష్యత్తును, కుటుంబమును, స్నేహితులను ఆరోగ్యమును చివరికి వారి జీవితాలను కూడా వదిలివేయదానికి సిద్ధంగా ఉండెను.

దీన్ని గురించిన ఒక ఉత్తమమైన ఉదాహరణ యిర్మీయా 38:1-2, 5-6 లో చూడవచ్చు. "యెహోవా ఈలాగు సెలవిచ్చుచున్నాడు. ఈ పట్టణములో నిలిచియున్నవారు ఖడ్గము చేతనైనను క్షామము చేతనైనను తెగులు చేతనైనను చత్తురుగాని కల్దీయుల యొద్దకు బయలు వెళ్లువారు బ్రదుకుదురు. దోపుడుసొమ్ము దక్కించుకొనునట్లు తమ ప్రాణము దక్కించుకొని వారు బ్రదుకుదురు. యెహోవా ఈలాగు సెలవిచ్చుచున్నాడు– ఈ పట్టణము నిశ్చయముగా బబులోనురాజు దండుచేతికి అప్పగింపబడును, అతడు దాని పట్టుకొనును అని యిర్మీయా ప్రజలందరికి ప్రకటింపగా, అందుకు రాజైన సిద్కియా – అతడు మీ వశమున ఉన్నాడు, రాజు మీకు అడ్డము రాజాడనగా, వారు యిర్మీయాను పట్టుకొని కారాగృహములోనున్న రాజకుమారుడగు మల్కియా గోతిలోనికి దింపిరి. అందులోనికి యిర్మీయాను త్రాళ్లతో దింపినప్పుడు ఆ గోతిలో నీళ్లు లేవు, బురద మాత్రమే యుండెను. ఆ బురదలో యిర్మీయా దిగబడెను."

నువ్వంటావేమో, "ఎందుకు ఒక వ్యక్తి తనని తాను చెరసాలలో త్రోయబడుటకు అనుమతిస్తాడు, బురదగా, జిగటగా, మురికిగా ఉన్న గోతిలోనికి దించబడటానికి ఎందుకు అంగీకరిస్తాడు?" అని. ఎందుకో నేను చెప్తాను.

ఎందుకంటే ఆయనకు దేవుని వాక్యం తనతో ఉందన్న నిశ్చయత తనకు ఉంది కాబట్టి. వారు వ్రాసిన సందేశం వారు దేవుని నుండి పొందుకొన్నారని ఈ వ్యక్తుల్లో చాలమంది నేరుగా తెలిపారు. వారు, ఇతరులకు దేవుని వాక్యముగ దానిని అందించడానికి వారు పొందుకున్నారని వారికి తెలుసు. ఈ వ్యక్తులు, "దేవుడు సెలవిచ్చునదేనగా, దేవుడు ఈలాగు సెలవిస్తున్నాడు, దేవుడు ఈ విధంగా అన్నాడు" అని చెప్పడం మీరు మరల, మరల, మరలా గమనిస్తారు.

నేను గ్రహించినదేమిటంటే, చాలామంది మతసంబంధీకులు దేవుని నోటిబూరలుగా చెప్పుకుంటారు. కాని పాతనిబంధన లేఖనములు మరియు క్రొత్త నిబంధన లేఖనములు కలిపి ఒక గ్రంథముగ భద్రపరచబడింది. దాని 66 పుస్తకములలో ఒక లోపమైనను, వైరుధ్యమైనను లేని గ్రంథముగా బైబిల్ ఉన్నది. అది నిష్కర్షగా, స్పష్టముగా, దేవుని పరిపూర్ణమైన పరిశుద్ధ వాక్యముగ ఉన్నది.

సామెతలు 30:5లో బైబిల్ ఏం చెప్తున్నదో వినండి. "దేవుని మాటలన్నీ పుటము పెట్టబడినవే. ఆయనను ఆశ్రయించువారికి ఆయన కేడెము.'

కీర్తనలు 138:2లో ఈలాగుంది. "నీ పరిశుద్ధాలయము తట్టు నేను నమస్కారము చేయుచున్నాను. నీ నామమంతటి కంటె నీవిచ్చిన వాక్యమును నీవు గొప్ప చేసియున్నావు. నీ కృపాసత్యములను బట్టి నీ నామమునకు కృతజ్ఞతా స్తుతులు చెల్లించెదను. సర్వశక్తిమంతుడైన దేవుడు ఆయన వాక్కులకు అటువంటి స్థానము ఇస్తున్నాడు – వృద్ధిచేసిన స్థానమును, అత్యున్నతమైన స్థానమును. ఆ వాక్కులకు నీ జీవితములో ఎటువంటి స్థానమును ఇస్తావు?

కీర్తనలు 19:7-10 లో బైబిలు ఈవిధంగా సెలవిస్తున్నది. "యెహోవా నియమించిన ధర్మశాస్త్రము యథార్థమైనది. అది ప్రాణమును తెప్పరిల్లజేయును. యెహోవా శాసనము నమ్మదగినది అది బుద్ధిహీనులకు జ్ఞానము పుట్టించును. యెహోవా ఉద్దేశములు నిర్దోషమైనవి. అవి హృదయమును సంతోషపరుచును. యెహోవా ఏర్పరచిన ధర్మము నిర్మలమైనది, అది కన్నులకు వెలుగిచ్చును. యెహోవాయందలి భయము పవిత్రమైనది. అది నిత్యము నిలుచును. యెహోవా న్యాయవిధులు సత్యమైనవి. అవి కేవలము న్యాయమైనవి. అవి బంగారుకంటెను, విస్తారమైన మేలిమి బంగారుకంటెను కోరదగినవి. తేనెకంటెను, జుంటితేనె ధారలకంటెను మధురమైనవి."

లేఖనములన్నియు ఆయనచేత ప్రేరేపింపబడినవని దేవుడు చాలా స్పష్టముగా

పేర్కొన్నాడు. ఆయన నిశ్చయముగా తెలియపరచుచున్నది ఏమిటంటే, దేవుడు తన వాక్యాన్ని వృద్ధిపరిచాడు. దేవుని నామాన్ని నమ్మలేకపోతే, దేవుని పేరిట ఉన్న వ్యక్తిని నమ్మలేము. ఆయన సత్యవంతుడు, కానట్లయితే ఆయన మీద ఆధారపడలేము. నమ్మదగిన వాక్కు ఒకటి నీకు లేనట్లయితే నమ్మదగిన దేవుడు నీకు లేనట్లే. సత్యమైన వాక్కు ఒకటి నీకు లేనట్లయితే, నిజమైన దేవుడు నీకు లేనట్లే. దేవుడు సత్యవంతుడు. దేవుని వాక్కు సత్యమైనది. దేవుడు పరిపూర్ణుడు. దేవుని వాక్కు పరిపూర్ణమైనది. దేవుడు నమ్మదగినవాడు. ఆయన వాక్యం నమ్మదగినది.

“ఏ వాక్కులు?” అని నువ్వు అంటావేమో. దేవునియొక్క ప్రతి మాట స్వచ్ఛమైనదే. ప్రియ సహోదరా, దేవుని వాక్యం మొట్టమొదటగా రచింపబడినప్పుడు, అది పరిపూర్ణమైనదిగాను, సత్యమైనదిగాను, మరియు ఏ లోపము లేనిదిగాను ఉండెను. కానీ, కాలం గడుస్తున్న కొలది, మనుష్యులు దానిని ఒక పుట నుండి మరొక పుటకు అనువదిస్తున్నప్పుడు,ఒక భానుండి మరొక భాషకు తర్జుమా చేస్తున్నప్పుడు, వారు దేవుని వాక్యములోనికి తప్పులు చేర్చకుండా ఉండటం అసాధ్యం అని చెప్పేవారు కూడా ఉన్నారు.

ఇప్పుడు నన్నొక ప్రశ్న అడుగనివ్వండి. దేవుడు మొదటగా ఆయన వాక్కులను మనుష్యులకు ఇచ్చినప్పుడు ఎటువంటివారికి ఇచ్చాడు? “పరిశుద్ధమైన వ్యక్తులకు” అని నువ్వంటావు.

అది సరే, బైబిలు ప్రకారంగా, పరిశుద్ధ వ్యక్తులు అంటే ఏమిటి? పరిశుద్ధ వ్యక్తులు అంటే, వారు దేవుని కృప వెలుపల పాపులుగా ఉంటూ బొత్తిగా ఏమీ లేనివారుగా ఉమడెను. మరియు దేవుడు ఆవ్యక్తులను ప్రేరేపించలేదు. దేవుడు ఆయన మాటలను ప్రేరేపించి, ఆ మాటలను ఆ వ్యక్తులకు ఇచ్చాడు. ఆ వ్యక్తులు ఆయన మాటలను భద్రపరిచారు.

పౌలు అవిధేయుడుగా ఉండెను (రోమా 7). దావీదు వ్యభిచారిగా ఉమడెను (2 సమూయేలు 11). పేతురు అబద్ధికుడు (లూకా 22:56-62). ఏలీయా పిరికివాడు (1 రాజులు 19).

ఈ వ్యక్తులు బైబిలును సృష్టిస్తారని నీవు నమ్మగలవా? లేదు. మరెందుకు మనము అసంపూర్ణమైన లేఖికులు మరియు అనువాదకులను గూర్చిన గడబిడ అంతా వినాలి? బైబిలు మొట్టమొదటగాను, ఈరోజుకు గాను దేవుని వాక్యమే అయ్యున్నది కానీ మనుష్యుని వాక్కు కాదు.

ఇప్పుడు నన్నొక ప్రశ్న అడుగనివ్వండి: మొట్టమొదటగా దేవుడు ఆయన వాక్యమును మానవుల చేతిలో పెట్టినప్పుడు, మొదటగా దేవునియొక్క పరిపూర్ణమైన వాక్యమును మనుష్యుల చేతివ్రాత చేత రచించబడనిచ్చినప్పుడు, ఆ వాక్యమును భద్రపరచడానికి, ఆ వాక్యమును స్వచ్ఛమైనదిగా ఉంచడానికి, ఆ వాక్యమును సరియైనదిగా ఉంచడానికి, ఈ రోజువరకు ఆ వాక్యము ఏ లోపము లేనిదిగా ఉంచడానికి దేవునికి సామర్థ్యత ఉందని నీవు అనుకుంటున్నావా? దేవునికి ఆ పని చేయగల సామర్థ్యం ఉందని నీవు నమ్ముతున్నావా?

ఇంతకుముందు నీవు నమ్మినావా అని నేను అడగటం లేదు కాని, దేవుని యొక్క స్వచ్ఛమైన మరియు పరిపూర్ణమైన వాక్యమును మొట్టమొదటగా రచించినప్పటినుండి ఈనాటి వరకు దానిని పరిపూర్ణమైనదిగాను మరియు స్వచ్ఛమైనదిగాను ఉంచేందుకు దేవుడు సమర్థుడు అని నీవు నమ్ముతున్నావా లేదా అని మాత్రమే నాకు తెలుసుకోవాలని ఉన్నది.

మత్తయి 24:35 లో ప్రభువైన యేసుక్రీస్తు ఈ విధంగా సెలవిస్తున్నాడు. “ఆకాశమును భూమియు గతించును గాని నామాటలు ఏ మాత్రమును గతింపవు.’ ఆయన మాటలు గతించిపోవని దేవుడు సెలవిచ్చాడు. మొట్టమొదటి రాతప్రతులుగా భద్రపరచమని దేవుడు మానవులకు ఏమి ఇచ్చాడో ఆయనకు తెలుసు. ఆయన మరచిపోలేదు. ఆయన ఏమి చెప్పియున్నాడో ఆయనకు ఖచ్చితంగా తెలుసు.

కాబట్టి, నన్ను మరొకటి అడుగనివ్వండి: రాతప్రతుల ద్వారా మానవజాతికి తనని తాను ప్రత్యక్షపరచగోరుచున్న దేవునికి మరియు మానవజాతికి తనని తాను ప్రత్యక్షపరచుకోవడానికి ఎన్నుకోబడ్డ దేవునికి అన్ని తరాలకు చెందినవారందరికి ఆయన తెలిసియుండాలని ఇష్టపడుతున్నాడని నీవు నమ్ముతున్నావా?

రక్షణ కొరకు, జ్ఞానోదయం కొరకు దేవుడు ఒక తరము కంటె మరొక తరముకు మొగ్గుచూపరని లేదా ఎన్నుకోరని మనందరము అంగీకరించాలని నేను అనుకుంటాను. దేవుడు మొట్టమొదటగా ఆయన మాటలను స్వచ్ఛమైన మరియు పరిపూర్ణమైన విధానములో ఒక్కోతరములోని కొందరు వ్యక్తులకు ఇచ్చియున్నాడు. (అది మోషే తరమైన కావచ్చు, దావీదు తరమైనను, యెషయా తరమైనను, మతయ్యి, మార్కు, లూకా తరమైనను, లేదా అపొస్తలుడైన పౌలు

తరమైనా కావచ్చు). ఆయన తన వాక్యమును ఆ తరమునకు ఇచ్చి దాని ద్వారా తనను ప్రత్యక్షపరచగోరాడు.

ఆయన మొట్టమొదటగ ఏమి చెప్పియున్నాడో మరియు ఏ తరమునకు ఏ వాక్యమును ఇచ్చియున్నాడో ఆయనకు ఖచ్చితముగ తెలుసు. మొదటగా వ్రాయబడిన ఆ వాక్కులను ఆయన తనంతట తాను పలికాడు. మొదటి తరాలలోని క్రొత్త నిబంధన సంఘము ఏవిధంగా పొందుకున్నదో మనకి కూడా అదే విధంగా ఆయన మాటలు సరిగ్గా అందేలా ఆయన చూచుకొంటాడని నమ్మడం అసమంజసమా?

అది ఊహకి అందని ఆలోచన అని నేను అనుకోను. దేవున్ని ఉన్నది ఉన్నట్టుగా తెలుసుకోవడం అనే విషయం ఎంతో తార్కికమైన, నమ్మడానికి ఎంతో సమంజసమైన విషయంగా నేను భావిస్తున్నాను. ఆయన వాక్యం పరలోకంలో స్థిరపడి ఉన్నది. ఆయన వాక్యం గతించిపోక మునుపు భూమి ఆకాశం గతించిపోతాయి.

ద్వితీయోపదేశకాండము 30:11–14 ద్వారా మానవుడు దేవుణ్ణి తెలుసుకోవాలని ఆయన ఆశిస్తున్నాడని మనకు తెలిసియున్నది. కాబట్టి, మానవుడు అందుకోలేనంత ఎత్తులో ఉన్న పరలోకానికి దేవుడు తన వాక్యాన్ని పరిమితం చెయ్యలేదు. ఎక్కడో మానవునికి దొరకకుండా సముద్రం గుండా దేవుడు ఆయన మాటలను ఉంచలేదు. “నేడు నేను నీ కాజ్ఞాపించు ఆ ధర్మశాస్త్రమును గ్రహించుట నీక కఠినమైనది కాదు, దూరమైనది కాదు. మనము దానిని విని గైకొనునట్లు, ఎవడు ఆకాశమునకు ఎక్కిపోయి మన యొద్దకు దాని తెచ్చును? అని నీవనుకొనుటకు అది ఆకాశమందు ఉండునది కాదు. మనము దాని విని గైకొనునట్లు, ఎవడు సముద్రము దాటి మన యొద్దకు తెచ్చును అని నీవనుకొననేల? అది సముద్రపు అద్దరి మించునది కాదు. నీవు దాని ననుసరించుటకు ఆ మాట నీకు బహు సమీపముగా నున్నది; నీ హృదయమున నీ నోట నున్నది.”

యెహోవా తన వాక్కులను మనుష్యుల చేతిలో పెట్టియున్నాడు. కాబట్టి ఆయన ద్వారా ప్రేరేపింపబడ్డ వాక్కులను భద్రపరచడానికి మొదట దేవుడు మనుష్యులను వాడుకొన్నాడని నీవు నమ్ముతున్నావా? అవును, నీవు నమ్ముతావు. ఎందుకంటె బైబిలు ఆలాగు సెలవిస్తున్నది కాబట్టి.

– లిఖితపూర్వకంగా ఉన్న ఆయన వాక్కుల ద్వారా మానవులు తనను తెలుసుకోవాలని దేవుడు ఆశిస్తున్నాడని నీవు నమ్ముతున్నావా?

అవును, నీవు నమ్ముతావు, ఎందుకంటె బైబిల్ ఆలాగు సెలవిస్తున్నది కాబట్టి.

– బైబిల్‌ను రచించిన ప్రతి రచయితతో దేవుడు మొట్టమొదటగ ఏమి పలికాడో ఈరోజు వరకును ఆయనకు తెలిసియున్నదని నీవు నమ్ముతున్నావా? అవును, మనము నమ్ముతాము; మనకు తెలుసు; ఎందుకంటే బైబిల్ ఆ విధంగా సెలవిస్తున్నది.

– ఈ తరములోని మనుష్యులు ఎవరైతే ఆయనను తెలిసికొనగోరుచున్నారో, ఆయన స్వచ్ఛమైన పరిపూర్ణమైన, న్యాయవంతమైన, సత్ప్రవర్తనగల వాక్యమును – ప్రతి వాక్కును దాని పరిపూర్ణతలో తెలుసుకొనగోరుచున్న వారి కొరకు, ఈ రోజు వరకు దేవుడు దానిని భద్రపరిచాడని నీవు నమ్ముతున్నావా? "బైబిల్ ఆవిధంగా చెబితే నేను నమ్ముతాను. లేఖనములు ఆలాగు సెలవిస్తే నేను నమ్ముతాను" అని నువ్వంటావు. సరే, అలాగైతే, కీర్తనలు 12:6–7 చూడండి. "యెహోవా మాటలు పవిత్రమైనది (లోపములేనివి). అవి మట్టి మూసలో ఏడు మారులు కరగి ఊదిన వెండియంత పవిత్రములు"

దేవుని వాక్యమును ఎవరు భద్రపరిచారు? అనువాదకులు కాదు, లేఖకులు, పండితులు, మంచివారు, దైవభక్తిగలవారు, లోపాలు, పొరపాటులు చేసేవారు, పాపులు, అతిక్రమము చేసేవారు కాదుగాని, దేవుడు తనంతట తానే తన వాక్యమును భద్రపరిచాడు. ఈ తరము మొదలుకొని ఎప్పటికీ. దానిని మరలా చదవండి. దానిని నమ్మండి.

ఇప్పుడు, నేను మిమ్మును మరలా ప్రశ్నిస్తాను. తన స్వచ్ఛమైన, పరిపూర్ణమైన వాక్యమును మొట్టమొదటగా దేవుడు మానవులకు ఇచ్చినప్పుడు, ఈ తమువారు కూడా దేవునియొక్క స్వచ్ఛమైన, పరిపూర్ణమైన వాక్యమును వారి హస్తాల్లో కలిగియుండాలని, దేవుడు దానిని అంతే స్వచ్ఛంగా, పరిపూర్ణంగా కాపాడాడని నీవు నమ్ముతావా? అవును, నీవు నమ్ముతావు, ఎందుకంటే బైబిలు ఆలాగు సెలవుస్తున్నది. బైబిల్ సెలవిస్తున్నాది!

నా స్నేహితులారా, ఆకాశమందున్న దేవుని అధికారము ద్వారా నేను చెప్తున్నాను, స్వచ్ఛమైన, పరిపూర్ణమైన దేవుని వాక్యము నా స్వహస్తాల్లో ఉన్నది. నేను లేఖకుల గూర్చియైనను, పండితులు, అనువాదకులు, కమిటీ సభ్యులు టైపిస్టుటలు, లేదా నకలు లేఖకులు గురించి నేను ఏమి పట్టించుకోను. నాకు దేవుడు తెలుసు. నేను దేవుణ్ణి నమ్ముతాను. ఆయన వాక్కులను ప్రేరేపించాడని నాకు తెలిసిన, నేను నమ్మిన దేవుడు నాకు చెప్పాడు. ఆయన వాక్యమును

మానవునికి ఇచ్చాడని ఆయన నాకు చెప్పాడు. ఆయన, ఆయన వాక్యమును స్వచ్ఛమైనదిగానూ, పరిపూర్ణమైనదిగాను కాపాడాడని ఆయన నాకు చెప్పాడు.

పరిశుద్ధ గ్రంథము ఈ విధంగా సెలవిస్తున్నది: "నీవు తిరిగి జన్మించాలి". ఈ దైవికమైన ప్రత్యక్షత ఈ విధంగా ప్రకటిస్తున్నది: "నీవు ప్రభువైన యేసుక్రీస్తును నమ్మినట్లయితే, నీవును నీ కుటుంబమును రక్షించబడుతుంది." పొరపాటులేణి ఈ లేఖనములు సెలవిచ్చునది ఏమనగా: "లేఖనానుసారముగా క్రీస్తు మన పాపములకొరకు మరణించాడు. లేఖనానుసారముగా ఆయన పాతిపెట్టబడి తిరిగి మూడవదినమున లేచాడు."

భద్రపరచబడిన బైబిల్ గ్రంథము ఈ విధంగా సెలవిస్తున్నది: "ప్రభువైన యేసు యెదుట నీ నోటితో నీ పాపములను ఒప్పుకొన్నట్లయితే, దేవుడు మృతులలోనుండి మూడవ దినమున తిరిగి లేచాడని నీ హృదయములోనీవు నమ్మినట్లయితే, నీవు రక్షింపబడతావు; ప్రభువు నామమును బట్టి ప్రార్థన చేయువాడెవడో వాడు రక్షింపబడును."

అది దేవుని వాక్కు. నీవు నమ్మినట్లయితే అది నీకు క్షేమము. ప్రియ పాఠకుడా, దేవుని యొక్క స్వచ్ఛమైన, పరిపూర్ణమైన, పరిశుద్ధవాక్యము గల బైబిలుగ్రంథము ఒకటి నీయొద్ద ఉన్నదా? ఈ తరానికి కూడా దేవుడు తన పరిశుద్ధ గ్రంథాన్ని ఇచ్చినందుకు దేవునికి కృతజ్ఞతలు చెల్లించాలి.

# దేవుని వాక్యం

## (మూడవ భాగం)

దేవుడు మానవునికి ఇచ్చిన వాక్యం ద్వారా మానవుడు దేవున్ని తెలుసుకుంటాడు. మనం దేవుని వాక్యం ద్వారా ఆయనను తెలుసుకొనుటకు తన వాక్కులను లిఖించి, భద్రపరచుటకు దేవుడు పరిశుద్ధ వ్యక్తులను ఉపయోగించుకున్నాడు. మన ఊహలకు లేదా అభిప్రాయాలకు మనము వదిలివేయబడలేదు. సంప్రదాయమును లేదా మూఢనమ్మకమును అనుకరించడానికి మనము వదిలివేయబడలేదు. అలా అని, దేనిని అనుకరించకుండా ఉండేందుకు మనము అంధకారములో వదిలివేయబడలేదు. దేవుడు, తనని తాను మనకు విశదపరచుకునేందుకు తాను ప్రేరేపించిన లిఖితపూర్వకమైన గ్రంథమును మనకు ఇచ్చాడు. దేవుని వాక్కునకు ఉన్న అధికారమును నొక్కిచెప్పడానికి మనము ఎంత సమయం గడిపినా తక్కువే.

మనమెందుకు మన ఆత్మలను సురక్షితంగా, తప్పనిసరిగా బైబిలులో ఉన్న సత్యము పైన పెట్టవలెనో, దానికి గల ఆరు కారణాలను ఈ పాఠంలో చూద్దాం.

1. దేవుని గురించిన సత్యాన్ని పరీక్షించడానికి కేవలం అనుభవమును మాత్రమే ఉపయోగించకూడదు కాని, సాధారణంగా, చివరి పరీక్ష అదే అవుతుంది. దేని విషయంలోనైనా 'అసలు ఇది పనిచేస్తుందా?' అనే ప్రశ్నకు సమాధానం కోరుకుంటాం. అలాగయితే, బైబిల్లో ప్రత్యక్షపరచబడిన సత్యాలను మరియు వాగ్దానాలను ఆచరణాత్మకమైన వ్యక్తిగత అనుభవములో పరీక్షించవచ్చా?

తప్పకుండా పరీక్షించవచ్చు. మేము దీని చేయగలమనేది పరాకాష్ట ఋజువు. మన తరంలోని ఒక ప్రముఖ నాస్తికురాలు (తన పేరు చెప్పడానికి కూడా నేను ఇష్టపడను, ఎందుకంటే, ఆ పేరును మరల ఉచ్చరించడానికి అంత అర్హమైనది

కాదు కాబట్టి) తన నాస్తికతను చాటి చెప్పడానికి తన జీవితకాలం వెచ్చించింది. ఆవిడ ఒకసారి ఈ విధంగా ప్రకటించింది: "వ్యక్తిగత సాక్ష్యానికి విరుద్ధంగా ఏ వాదన లేదు."

అదే అవకాశం అందరికి తెరువబడివుంది. బైబిల్ సత్యమైనదా, కాదా? దానిని ప్రయత్నించండి! అది ఏమి చెప్తున్నదో ఆలాగుచెయ్యండి! అప్పుడు, అది వాస్తవంగా దేవుని వాక్యము అవునో, కాదో చూడండి. దేవుని వాక్యము సత్యమైనదని గ్రహించిన వారి పొడుగాటి జాబితాకు ప్రతి దశాబ్దంలో కొన్ని వేలమంది వారి సాక్ష్యాన్ని చేర్చుతున్నారు. వారి జీవితాలు రూపాంతరము చెందాయి. ప్రార్థనకు, స్పష్టమైన జవాబును పొందుకున్నారు. దేవునితో వారు నిజమైన సహవాసమును కలిగియున్నారు.

ఇదంతా కూడా బైబిల్లో వాగ్దానాలను పలుకుతూ, వాటిపైన నిలబడుతు చెయ్యగలిగారు.

ఈ సాక్ష్యము తాజాది మరియు నవీనమైనది. దేవుని వాక్యము సత్యమైనదని నేను కనుగొన్నానని ఈ రోజు మీకు సంతోషంగా సాక్ష్యమిస్తున్నాను. బైబిలులోని ప్రతి వరస, ప్రతి వచనం, ప్రతి భాగము, ప్రతి అధ్యాయం, ప్రతి పుస్తకము, అవును, బైబిల్ గ్రంథమంతా నిజమైనది, సత్యమైనది అని నేను కనుగొన్నాను.

2. బైబిల్ నిజంగా దేవుని సాక్ష్యమే అని బలంగా నిరూపించడానికి అందులో ఒక వచనం ఉంది. ఆ వచనం నెరవేర్చబడిన ప్రవచనం. ఉదాహరణకు మనం కొన్ని వచనాలను చూద్దాం:

ద్వితీయోపదేశకాండము 28:63-65 లో మనము ఈ విధంగా చదువుతాము: "కాబట్టి మీకు మేలు చేయుచు మిమ్మును విస్తరింపజేయుటకు మీ దేవుడైన యెహోవా మీయందు ఎట్లు సంతోషించెనో అట్లు మిమ్మును నశింపజేయుటకును మిమ్ము సంహరించుటకును యెహోవా సంతోషించును గనుక నీవు స్వాధీనపరచుకొనుటకు ప్రవేశించుచున్న దేశములో నుండి పెల్లగింపబడుదువు. దేశము యొక్క ఈ కొన మొదలుకొని ఆ కొన వరకును సమస్త జనములలోనికి యెహోవా నిన్ను చెదరగొట్టును. అక్కడ నీవైనను నీ పితరులైనను ఎరుగని కొయ్యవియు రాతివియునైన అన్యదేవతలను పూజింతువు. ఆ జనములలో నీకు నెమ్మది కలుగదు; నీ అరకాలికి విశ్రాంతి కలుగదు. అక్కడ యెహోవా హృదయకంపమును నేత్రక్షీణతయు మనోవేదనయు నీకు కలుగజేయును."

ఈ ప్రవచనము ఇశ్రాయేలు దేశము గురించి పలుకబడింది. దేవుడు వారిని కనాను దేశమునకు నడిపిస్తానని ప్రమాణం చేసాడు. వారు ఆయన ఆజ్ఞలకు లోబడి యున్నట్లయితే వారక్కడ ఎప్పటికీ నివసించవచ్చు, వారు ఆయన ఆజ్ఞలకు లోబడనొల్లక యున్నట్లయితే దేవుడు వారిని ఆదేశము నుండి పారద్రోలి భూమి మీద నున్న ఇతర దేశాలకు వారిని చెదరగొడతాను అన్నాడు. మరియు వారు ఆ దేశాలలో నానా రకాలుగా ద్వేషించబడి, పీడించబడి, హింసించబడి, వేధించబడతారు. నా స్నేహితుడా, ఇప్పుడు నేను నిన్ను అడుగుతున్నాను, యూదుల యొక్క చరిత్ర ఏమిటి? టైటస్ క్రింద, స్పెయిను క్రిందను, హిట్లరు యొక్క జర్మనీ క్రిందను వారు ఎలావున్నారు? ఈరోజు వరకును వారు భూమియందంతట విస్తారంగా చెదరగొట్టబడ్డారు. చాలమంది వారి స్వదేశానికి తిరిగి సమకూర్చబడుతున్ననూ వారికి విశ్రాంతి దొరకటం లేదు. ఖచ్చితంగా వారివారి జీవితాల్లో సమాధానం లభించడం లేదు.

మరియు సంక్షోభము, కలవరము , యుద్ధము, రక్తపాతము దూసుకొస్తున్నాయి. ఈ ప్రవచనములో బైబిలు ఖచ్చితంగా తనను తాను నిరూపించుకుంది. ఈ మాటలు మనము లేవీయకాండము 26:32-35లో చూడవచ్చు. “నేనే మీ దేశమును పాడుచేసిన తరువాత దానిలో కాపురముండు మీ శత్రువులు దాని చూచి ఆశ్చర్యపడెదరు. జనములలోనికి మిమ్మును చెదరగొట్టి మీ వెంట కత్తిదూసెదను. మీ దేశము పాడైపోవును. మీ పట్టణములు పాడుపడును. మీరు మీ శత్రువుల దేశములో ఉండగా మీ దేశము పాడైయున్న దినములన్నియు అది తన విశ్రాంతికాలములను అనుభవించును. అది పాడైయుండు దినములన్నియు అది విశ్రమించును. మీరు దానిలో నివసించినప్పుడు అది విశ్రాంతి కాలములో పొందకపోయిన విశ్రాంతిని అది పాడై యుండు దినములలో అనుభవించును.”

ఈ మాటలు ఖచ్చితంగా, భయంకరంగా నెరవేర్చబడ్డాయి. అప్పుడు మనము ప్రభువైన యేసుక్రీస్తును పరిగణలోనికి తీసుకోవాలి. ఆయన జీవితమును గూర్చియు, మరణమును గూర్చియు ఎంతో అద్భుతమైన ప్రవచనాలు అనేకములుగా ఉన్నవి. ఆయన జన్మించే రోజు, సమయము మాత్రమే కాదు, ఆయన ఏ దేశములో, ఏ పట్టణములో ఏ విధంగా జన్మిస్తాడో, ఆయన జన్మించే సమయంలో ఎవరు సహాయపడతారో, ఆ సమయంలో అక్కడ ఏమేమి మాట్లాడతారో కూడా ప్రవచింపబడ్డాయి. నా స్నేహితులారా, ఇది

గణితశాస్త్రపరంగా చూచినట్లయితే, అది అసాధ్యం.

ఎవరో ఒకరు, ప్రభువైన యేసుక్రీస్తును గూర్చిన ప్రవచనములన్నీ ఆధునిక కంప్యూటర్‌లోకి అనుసంధానించారు. ఆయన జీవితకాలంలో నెరవేర్చబడిన మరియు ఆయన మరణమును గూర్చి నెరవేర్చబడిన కొన్ని వందలకొద్ది ప్రవచనాలను పేర్కొనలేదు కాని కేవలం ఆయన జననమునకు సంబంధించిన ప్రవచనాలను మాత్రమే అనుసంధానించారు. ఆ ప్రవచనాల అసమానతలను పేర్కొనడానికి కంప్యూటర్‌లో అంత పెద్ద సంఖ్య లేదు. అది అసాధ్యము.

బైబిల్ నిజంగా దేవుని వాక్యమే అని నిరూపించడానికి, నెరవేర్చబడిన ప్రవచనాలే రుజువు. మానవుడు భవిష్యత్తును చూడలేడు, తెలుసుకొనలేడు. కానీ, బైబిలు దానిని 100% నెరవేర్చింది. దేవుడు ఒకసారి కూడా భంగము కాని, పొరపాటుగాని, తప్పుగాని చేయడు. నెరవేర్చబడిన ప్రవచనము ద్వారా బైబిలు దేవుని వాక్యమే అని మనకు తెలుస్తున్నది.

3. బైబిల్ దేవుని యొక్క ప్రత్యక్షతే అని నిరూపించడానికి, దానియొక్క మంచి విలువలు, నైతిక పాఠాలు ఎంతో ఎత్తుగా, ఎంతో స్వచ్ఛమైనవిగా ఉన్నాయి.

ఎన్నో ఉదాహరణల నుండి మత్తయి 5:3–10 వరకు మనము మూలంగా తీసికొనవచ్చు. "ఆత్మవిషయమై దీనులైనవారు ధన్యులు; పరలోక రాజ్యము వారిది. దుఃఖపడువారు ధన్యులు; వారు ఓదార్చబడుదురు. సాత్వికులు ధన్యులు; వారు భూలోకమును స్వతంత్రించుకొందురు. నీతికొరకు ఆకలిదప్పులు గలవారు ధన్యులు; వారు తృప్తిపరచబడుదురు. కనికరము గలవారు ధన్యులు; వారు కనికరము పొందుదురు. హృదయశుద్ధి గలవారు ధన్యులు; వారు దేవుని కుమారులనబడెదరు. నీతి నిమిత్తము హింసింపబడువారు ధన్యులు; పరలోక రాజ్యము వారిది." దేవుని పరిశుద్ధ గ్రంథపు పుటలలో పేర్కొనబడిన అందమైన జీవన విధానం, నీతి మరియు పరిశుద్ధత యొక్క ప్రమాణము, మనుష్యుడు మాట్లడిన మాటలతో పోల్చబడలేవు.

యాకోబు 2:10 లో బైబిలు ఈ విధంగా సెలవిస్తున్నది: "10 ఎవడైనను ధర్మశాస్త్ర మంతయు గైకొనియు, ఒక ఆజ్ఞవిషయములో తప్పి పోయినయెడల, ఆజ్ఞలన్నిటి విషయములో అపరాధి యగును." ఏ మతము, ఏ నాగరికత, ఏ సమాజము, ఏ ప్రభుత్వము అటువంటి నీతిన్యాయములు గల చట్టమును ఏర్పరచుతుంది?

బైబిలు నిజంగా అతిపరిశుద్ధమైన దేవుని నుండి మానవునికి ప్రత్యక్షత అని నిరూపించుటకు, దాని మంచి నైతిక విలువలు గల బోధనలలో నీకు ఒక గొప్పతనం, ఒక స్వచ్ఛత కనబడుతుంది.

4. బైబిల్లో బోధింపబడిన విధానంగా వ్యక్తిగత విశ్వాసమును క్రీస్తులో కలిగియుండటం ద్వారా, వారి వ్యక్తిగత జీవితాలు ఖచ్చితంగా ఒక మానవాతీత శక్తితో రూపాంతరము చెందాయి.

ఉదాహరణకు, అపొస్తలుల కార్యములు 16:25-34లో ఈ విధంగా వ్రాయబడింది: "అయితే మధ్యరాత్రివేళ పౌలును సీలయు దేవునికి ప్రార్థించుచు కీర్తనలు పాడుచునుండిరి; ఖయిదీలు వినుచుండిరి. అప్పుడు అకస్మాత్తుగా మహా భూకంపము కలిగెను, చెరసాల పునాదులు అదరెను, వెంటనే తలుపులన్నియు తెరచుకొనెను, అందరి బంధకములు ఊడెను. అంతలో చెరసాల నాయకుడు మేలుకొని, చెరసాల తలుపులన్నియు తెరచియుండుట చూచి, ఖయిదీలు పారిపోయిరనుకొని, కత్తిదూసి, తన్ను తాను చంపుకొనబోయెను. అప్పుడు పౌలునీవు ఏ హానియు చేసికొనవద్దు, మేమందరము ఇక్కడనే యున్నామని బిగ్గరగా చెప్పెను. అతడు దీపముతెమ్మని చెప్పి లోపలికి వచ్చి, వణకుచు పౌలుకును సీలకును సాగిలపడి వారిని వెలుపలికి తీసికొనివచ్చి అయ్యలారా, రక్షణపొందుటకు నేనేమి చేయవలెననెను. అందుకు వారుప్రభువైన యేసు నందు విశ్వాసముంచుము, అప్పుడు నీవును నీ యింటివారును రక్షణ పొందుదురని చెప్పి అతనికిని అతని ఇంటనున్న వారికందరికిని దేవుని వాక్యము బోధించిరి. రాత్రి ఆ గడియలోనే అతడు వారిని తీసికొనివచ్చి, వారి గాయములు కడిగెను; వెంటనే అతడును అతని ఇంటివారందరును బాప్తిస్మము పొందిరి. మరియు అతడు వారిని ఇంటికి తోడుకొని వచ్చి భోజనముపెట్టి, దేవునియందు విశ్వాసముంచినవాడై తన ఇంటివారందరితోకూడ ఆనందించెను."

మిక్కిలి నిరాశకు గురై, ఆత్మహత్యకు సిద్ధపడిన కఠినాత్ముడైన రోమను జైలరు, కొన్ని నిమిషాల వ్యవధిలోనే, ఆనందముగా, సంతోషముగా ఉండే వ్యక్తిగా, దేవుని నమ్మే వ్యక్తిగా మార్చబడ్డాడు. ఖైదీలలో ఒకరి గాయాలను కడిగాడు. వారిని ఇంటికి ఆహ్వానించి వారికి భోజనం పెట్టాడు. ఆయన జీవితంలో ఇంత వ్యత్యాసాన్ని ఏది కలిగించింది? 'దేవుని వాక్యాన్ని నమ్మటమే.'

చెరసాలలో పాటలు పాడుతున్న పౌలుకు కూడా ఒక గొప్ప అనుభవం ఉన్నది. అపొస్తలులు కార్యములు 9:2-7, 20-22 వచనాలలో ఈ విధంగా

వ్రాయబడి ఉంది: "యీ మార్గ మందున్న పురుషులనైనను స్త్రీలనైనను కనుగొనిన యెడల, వారిని బంధించి యెరూషలేము నకు తీసికొని వచ్చుటకు దమస్కులోని సమాజముల వారికి పత్రికలిమ్మని అడిగెను. అతడు ప్రయాణము చేయుచు దమస్కుదగ్గరకు వచ్చి నప్పుడు, అకస్మాత్తుగా ఆకాశమునుండి యొక వెలుగు అతనిచుట్టు ప్రకాశించెను. అప్పుడతడు నేలమీదపడి సౌలా, సౌలా, నీవేల నన్ను హింసించుచున్నావని తనతో ఒక స్వరము పలుకుట వినెను. ప్రభువా, నీవెవడవని అతడడుగగా ఆయననేను నీవు హింసించు చున్న యేసును; లేచి పట్టణములోనికి వెళ్లుము, అక్కడ నీవు ఏమి చేయవలెనో అది నీకు తెలుపబడునని చెప్పెను. అతనితో ప్రయాణము చేసిన మనుష్యులు ఆ స్వరము వినిరి గాని యెవనిని చూడక మౌనులై నిలువ బడిరి. వెంటనే సమాజమందిరములలో యేసే దేవుని కుమారుడని ఆయనను గూర్చి ప్రకటించుచు వచ్చెను. వినినవారందరు విభ్రాంతినొంది, యెరూష లేములో ఈ నామమునుబట్టి ప్రార్థన చేయువారిని నాశనము చేసినవాడితడే కాడా? వారిని బంధించి ప్రధాన యాజకులయొద్దకు కొనిపోవుటకు ఇక్కడికికూడ వచ్చి యున్నాడని చెప్పు కొనిరి. అయితే సౌలు మరి ఎక్కువగా బలపడి ఈయనే క్రీస్తు అని రుజువు పరచుచు దమస్కులో కాపురమున్న యూదులను కలవరపరచెను."

ఏదో నాటకీయమైన ఒక సంఘటన ఈ వ్యక్తి జీవితంలో జరిగింది. పౌలు ప్రభువైన యేసుక్రీస్తును నమ్మేవారిని జైలులో వేయుటకు, హింసించుటకు, నాశనము చేయుటకు, హత్యచేయుటకు దమస్కునకు బయలుదేరాడు. కానీ, ఆయన ఆ పట్టణమునకు చేరుకునే సరికి, అందరు ప్రభువైన యేసుక్రీస్తుమీద విశ్వాసం ఉంచాలని బహిరంగంగా ప్రసంగిస్తున్నాడు. అతని జీవితంలో ఇంత విపరీతమైన మార్పును ఏది కలిగించింది? అది ఏంటో నేను చెప్తాను. "దేవుని వాక్యాన్ని నమ్మటం".

నీ జీవితంలో ఏ ద్వేషము, ఏ గర్వము, ఏ స్వార్థము, ఏ కోపము, ఏ అలవాటు, ఏ చెడు అలవాటు, ఏ పాపము నిన్ను కట్టిపడేస్తున్నదో నాకు తెలియదు. ఏ చెడు ప్రభావం నిన్ను నియంత్రిస్తున్నదో, ఏ చెడు ప్రభావమైతే నిన్ను దేవుని నుండి దూరంగా తీసుకెళ్తున్నదో – అదే చెడు ప్రభావము దినదినము నిన్ను నరకానికి దగ్గర చేస్తున్నది. కానీ, నీవు దేవుని వాక్యాన్ని నమ్మినట్లయితే, అది అందరు ఆశ్చర్యపడేరీతిగా, నిన్ను అద్భుతంగా మారుస్తుందని నాకు తెలుసు. అప్పుడు వాళ్లంటారు– "చాలా ద్వేషపూరితంగా ఉండే ఆ వ్యక్తి ఇతను కాదా?

చాలా గర్వంగా ఉండే ఆ వ్యక్తి ఇతను కాదా? చాలా సోమరిగా ఉండే ఆ వ్యక్తి ఇతనే కదా? చాలా స్వర్థపూరితంగా ఉండే ఆ వ్యక్తి ఇతను కాదా? అతనికి ఏమైంది?

ప్రియ స్నేహితుడా, అప్పుడు నీవు ఒత్తిడికి గురై, నిన్ను నీవు వివరించుకోలేవు. నీకు తెలిసినదేమిటంటే, దేవుడు తన కృపాశక్తితో నీ జీవితాన్ని మార్చాడని.

5. ప్రార్థనపై మరియు వాగ్దానములను పొందుకోవడం పై బైబిల్ బోధన అమలుచేయడం ద్వారా ఎవరైతే ప్రార్థన చేస్తారో, స్త్రీలు, పురుషులు వారి ప్రార్థనలకు జవాబులు తరుచుగా అద్భుతరీతిగా దాదాపు గుర్తించబడిన విధంగా ప్రార్థనలకు జవాబులు వస్తాయి. ప్రతిరోజు కొన్ని వందల వేలసార్లు, తన పిల్లల ప్రార్థనలకు జవాబుగా అద్భుతాలు చేస్తాడు. అనారోగ్యంగా ఉన్నవారిని బాగుచేస్తాడు. ఆయన పాపము చేసినవారిని రక్షిస్తాడు. భయంతో ఉన్నవారికి మంచి మనస్సును ఇస్తాడు. నిరాశ, బాధలో ఉన్నవారికి, సమాధానము, సంతోషము, ఆనందము కలుగజేస్తాడు. భౌతిక అవసరాలను తీరుస్తాడు. ఆయన మనుష్యుల జీవనవిధానాన్ని మారుస్తాడు. ఇది అంతాకూడా ఎందుకు జరిగింది అంటే, బైబిల్లో వాగ్దానాలను కనుగొనేవారు, వాటిని నమ్మి కృపాసింహాసనము వద్దకు ధైర్యముగా వచ్చి, వాగ్దానాలు చేసిన దేవుని యెదుట వారి హృదయమును కుమ్మరించుతారు కాబట్టి.

దేవుని వాక్యము సత్యము గనుక, ప్రార్థనలకు జవాబులు లభిస్తాయి. బైబిలు గ్రంథము మొదటి పుస్తకము నుండి చివరి పుస్తకం వరకు దేవుడు ప్రార్థనలు వినటం గురించి వాటికి జవాబివ్వడం గురించి నింపబడింది.

యాకోబు 5:16-18లో ఈ విధంగా ఉంది: "మీ పాపములను ఒకనితోనొకడు ఒప్పుకొనుడి; మీరు స్వస్థతపొందునట్లు ఒకనికొరకు ఒకడు ప్రార్థనచేయుడి. నీతిమంతుని విజ్ఞాపన మనఃపూర్వకమైనదై బహు బలము గలదై యుండును. ఏలీయా మనవంటి స్వభావముగల మనుష్యుడే; వర్షింపకుండునట్లు అతడు ఆసక్తితో ప్రార్థన చేయగా మూడున్నర సంవత్సరములవరకు భూమిమీద వర్షింపలేదు. అతడు మరల ప్రార్థనచేయగా ఆకాశము వర్ష మిచ్చెను, భూమి తన ఫలము ఇచ్చెను."

ఎంత అద్భుతమైన విషయం! ఒక వ్యక్తి, నీలాంటి, నాలాంటి ఒక వ్యక్తి

ప్రార్థించాడు. అతను దేవుడు చెప్పిన మాటను ఉన్నది ఉన్నట్లుగా తీసికొని, దానిని నమ్మాడు. దేవుడు వాగ్దానం చేసిన దాన్ని ఆధారం చేసికొని దాని ప్రకారం ప్రార్థించాడు. దేవుడు ఆ ప్రార్థనలు విని వాటికి జవాబిచ్చాడు. 1 రాజులు 17:1 ప్రకారం, ఈ మనుష్యుని ద్వారా వర్షము నిలిపివేయబడునని, మరలా ఈ మనుష్యుడు ప్రార్థించేవరకు తిరిగి వర్షించదని దేవుని ద్వారా అతనికి చెప్పబడింది. కాబట్టి, దేవుడు వర్షమును నిలిపివేయాలని అతను ప్రార్థించగా మూడున్నర సంవత్సరముల వరకు వర్షము కురియలేదు (యాకోబు 5:17). దాని గురించి ఆలోచించండి! అదే వ్యక్తి ప్రార్థించగా ఆకాశము వర్షమిచ్చెను అని బైబిల్ సెలవిస్తున్నది (యాకోబు 5:18; 1 రాజులు 18:41-46).

వర్షము ఎక్కడనుండి వస్తుందో నీకు తెలుసా? అది తుఫాను సరిహద్దులనుండి అయిన అధిక పీడనం గల ప్రాంతాలనుండైనను, అల్పపీడనం గల ప్రాంతాలనుండైనను, గాలి చిత్తుప్రతుల నుండైనను రాదు గాని, వర్షము దేవుని నుండి వస్తుంది. అది ఎప్పుడు వర్షిస్తుందో, నీకు తెలుసా? దేవుని ప్రజలు ప్రార్థించినప్పుడు. అది ఎప్పుడు వర్షించదో నీకు తెలుసా? దేవుని ప్రజలు ప్రార్థించినప్పుడు. బైబిల్ ఆయన పరిశుద్ధ వాక్కు అనే సత్యానికి, నిత్యకృత్యంగా నిరంతరమైన ప్రార్థనలకు జవాబులు పొందుకొంటున్న దేవుని ప్రజలే సాక్ష్యము.

నువ్వంటావేమో, "బైబులును నేను నమ్మలేకపోతున్నాను. అది నిజం ఎలా అవుతుందో నేను గ్రహించలేకపోతున్నాను" అని. నీవు దానిని గురించి ఎప్పుడైనా ప్రార్థించావా? నిష్కపటంగా నీ హృదయాంతరంగాల్లో నుంచి నిన్ను రక్షించమని, నీకు విశ్వాసమును ఇవ్వమని, నీ జీవితమును మార్చుమని దేవుడిని ఎప్పుడైనా అడిగావవా? నీవు ఆవిధంగా చేసినంతవరకు, బైబిలు దేవుని వాక్యము కాదు అని అనడానికి, నీకు ఏ హక్కు లేదు.

6. బైబిల్లో గల గొప్ప ప్రకటనల్లో ఒక ప్రకటన ఏమిటంటే, ఎవరైతే యేసుక్రీస్తును నమ్ముతారో, అది వారిని దేవునితో జ్ఞానం గల సహవాసము కలిగివుండేలా చేస్తుంది. బైబిల్‌ను నమ్మిన జనసమూహములు, దేవుని పేరట ప్రార్థన చేసి, రక్షణ కొరకై ఆయన మిద నమ్మకముంచినవారందరు ఈ సత్యమును గురించి సాక్ష్యమిస్తారు. ఈ పుస్తకం చదివేవారిలో దాదాపు అందరికి, బైబిలుగ్రంథమును నమ్మిన, దాని ఆదేశాల ప్రకారము నడుచుకున్నవారు,

మరియు ప్రభువైన యేసుక్రీస్తుతో వ్యక్తిగత సంబంధంలోనికి ప్రవేశించిన వారు ఎవరో ఒకరు తెలిసే ఉంటుంది.

యోహాను 14:21–24 వచనాలలో బైబిలు ఈ విధంగా చెప్తున్నది. “నా ఆజ్ఞలను అంగీకరించి వాటిని గైకొనువాడే నన్ను ప్రేమించువాడు; నన్ను ప్రేమించువాడు నా తండ్రివలన ప్రేమింపబడును; నేనును వానిని ప్రేమించి, వానికి నన్ను కనబరచుకొందు నని చెప్పెను. ఇస్కరియోతు కాని యూదా ప్రభువా, నీవు లోకమునకు కాక మాకు మాత్రమే నిన్ను నీవు కనబరచుకొనుటకేమి సంభవించెనని అడుగగా యేసు ఒకడు నన్ను ప్రేమించిన యెడల వాడు నా మాట గైకొనును, అప్పుడు నా తండ్రి వానిని ప్రేమించును, మేము వాని యొద్దకువచ్చి వానియొద్ద నివాసము చేతుము. నన్ను ప్రేమింపని వాడు నా మాటలు గైకొనడు; మీరు వినుచున్న మాట నామాట కాదు, నన్ను పంపిన తండ్రిదే.”

నీవు దేవుని వాక్యమును విని, నమ్మి, దానికి విధెయత చూపినయెడల, అది ఖచ్చితంగా దేవుని వాక్యమే అని నీకు తెలియును. ఎందుకంటే, అప్పుడు, ఆయన, ఆయన తండ్రి వచ్చి నీతో సహవాసము చేయునని ప్రభువైన యేసుక్రీస్తు అన్నడు.

ఎవరైనా నీ గృహంలో ప్రవేసించి, దానిలో కాపురమున్న యెడల నీకు తప్పకుండ తెలుస్తుంది. నీకు తెలియకుండా ఉండటం అనేది అసాధ్యం. ప్రభువైన యేసుక్రీస్తు కూడా నీ హృదయంలోనికి వచ్చి, దానిలో నివాసము చేసినప్పుడు, నీకు తెలియకుండా ఉండటం అసాధ్యం.

దేవుని వాక్యాన్ని నమ్మడం అనేది నీ ఇష్టానికే వదిలివేయబడింది. నీవు నమ్మినట్లయితే, ఆ వాక్కులు సత్యమని వాటిని అవి నిరూపించుకుంటాయి. రోమా 8:15, 16లో బైఇలు ఈ విధంగా సెలవిస్తున్నది: ఏలయనగా మరల భయపడుటకు మీరు దాస్యపు ఆత్మను పొందలేదు గాని, దత్త పుత్రాత్మను పొందితిరి. ఆ ఆత్మ కలిగినవారమై మనము – అబ్బా తండ్రీ అని మొఱ్ఱపెట్టుచున్నాము. మనము దేవుని పిల్లలమని ఆత్మ తానే మన ఆత్మతో కూడా సాక్ష్యమిచ్చుచున్నాడు.”

దాని ఆజ్ఞలకు విధేయత చుపేంతగా, ప్రభువైన యేసుక్రీస్తును నీ స్వంత ప్రభువుగా, నీ స్వంత రక్షకునిగా అంగీకరించేంత వరకు, బైబిలు సత్యమే అని నీకు తెలియదు.

బైబిలు లోని కొన్ని భాగాలు దేవుని వాక్కులని, మిగతా భాగాలు కాదు అని బోధించడం ఏ భగాన్ని నమ్మాలో తెలియని అనిశ్చిత స్థితికి పాఠకుణ్ణి చేరుస్తుంది. క్రమక్రమంగా ఆ ఆలోచన, దేవుని వాక్యము పైన ఉన్న విశఅ్వసాన్ని సంపూర్ణంగా తొలగిస్తుంది. అయితే దేవుని యొక్క ప్రతి మాట నిజమైనది మరియు నమ్మదగినది లేదా మన నమ్మకాన్ని సంపూర్ణంగా పరిత్యజించాలి. ఎందుకంటే, ఆదికాండం మొదలుకొని ప్రకటన గ్రంథం వరకు, లేఖనాలన్నీ కలిపి నిలబడతాయి, లేదా పడిపోతాయి.

ప్రతి భూభాగానికి మరియు సముద్రంలోని దీవుల్లోనికి యూదులు చెదరగొట్టబడ్డారు. అయినప్పటికీ, వారు వారి జాతియొక్క గుర్తింపును నిలుపుకున్నారు. వారి యెరూషలేము రెండువేల సంవత్సరాల వరకు అన్యదేశస్తుల చేతుల్లో ఉంది. అయినను, ఈ ప్రాచీన పట్టణము యొక్క భాగాలు మరొక మారు యూదుల చేతుల్లో ఉన్నాయి. ఇదంతా కూడా గొప్ప ఖచ్చితత్వంతో బైబిల్లో ముందే చెప్పబడింది. ప్రభువైన యేసుక్రీస్తును తమ స్వంత రక్షకునిగా నమ్మిన వారి జీవితాలు ఏవిధంగా రూపాంతరము చెందినాయో, ఆ సాక్ష్యాలు మీ ముందర ఉన్నాయి.

కొన్ని వేలకొలది స్త్రీ, పురుషులు ప్రార్థనలకు జవాబులు పొందుకున్నామని సాక్ష్యమిచ్చుచున్నారు.

కాని, అన్నిటిని మించి, యేసుక్రీస్తును ప్రభువుగా, రక్షకునిగా అంగీకరించాలనే బైబిలు ఆజ్ఞకు నీవు విధేయత చూపినట్లయితే, నీకు కలిగే స్థిరమైన సమాధానము/శాంతియే బైబిలు దేవుని వాక్యము అన్నదానికి ఋజువు.

ఓ నా ప్రియస్నేహితులారా, మీరు దానిని నిరూపించుకోగలరా? నా మాట మీద కాదు, మరెవరో మాట మీద కాదు గాని, నీ మట్టుకు నీవు బైబిలును నమ్ము. బైబిలు ఏమి చెప్తున్నదో అది చేసి, నమ్మగల నిజాయితీగల హృదయమును కలిగి ప్రభువైన యేసుక్రీస్తు పేరట ప్రార్థన చేయి. నీ ఆత్మ రక్షణకు మరే నిరీక్షణ లేనంతగా ఆయనను నమ్ము. అపప్పుడు నేనేదైతే కనుగొన్నానో లెక్కించలేనన్ని వేలమంది ఏదైతే కనుగొన్నారా, అది నీవును కనుగొంటావు. అదేమిటంటే, బైబిల్ దేవుని వాక్యము అని.

# దేవుని సృష్టి

దేవుడు లేడని బుద్ధిహీనులు తమ హృదయములో అనుకొందురు (కీర్తనలు 14:1). ఆ స్థానము తీసుకునేవారు మరెవరు లేరు. బుద్ధిహీనునికి తప్ప అందరికి దేవుడు తెలుసు మరియు దేవున్ని నమ్ముతారు. అయితే, ప్రతి వ్యక్తికీ దేవుడు తెలియదు. అందువల్ల, మానవులు ఇంతటి భయంకరమైన విషయాలు చేసారని బైబిలు చెప్తున్నది.

రోమా 1:21-25 లో బైబిలు ఈ విధంగా చెప్తున్నది, "మరియు వారు దేవుని నెరిగియు ఆయనను దేవునిగా మహిమపరచ లేదు, కృతజ్ఞతాస్తుతులు చెల్లింపనులేదు గాని తమ వాద ములయందు వ్యర్థులైరి. వారి అవివేక హృదయము అంధ కారమయమాయెను; తాము జ్ఞానులమని చెప్పుకొనుచు బుద్ధిహీనులైరి. వారు అక్షయుడగు దేవుని మహిమను క్షయమగు మనుష్యులయొక్కయు, పక్షులయొక్కయు, చతుష్పాద జంతువులయొక్కయు, పురుగులయొక్కయు, ప్రతిమాస్వరూపముగా మార్చిరి. ఈ హేతువుచేత వారు తమ హృదయముల దురాశ లను అనుసరించి, తమ శరీరములను పరస్పరము అవమాన పరచుకొనునట్లు దేవుడు వారిని అపవిత్రతకు అప్పగించెను. అట్టివారు దేవుని సత్యమును అసత్యమునకు మార్చి, సృష్టికర్తకు ప్రతిగా సృష్టమును పూజించి సేవించిరి. యుగముల వరకు ఆయన స్తోత్రార్హుడై యున్నాడు, ఆమేన్."

కాబట్టి, దేవుని వాక్యము సెలవిస్తున్నదేమిటంటే, అందరు దేవుని జ్ఞానముచేత ప్రారంభించారు. అందరు, దేవుని మీద విశ్వాసముంచి వారి జీవితాలను ప్రారంభిస్తారు. ఏ మనుష్యుడు కూడా సర్వశక్తివంతుడైన దేవుని పై విశ్వాసలోపం కలిగి జన్మించలేదు. ఎవరైనా దానికి వ్యతిరేకంగా మాట్లాడి ఉండవచ్చు, ఎవరైనా వారిని ఆ సత్యంనుండి సిగ్గుపరచని ఉండవచ్చు. ఎవరో వారికి తప్పుగా బోధించి ఉండవచ్చు. కాని, మనుష్యులు దేవుని స్పృహతో ప్రారంభిస్తారు.

అయితే, ఈ జ్ఞానమునకు తప్పకుండా అభివృద్ధి లోపం ఉంటుంది, కాని,

వారికి సృష్టికర్త ఉన్నాడని, అతనికి వారు లెక్క అప్పజెప్పవలసి ఉందన్న కొంత అవగాహనతో ప్రతి ఒక్కరూ ఈ లోకములోనికి వస్తారు.

జీవిత ప్రయాణంలో కొన్ని అసాధారణమైన విషయాలు జరుగుతాయని బైబిలు చెప్తున్నది. మత్తయి 7:13లో ఈ విధంగా ఉన్నది: “నాశనమునకు పోవు ద్వారము వెడల్పును, ఆ దారి విశాలమునై యున్నది. దానిద్వారా ప్రవేశించువారు అనేకులు.” ఈ విశాల దారిలో దేవున్ని కీర్తించనివారు, వారికి జీవమును ఇచ్చినందుకు ఆయనకు కృతజ్ఞతలు చెల్లించనివారు ఉన్నారు. అందువల్ల వారి ఊహాగానాలలో వారు వ్యర్థులైరి.

ఇది వారని శాశ్వతమైన దేవునికి చెందాల్సిన కీర్తిని ఒక ప్రతిమగా మార్చేలా చేసింది. ఈ ప్రతిమ ఒక మనుష్యునిగా నైనను లేదా పక్షిగానైనను, లేదా చతుష్పాద జంతువుగానైనను లేదా ప్రాకే పురుగుగానైనను చేయబడుతుంది.

“నాగకరిత” చెందిన వ్యక్తులు కొందరు, క్రైస్తవేతరులను తిరస్కరిస్తారు, చెక్క లేదా రాతితో చేయబడిన ప్రతిమ పైన విశ్వాసం ఎలా ఉంచుతారు అని ఆశ్చర్యపడతారు. కానీ అదే వ్యక్తులు విగ్రహాలు, ప్రతిమలు గల చర్చిలకు వెళతారు.

కొందరు ‘జ్ఞానోదయం’ అయిన వ్యక్తులు వారి గృహములో లేదా వారి పచ్చికలో ఏదైనా మునిని గాని కన్యకను గాని వర్ణించే విగ్రహాలు కలిగియుంటారు. మరికొందరు ఏదైనా పవిత్ర స్థలములో ఏదైన ప్రతిమను కాని విగ్రహమును గాని పూజిస్తారు.

వారు విగ్రహాల వైపుకి మరలడానికి కారణ, మొదట దేవుని నుండి మరలిపోయారు కాబట్టి, అని బైబిల్ స్పష్టంగా చెప్తున్నది. మరియు మనము రోమా 1:24 లో చదువుతాము, “దేవుడు వారిఆని అపవిత్రతకు అప్పగించెను’ అని. ఒక అన్యమతస్తుడిగానో లేదా విగ్రహారాధకుడిగానో ఎవరూ జీవితాన్ని ప్రారంభించరు. మనుష్యులు మొదట దేవుణ్ణి వదిలేసి అప్పుడు విగ్రహాల వైపు మరలుతారు. దానికి బదులుగా దేవుడు కూడా వారిని విడిచిపెడతాడు. నా స్నేహితుడా, అది భయంకరమైన ఆలోచన.

ఒక ప్రతిమగాని ఒక విగ్రహం గాని ఎవరినీ రక్షించదన్న విషయం నీకు తెలుసు. అది చెక్క లేదా రాతితో చేయబడినదని నీకు తెలుసు. మనిషి తన స్వహస్తాలతో దానిని తయారుచేసాడు. నీవు దానికి వెల చెల్లించి దానిని కొనుగోలు చేసావు. నేను కొనుగోలు చేసే దేవున్ని నేను కలిగియుండను. నేను

వెల చెల్లించే దేవున్ని నేను కలిగియుండను. నా దేవుడు భూమ్యాకాశములను సృష్టించాడు. అదంతా ఆయన సొంతం. ఆయన చెక్క లేదా శిల ద్వారా చేయబడలేదని నేను హామీ ఇవ్వగలను.

మీలో కొందరు విగ్రహారాధన సరియైనదే అంటారు. క్రైస్తవులుగా పిలువబడే మీ ప్రియమైన వ్యక్తులో, మీ కుటుంబ సభ్యులో వెళ్లే చర్చీలు ప్రతిమలతో, విగ్రహాలతో నింపబడి ఉన్నాయి కాబట్టి. నా స్నేహితుడా, దేవునికి వ్యతిరేకంగా వారి పాపములకు ఆమోదం తెల్పడం ద్వారా నువ్వెన్నడు కూడా నీ బంధువర్గానికి సహాయం చెయ్యలేవు. విగ్రహారాధన దేవునికి అసహ్యమైనది. మరి ముఖ్యంగా అవి ఆయన పేరునుగాని, ఆయన పరిశుద్ధ గ్రంథములోని వ్యక్తుల పేర్లు కలిగియున్నట్లయితే ఇంకా అసహ్యం పుట్టిస్తుంది.

అంతమాత్రమే కాదు. కొందరు (వాస్తవానికి ఇలా చెప్పడం బాధాకరమే గాని, చాలామంది) విగ్రహారాధనలో పాలుపొందని వారు దేవుని సత్యాన్ని అబద్ధంగా మార్చారు. రోమా 1:25 లో మనం చూడవచ్చు, “అట్టివారు దేవుని సత్యమును అసత్యమునకు మార్చి”

యోహాను 17:17 లో యేసు క్రీస్తు ఈవిధంగా అన్నాడు. ‘సత్యమందు వారిని ప్రతిష్ఠచేయుము; నీ వాక్యమే సత్యము.’ దేవుని వాక్యము సత్యము. బైబిలు సత్యము కాదుని, లేఖనాలు నిజము కావని, వాక్యములో కొన్ని నమ్మకం కలిగించని విషయాలు ఉన్నాయని అనేవారు ఉన్నారు. ఈ నాస్తికులు, బైబిల్లోని తప్పులు, పొరపాటులను తొంగిచూచి సణుగుతుంటారు. అటువంటి వారందరు దేవుని సత్యాన్ని అబద్ధంగా మార్చారు.

రోమా 1:26 వీరిగురించి ఈ విధంగా చెప్తున్నది: “అందువలన దేవుడు తుచ్ఛమైన అభిలాషలకు వారిని అప్పగించెను.” నీవు దేవున్ని వదిలేసినట్లయితే, దేవుడు కూడా నిన్ను వదిలేస్తాడని బైబిల్ చెప్తున్నది. మరి అప్పుడు నువ్వెక్కడ ఉంటావు?

అది దేవుని పరలోకము. ఆయన సింహాసనము అక్కడ ఉంది. దేవుడు నిన్ను విడిచిపెట్టినట్లయితే, నా స్నేహితుడా, నీవు పరలోకము లేకుండా ఉంటావు. నువ్వు నిత్యజీవం లేకుండా ఉంటావు.

మరొక గుంపు ఉంటుంది, వీరు విగ్రహారాధన చేయరు, మరియు సత్యాన్ని అసత్యంగా మార్చరు గాని, వీరు సృష్టికర్తకంటె సృష్టించబడిన ప్రాణులను ఆరాధిస్తారు, సేవిస్తారు అని బైబిల్ చెప్తున్నది.

నువ్వు సృష్టింబడ్డావు. నీవు దేవుని ప్రాణివి. నీవు దేవుని కొరకు కాకుండ నీకొరకే జీవిస్తావా? నీవు, దేవుడు ఇచ్చిన వాటి ప్రకారం కాకుండా, నీ స్వంత అభిప్రాయాలు, నీ స్వంత నియమాలు, నీ స్వంత ప్రామాణికాల ప్రకారమే జీవిస్తావా?

జీవితంలో నీ మార్గాన్ని, దేవున్ని పరిగణలోనికి తీసికొని నిర్మించుకుంటావా లేదా దేవుడిని పరిగణలోనికి తీసికొనకుండా నిరి%ఇ%ంచుకుంటావా? నీ జీవితము నీ స్వయ నిశ్చయమా లేదా దేవుడు నీ జీవితాన్ని ఏలుతున్నాడా? దేవుడు ఇటువంటి వారిని కూడా విడిచిపెడతాడని బైబిలు చెప్తున్నది.

దేవుడు నిన్ను విడిచిపెట్టడమనేది బాధాకరమైన విషయము. దేవుడు చాలా ఓర్పుగలవాడు. ఆయన ప్రేమ, కరుణ అధికంగా చూపించేవాడు. అంతటి ఓర్పు, సహనము మరెవరికి లేదు. కాబట్టి, దేవుడు నిన్ను విడిచిపెట్టేంత స్థితికి నీవు చేరుకున్నట్లయితే, నీవు తలుపు మూయబడిన నరకంతో సమానము.

నీవు ఈ మాటలు చదువుతున్నావంటే, నీ హృదయాంతరంగాల్లో నీకు ఇంకా దేవుని పైన నమ్మకమున్నదని కనబడుతుంది. సర్వశక్తిమంతుడైన దేవునితో నీకున్న సంబంధము గురించి ఇంకా కొంత ఆందోళన ఉంది. దాని విషయంలో నీవు ఏదో ఒకటి చేయాలి.

విగ్రహారాధన నీ మార్గములో అడ్డుగా ఉన్నట్లయితే, ఆ ప్రతిమలను నీవు ఉపేక్షించవలసి ఉంది. అది పాపమని ఒప్పుకో. వాటితో ఏ సంబంధమున్ననూ దానిని తిరస్కరించి సత్యవంతుడైన, జీవముగల దేవునియొద్దకు వచ్చి, నీ ఆత్మ రక్షణకు ఆయన మీద విశ్వాసముంచు.

బైబిలును నమ్మరాదని, సాతాను చేత మోసపరచబడినవారిలో నీవు కూడా ఉన్నట్లయితే, ఆ పాపమును బట్టి పశ్చాత్తాపపడు. మానవజాతిలో అది అత్యంత పురాతనమైన పాపము. దేవుడు అబద్ధం చెప్పాడని ఏదెను వనములో సాతాను హవ్వతో అన్నది. ఆమె సాతానును నమ్మింది. అప్పుడు ఆమె ఏమి కనుగొన్నదో తెలుసా? దేవుడు అబద్ధం చెప్పలేదని కనుగొన్నది. ఆమె మరణించింది! దేవుడు అబద్ధం చెప్పలేదని ఆదాము కనుగొన్నాడు. ఆదాము మరణించింది.

దేవుని వాక్యము సత్యం కాదని, నీవు మరణించేవరకు సాతాను నీతో చెప్తాడు. అది ఖచ్చితంగా నిజమని దేవుడు చెప్తున్నాడు.

'మీరు ఎవని సేవించెదరో కోరుకొనుడి' (యెహోషువ 24:5). దేవుడు నిన్ను వదిలివేయకముందు, ఆయనను నమ్ముతమని నిన్ను త్వరపెడుతున్నాను.

నీవు సృష్టికర్త (నీ దేవుడు) కంటె సృష్టింపబడిన ప్రాణిని (నిన్ను) ఎక్కువగా సేవించినట్లయితే, నిన్ను నీవు ఉపేక్షించుకొని, తన కుమారుడైన యేసుక్రీస్తు ద్వారా దేవుని యొద్దకు రమ్ము. నీకు మరే నిరీక్షణ లేదు. నువ్వు దేవుడివి కాదు. సాతాను దేవుడు కాదు. అచేతనమైన వస్తువులు మరియు విగ్రహములు దేవుడు కాదు.

దేవుడు ఉన్నవాడను అనువాడైయున్నాడు. ఆయన ఎప్పటికీ జీవిస్తాడు. ఆయన ఆదియు, అంతమునైన ఉన్నాడు. మరియు నేను సరిగా చెప్పినట్లయితే, ఆయన మధ్యలో కూడా ఉన్నాడు. ఆయనే దేవుడు. ఆయన నీకు తెలుసా?

ఈ పాఠంలోని మిగతా భాగమంతయూ దేవుని సృజనాత్మకమైన కార్యమును గురించి వివరిస్తుంది. దృశ్యమైనవాటికి, అదృశ్యమైనవాటికి, మరియు సమస్తానికి దేవుడు సృష్టికర్తయని బైబిలు చెప్తుందన్న వాస్తవం స్థాపితమైనది. లేఖనాలను నమ్మే వారందరికి ఇది సులభంగా అర్థమవుతుంది.

హెబ్రీ 11:3 లో ఈ విధంగా ఉంది: "ప్రపంచములు దేవుని వాక్యము వలన నిర్మాణమైనవనియు, అందునుబట్టి దృశ్యమైది కనబడెడు పదార్థములచే నిర్మింపబడలేదనియు విశ్వాసము చేత గ్రహించుకొనుచున్నాము."

దేవుని గురించి మరియు ఆయన అద్భుతజ్ఞానం మరియు శక్తి గురించి తెలిసికొన్న తరువాత, దేవుడు ఈ భూగోళమును సృష్టించాడని అంగీకరించడం సహజమే.

ఈ ప్రత్యక్షత, ప్రయోగ శాస్త్రము నుగొన్నవాటితో సరిపడాలని మనము ఎదురచూడాలి. అది సరిపడుతుంది కూడా.

ఏదైనా సరిపడని విషయం కనిపించినట్లయితే, ఆ సమస్యను తొలగించడానికి మనము ఈ క్రింది విషయాలను తెలిసికొని అంగీకరించాలి.

1. ప్రయోగశాస్త్రము వాస్తవాలన్నీ సేకరించలేదు. దేని గురించైనా సేకరించిన వాస్తవాలనీ సేకరించినట్లయితే, అవన్ని బైబిలుతో సరితూగుతున్నాయి.

2. లేఖనాల గురించి మనకున్న జ్ఞానం అసంపూర్ణమైనది.

దేవునిని సృష్టికర్తగా విశ్వసించడంలో మనిషికి ఉన్న ఇబ్బందులను తొలగించడానికి మేము ఉద్దేశించాం. కారణం యొక్క వ్యయంతో కాకుండా కారణాన్ని విజ్ఞప్తి చేయడం ద్వారా.

మొట్టమొదటగా, దేవుడు లోకమును, దానిలో ఉన్న సమస్తమును సృష్టించాడని బైబిలు చెప్తున్నది. ప్రత్యేకంగా, అవి ప్రభువైన యేసుక్రీస్తు ద్వారా రూపించబడినవి అని మనకు చెప్పడం జరిగింది.

బైబిలు తీసిన వారిలో దాదాపుగా అందరికి ఆదికాంటము 1:1 తెలిసే ఉంటుంది. వాస్తవానికి, బైబిలు ఎన్నడూ చదవని వారిలో లెక్కలేనన్ని లక్షలమందికి ఈ వచనం తెలిసియున్నది.

ఈ గొప్ప భాగంలో, దేవుని వాక్యము క్లుప్తంగా ఇలా అంటుంది: "ఆదియందు దేవుడు భూమిని, ఆకాశమును సృజించెను." వాదనచేత బైబిలు ప్రారంభం కాలేదని గమనించండి. బైబిలు ఒక వివరణతో ఆరంభమవుతుంది. ఒక ఖచ్చితమైన సత్యాన్నిప్రకటిస్తూ బైబిలు ప్రారంభించబడుతుంది.

మానవుడు దానిని స్వీకరించవచ్చు లేదా వదిలివేయవచ్చు.

అది హెబ్రీయులకు 11:3 తో ఎలా సరిపడిందో గమనించావా?

అందులో అర్థం చేసికొనడానికి ఏమీలేదు–

అది నమ్మకానికి సంబంధించిన విషయము.

ప్రారంభంలో దేవుడు తప్ప మరేది లేదు.

ప్రజలు అంటారు, దేవుడు ఎక్కడనుండి వచ్చాడు?" అని

కాదు, కాదు, కాదు, 'ఎక్కడ' అనునది దేవుని నుండి వచ్చింది. సమస్తము దేవునినుండి వచ్చినప్పుడు, మరెక్కడినుండో రావడానికి లేదు.

సృష్టించడం అనేది శూన్యంలో నుండి దేన్నైనా తయారుచేయడం. దేవుడు భూమిని ఆకాశమును సృష్టించాడు. హెబ్రీ 1:1–2 లో ఇలా చెప్పబడింది. "పూర్వకాలమందు నానా సమయములలో నానా విధములుగాను ప్రవక్తలద్వారా మన పితరులతో మాట్లాడిన దేవుడు ఈ దినముల అంతమందు కుమారుని ద్వారా మనతో మాట్లాడెను. ఆయన ఆ కుమారుని సమస్తమునకు వారసునిగా నియమించెను. ఆయన ద్వారా ప్రపంచములను నిర్మించెను."

భూమిని ఆకాశమును ఎవరు సృజించారు?

దేవుడు.

దేవుడు ఎలా సృష్టించాడు?

తన కుమారుడైన యేసుక్రీస్తు ప్రభువు ద్వారా. ఈ ప్రపంచమును రూపించి, ఏర్పాటుచేసే కార్యము, కుమారుడైన దేవుడు చేసాడు. "మరియు ప్రభువా, నీవు ఆదియందు భూమికి పునాది వేసితివి ఆకాశములు కూడా నీ చేతిపనులే.

అవి నశించును గాని, నీవు నిలిచియుందువు. అవన్నియు వస్త్రమువలె పాతగిలును, ఉత్తరీయమువలె వాటిని మడచివేతువు, అవి వస్త్రమువలె మార్చబడును గాని నీవు ఏకరీతిగానే యున్నావు, నీ సంవత్సరములు తరుగవు అని చెప్పుచున్నాడు?" (హెబ్రీ 1:10-12).

భూమిని, ఆకాశమును ఏర్పరచకమునుపు దేవుడున్నాడు.

ఆయన తన స్వహస్తాలతో, భూమిని, ఆకాశమును, పునాదులను ఏర్పాటుచేసాడు. మరియు అవన్ని గతించిపోయినప్పుడు ఈ విశ్వం గతించినప్పుడు, నీవు జీవించే ఈ గ్రహము గతించిపోయినప్పుడు, యేసుక్రీస్తు ప్రభువు.

ఈరోజు ప్రజలు క్షామము గురించి, కరువు, ఆకలి, హింసించబడడం, చంపివేయబడడం మరియు నియంత్రణ లేని ప్రభుత్వాల గురించి ఆందోళన చెందుతున్నారు. జీవావరణ శాస్త్రము గురించి భూమిని సంరక్షించుటను గురించి ఆందోళన చెందుతున్నారు. అణ్వాయుధాల చేత భూమి నాశనము చేయబడుతుందేమో అని వారు ఆందోళన చెందుతున్నారు.

నన్ను ఒకటి చెప్పనివ్వండి. నా స్నేహితుడా, నీవు సత్యవంతుడైన దేవుడిని ఎరిగి, ఆయన కుమారుడైన యేసుక్రీస్తు ప్రభువును నీ స్వంత రక్షకునిగా అంగీకరించినట్లయితే, మరియు నిత్యజీవమును ఆయనయొద్దనుండి పొందుకున్నట్లయితే, నీవు ఆయనతో ఎప్పటికీ ఉంటావన్న ఖచ్చితమైన వాగ్దానము నీకు ఉన్నట్లయితే, భూమి నాశనమవ్వడం గురించి నీవు ఆందోళన చెందనవసరం లేదు. ఆకాశములు నాశనమవడం గురించి నీవు ఆందోళన చెందాల్సిన పనిలేదు. అవి తప్పకుండా నాశనమవుతాయి. కానీ, భూమి ఆకాశములు ఎంత ఖచ్చితంగా నాశనమవుతాయో, అంతే ఖచ్చితంగా దేవుడు నిలిచి ఉంటాడు. నీవు చిరకాలము ఆయనతో సురక్షితంగా ఉంటావు. మనుష్యులు భూమిని గురించి ఆందోళన చెందడం కంటె, వారి ఆత్మలను గురించి ఆందోళన చెందాల్సి ఉంది. అది ప్రాముఖ్యమైన విషయం.

"ఆయన మనలను అంధకార సంబంధమైన అధికారములోనుండి విడుదల చేసి, తాను ప్రేమించిన తన కుమారునియొక్క రాజ్య నివాసులనుగా చేసెను. ఆ కుమారుయందు మనకు విమోచనము, అనగా పాపక్షమాపణ కలుగుచున్నది. ఆయన అదృశ్యదేవుని స్వరూపియై సర్వసృష్టికి ఆదిసంభూతుడై యున్నాడు. ఏలయనగా, ఆకాశమందున్నవియు భూమియందున్నవియు, దృశ్యమైనవిగాని,

అదృశ్యమైనవిగాని, అవి సింహాసనములైనను, ప్రభుత్వములైనను ప్రధానులైనను, అధికారములైనను, సర్వమును ఆయన యందు సృజింపబడెను. సర్వమును ఆయన ద్వారాను ఆయనను బట్టియు సృజింపబడెను. ఆయన అన్నిటికంటె ముందుగా ఉన్నవాడు, ఆయనే సమస్తమునకు ఆధారభూతుడు." (కొలొస్స 1:13-17).

బైబిలు యొక్క దేవుడు ఉన్నాడు. ఆయన నీ సృష్టికర్త. అది అంతకంటె స్పష్టంగా చెప్పబడలేదు. దేవుడు అన్నిటికంటె ముందుగా ఉన్నవాడు. మరియు ఆయనద్వారా అన్నియు కలిగివుంటాయి. సమస్తము ఆయనచేత, ఆయన కొరకు సృష్టించబడింది.

ఏది చేయాలో, ఏది నమ్మాలో, ఎలా జీవించాలో వారికి చెప్పే హక్కు దేవునికి లేదని కొందరుంటారు.

స్నేహితుడా, దేవుడు నిన్ను రూపించకయుంటే, నీవు ఇక్కడ ఉండేవాడివే కాదు. దేవుడు దానిని అనుమతించకయుంటే, నిన్ను బ్రతికి ఉంచేందుకు, నీ గుండె శరీరమంతటికి రక్తము సరఫరా చేయదు.

నీవేమైయున్నావో, నీవు కలిగియున్నదంతయు, మరియు నీవు ఏమైయుంటావో, అదంతయు దేవుని కార్య ఫలితమే. ఆయన ధూళి, నీరు నుండి నీ శరీరమును చేయబడింది. నీవు ఆయన వాయువును పీల్చుతున్నావు. ఆయన ఆహారమును భుజించుచున్నావు. నీకు కలిగిన జీవము ఆయన నుండి వచ్చిందే. నీవు ఆయనకు చెందినవాడవు. ఆయనకు పరిపూర్ణమైన ఖచ్చితమైన హక్కు ఉంది. వాస్తవానికి నీవు ఏమి చేయాలో, ఎలా జీవించాలో చెప్పే హక్కు ఆయనకు మాత్రమే ఉంది. నీవు ఎలా జీవించవలెనో నీకు నీవు చెప్పుకునే హక్కు నీకు ఖచ్చితంగా లేదు.

దేవుడు నిన్ను రూపించాడు. యోహాను 17:5 లో ఈ విధంగా ఉంది, "తండ్రీ, లోకము పుట్టక మునుపు నీ యొద్ద నాకు ఏ మహిమ యుండెనో ఆ మహిమతో నన్ను ఇప్పుడు నీ యొద్ద మహిమపరచుము."

తండ్రి, వాక్యము, పరిశుద్ధాత్మ, లోకము ఏర్పరచబడక ముందే, వారు సృష్టించుటకు ఉండెను. వారి జ్ఞానము, వారి తెలివి, వారి బలము నీకంటె ఉన్నతమైనదని గమనించావా?

దేవుడు భూమి, ఆకాశములను ఎప్పుడు సృష్టించాడో మనకు తెలియదు కాని, ఆయన ఆరు రోజులలో వాటిని ఇప్పుడున్న రూపమనకు తీసికొచ్చాడని, భూమ్మీద నున్న జంతువులన్నిటిని సృష్టించాడని మనకు తెలుసు.

ఆదికాండము 1:3–5 లో బైబిలు ఈ విధంగా చెప్తున్నది: "దేవుడు – వెలుగు కమ్మని పలుకగా వెలుగు కలిగెను. వెలుగు మంచిదైనట్టు దేవుడు చూచెను, దేవుడు వెలుగును, చీకటిని వేరుపరచెను. దేవుడు వెలుగునకు పగలనియు, చీకటికి రాత్రి అనియు పేర్లు పెట్టెను. అస్తమయమును, ఉదయమును కలుగగా ఒక దినమాయెను."

ఇక్కడ కాలము గూర్చిన ప్రశ్న ఉండకూడదు. అవి ఖచ్చితమైన ఇరవై నాలుగు గంటల కాలవ్యవధి గలవి. మనకు పగలు ఉంది – అది వెలుగు, మరియు రాత్రి ఉంది – అది చీకటి. అస్తమయము, ఉదయము కలిగితే, అది ఒక దినము. ఈ రోజులలో దినములు అని ఏవిధంగా అనబడుతున్నాయో అదే విధంగా ఇది మొదటి దినము. అది ఉన్న ప్రకారం దానిని నమ్ము. దేవుని సత్యాన్ని అబద్ధంగా మార్చడానికి ప్రయత్నించి నీ ఆత్మను ఇబ్బంది పెట్టకు. దేవుడు చెప్పిన మాటను ఉన్నది ఉన్నట్టుగా తీసికొని, ఆయన చెప్పింది నమ్ము.

కొందరు దేవుడు భూమిని, ఆకాశాన్ని సృష్టించడానికి శక్తిమంతుడు అని నమ్మి, వాటిని ఆరు రోజులలో సృష్టించాడన్న సత్యాన్ని నమ్మలేకపోవడం నాకు ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. ఆయన ఆ విధంగా చేయుటకు శక్తిమంతుడైనప్పుడు, అది ఆయనకు ఎంతో కాలము ఎందుకు పడుతుంది?

ఆదికాండము 1:6–13 "మరియు దేవుడుజలముల మధ్య నొక విశాలము కలిగి ఆ జలములను ఈ జలములను వేరుపరచును గాకని పలికెను. దేవుడు ఆ విశాలము చేసి విశాలము క్రింది జలములను విశాలము మీది జలములను వేరుపరపగా ఆ ప్రకారమాయెను. దేవుడు ఆ విశాలమునకు ఆకాశమని పేరు పెట్టెను. అస్తమయమును ఉదయమును కలుగగా రెండవ దినమాయెను. దేవుడుఆకాశము క్రిందనున్న జలము లొకచోటనే కూర్చబడి ఆరిన నేల కనబడును గాకని పలుకగా ఆ ప్రకారమాయెను. దేవుడు ఆరిన నేలకు భూమి అని పేరు పెట్టెను, జలరాశికి ఆయన సముద్రములని పేరు పెట్టెను, అది మంచిదని దేవుడు చూచెను. దేవుడుగడ్డిని విత్తనములిచ్చు చెట్లను భూమిమీద తమ తమ జాతి ప్రకారము తమలో విత్తనములుగల ఫలమిచ్చు ఫలవృక్షములను భూమి మొలిపించుగాకని పలుకగా ఆ ప్రకార మాయెను. భూమి గడ్డిని తమ తమ జాతి ప్రకారము విత్తనములిచ్చు చెట్లను, తమ తమ జాతి ప్రకారము తమలో విత్తనములుగల ఫలవృక్షములను మొలిపింపగా అది మంచిదని దేవుడు చూచెను అస్తమయమును ఉదయమును కలుగగా మూడవ దినమాయెను."

వృక్షాలు ఎక్కడనుండి వచ్చాయి? వృక్షసంపద, ఫలాలు మరియు కూరగాయలను ఇచ్చే వృక్షాలు ఎక్కడనుండి వచ్చాయి? దేవుడు వాటిని మూడవ దినమున సృష్టించాడు. ఇప్పుడు మనము నాలుగవ దినమునకు వద్దాము.

ఆదికాండము 1:14-19: "దేవుడుపగటిని రాత్రిని వేరుపరచునట్లు ఆకాశవిశాల మందు జ్యోతులు కలుగును గాకనియు, అవి సూచనలను కాలములను దిన సంవత్సరములను సూచించుటకై యుండు గాకనియు, భూమిమీద వెలుగిచ్చుటకు అవి ఆకాశ విశాలమందు జ్యోతులై యుండు గాకనియు పలికెను, ఆ ప్రకారమాయెను. దేవుడు ఆ రెండు గొప్ప జ్యోతులను, అనగా పగటిని ఏలుటకు పెద్ద జ్యోతిని రాత్రిని ఏలుటకు చిన్న జ్యోతిని నక్షత్రములను చేసెను. భూమిమీద వెలు గిచ్చుటకును పగటిని రాత్రిని ఏలుటకును వెలుగును చీక టిని వేరుపరచుటకును దేవుడు ఆకాశ విశాలమందు వాటి నుంచెనుబీ అది మంచిదని దేవుడు చూచెను. అస్తమయ మును ఉదయమును కలుగగా నాలుగవ దినమాయెను."

నాలుగవ దినము గురించి ప్రత్యేకంగా చెప్పుకోవానికి రెండు విషయాలు ఉన్నవి. మొదటిది, ఇవన్నియు కొన్ని దినాలలో చేయబడలేదు గాని, నిజానికి, కొన్ని వేల సంవత్సరాలు పట్టింది అని బోధించేవారు ఉన్నారు. కానీ, సూర్యరశ్మి లేకుండా వృక్షసంపద జీవించలేదు. ఇది భూమిమీద నియమింపబడిన ధర్మము. వృక్షసంపద మూడవ దినమున సృష్టించబడింది. సూర్యుడు నాలుగవ దినమున సృజించబడ్డాడు. కాబట్టి, రెండు దినముల మధ్య, చాల కాలవ్యవధి ఉన్నట్లయితే, సూర్యుడు సృష్టించబడక ముందే వృక్షసంపద మరణించి ఉండేది. నమ్మికలేని శాస్త్రవేత్తలకంటె దేవుడు మిక్కిలి తెలివిగలవాడు. ఆయన శక్తి గురించి నీకు ఏ ప్రశ్న, ఏ వాదన లేకుండా, దేవుడు సృష్టిని చేసాడు.

రెండవది, నీవు రాత్రి నక్షత్రములను చూచినప్పుడు, వాటి సంఖ్య చెప్పలేవు. వాటి మధ్యలో ఉన్న దూరాన్ని చెప్పలేవు. అయినప్పటికీ, 'ఆయన నక్షత్రములను చేసెను' అని బైబిలు చెప్తున్నది. దేవుని శక్తి ఎంత అద్భుతమైనదంటే, ఈ నక్షత్ర దండును సృజించడానికి ఆయన ఎంతమాత్రమును తన కృషిని వినియోగించలేదు. "దేవుడుజీవముకలిగి చలించువాటిని జలములు సమృద్ధిగా పుట్టించును గాకనియు, పక్షులు భూమిపైని ఆకాశ విశాలములో ఎగురును గాకనియు పలికెను. దేవుడు జల ములలో వాటి వాటి జాతి ప్రకారము జలములు సమృద్ధిగా పుట్టించిన మహా మత్స్యములను, జీవముకలిగి చలించు వాటినన్నిటిని,

దాని దాని జాతి ప్రకారము రెక్కలుగల ప్రతి పక్షిని సృజించెను. అది మంచిదని దేవుడు చూచెను. దేవుడు మీరు ఫలించి అభివృద్ధిపొంది సముద్ర జలములలో నిండి యుండుడనియు, పక్షులు భూమిమీద విస్తరించును గాకనియు, వాటిని ఆశీర్వ దించెను. అస్తమయమును ఉదయమును కలుగగా అయి దవ దినమాయెను." (ఆదికాండము 1:20-23).

పరిణామక్రమం ఖచ్చితంగా, పూర్తిగా, నరకము నుండి వచ్చిన అత్యంత చెడ్డదైన అబద్ధము. జీవసంపద నీకు ఎలా కనుబడుతుందో, అలానే సృష్టించబడింది. "తప్పిపోయిన వలయము" ఒకటి కూడా కనబడలేదు, కనబడదు. వలయాలనేవి అసలు లేవు కాబట్టి అవి తప్పిపోలేదు. "దేవుడు వాటి వాటి జాతి ప్రకారము జీవముగల వాటిని, అనగా వాటి వాటి జాతి ప్రకారము పశువులను పురుగులను అడవి జంతువులను భూమి పుట్టించుగాకని పలి కెనుబీ ఆప్రకారమాయెను. దేవుడు ఆ యా జాతుల ప్రకారము అడవి జంతువులను, ఆ యా జాతుల ప్రకారము పశువులను, ఆ యా జాతుల ప్రకారము నేలను ప్రాకు ప్రతి పురుగును చేసెను. అదిమంచిదని దేవుడు చూచెను. దేవుడు మన స్వరూపమందు మన పోలికె చొప్పున నరులను చేయుదముబీ వారుసముద్రపు చేపలను ఆకాశ పక్షులను పశువులను సమస్త భూమిని భూమిమీద ప్రాకు ప్రతి జంతువును ఏలుదురుగాకనియు పలికెను." (ఆదికాండము 1:24-26).

ఈ వచనాలన్ని దేవుని సృష్టిని గురించి వ్రాయబడియున్నవి. దేవుడు మానవు సృజించాడు. నేలనుండి మన్ను తీసుకొని ఆయన మానవుని రూపించాడు. అలా నీవు చేయబడ్డావు, దేవుడే నీ దేవుడు.

ఇప్పుడు, నీవు దేవుణ్ణి అంగీకరించి, నిత్యత్వమును మరియు నిత్యజీవమును ఆయననుండి పొందుకుంటావో, లేదా నీ పైన ఆయన అధికారమును, ప్రభుత్వమును నిరాకరించి, అగ్నిగుండంలో ప్రవేశించి, జీవముకంటె మరణములో నిత్యము ఉంటావో అనేది వాస్తవాలను ఏమాత్రము మార్చదు.

శాశ్వతమైన, మార్పులేని వాస్తవమేమిటంటే, నీవు దేవుని సృష్టిలో ఒకడివి మరియు ఆయనను నమ్ముటకు నీవు సిద్ధపడి ఉండాలి. 'మీ దేవుని సన్నిధిని కనబడుటకై సిద్ధపడుడి.' (ఆమోసు 4:12).

'నేను ఆయన సన్నిధిలో ఎలా కనబడగలను?' అని నీవు అంటావేమో. నీవు నేరుగా ఆయన యెదుట కనబడలేవని తెలిసి, దేవుడే స్వయాన నీ యొద్దకు

వచ్చాడు. ఆయన మనుష్యరూపమును దాల్చి, ప్రభువైన యేసుక్రీస్తుగా నీ యొద్దకు వచ్చాడు. నీ పాపమునకు శిక్షపొందడం తప్ప దాని గురించి నీవు మరేమి చేయలేవు. కాని దేవుడు, నిన్ను ఎంతో ప్రేమించాడు గనుక, నీ పాపమును ఆయన మిద వేసికొని, మ్రానుపైన ఆయన శరీరములో నీ పాపమును భరించాడు.

ప్రభువైన యేసుక్రీస్తు కల్వరి సిలువలో మరణించినప్పుడు, నీ పాపమునకు పరిహారము చెల్లించుటకు మరణించాడు. మరియు, ఆయన దేవుడు గనుక, ఆయనకు అపరిమితమైన జీవము యొక్క శక్తి ఉంది గనుక, ఆయన మూడు పగళ్లు, మూడు రాత్రుల తర్వాత, మృతులలోనుండి తిరిగి లేచాడు. నిన్ను రక్షించడానికి ఆయన చేయవలసిందంతా చేసాడు. నీవు నేడే ఆయనను నమ్మి తిరిగి జన్మించవా?

# దేవుని క్రమం

ఈ పాఠంలో మనము, దేవుని సృజనాత్మకమైన పనిని గూర్చిన ధ్యానాన్ని కొనసాగిద్దాం. ఇంతకుముందు పాఠంలో కుమారుడైన దేవుడు ఈ లోకమును మరియు లోకములో ఉన్నదంతయు సృష్టించాడని బైబిలు చెప్తున్నట్లు మనం చూసాం. దేవుడు ఆదియందు భూమిని, ఆకాశమును సృజించాడు. మరియు కేవలం ఆరురోజుల్లో అవి ప్రస్తుతమున్న ఆకారమునకు తీసికొని వచ్చి, భూమ్మీద జంతు సంపదను సృష్టించాడు. భూమి యొక్క సృష్టి మరియు దానిని ప్రస్తు రూపంలోకి తీసుకురావడం మధ్య గడిచిన సమయం అన్ని భౌగోళిక యుగాలకు స్థలాన్ని ఇస్తుంది. బైబిలుకు మరియు నిజమైన శాస్త్రములకు మధ్య విభేదాలు లేవు.

భూమి, ఆకాశమునకు సృజించడం, తరువాత జంతువులను, ఆ తరువాత మానవున్ని సృష్టించడం తప్ప, మరే సృజనాత్మకమైన పని ఆదికాండము మొదటి అధ్యాయంలో లిఖించబడలేదు. దేవుడు ఖగోళమును మరియు రెండు పెద్ద జ్యోతులను చేసాడు అంటే ఆయన వాటిని ప్రస్తుతమున్న ఆకారంలోనికి తీసికొని వచ్చాడు అని అర్థం. (ఆదికాండము 1:7, 16).

దేవుడు స్త్రీని నిర్మింపక మునుపు, పురుషుని నిర్మించినప్పుడు, వెమటనే అతను పూర్తిగా అభివృద్ధి చెందిన, అరుదైన వివేకముగలవాడిగా అయ్యాడు.

ఆదికాండము 2:7 లో ఉన్న మాటలను గమనించండి: "దేవుడైన యెహోవా నేలమంటితో నరుని నిర్మించి వాని నాసికా రంధ్రములలో జీవవాయువును ఊదగా నరుడు జీవాత్మ ఆయెను." దేవుడు నరుని నాసికారంధ్రములలో జీవవాయు ఊదిన వెంటనే నరుడు జీవాత్మ అయ్యాడు.

"దేవుడు వారిని ఆశీర్వ దించెను, ఎట్లనగామీరు ఫలించి అభివృద్ధిపొంది విస్తరించి భూమిని నిండించి దానిని లోపరచుకొనుడి; సముద్రపు చేపలను ఆకాశ పక్షులను భూమిమీద ప్రాకు ప్రతి జీవిని ఏలుడని దేవుడు వారితో చెప్పెను." (ఆదికాండము 1:28).

దేవుడు మానవునికి, భూమిమీద నున్న సమస్త జీవులపైన సంపూర్ణమైన అధికారమును ఇచ్చాడు. (ఆదికాండము 2:8-9, 15). “దేవుడైన యెహోవా తూర్పున ఏదెనులో ఒక తోటవేసి తాను నిర్మించిన నరుని దానిలో ఉంచెను. మరియు దేవుడైన యెహోవా చూపునకు రమ్యమైనదియు ఆహారమునకు మంచిదియునైన ప్రతి వృక్షమును, ఆ తోటమధ్యను జీవవృక్షమును, మంచి చెడ్డల తెలివినిచ్చు వృక్షమును నేలనుండి మొలిపించెను. మరియు దేవుడైన యెహోవా నరుని తీసికొని ఏదెను తోటను సేద్యపరచుటకును దాని కాచుటకును దానిలో ఉంచెను.”

ఆదాము సృజించబడినప్పుడు, ఆయన సంపూర్ణంగా ఎదిగిన పురుషునిగా, పనిచేయుటకు సంపూర్ణమైన సామర్థ్యము కలిగినవాడుగా ఉండెను. ఆ దేవుడు అతనికి వెంటనే పని అప్పగించాడు.

దేవుడు అతనిని సంక్షేమ జాబితాలో పెట్టలేదు, లేదా టివి చూస్తూ ఇంట్లో కూర్చుండుమనో, సేదదీరుతూ ఉండమనో, అప్పుడప్పుడు నడకకు వెళ్తుండమనో, ఏదైనా బంతితో ఆడుకొమ్మనో చెప్పలేదు. దేవుడు అతన్ని సృజించిన వెంటనే అతనికి పని అప్పగించాడు. ఆయన చేసిన ఇతర ప్రాణుల పైన అతనికి అధికారము ఇచ్చాడు. ఏదేను తోటలో పనిచేసే బాధ్యత అతనికి అప్పగించాడు.

“దేవుడైన యెహోవా ప్రతి భూజంతువును ప్రతి ఆకాశపక్షిని నేలనుండి నిర్మించి, ఆదాము వాటికి ఏ పేరు పెట్టునో చూచుటకు అతని యొద్దకు వాటిని రప్పించెను. జీవముగల ప్రతిదానికి ఆదాము ఏ పేరు పెట్టెనో ఆ పేరు దానికి కలిగెను. అప్పుడు ఆదాము సమస్త పశువులకును ఆకాశ పక్షులకును సమస్త భూజంతువులకును పేరులు పెట్టెను. అయినను ఆదామునకు సాటియైన సహాయము అతనికి లేక పోయెను.” (ఆదికాండము 2:19, 20)

ఈ మనుష్యునికి ఉన్న గొప్ప తెలివిని గమనించండి. మంచి చెడ్డల తెలివినిచ్చు వృక్షము యొక్క పండు తిన్నప్పుడు, దేవుని రాజ్యము, ఆస్తి అనబడిన దానిలోనికి ప్రవేశించాడు. ఆ పండు తినకముందు, ఆదాముకు ఖచ్చితంగా గొప్ప జ్ఞానము, గొప్ప వివేకము, అర్థంచేసుకునే తెలివి ఉన్నాయి. దేవుడు పరిపూర్ణమైన, సంతోషమైన సహవాసం కలిగివుండటానికి అతనికి సమస్తము ఉండెను. ఉదాహరణకు, పక్షులు, మృగాలు, గాల్లో ఎగిరే పక్షులు, ప్రాకే జంతువులన్ని మంచి చెడ్డల తెలివినిచ్చు వృక్షమునుండి ఎప్పుడు తినలేదు. అయినప్పటికీ, ఎలా జీవించాలో ఎలా ఊపిరి పీల్చుకోవాలో, ఎలా ఉత్పత్తి

చేయాలో, వాటి ఇళ్లను, గూళ్లను ఎలా కట్టుకోవాలో, ఆహారము ఎలా సేకరించాలో, వాటి బిడ్డలను ఎలా పెంచి, సంరక్షించాలో, అపాయమును ఎలా తప్పించుకోవాలో, సమయం వచ్చినప్పుడు ఎలా మరణించాలో వాటికి దేవుడు నేర్పించాడు. మంచి చెడ్డల తెలివి లేకుండా వాటి సృష్టికర్తతో అవి పరిపూర్ణమైన సామరస్యంతో జీవిస్తున్నాయి. తినవద్దన్న పండు తినడం ద్వారా, మానవుడు ఏ లాభము పొందుకోలేదు.

కానీ, భయము, ఆందోళన, అనుమానము, ఆరాటము, రక్తపాతము, మరియు యుద్ధము లేణి జీవితాన్ని జీవించడం అనే గొప్ప ఆధిక్యతను కోల్పోయాడు.

మానవుడు సృష్టించబడినప్పుడు, చెప్పుకోదగిన తెలివిని దేవునినుండి సొంతం చేసుకున్నాడు. నీవు నమ్మనట్లయితే, అన్ని రకాల పక్షులు, జంతువులు, మరియు ప్రాకే జీవులు ఉండే ఒక సమస్త శాస్త్రము తీసికొని, వాటన్నిటికీ పేర్లు ఇవ్వడానికి ప్రయత్నించు. వాటికి పూర్వముగా ఉన్న పేర్లు కాకుండా క్రొత్తవి. ఆ జీవులన్నిటికీ పేర్లను గురించి ఆలోచించడానికి ప్రయత్నించు. వాటి గురించి జ్ఞానము పొందుకోవడం కాదు గాని, కేవలం పేర్లు మాత్రము ఇవ్వు. దేవుని సమక్షంలో ఆదాము ఈ పనిని పూర్తిచేసాడు.

ఆదాము దేవునితో పాపరహితమైన స్థితిలో సహవాసం కలిగి ఉండే శక్యత ఉన్నదని బైబిలు చెప్తున్నప్పటికీ, అటువంటి సహవాసం గురించి మనము బైబిల్లో ఎక్కడా చదవము. "చల్లపూటను ఆదామును అతని భార్యయు తోటలో సంచరించుచున్న దేవుడైన యెహోవా స్వరము విని, దేవుడైన యెహోవా ఎదుటికి రాకుండ తోటచెట్ల మధ్యను దాగుకొనగా దేవుడైన యెహోవా ఆదామును పిలిచి – నీవు ఎక్కడ ఉన్నావనెను." (ఆదికాండము 3:8–9)

కాబట్టి, ఆదాము దేవునితో సహవాసము చేసే గొప్ప అవకాశాన్ని కోల్పోయాడు అని మనము గమనించవచ్చు.

మధ్యయుగాలలో, విజ్ఞానశాస్త్రానికి, బైబిలుకు మధ్యలో కొంత విరోధము ఉందని భావించారు. కొందరు శాస్త్రవేత్తలు భూమి గుండ్రముగా ఉందని వాదించారు. మరికొందరేమో ఆ ఆలోచనను తిరస్కరించే మత పెద్దలతో కలిసారు. దాని గురించి గొప్ప వివాదము జరిగింది. బైబిలును మరలా అధ్యయనం చేసినప్పుడు, వారు కనుగొన్న దేమిటంటే, భూమి గుండ్రంగా ఉందని బైబిలు యెప్పటినుండో చెప్తూ వస్తుంది. విజ్ఞానశాస్త్రము కొరకు

ఎదురుచూడకుండా వారు ముందే బైబిలును నమ్మియుంటే ఈ సమస్య ఎదురయ్యేది కాదు.

"ఆయన భూమండలముమీద ఆసీనుడై యున్నాడు దాని నివాసులు మిడతలవలె కనబడుచున్నారు ఒకడు తెరను విప్పినట్లు ఆయన ఆకాశవైశాల్యమును వ్యాపింపజేసెను ఒకడు గుడారము వేసినట్లు ఆయన దానిని నివాస స్థలముగా ఏర్పరచెను." (యెషయా 4:22). భూమి గుండ్రముగా ఉన్నది.

నిజమైన విజ్ఞానశాస్త్రము మరియు బైబిలు మధ్య ఉన్న అన్ని విభేదాలు బైబిలు యొక్క ఏ భాగాన్ని వదలకుండా మనష్యులు చదివి నమ్మినట్లయితే, వాటిని ఆపవచ్చు. శాస్త్రము బైబిలును అందుకోగలిగితే, అది బైబిలును రుజువుచేస్తుంది. ఎక్కడైన ఆ శాస్త్రమునకు బైబలుకు విభేదం ఏర్పడినట్లయితే, సమస్య ఏమిటంటే, శాస్త్రమునకు పూర్తి సమాచారం లేదు, లేదా బైబిలును నమ్మే బదులు, మనుష్యులు దానిని అనువదిస్తున్నారు.

ఇప్పుడు, మనము ఒక ప్రశ్నను సమీపించవలసి ఉంది. ఈ ప్రశ్న అంత ప్రాముఖ్యమైనది కాదుగాని, ఈ ప్రశ్నకు సమాధానం చెప్పేంత వరకు కొందరు బైబిలును నమ్మడానికి నిరాకరిస్తారు. దేవుడు సమస్తమును సృష్టించాడు అన్నది గొప్ప వాస్తవము కాని ఎలా సృష్టించాడు అన్నది కాదు. ఆయన వాటిని ఆరు రోజుల్లో సృష్టించాడా లేదా అరవై లక్షల సంవత్సరాలలో సృష్టించాడా అన్నది అవసరం లేని విషయం. ఏది అవసరమైన విషయమంటే, దేవుడు వీటిని ఆరు రోజుల్లో సృష్టించాడని బైబిలు చెప్తున్నది. కాబట్టి, బైబిలుకు ఉన్న విశ్వసనీయత మరియు అధికారము పడిపోతుందా లేదా నిలబడుతుందా అనేది ఈ విషయం పైన ఆధారపడివుంటుంది. జంతువులు , ఇప్పుడున్న విధంగా ఒకేసారి సృష్టించబడ్డాయా లేదా అవి తక్కువ స్థాయి జీవాలలోనుండి ఉద్భవించాయా అనేది దేవుని వాక్యము యొక్క అధికారాన్ని తృణీకరించుటకు ఇష్టపడేవారి చేత చర్చించబడుతుంది. మరియు వాదించబడుతుంది. సృష్టి గురించి బైబిలుకు ఉన్న వివరణ గురించి ఉన్న ప్రశ్న చాలా ప్రాముఖ్యమైనది. ఎందుకంటే, లేఖనాలు స్పష్టంగా ఒక విషయనాన్ని బోధిస్తే, చాలా చాలమంది మరొక దాన్ని నమ్ముతారు.

ఎక్కడైనా మనుష్యుల బోధనలకు మరియు బైబిలు బోధనలకు వైరుధ్యము ఏర్పడినట్లయితే, నీవు దేవుని వాక్యము వైపు ఉండటం మేలు.

1. సృష్టిని కలుగజేసేటప్పుడు పేర్కొన్న 'దినము'లలో ఒక్కో దిన కాలవ్యవధి వెయ్యి సంవత్సరములు కాదు గాని 24 గంటలు. ఇది ఏ వాస్తవము ద్వారా

నిరూపించబడిందంటే, ఆదాము ఆరవ దినమున సృజించబడ్డాడు. దేవుడు ఏడవ దినమున విశ్రాంతి తీసుకున్నాడు. మరియు షేతు ఏడవ దినము తరువాత జన్మించాడు. షేతు జన్మించినప్పుడు, ఆదాము 130 సంవత్సరముల వయస్సు గలవాడు. నన్ను వివరించనివ్వండి. మొదటి ఆరు రోజులు కొన్ని యుగాలైతే, ఏడవ దినాన్ని వేరుగా చేయడం అన్యాయం. న్యాయంగా అయితే, ఏడవ దినము మరియు మొదటి ఆరు రోజులు కూడా సమాన కాల వ్యవధి కలిగి యుండాలి. దీనిని నిరాకరించడమంటే పదాలకు అర్థము ఉంటుందన్న వాస్తవమును నిరాకరించడమే.

ఏడవ దినము 130 సంవత్సరముల కంటె ఎక్కువ ఉండలేదు. ఆదికాండము 5:1–3 గమనించండి. "ఆదాము వంశావళి గ్రంథము ఇదే. దేవుడు ఆదామును సృజించిన దినమున దేవుని పోలికెగా అతని చేసెను; మగవానిగాను ఆడుదానిగాను వారిని సృజించి వారు సృజించబడిన దినమున వారిని ఆశీర్వదించి వారికి నరులని పేరు పెట్టెను. ఆదాము నూట ముప్పది యేండ్లు బ్రదికి తన పోలికెగా తన స్వరూపమున కుమారుని కని అతనికి షేతు అను పేరు పెట్టెను."

మరింత శ్రద్ధ పెట్టండి. నేను ఈ వాక్యమును పునరుద్ఘాటిస్తాను. ఆదికాండము 1వ అధ్యాయంలోని 'దినములు' వెయ్యి సంవత్సరాల కాలవ్యవధి కలిగినవి అనేవారు కొందరు ఉన్నారు. వాటి కాలవ్యవధి కొన్ని మిలియన్ల సంవత్సరాలు అని కొందరంటారు. నా స్నేహితుడా, నీవు బైబిలును నమ్మినట్లయితే, అది నీ సమస్యను పరిష్కరిస్తుంది. ఆదాము ఆరవ దినాన సృజించబడ్డాడు. దేవుడు ఏడవ దినమున విశ్రాంతి నొందాడని బైబిల్ చెప్తున్నది. ఏడవ దినము తరువాత, కొంత కాలమునకు ఆదాము, హవ్వ ఒక కుమారుణ్ణి కని, అతనికి షేతు అని పేరు పెట్టారు. అతడు జన్మించినప్పుడు, ఆదాము 130 సంవత్సరాల వయస్సు గలవాడు.

ఆడంబరత లేని పరిణామక్రమ సంఖ్య ఒకటి తీసికొని, ఆదికాండము 1 అధ్యాయంలోని ఒక దినము పది లక్షల సంవత్సరాలు అని ఊహిద్దాం. అది షేతు జన్మించినప్పుడు ఆదామును (365 రోజులు × 130 సం॥లు) 474,500,000,000 సంవత్సరాల వయస్సుగలవానికి చేస్తుంది. నిజంగా దీర్ఘాయువే.

దీనిని నీవు ఇంకా సాగదీసి (నిన్ను నీవు బుద్ధిహీనునిగా

చేసుకోవాలనుకుంటే), దాని గురించి వాదించాలనుకుంటే, ఏడవ దినము కొన్ని దశాబ్దాలకు మించి ఉండలేదు. బైబిలును ఉన్నది ఉన్నట్టు ఉండనిస్తే:

1. అయితే, పరిణామ క్రమానికి సమయం లేదు

లేదా

2. షేతును కనడానికి, ఆదాము ఆయన భార్య ఎక్కువ కాలము జీవించలేరు.

ఏదైనా పరిణామ క్రమాన్ని నీవు అంగీకరించాలి అని అనుకుంటే, ఏదో రకంగా స్పష్టమైన దేవుని వాక్యబోధనలను నీవు తిరస్కరించాలి. వాస్తవమైన విషయమేమిటంటే, ఒక దినము ఒక దినమే.

వాదన చేసి అగ్నిగుండములోకి ప్రవేశించడం కంటే, బైబిలును ఉన్నది ఉన్నట్టుగా అంగీకరించడం నీకు మేలు.

2. ఆదాము లేదా మరే జంతువైనా పరిణామక్రమం ప్రకారం తక్కువస్థాయి జీవాలలోనుండి వచ్చారు అన్న ఆలోచన తప్పు అని నిరూపితమైంది. ఎందుకంటే, వాటిని సృష్టించినప్పుడు అవి పక్షి, చేప, మనిషి, జంతువు, ప్రాకే జంతువులుగా ఉన్నాయి. మనిషి దేవుని స్వారూప్యములో చేయబడి, జీవమును పొందుకున్నాడు అనే వాస్తవం ద్వారా కూడా ఆ ఆలోచన తప్పు అని నిరూపించబడింది. ఇప్పుడు ఆధారముగా ఉన్న వచనాలను చూద్దాము. ఆదికాండము 1:26,27 చూడండి. "దేవుడు మన స్వరూపమందు మన పోలికె చొప్పున నరులను చేయుదము; వారుసముద్రపు చేపలను ఆకాశ పక్షులను పశువులను సమస్త భూమిని భూమిమీద ప్రాకు ప్రతి జంతువును ఏలుదురుగాకనియు పలికెను. దేవుడు తన స్వరూపమందు నరుని సృజించెను, దేవుని స్వరూపమందు వాని సృజించెను; స్త్రీనిగాను పురుషునిగాను వారిని సృజించెను."

ఆదాము సృష్టించబడ్డాడు. ఆయన ఒక అమీబా వలె బురద గుంటనుండి ఎలాగోలా పైకి వచ్చి, చెట్టు పైకి ప్రాకి అక్కడ అరటిపండ్లు కొంతసేపు తిని, తప్పిపోయిన లింకు దొరికిన వెంటనే ఒక కోటు, టై తీసుకొని తన పనికి వెళ్లిపోలేదు. దేవుడు ఆదామును సృష్టించాడు, సృజించబడిన వెంటనే ఆదాము దేవుని స్వారూప్యంలో ఉండెను. తోకలేని కోతి మనిషి లేదా కోతి–మనిషి నుండి మానవునిగా, ఒక జీవరూపమునుండి మరో జీవరూపానికి మార్చబడుతూ మనుష్యునిగా అతడు ఉద్భవించలేదు.

మనిషి ఈ రోజు ఎలాగున్నాడో, అలాగే దేవుడు మానవుణ్ణి సృష్టించాదని

బైబిలు చెప్తున్నది. అతని లోపల జీవము లేకమునుపే అతడు దేవుని సారూప్యములో చేయబడ్డాడు. మరియు దేవుడు అతని నాసికారంధ్రములలో జీవవాయువును ఊదగా, అతడు జీవాత్మ ఆయెను.

ప్రభువైన యేసుక్రీస్తు, ఈ స్థానముతో అంగీకరిస్తాడు. ఈ సంఘటనల నుండి నీవు ఏదైనా మినహాయింపు తీసికొనగోరితే, దేవుడు విశదపరిచిన దానితో నీవు వాదన చేయవలసి ఉంటుంది. మత్తయి 19:4 లో “ఆయన సృజించినవాడు ఆదినుండి వారిని పురుషునిగాను స్త్రీనిగాను సృజించెను”

ఆరంభములో దేవుడు వారిని అమీబా వలెనో ఏకకణ సూక్ష్మజీవి వలెనో చేయలేదు. ఆరంభమున దేవుడు వారిని స్త్రీనిగాను, పురుషునిగాను సృజించెను; వారు అలానే ప్రారంభించారు. మార్కు 10:6 “సృష్ట్యాదినుండి దేవుడు వారిని పురుషునిగాను స్త్రీనిగాను కలుగజేసెను.”

దేవుడు ఆకుపచ్చని బూజు ద్వారానో, దుమ్ము మేఘాలద్వారానో విశ్వకిరణాల ద్వారానో వాయువు ద్వారానో ప్రారంభించలేదు. బైబిలు చెప్తున్నదేమిటంటే, ‘ఆదియందు దేవుడు మానవుని సృజించెను.’ ఈ దినాలలో ఉన్న విధంగా స్త్రీనిగాను, పురుషునిగాను వారిని సృజించాడు.

‘ఆధునిక శాస్త్రవేత్తలకు తెలిసినంతగా బైబిలు రచయితలకు తెలియదు” అని కొందరంటారు. కానీ, ప్రభువైన యేసుక్రీస్తుకు సమస్తము తెలిసియున్నది. ఆయన ఉండెను. ఆయననుండి సమస్తము చేయబడింది. ఆదికాండము 1వ అధ్యాయాన్ని జాగ్రత్తగా చదివినట్లయితే, “దేవుడు (ఏకవచనం) – మన (బహువచనం) స్వరూపమందు మన (బహువచనం) పోలికె చొప్పున నరులను చేయుదము (బహువచనం).

కాబట్టి, ప్రభువైన యేసుక్రీస్తు అప్పుడు ఉన్నాడు, ఆయన చెప్తున్నది ఏమిటంటే, ఆదినుండి మానవుడు ఈ రోజు ఉన్న విధంగానే ఉన్నాడని, కాకపోతే, కేవలం పాపం లేకుండా ఉన్నాడు.

3. పరిణామ క్రమం, కొన్ని పరిమితులతో, సృష్టిలో భాగమైయున్నది. ఈ సూక్ష్మ పరిణామం కొందరికి స్వీయ–స్పష్టంగా ఉంది. దీని అర్థం ఒక జాతి నుండి మరొక జాతికి మార్పు చెందటం అన్న డార్విన్ ఆలోచన కాదుగాని, కాలక్రమేణ ఒక జాతిలో కలిగే మార్పు. ఈ ఆలోచన గురించిమాకు కొన్ని ప్రశ్నలున్నాయి కాని మరొక దాని గురించి మేము పట్టించుకోము.

ఇదిమాత్రం ఖచ్చితము: ఎక్కడైనా తెలివైన ఎంపిక లేనట్లయితే, ప్రతి మార్పు

యొక్క ధోరణి తిరోగమనమే అవుతుంది. ఇది, మనష్యుల జీవితకాలము పూర్వము ఎంత ఉన్నదో, ఇప్పుడు ఎంత ఉన్నదో దానిని బట్టి ఋజువు చేయబడింది. కొన్ని జాతులను కలిపినప్పుడు, వాటినుండి కలిగే సంతతి అయితే నిస్సారమైనది లేదా దిగజారిపోయినదై ఉంటుంది.

వివిధ జాతులను కలిపినప్పుడు, ఉన్నతమైనది ఉత్పత్తి అవ్వదు. వేర్వేరు జాతుల సాంకర్యం వల్ల జన్మించినది మెరుగైనదిగా ఉన్నట్లయితే, అటువంటి మెరుగైనది ఉత్పత్తి అవ్వడం అనేది జరుగదు. ఒకజాతి నుండి మరొక జాతికి మెరుగు పరిచే క్రమంలో ఏదైనా ఎంపిక జరిగినప్పుడు, చివరికి, తెలివైన ఎంపిక జరిగిననూ, అది ఎప్పటికీ దిగజారిపోయినదిగా ఉంటుంది కాని మెరుగైనదిగా ఉండదు.

మెతూషెల 969 సంవత్సరాలు బ్రదికాడని బైబిలు చెప్తున్నది. హనోకు పరలోకమునకు తీసికొకని పోబడక ముందు 365 సంవత్సరాలు జీవించాడు. యెరెదు 962 సంవత్సరలు, మహలేలు 895 సంవత్సరాలు, కాబట్టి, కాలక్రమేణ మనిషి మెరుగవుతున్నాడు అని చెప్పకండి. ఈ దినాలలో 70 సంవత్సరముల వయస్సును చేరుకోవడం అతి కష్టంగా ఉంటుంది. బైబిలు చెప్పేదానితో నీవు అంగీకరించవలసి ఉంది: దేవుడు సృష్టికర్త మరియు దేవుడు మానవుని సృజించాడు. బైబిలు చెప్తున్న ప్రకారం, దేవుడు సమస్తమును సృష్టించాడు.

మానవుడు పరిణామక్రమం ద్వారా ఉద్భవించాడు అన్నదానికి ఖచ్చితమైన ఋజువు ఏది లేదు. అది బైబిలు ప్రకారం ఉన్న సృష్టిని వ్యతిరేకించే నిరూపించబడని సిద్ధాంతము. నీవు పరిణామ సిద్ధాంతాన్ని ఆమోదించే వ్యక్తిగాను, క్రైస్తవునిగాను ఉండలేవు. మీరు పరిణామాన్ని వేరే పరిణామంగా చేసుకొని లేదా యేసు క్రీస్తును నమ్మడం కాకుండా మరొక క్రైస్తవము క్రైస్తవ పరిణామవేత అనేది లేదు. క్రైస్తవుడు అంటే ప్రభువైన యేసుక్రీస్తును నమ్మేవాడు, మరియు స్త్రీ పురుషులు ఈరోజు ఎలా ఉన్నారో, సృష్టిని కలుగజేసే సమయంలో కూడా అలాగే ఉన్నారని ప్రభువైన యేసుక్రీస్తు చెప్తున్నాడు.

4. బైబిలు ప్రకారం సృష్టిలో 5 సాధారణ భాగాలు ఉన్నాయి. అవి, పక్షి, చేప, జంతువు, ప్రాకే జంతువు, మానవుడు. ఇవి నిర్ధారించబడిన సాధారణ భాగాలు. ఈ భాగాల మధ్య సంతానోత్పత్తి జరిగితే తప్ప, పరిణామక్రం అనేది పూర్తిగా తిరస్కరించబడే సిద్ధాంతము. అది కేవలం గొప్ప మోసము.

పరలోకంలో 5 కెరూబులు ఉండేవని బైబిలు చెప్తున్నది. అవి పక్షిరాజు, వృషభము, సింహము, మానవుడు, ప్రాకే జంతువును సూచిస్తున్నవి. ఇందులో ఐదవది క్రింద పడెను కాని అది ఇంకనూ మూడు ఆకాశములలో మధ్య ఆకాశములో తిరుగులాడుతున్నది. ఈ భూమిమీద మనకు పక్షి, చేప, పశువులు, ప్రాకే జంతువులు, మరియు మానవుడు ఉన్నాయి. పరలోకంలో 5 వర్గాలు మరియు భూమిమీద మనకు 5 వర్గాలు ఉన్నాయి. ఈ వర్గాలలో దాటిపోవడం అనేది లేదు; వీటి మధ్యలో సంతానోత్పత్తి లేదు. అది జరుగదు. అది జరుగలేదు. అది ఎన్నటికీ జరుగదు.

దేవుడు సృష్టికర్త. దేవుడు సరిహద్దులను నియమించాడు. దేవుడు పరిమితులను నియమించాడు. వాటిని నీవు దాటుటకు వీలులేదు.

5. ఆదికాండంలో సంవత్సరాలు చంద్రయాన సంవత్సరాలు అని చెప్పడం ద్వారా కొందరు విపరీత పరిణామవాదులు పితరుల కాలానికి ముందున్న సమయాన్ని సమర్థించే ప్రయత్నం చేసారు.

ఒకవేళ అదే నిజమైతే, షేతుకు తొలి సంతానం కలిగినప్పుడు అతని వయస్సు ఎనిమిది సంవత్సరాలై యుండాలి.

ఆదికాండము 5:6లో "షేతు నూట ఐదు సంవత్సరము బ్రదికి ఎనోషును కనెను" అని ఉంటుంది. ఇది మానవుడు చంద్రమండలం మీద ఉన్నప్పటి కాలెండరులో కేవలం పది సంవత్సరాలకంటె తక్కువ. (నవ్వకండి. సరిగ్గా క్వేకర్ల వలె బట్టలు ధరించిన మనుష్య జాతి ఒకటి చంద్రమండలం మీద ఉందని మార్మోనుల మతాన్ని స్థాపించిన జోసఫ్ స్మిత్ చెప్పేవాడు.) కాబట్టి నీవు బైబిలును నమ్మడం నీకు ఉత్తమం. దేవుని మాట ఉన్నది ఉన్నట్టుగా తీసుకోవడం వల్ల నీకు ఎటువంటి సమస్య తలెత్తదు. ఎవరైనా బైబిలును మోసం చెయ్యాలని ప్రయత్నిచినట్లయితే, వారు దేవుని అబద్ధికునిగా చేస్తారు. ఎందుకంటే, బైబిలు దేవుని వాక్యం. ఒక వ్యక్తి దేవున్ని అబద్ధికుడు అని పిలిస్తే, అతను తీర్పు దినాన్ని ఎలా ఎదుర్కొంటాడు అనుకుంటున్నారు?

సృష్టి గురించి బైబిలు మరికొన్ని చూడదగ్గ విషయాలను ప్రకటిస్తుంది. "ఆకాశమును భూమియు వాటిలోనున్న సమస్త సమూహమును సంపూర్తి చేయబడెను. దేవుడు తాను చేసిన తనపని యేడవదినములోగా సంపూర్తిచేసి, తాను చేసిన తన పని యంతటినుండి యేడవ దినమున విశ్రమించెను." కేవలం ఆరు రోజుల్లో సృష్టి అంతయు చేయబడింది. ఇంకా అభివృద్ధిపరచడానికి మరేమి

మిగలలేదు. ఇంకా పనిచేయడానికి ఏమీ లేదు. మరీ మార్గములోనైనా, మరే రూపంలోనైనా పరిణమించడానికి ఏమి మిగలలేదు. పని సమాప్తమైంది.

నా స్నేహితులారా, మీరు దేవుని చేతిపనియై యున్నారు. ఆయన నిన్ను రూపించాడు. ఆయన నిన్ను తయారుచేసాడు. ఆయన నిన్ను సృష్టించాడు. నీ హృదయాంతరగాల్లో నీ సృష్టికర్తను తెలుసుకోవాలని ఆశపడుతున్నావంటే, దానికి కారణం ఆయన నిజంగా నీ సృష్టికర్త. ఆయన ముద్ర మరియు స్వారూప్యము నీ పైన ఉన్నది. నీకు అది తెలియకున్నను, ఆయనతో సహవాసం కలిగివుండాలని నీవు ఆశపడుతున్నావు.

"నా అంతరింద్రియములను నీవే కలుగజేసితివి నా తల్లి గర్భమందు నన్ను నిర్మించినవాడవు నీవే. నీవు నన్ను కలుగజేసిన విధము చూడగా భయమును ఆశ్చర్యమును నాకు పుట్టుచున్నవి అందునుబట్టి నేను నీకు కృతజ్ఞతాస్తుతులు చెల్లించు చున్నాను నీ కార్యములు ఆశ్చర్యకరములు. ఆ సంగతి నాకు బాగుగా తెలిసియున్నది. నేను రహస్యమందు పుట్టిననాడు భూమియొక్క అగాధస్థలములలో విచిత్రముగా నిర్మింపబడిననాడు నాకు కలిగినయెముకలును నీకు మరుగై యుండలేదు. నేను పిండమునై యుండగా నీ కన్నులు నన్ను చూచెను నియమింపబడిన దినములలో ఒకటైన కాకమునుపే నా దినములన్నియు నీ గ్రంథములో లిఖితము లాయెను. దేవా, నీ తలంపులు నా కెంత ప్రియమైనవి వాటి మొత్తమెంత గొప్పది."

నీవొక ప్రత్యేమైన అద్భుత కార్యానివి. నీ తల్లి గర్భములో దేవుడే నిన్ను రూపించాడు. నీకున్న మనస్సాక్షి మరియు మనస్సు నీకు ఇచ్చింది దేవుడే.

యోహాను 1:9 లో ప్రభువైన యేసుక్రీస్తు గురించి మాట్లాడుతూ బైబిలు ఈ విధంగా చెప్తున్నది. "నిజమైన వెలుగు ఉండెను; అది లోకములోని వచ్చుచు ప్రతి మనుష్యుని వెలిగించుచున్నది." నీవు సృష్టికర్తయైన నీ దేవునికిబాధ్యుడవచని, నీవు సృజింపబడిన వాడవని నీవు తెలుసుకొనుటకు నీవు జన్మించిననాడే దేవుడు నీలో సరిపోయేంత వెలుగును పెట్టాడు.

"సమస్త దేశములారా, యెహోవాకు ఉత్సాహధ్వని చేయుడి. సంతోషముతో యెహోవాను సేవించుడి ఉత్సాహగానము చేయుచు ఆయన సన్నిధికి రండి. యెహోవాయే దేవుడని తెలిసికొనుడి ఆయనే మనలను పుట్టించెను మనము ఆయన వారము మనము ఆయన ప్రజలము ఆయన మేపు గొఱ్ఱెలము." (కీర్తన 100:1-3).

దేవుని కోసం ఆరాటపడేలా ఆయన నిన్ను తయారుచేసాడు. నీవు ఏదో ఒకరోజు ఆయన యెదుట నిలువబడి, తీర్పు తీర్చబడుదువు అనే ఉద్దేశముతో ఆయన నిన్ను రూపించాడు. ఆ తీర్పు కొరకై నీవు సిద్ధంగా ఉన్నావా? నీవు దేవుని యెదుట నిలవబడటానికి సిద్ధముగా ఉన్నావా?

దేవునికి ఆదాముకు మధ్యలో ఆ పగులు దేనివల్ల కలిగింది? పాపము వల్ల. నీవు పాపము చేసావా? అవును, నీవు చేసావు. నీకు తెలుసు నీవు చేసావని. నీకు తెలుసు, నీవు దేవుని పరిశుద్ధ చిత్తమును మరియు ఆజ్ఞలను అతిక్రమించావని.

కానీ, ఎలాగైతే దేవుడు ఆదామును వెతుక్కుంటూ ఏదెను వనమునకు వచ్చాడో, ఎలాగైతే ఆదాము, హవ్వల పాపమునకు ఒక అమాయక పశువు వధించబడింది, అంతే ఖచ్చితంగా దేవుడు నిన్ను వెతుక్కుంటూ వచ్చాడు.

యేసుక్రీస్తు ప్రభువు మానవ రూపమును దాల్చి తనను తాను విశదపరచుకొన్నాడు అని బైబిలు చెప్తున్నది. ఆయన వెదకి రక్షించుటకు వచ్చెనని యేసుక్రీస్తు అన్నాడు. నీ పాపమునకు ప్రాయశ్చిత్తముగా ఆయన తన అమూల్యమైన రక్తమును కార్చి, నిరపరాధియైన దేవుడు తన ప్రాణాలను అర్పించాడు. ప్రభువైన యేసుక్రీస్తు యొక్క మరణము, భూస్థాపనము, పునరుత్థానము ద్వారా మరియు ఆయన గొప్ప కార్యముల పట్ల నీ విశ్వాసమును బట్టి నీ సృష్టికర్తతో శాశ్వతమైన సహవాసమునకు నీవు పునరుద్ధరించబడతావు.

దేవుడు మనుష్య రూపములో విశదపరచుకున్నాడని నీవు నమ్ముతావా? యేసుక్రీస్తు ప్రభువు కన్యకు జన్మించిన కుమారుడైన దేవుడని నీవు నమ్ముతావా? కల్వరి సిలువలో నీ పాపానికి ప్రాయశ్చిత్తము చెల్లించుటకై మరణించి, నీవు నిత్య జీవము పొందుటకై తిరిగి లేచాడని నీవు నమ్ముతావా?

నా స్నేహితులారా, మీరు అది నమ్మినట్లయితే, ప్రభువైన యేసుక్రీస్తు వద్దకు వచ్చి, ఆయన ముందు మోకరించవలసి ఉంది. దేవుడు నీ కొరకు మరణించిన పాపివని ఒప్పుకొని, ఆయన కృపద్వారా, ఆయన ప్రేమ ద్వారా, ఆయన కరుణ ద్వారా నీ పాపాలను క్షమించి, నీ ఆత్మను రక్షించుమని ఆయనను అడుగు.

"నాయొద్దకు వచ్చువానిని నేనెంత మాత్రము బయటికి త్రోసివేయను" అని ప్రభువైన యేసుక్రీస్తు అన్నాడు.

"ప్రభువైన యేసు నామమును బట్టి ప్రార్థన చేయువాడెవడో వాడు రక్షింపబడును." అని బైబిలు చెప్తున్నది.

నీవు నీ పాపమునుండి రక్షించబడాలి. దేవుడు మాత్రమే నిన్ను నీ పాపము నుండి రక్షించగలడు. ఆయన యొద్దకు నువ్వు వస్తావా? ఆయనను నువ్వు నమ్ముతావా?

నీవు చిరకాలము ఎక్కడ ఉంటావన్నది ప్రభువైన యేసు క్రీస్తుతో నీకున్న సంబంధము పైన ఆధారపడివుంటుంది. నిన్ను నరకానికి పంపించడానికి దేవుడు నిన్ను సృజించలేదు. నీవు నరకంలో ఉండటం ఆయనకు ఇష్టము లేదు గాని ఆయన పాపాన్ని శిక్షించాలి. నీ శిక్షను యేసు ప్రభువు భరించాడు. ఆయన చెల్లింపును నీవు అంగీకరిస్తావా లేదా నీ స్వంత చెల్లింపును చెల్లించే బాధను ఎన్నుకొంటావా? అది నీ ఎంపిక!

నీవు నిత్య జీవమును పొందుకొనుటకు ప్రభువైన యేసుక్రీస్తును ఎన్నుకో!

# పరిశుద్ధాత్మ దేవుడు

ఈ పాఠంలో మనము, పరిశుద్ధాత్మ దేవుని గురించి చర్చించుకుందాము. పాఠం 1 లో మనము ఎదుర్కొన్న లేఖన వచనముతో ప్రారంభిద్దాము. "పరలోకంలో సాక్ష్యము చెప్పువారు ముగ్గురున్నారు, తండ్రి, వాక్యము, మరియు పరిశుద్ధాత్మ. అయితే ఈ ముగ్గురు ఏకముగా ఉన్నారు" (1 యోహాను 5:7).

మూడు వ్యక్తిత్వాలు కలిపి ఒకే దేవుడు అని బైబిలు స్పష్టంగా చెప్తున్నది: తండ్రి, కుమారుడు, పరిశుద్ధాత్మ. ఈ ముగ్గురిని లెక్కించండి – ఒకటి, రెండు, మూడు – కలిపితే ఒకటికి సమానం.

"అలా ఎలా అవుతుంది?" అని నువ్వంటావు. ఒక పరిపూర్ణమైన త్రిభుజము దీనికి సులభమైన ఉదాహరణ. దానికి మూడు సమాన వైపులుంటాయి; అయినప్పటికీ, అది ఒకే త్రిభుజం. వాటిలో నుండి ఒక వైపును తొలగించు, అది త్రిభుజము కాకుండా వుంటుంది. త్రిత్వములో మూడో వ్యక్తి 'పరిశుద్ధాత్మ'. ఆయనకు పరిశుద్ధాత్మ, దేవుని ఆత్మ, సత్యమైన ఆత్మ, ఆదరణకర్త, వంటి మరెన్నో పేర్లు ఉన్నాయి. మనము మన అధ్యయనంలో ఈ పేర్లగుండా వెళ్తుంటాం.

మనము పరిశుద్ధాత్మ గురించి ఒకే పాఠంలో అధ్యయనం చేస్తున్నాం కాబట్టి, ఆయన గురించి, ఆయన కార్యముల గురించి, ముఖ్యవిషయాలు చూడటానికి ప్రయత్నిద్దాం. ఆయనకు తక్కువ ప్రాముఖ్య ఉన్నదని కాదు గాని, ఈ వరుస అధ్యయనాలలో మనకు తక్కువ స్థలము ఉన్నది గనుక.

తండ్రి, కుమారుడు, పరిశుద్ధాత్మ చేసే పనులలో విభాగాలు ఉన్నాయి. ఒక్కొక్కరి గురించి ఏమి తెలియపరచబడింది అనేది రక్షణ ప్రణాళికలో వారికి మానవులతో ఉన్న సంబంధము పైన ఆధారపడి ఉంటుంది. తండ్రి, కుమారుడు, పరిశుద్ధాత్ముడు, ఒక్కొక్కరు వేరు వేఱ్ఱు సేవలు చేస్తుంటారు; ప్రస్తు యుగంలో ప్రతి ఒక్కరు వేర్వేరు విధాలలో పనిచేస్తుంటారు. ఆదికాండము 1:2 లో పేర్కొన్న విధంగా, "దేవుని ఆత్మ జలములపై అల్లాడుచుండెను."

పరిశుద్ధాత్ముడు పాత నిబంధన సమయాల్లో మనుష్యుల మీదికి వచ్చి, వారికి సాధికారత ఇచ్చాడు. కొన్నిసార్లు పరి పూర్తి అయిన వెంటనే వారిని విడిచి వెళ్లాడు; కొన్నిసార్లు, వారి జీవితకాలమంతా వారితో ఉన్నాడు; కొన్నిసార్లు, వారు పుట్టకమునుపే వారితో కలిసాడు; మరి కొన్నిసార్లు వారిమీదకు వచ్చి, విడచి, మళ్లీ వచ్చాడు. ప్రభువైన యేసుక్రీస్తు యొక్క మొదటి రాకడకు ముందు, పరిశుద్ధాత్మునికి ఒక స్థిరమైన క్రమమైన పద్ధతి ఆయన కార్యములలో లేకుండెను. అయినప్పటికీ, ప్రభువైన యేసుక్రీస్తు యొక్క మొదటి రాకనుండి, పరిశుద్ధాత్మ దేవుడు తన గొప్ప పనిని చేస్తూ వస్తున్నాడు, మరియు ఈ పాఠంలో మనము దీనిపైన దృష్టిసారిస్తాము.

మొట్టమొదటిగా, ఆయన, బాప్తిస్మమిచ్చు యోహానుకు సాధికారతను ఇచ్చాడు, మరియు అపొస్తలులకు కూడా వారి అద్భుతమైన సేవకొరకు వారికి సాధికారతను ఇచ్చాడు.

లూకా 1:13–15లో బైబిలు ఈ విధంగా చెప్తున్నంది, "అప్పుడా దూత అతనితోజెకర్యా భయ పడకుము; నీ ప్రార్థన వినబడినది, నీ భార్యయైన ఎలీస బెతు నీకు కుమారుని కనును, అతనికి యోహాను అను పేరు పెట్టుదువు. అతడు ప్రభువు దృష్టికి గొప్పవాడై, ద్రాక్షారసమైనను మద్యమైనను త్రాగక, తన తల్లి గర్భమున పుట్టినది మొదలుకొని పరిశుద్ధాత్మతో నిండుకొనిన వాడైయుండెను."

దానికి అపొ.కా. 10:38 ని కలపండి: "అదేదనగా దేవుడు నజరేయుడైన యేసును పరిశుద్ధాత్మతోను శక్తితోను అభిషేకించెనను నదియే. దేవుడాయనకు తోడైయుండెను గనుక ఆయన మేలు చేయుచు, అపవాదిచేత పీడింపబడుచున్న వారందరిని బాగుచేయుచుండెను."

అలాగే, యోహాను 20:19–23 వచనాలలో ఇలా చదువుతాం: "ఆదివారము సాయంకాలమున శిష్యులు యూదులకు భయపడి, తాము కూడియున్న యింటి తలుపులు మూసి కొనియుండగా యేసు వచ్చి మధ్యను నిలిచిమీకు సమాధానము కలుగునుగాక అని వారితో చెప్పెను. ఆయన ఆలాగు చెప్పి వారికి తన చేతులను ప్రక్కను చూపగా శిష్యులు ప్రభువును చూచి సంతోషించిరి. అప్పుడు యేసు మరల మీకు సమాధానము కలుగును గాక, తండ్రి నన్ను పంపిన ప్రకారము నేనును మిమ్మును పంపుచున్నానని వారితో చెప్పెను. ఆయన ఈ మాట చెప్పి వారిమీద ఊది పరిశుద్ధాత్మమ పొందుడి. మీరు ఎవరి పాపములు క్షమింతురో అవి వారికి క్షమింపబడును; ఎవరి

పాపములు మీరు నిలిచియుండ నిత్తురో అవి నిలిచియుండునని వారితో చెప్పెను.”

కాబట్టి, ప్రభువైన యేసుక్రీస్తుకు ముందుగా వచ్చిన బాప్తిస్మమిచ్చు యోహాను; లోక రక్షకుడైన యేసుక్రీస్తు, మరియు తన మరణ, సమాధి, పునరుత్థానాలను ప్రచురించిన అపొస్తలులను వారి అద్భుతమైన సేవకొరకు వారికి సాధికారతను ఇచ్చాడు.

రెండవది, యేసుక్రీస్తు, తన పునరుత్థానము తరువాత భూమిపైన నలభై పగళ్లు మరియు నలభై రాత్రుళ్లు సజీవుడిగా జీవించి, పరలోకమునకు ఆరోహణమైన తరువాత, పరిశుద్ధాత్ముడు భూమి మీదకు వచ్చి, దేవుని పనికి కట్టుబడి, ఆయన పనిని ఇక్కడ కొనసాగించాడు.

యోహాను 14:16-17 లో యేసుక్రీస్తు ఇలా అన్నాడు: “నేను తండ్రిని వేడుకొందును, మీయొద్ద ఎల్లప్పుడు నుండు టకై ఆయన వేరొక ఆదరణకర్తను, అనగా సత్యస్వరూపి యగు ఆత్మను మీకనుగ్రహించును. లోకము ఆయ నను చూడదు, ఆయనను ఎరుగదు గనుక ఆయనను పొంద నేరదు; మీరు ఆయనను ఎరుగుదురు. ఆయన మీతో కూడ నివసించును, మీలో ఉండును.”

25-26 వచనాలలో “నేను మీయొద్ద ఉండగానే యీ మాటలు మీతో చెప్పితిని. ఆదరణకర్త, అనగా తండ్రి నా నామమున పంపబోవు పరిశుద్ధాత్మ సమస్తమును మీకు బోధించి నేను మీతో చెప్పిన సంగతులన్నిటిని మీకు జ్ఞాపకము చేయును.”

కాబట్టి, క్రీస్తు పరలోకమునకు ఆరోహణమైన తరువాత పరిశుద్ధాత్మ దేవుడు భూమి మీదకు వచ్చి దేవుని పనికి కట్టుబడి, ఆయన పనిని కొనసాగిస్తాడని ప్రభువైన యేసు చెప్పాడు. ఇది తండ్రి వాగ్దానము. ఇది నెరవేర్చబడిందని అపొస్తలుల కార్యములు 2వ అధ్యాయంలో వ్రాయబడివుంది.

యోహాను 14:17 లో యేసుక్రీస్తు ప్రభువు ఏమి చెప్తున్నాడో జాగ్రత్తగా గమనించండి. “లోకము ఆయనను చూడదు, ఆయనను ఎరుగదు గనుక ఆయనను పొందనేరదు; మీరు ఆయనను ఎరుగుదురు. ఆయన మీతో కూడ నివసించును, మీలో ఉండును.”

ప్రియ స్నేహితుడా, దేవుని యొక్క పరిశుద్ధాత్మ, నీ హృదయంలో కట్టుబడి వుండుటకు వస్తాడు. దేవుని మాటను నమ్మి, ఆయన మాట చొప్పున ఆయనను అంగీకరించు వారి యొద్దకు వచ్చి, వారిని పునరుత్పత్తి చేసి, వారికి నూతన

జననమును ఇస్తాడు. పరిశుద్ధాత్మ దేవుని ద్వారా తిరిగి జన్మించకుండా జీవించి, మరణించినవారు ప్రభువైన యేసుక్రీస్తును తృణీకరించినందుకు నరకములో ప్రవేశిస్తారు. భూమిమీద ఉన్నప్పుడు, ఆయనను అంగీకరించుటకు ప్రతి అవకాశము ఉన్ననూ, ఆయనను అంగీకరించనందుకు వారు నిరంతరమైన అగ్నిలో కాల్చబడతారు.

వీరు ఎవరంటే, వారి కన్నులతో చూడనిదానిని లేదా చూడనివారిని పొందుకొనుటకైనను, నమ్మడానికైనను నిరాకరిస్తారు. మనం ముందు పాఠంలో నేర్చుకొన్న విధంగా, దేవుడు ఆత్మయై యున్నాడు" (యోహాను 4:24). దేవుని యొక్క పరిశుద్ధాత్మను నీవు చూడవు గాని, దేవుని వాక్యమును నమ్మి, నీ విశ్వాసం ద్వారా ప్రభువైన యేసుక్రీస్తును అంగీకరించినట్లయితే, ఆయనను నీవు తెలిసికొంటావు.

ఈ గొప్ప సత్యాలన్నిటిని అర్థంచేసికొమ్మని దేవుడు అడుగలేదు గాని, ఆయనను నమ్ముమని మాత్రము అడిగాడు.

మూడవది, పరిశుద్ధాత్ముడు, విశ్వాసులలో నిలిచియుండి, దేవుని పనిని కొనసాగించుటకు భూమిమీదకు వచ్చాడు గనుక, ఆయన పని ఏమైయున్నదంటే, సువార్త వినువారిని ఒప్పింపజేసి, దానిని నమ్మడానికి వీలు కల్పించడం.

యోహాను 16:7-8 వచనాలలో ప్రభువైన యేసుక్రీస్తు ఇలా అన్నాడు, "అయితే నేను మీతో సత్యము చెప్పుచున్నాను, నేను వెళ్లిపోవుటవలన మీకు ప్రయోజనకరము; నేను వెళ్లనియెడల ఆదరణకర్త మీయొద్దకు రాడు, నేను వెళ్ళినయెడల ఆయనను మీయొద్దకు ఆయన వచ్చి, పాపమును గూర్చియు నీతిని గూర్చియు తీర్పును గూర్చియు లోకమును ఒప్పుకొనజేయును." ఇది పరిశుద్ధాత్మ దేవుని కార్యము.

అంతట యేసుక్రీస్తు, పాపమును గూర్చియు, నీతిని గూర్చియు, తీర్పును గూర్చియు ఒప్పింపజేవయడం అంటే ఏమిటో వివరించాడు. 9వ వచనంలో "లోకులు నాయందు విశ్వాముంచలేదు గనుక పాపమును గూర్చియు" అని ఉంది. నీవు పాపం చెయ్యడానికి కారణం నీవు ప్రభువైన యేసుక్రీస్తునందు విశ్వాసముంచకపోవడమే. అన్ని పాపములలో కెల్లా గొప్ప పాపము ప్రభువైన యేసుక్రీస్తును నమ్మకపోవడం లేదా తిరస్కరించడం.

10వ వచనం ఈవిధంగా చెప్తున్నది, "నేను తండ్రియొద్దకు వెళ్లుట వలన మీరిక నన్ను చూడరు గనుక నీతిని గూర్చియు."

ప్రభువైన యేసుక్రీస్తు భూమిమీద ఉన్నప్పుడు, జీవించినవారందరిలో ఏకైక నీతిమంతుడుగా ఉండెను. ఇప్పటివరకు జీవించిన ఏకైక పాపములేని పరిపూర్ణ వ్యక్తి ఆయనే. ఇప్పుడు ఆయన పరలోకమునకు తిరిగి వెళ్లిపోయాడు. మనకు ఇకపై మానవశరీరంలో నీతియొక్క సంపూర్ణ ప్రమాణం లేదు. ఈ రోజు భూమిపైన మనకు పాపరహిత పరిపూర్ణతకు సంపూర్ణ ప్రామాణికత లేదు. కాబట్టి, ఈ యుగంలో పరిశుద్ధాత్ముని పని ఏంఇటంటే, ప్రభువైన యేసు మాత్రమే జీవించిన ఏకైక నీతిమంతుడు అని, నీవు అంత నీతిమంతుడవు కాదు అని నిన్ను ఒప్పించడమే.

అందరూ పాపము చేసి దేవుడు అనుగ్రహించు మహిమను పొందలేకపోవుచున్నారు. మరియు, నీవు ఎప్పుడైనా పరలోకానికి వెళ్తావు అని ఆశించినట్లయితే, అది ప్రభువైన యేసుక్రీస్తు యొక్క గొప్పతనం వలననే కాని నీ నీతి వలన కాదు, ఎందుకంటే, నీకు నీతి లేదు.

11వ వచనంలో కొనసాగిస్తూ, “ఈ లోకాధికారి తీర్పు పొందియున్నాడు గనుక తీర్పును గూర్చియు ఒప్పుకొనజేయును.”

దేవుని ప్రణాళికను ఆపడానికి సాతాను చేయగలిగినదంతా చేసాడు. యేసు పుట్టినప్పుడు తొట్టిలోనే శిశువును చంపడానికి ప్రయత్నించాడు. రెండు సంవత్సరాల వయస్సు అంతకన్నా తక్కువ ఉన్నవారందరిని చంపించాడు. ఆ తరువాత సాతాను శాస్త్రులతోను, పరిసయ్యులతోను, మతపెద్దలతోను రాళ్లుతీసికొని యేసును కొట్టించాడు. అరణ్యములో నలభై రాత్రులు, నలభై పగళ్లు సాతాను దేవుని శోధించి, వాడికి తెలిసిన ప్రతి మార్గాన్ని ప్రయోగించి ప్రభువుచేత పాపం చేయించడానికి ప్రయత్నం చేసాడు. యేసు మన పాపాలను భరించినప్పుడు తండ్రియొక్క భయంకరమైన ఉగ్రత ఆయన మీద కురిపించబడుతుందని దానిని పరిగణలోకి తీసుకున్నప్పుడు, గెత్సెమనె తోటలో “ఆయన చెమట రక్తబిందువులవలె ఆయెను”. ఆయనను విడిపించడానికి పండ్రెండు సేనావ్యూహములను పిలిచే అవకాశం ఉంది (మత్తయి 26:52-54). సిలువమీద నుండి క్రిందికి దిగివచ్చే శక్తి ఆయనకుంది. మనుష్యులు ఆయనను సిలువ పై నుండి క్రిందకు రమ్మన్నప్పుడు, క్రిందికి వచ్చినట్లయితే ఆయనను నమ్ముతామని చెప్పినప్పుడు, ఆవిధంగా చేయుటకు ఆయన శోధింపబడ్డాడు కూడా. ఆయన పొంతి పిలాతు ముందు నిలబడినప్పుడు, తమ మత వ్యవస్థను ఖండించుటకు వచ్చాడని ఆగ్రహంతో రగిలిపోతూ మతాధికారులు నేరారోపణ చేస్తుండగా, లోకమంతటిని నాశనము చేయగల అవకాశం ఆయనకు ఉండెను.

అయినప్పటికీ, ఈ లోకాధిపతి ఎన్ని చేసినప్పటికి, యేసు క్రీస్తు మన పాపాల కోసం తన ప్రాణాలను అర్పించాడు. మూడు రాత్రులు, మూడు పగళ్లు తరువాత, ఆయన సమాధిపై విజయంతో లేచాడు.

అపవాది, లేక వాని సేవకుల చేత మోసపోకండి. సాతాను మీకు అందించే ఈ లోక విషయాల చేత మోసపోకండి. ఘటసర్పానికి తీర్పు తీర్చబడింది. అతను ఒక అబద్ధికుడు అని తెలిసిపోయింది. వాడు హంతకుడుగా రుజువయ్యింది. ప్రభువైన యేసుక్రీస్తు, ఆయన మాత్రమే ఈ లోక రక్షకుడని నిరూపించాడు.

నీవు అనుమతించినట్లయితే, ఈ వాస్తవాలన్నిటిని దేవుని పరిశుద్ధాత్మ నీకు ఋజువుచేస్తాడు. నీవు కేవలం దేవుని మాట విని దానిని నమ్మినట్లయితే, నీ పాపము యొక్క ఖచ్చితమైన నిశ్చయత గురించి, యేసుక్రీస్తు యొక్క నీతి గురించి, మరియు సాతాను యొక్క నిశ్చయమైన తీర్పు గురించి నీవు ఒప్పింపబడతావు.

నాలుగవది, నీవు ఈ వర్తమానమును నమ్మినట్లయితే, పరిశుద్ధాత్మ దేవుడు నీకు నూతన జన్మను ఇస్తాడు. నీలో నివసించుటకు వస్తూ, ఆయన దేవుని జీవమును నీకు తీసుకొనివస్తాడు. ఎందుకంటే, ఆయన దేవుడు కాబట్టి. ఆత్మ నిన్ను తిరిగి జన్మింపజేసి, ఆవిధంగా నిన్ను నిత్యజీవము కలిగియున్న ఒకనూతన సృష్టిగా మార్చివేస్తాడు.

యోహాను 3:1–5 వచనాలలో ఈ కథ చెప్పబడింది: “యూదుల అధికారియైన నీకొదేమను పరిసయ్యు డొకడుండెను. అతడు రాత్రియందు ఆయనయొద్దకు వచ్చిబోధకుడా, నీవు దేవునియొద్దనుండి వచ్చిన బోధ కుడవని మే మెరుగుదుము; దేవుడతనికి తోడైయుంటేనే గాని నీవు చేయుచున్న సూచకక్రియలను ఎవడును చేయలేడని ఆయనతో చెప్పెను. అందుకు యేసు అతనితో ఒకడు క్రొత్తగా జన్మించితేనే కాని అతడు దేవుని రాజ్యమును చూడలేడని నీతో నిశ్చయముగా చెప్పు చున్నాననెను. అందుకు నీకొదేముముసలివాడైన మనుష్యుడేలాగు జన్మింపగలడు? రెండవమారు తల్లి గర్భోమందు ప్రవేశించి జన్మింపగలడా అని ఆయునను అడుగగా యేసు ఇట్లనెను: ఒకడు నీటిమూలముగాను ఆత్మమూలము గాను జన్మించితేనేగాని దేవుని రాజ్యములో ప్రవేశింప లేడని నీతో నిశ్చయముగా చెప్పుచున్నాను.”

పరిశుద్ధాత్మ యొక్క తిరిగి జన్మింపజేసే కార్యము గురించి 1 కొరింథీ 3:16 లో బైబిలు ఈవిధంగా చెప్తున్నది: “మీరు దేవుని ఆలయమైయున్నారనియు, దేవుని ఆత్మ మీలో నివసించుచున్నాడనియు మీరెరుగరా?”

మరల 1 కొరింథీ 12:13 లో ఈవిధంగా చదువుతాం: "ఏలాగనగా, యూదులమైనను, గ్రీసు దేశస్తులమైనను, దాసులమైనను, స్వతంత్రులమైనను, మనమందరము ఒక్క శరీరము లోనికి ఒక్క ఆత్మయందే బాప్తిస్మము పొందితిమి (ఒక్క మనిషియందు మనమందరము నీటిలో బాప్తిస్మము పొందలేదు). మనందరము ఒక్క ఆత్మను పానము చేసినవారమైతిమి."

ఎఫెసీ 4 ప్రకారం, 'ఒక్క శరీరము' అనగా ప్రభువైన యేసుక్రీస్తువారి శరీరము. సువార్తను నమ్మినవారిని, వారిలో నివసించుట మరియు వారిని తిరిగి జన్మింపజేయుట అనేది పరిశుద్ధాత్మ యొక్క పనియై యున్నది.

ఐదవది: ప్రభువైన యేసుక్రీస్తును తమ స్వంత రక్షకునిగా అంగీకరించినవారిని, దేవుని కుటుంబంలో వారి కుమారత్వం గురించి వారికి సాక్ష్యమిస్తాడు.

'నేను నిజంగా తిరిగి జన్మించానని నాకు ఎలా తెలుస్తుంది? పరిశుద్ధాత్మ నాలో నివసించుచున్నాడని నాకెలా తెలుస్తుంది?" అని నువ్వడుగుతావేమో. నేను మీ ఇంట్లోకి ప్రవేశించినట్లయితే, మీకు తెలుస్తుంది, ఎందుకంటే, నేను నా ఉనికిని చాలా రకాలుగా తెలియజేస్తాను. అదే విధంగా, ప్రభువైన యేసుక్రీస్తును నీ స్వంత రక్షకునిగా నమ్మినట్లయితే, విశ్వాసంతో కూడిన నిజాయితీగల హృదయంతో ఆయనకు ప్రార్థించినట్లయితే, పరిశుద్ధాత్మ దేవుడు నీలో నివసించుటకు వస్తాడు. నీవు నమ్ము, ఆయన తన ఉనికిని నీకు తెలియజేస్తాడు.

రోమా 8:16లో బైబిలు ఈ విధంగా చెప్తున్నది, "మనము దేవుని పిల్లలమని ఆత్మ తానే మన ఆత్మతో కూడ సాక్ష్యమిచ్చుచున్నాడు."

యోహాను 3:8లో పరిశుద్ధాత్మ గురించి ప్రభువైన యేసుక్రీస్తు ఈ విధంగా చెప్తున్నాడు: గాలి తనకిష్టమైన చోటును విసరును; నీవు దాని శబ్దము విందువేగాని అది యెక్కడినుండి వచ్చునో యెక్కడికి పోవునో నీకు తెలియదు. ఆత్మ మూలముగా జన్మించిన ప్రతివాడును అలాగే యున్నాడనెను."

నా స్నేహితుడా, నేను గాలిని చూడలేను. నేను గాలిని ముట్టుకోలేను. నేను గాలిని నా చేతులతో పట్టుకోలేను. కాని, గాలి వీచినప్పుడు అనుమానం లేకుండా మనకు తెలుస్తుంది, గాలి ఉన్నదని. దాని ప్రభావాల గురించి నీకు తెలిసేయున్నది. ఆవిధంగా, ఆత్మ మూలముగా తిరిగి జన్మించినవారందరితో ఆత్మ ఉన్నాడు. దేవుని సమాధానము నీ హృదయములోనికి మనస్సులోనికి ప్రవేశించినప్పుడు ఎంతో గొప్ప మార్పు కనబడుతుంది.

మత్తయి 10:32 లో బైబిలు ఈవిధంగా చెప్తున్నది, “మనుష్యుల యెదుట నన్ను ఒప్పుకొనువాడెవడో పరలోకమందున్న నా తండ్రియెదుట నేను వానిని ఒప్పుకొందును.”

దేవుని కుటుంబంలో వారి కుమారత్వం గురించి క్రీస్తును తమ ప్రభువుగా అంగీకరించిన విశ్వాసులకు సాక్ష్యమివ్వడం పరిశుద్ధాత్మ యొక్క పని.

ఆరవది: పరిశుద్ధాత్ముడు సేవకొరకు విశ్వాసులను శక్తివంతులుగా చేస్తాడు. వారి సేవలో వారికి మార్గనిర్దేశం చేస్తాడు.

అపొస్తలుల కార్యములు 1:8-9 లో బైబిలు ఈ విధంగా చెప్తున్నది. “అయినను పరిశుద్ధాత్మ మీ మీదికి వచ్చునప్పుడు మీరు శక్తినొందెదరు గనుక మీరు యెరూషలేములోను, యూదయ సమరయ దేశముల యందంతటను భూదిగంత ముల వరకును, నాకు సాక్షులైయుందురని వారితో చెప్పెను. ఈ మాటలు చెప్పి, వారు చూచుచుండగా ఆయన ఆరోహణమాయెను, అప్పుడు వారి కన్నులకు కనబడకుండ ఒక మేఘము ఆయనను కొనిపోయెను.”

అపొ.కా. 2వ అధ్యాయంలో దేవుని వాక్యం ఈ విధంగా సెలవిస్తుంది, పరిశుద్ధాత్మ దేవుడు క్రిందికి వచ్చి తండ్రి వాగ్దానం కొరకు ఎవరైతే ఎదురుచూస్తూ ఉన్నారో, వారిలో నివసించి, వారిని ఆత్మచేత నింపాడు. వారు ఆత్మచేత నింపబడగానే, వెంటనే యెరూషలేము వీధుల్లోకి, సంతలోకి, ప్రజారంగంలోకి వెళ్లారు. అక్కడ ఏమాత్రము భయం లేకుండా, మొహమాటం లేకుండా సంకోచం లేకుండా, ఇతరులు వారిని గూర్చి ఏమనుకుంటారో అనే విషయం ఆలోచించకుండ వారు ధైర్యంగా యేసుక్రీస్తు ప్రభువు యొక్క మరణము, సమాధి, పునరుత్థానము గురించి ప్రకటిస్తూ, మనుష్యులు పశ్చాత్తాపపడి ప్రభువైన యేసుక్రీస్తును నమ్మాలని హక్కుగా భావించి అడిగారు.

పరిశుద్ధాత్మ దేవుడు వారిలో ఉన్నందుకు ఇది జరిగింది. మరేది కూడా దేవుని సేవించుటకు, ప్రభువైన యేసుక్రీస్తు యొక్క సువార్త సత్యానికి సాక్షులుగా ఉండుటకు వారికి శక్తిని ఇవ్వలేదు.

రోమా 8:14లో బైబిలు ఈ విధంగా చెప్తున్నది, “దేవుని ఆత్మచేత ఎందరు నడిపింపబడుదురో వారందరు దేవుని కుమారులైయుందురు.”

నీవు నిజంగా తిరిగి జన్మించినట్లయితే, దేవుని పరిశుద్ధాత్మ నిన్ను ప్రభువైన యేసుక్రీస్తును సేవించుటకు, సాక్ష్యమిచ్చుటకు మరియు ఆయనకు ప్రాతినిధ్యం వహించుటకు నడిపిస్తాడు. రక్షించబడిన దేవుని బిడ్డయైన విశ్వాసికి దేవుని

ఏర్పాటు ఏమిటంటే, దేవుని పరిశుద్ధాత్మ అతనిలో ఉండి అతన్ని శక్తివంతునిగా చేయడమే కాక, అతడు క్రీస్తులో నిలిచి ఉంటాడు.

మన ఆస్తులను మనం సొంతం చేసుకొంటే, మనం ఎప్పటికీ ఆధ్యాత్మిక బలహీనులముగా ఉండవలసిన అవసరం లేదు. మీరు క్రైస్తవులు కాబట్టి, దేవునికి తోడ్పడే శక్తియైన పరిశుద్ధాత్మను బట్టి సాక్ష్యమివ్వకపోవడానికి కారణమే లేదు.

పాపమును, శోధనను, లోకమును, శరీరాశలను, మరియు అపవాదిని ఎదిరించకపోవడానికి ఎటువంటి కారణం లేదు. నా స్నేహితుడా, క్రైస్తవ జీవితంలో ఓడిపోవడానికి కారణమేమి లేదు.

పరిశుద్ధాత్మచేత తిరిగి జన్మించడం, పరిశుద్ధాత్మ నీలో నిలిచియుండడం మరియు పరిశుద్ధాత్మ గురించి సాక్ష్యమివ్వడం వీటన్నిటి మధ్యలో వ్యత్యాసం ఉందని స్పష్టంగా గమనించాలి. ఇవన్నీ కూడా వేరువేరుగా జరిగే పరిశుద్ధాత్మ కార్యాలు. అయినప్పటికి, ఒకరు ఆత్మచేత తిరిగి జన్మించకయుంటే వారిలో ఆత్మ నివసించే అవకాశం ఉండదు.

ఎవరితోనైతే ఆత్మ నివసించదో, వారికి దేవుని ఆత్మయొక్క సాక్ష్యం ఉండదు. ఒకరికి పరిశుద్ధాత్మ సాక్ష్యం లేకపోతే, అతను ఆత్మయొక్క శక్తిలో దేవునికి సాక్షిగా ఉండలేదు.

కాబట్టి, వీటిలో ప్రతి ఒక్కటి సాంకేతికంగా వేరు వేరు కార్యములుగా ఉన్నప్పటికీ, ఒకటి మరొక దానిని వెంబడిస్తూ, ఒక కార్యము జరిగిన వెంటనే మరొకటి వెంబడిస్తుంది.

నీవు తిరిగి జన్మించాలి. నీ జీవితంలో దేవుని పరిశుద్ధాత్మ కార్యమునకు నిన్ను నీవు సమర్పించుకోవాలి. మనలను మనం ఆయనకు సమర్పించుకొన్నప్పుడు, దేవుడు చేయాలనుకొన్న పనులలో ఆయన మనలను శక్తివంతులుగా చేస్తాడు, మనకు మార్గనిర్దేశనం చేస్తాడు.

మీలో చాలామంది దేవుని సేవించుటకు మీ ఉత్తమమైన ప్రయత్నం చేసారు. కానీ మీరు విసిగిపోయారు. ఓడిపోయారు, నిరాశపరచబడ్డారు. కొంతమంది చివరికి వదిలేసారు, లేదా వదిలేయాలనుకొన్నారు.

మీరు చేయగలిగే ఉత్తమమైన పని వదులుకోవడమే అని నేను చెప్తున్నాను. నేను నిష్క్రమించమనట్లేదు కాని వదులుకోమంటున్నాను. నీ సొంత బలమును నమ్ముకోవడం వదిలివేయమంటున్నాను. నీ సొంత శక్తితో ప్రయాసపడటం, శ్రమపడటం వదిలేయి. దేవుని కొరకు నీ సొంత మార్గంలో, నీ సొంత కారణాలకు

పనిచేయడం వదిలేసి, నిన్ను నీవు పరిశుద్ధాత్మునికి సమర్పించుకో. ఆయనను నీ ద్వారా పనిచేయుటకు అనుమతించు. నీ ఆలోచనలను, మాటలను క్రియలను మరియు చర్యలను మార్గనిర్దేశం చేయుటకు, నడిపించుటకు ఆయనను అనుమతించు.

నీ సొంత శక్తితో దేవుని సేవించడం మానేసి, సర్వశక్తుడైన దేవుని సేవలో పరిశుద్ధాత్ముడు నీ ద్వారా పనిచేసినట్లయితే, అది ఎంతో వ్యత్యాసం ఉంటుంది.

మీలో కొందరు నిజాయితీగా, మీకు తెలిసిన ఉత్తమమైన మార్గంలో దేవుని సేవిస్తున్నారు. మీరు మీ సేవకునికి, మీ మందిరానికి విశ్వాసంగా వుంటున్నారు. బహుశా మీరు చాలా శ్రద్ధగా పనిచేస్తున్నారు. మీకు తెలిసిన, మీకు అర్థమైన బైబిలులోని కొన్ని సత్యాలను ప్రచురించుటకు మీరు చురుకుగా ప్రయత్నిస్తున్నారు. అయినప్పటికీ, మీరు దేవునిబిడ్డ అని ఆదరించే ఖచ్చితత్వం మీ హృదయంలో లేదు. మీరు నిజంగా దేవుని బిడ్డ అని, మీ పాపాలన్నీ క్షమించబడ్డాయన్న పరిశుద్ధాత్మ సాక్ష్యం మీలో లేదు.

ఒకవిధంగా, నీగురించి చెప్పాలంటే, దేవుడు నీకోసం చేసిన పనిని నమ్మడం కంటే, దేవునికోసం నీవు చేస్తున్న పనే నిన్ను రక్షిస్తుందని నీవు నమ్ముతున్నావన్న మాట.

చూడండి, యేసుక్రీస్తు కల్వరి సిలువలో నీ కోసం మరణించినప్పుడు, ఆయన పెద్ద స్వరముతో "సమాప్తమాయెను" అని అరిచాడు. ఆయన పని ప్రారంభించి నిన్ను ముగించుమని అడగలేదు. ఆయన పనిని ముగించాడు.

మీరు చేయగలిగినది సరిపోదని, తెలిసికొని, మీరు మీ మంచితనమును, మీ పనులను, కార్యములను విడిచిపెట్టి, దేవుడు నీ ఆత్మ రక్షణకై ముగించిన పనిని నమ్మినట్లయితే, దేవునితో మీకు సమాధానము ఏర్పడుతుంది.

ఈరోజు అది చేయడానికి ఇష్టపడుతున్నావా? నిన్ను దోషిగా నిర్ధారించి, నీ పాపము విషయమై, దేవుని నీతి విషయమై, మరియు యేసుక్రీస్తు ప్రభువునందు కాక నీవు నమ్మే సమస్తముపై దేవుని తీర్పు విషయమై పరిశుద్ధాత్ముడు నిన్ను ఒప్పింపజేయుటకు నీవు అనుమతిస్తావా?

నీ పాపములను క్షమించి, నీ రక్షకునిగా ఉండుమని ఈరోజు నీవు నిజాయితీగల, నమ్ముతున్న హృదయముతో ఆయనకు ప్రార్థనచేస్తావా? ఇప్పటికీ ఎప్పటికీ అది ఎంతో వ్యత్యాసం చూపెడుతుంది.

# మాంసయుక్తమైన దేహమందు దేవుడు

## (మొదటి భాగం)

ఈ పాఠంలో శరీరమందున్న దేవుని గురించి మనం ఆలోచన చేద్దాం. యేసుక్రీస్తు దైవత్వం గురించిన ఆయన సాక్ష్యాన్ని, ఇతరుల సాక్ష్యాన్ని, ఆయన దైవత్వానికి సంబంధించిన పునరుత్థానాన్ని పరిశీలించడం ద్వారా ఆయన దైవత్వాన్ని మనం తలచుకుందాం.

దేవుడొక్కడే అని, తండ్రి, వాక్యము, పరిశుద్ధాత్మలుగా ఏకమై నిత్య ఉనికి కలిగివున్నాడని మన అధ్యయనాలన్నిటిలో పదే పదే పేర్కొనడం జరిగింది (1 యోహాను 5:7). యేసుక్రీస్తు ఇప్పుడు ఎల్లప్పుడు శరీరమందు ప్రత్యక్షమైన దేవుడు అని ఎప్పటికప్పుడు పేర్కొనడం జరిగింది (1 తిమోతి 3:16).

యేసుక్రీస్తు దేవుడని పై రెండు వాక్యభాగాల్లో మాత్రమే కాక, బైబిల్‌లో అనేకచోట్ల ఆ సత్యం అసంఖ్యాకంగా పునరుద్ఘాటించబడింది.

మొదట శరీరధారణ అంటే ఏమిటో చూద్దాం. "కార్నె" అంటే శరీరము లేక మాంసము మాంసాహార జీవులైన కార్నివోరస్, కార్నివాల్ (శరీరసంబంధమైన వినోదాత్మక నృత్యహేళి), కార్నల్ (శరీర సంబంధమైన మనస్సు), ఇవన్నీ శరీరానికి సంబంధించిన అంశాలు. శరీరధారణ అంటే దేవుడు శరీరం ధరించి ఈ లోకానికి రావడమని అర్థం.

దైవ-మానవ సంయోగం గురించిన ఈ వైచిత్రిని కొంతవరకు అర్థం చేసుకోడానికి, యేసుక్రీస్తు దైవత్వానికి సంబంధించిన ఆధారాలను పరిశీలించడం మంచిది.

తన దైవత్వం గురించి యేసు ఏమని చెప్పాడో మొదట చూద్దాం.

రక్షకునిగా రానున్న మెస్సీయాను గురించి ముందుగానే ప్రకటించిన పాత నిబంధన ప్రవక్తలు, ఆ రక్షకుడు దేవుడని చెప్పారు.

యెషయా 9:6-7 లో వ్రాయబడివుంది: ఏలయనగా మనకు శిశువు పుట్టెను మనకు కుమారుడు అనుగ్రహింపబడెను ఆయన భుజముమీద రాజ్యభారముండును. ఆశ్చర్యకరుడు ఆలోచనకర్త బలవంతుడైన దేవుడు నిత్యుడగు తండ్రి సమాధానకర్తయగు అధిపతి అని అతనికి పేరు పెట్టబడును. ఇది మొదలుకొని మితిలేకుండ దానికి వృద్ధియు క్షేమమును కలుగునట్లు సర్వకాలము దావీదు సింహాసనమును రాజ్యమును నియమంచును. న్యాయమువలనను నీతివలనను రాజ్యమును స్థిరపరచుటకు అతడు సింహాసనాసీనుడై రాజ్యపాలన చేయును. సైన్యములకధిపతియగు యెవా ఆసక్తి కలిగి దీనిని నెరవేర్చును.

ఒక శిశువు జన్మించనున్నాడని, ఆ శిశువు బలవంతుడైన దేవుడవుతాడని బైబిల్ చెబుతోంది. ఆ శిశువు నిత్యుడగు తండ్రి అవుతాడు. ఇది పరిశుద్ధాత్మ దేవుని ప్రేరణద్వారా యెషయా పలికిన ప్రవచనం. బలవంతుడగు దేవుడైన తండ్రి శిశువుగా జన్మించలేదు అంటే బైబిల్ అబద్ధమాడినట్లే.

యెషయా 7:14 లో మనం ఇలా చదువుతాం, కాబట్టి ప్రభువు తానే యొక సూచన మీకు చూపును. ఆలకించుడి, కన్యక గర్భవతియై కుమారుని కని అతనికి ఇమ్మానుయేలను పేరు పెట్టును.

ప్రియ స్నేహితుడా, ఆదాము ద్వారా జన్మించిన మనుష్యులందరూ పాపముతోనే జన్మించారు. అది వారి స్వభావం (ఎఫెసీ 2:1-3). పాపమువైపు మొగ్గు చూపే సహజ స్వభావంతోనే మనుష్యులు జన్మిస్తున్నారు. మానవుని రక్షించడానికి ఆదాము స్వభావంలో జన్మించిన ప్రతి ఒక్కడూ మర్త్యుడే కనుక మానవుని రక్షించడం మరో మానవునికి ఏమాత్రం సాధ్యం కాదు.

అయితే యెషయా ప్రవచనం నెరవేరి, కన్య గర్భాన ఒక శిశువు జన్మించి ఉంటే మీరు ఈ భూమిమీద ఆదాము బీజం లేనివారుగా జీవించగలరు. మెస్సీయాను గూర్చిన ప్రవచనాలన్నీ మరే మనుష్యునిలోను కాక, ప్రభువైన యేసుక్రీస్తునందే నెరవేరాయి.

ఈ మాటను యేసే స్వయంగా తన్నుగూర్చి చెప్పుకున్నాడు. లూకా 24 లో చూడండి. ఎమ్మాయు గ్రామానికి వెళుతున్న క్రమంలో ప్రభువు ఇద్దరు శిష్యులను సమీపించి వారితో కూడ నడుస్తూ చెప్పిన మాటలు జ్ఞాపకం చేసుకోండి. వారు సంభాషించుచు ఆలోచించుకొనుచుండగా, యేసు తానే దగ్గరకువచ్చి వారితోకూడ నడిచెను. అయితే వారాయనను గుర్తు పట్టలేకుండ

వారి కన్నులు మూయబడెను. ఆయన మీరు నడుచుచు ఒకరితో ఒకరు చెప్పుకొనుచున్న యీ మాట లేమని అడుగగా వారు దుఃఖముఖులై నిలిచిరి. వారిలో క్లెయొపా అనువాడు యెరూషలేములో బస చేయుచుండి, యీ దినములలో అక్కడ జరిగిన సంగతులు నీవొకడవే యెరుగవా? అని ఆయనను అడిగెను. ఆయన అవి ఏవని వారిని అడిగినప్పుడు వారు నజరేయుడైన యేసును గూర్చిన సంగతులే. ఆయన దేవునియెదుటను ప్రజలందరియెదుటను క్రియలోను వాక్యములోను శక్తిగల ప్రవక్తయై యుండెను. మన ప్రధాన యాజకులును అధికారులును ఆయనను ఏలాగు మరణశిక్షకు అప్పగించి, సిలువ వేయించిరో నీకు తెలియదా? ఇశ్రాయేలును విమోచింపబోవువాడు ఈయనే అని మేము నిరీక్షించి యుంటిమి. ఇదిగాక యీ సంగతులు జరిగి నేటికి మూడు దినములాయెను. అయితే మాలో కొందరు స్త్రీలు తెల్లవారగానే సమాధియొద్దకు వెళ్లి, ఆయన దేహమును కానక వచ్చి కొందరు దేవదూతలు తమకు కనబడి ఆయన బ్రదికియున్నాడని చెప్పిరని మాతో చెప్పి మాకు విస్మయము కలుగజేసిరి. మాతోకూడ ఉన్నవారిలో కొందరు సమాధియొద్దకు వెళ్లి ఆ స్త్రీలు చెప్పినట్టు కనుగొనిరి గాని, ఆయనను చూడలేదని ఆయనతో చెప్పిరి. అందుకాయన అవివేకులారా, ప్రవక్తలు చెప్పిన మాటలనన్నిటిని నమ్మని మందమతులారా, క్రీస్తు ఈలాగు శ్రమపడి తన మహిమలో ప్రవేశించుట అగత్యము కాదా అని వారితో చెప్పి మోషేయు సమస్త ప్రవక్తలును మొదలు కొని లేఖనములన్నిటిలో తన్ను గూర్చిన వచనముల భావము వారికి తెలిపెను. (లూకా 24:15-27).

పాత నిబంధన ప్రవక్తలు ప్రవచించింది తన్ను గురించే అని ప్రభువైన యేసుక్రీస్తు లూకా 24 లో చెప్పుకున్నాడు.

ప్రవక్తలు ముందుగా చెప్పబడిన కన్య గర్భధారణ క్రొత్త నిబంధనలో సంపూర్ణంగా స్థిరపరచబడింది. లూకా మొదటి అధ్యాయాన్ని, దానితోపాటు మత్తయి మొదటి అధ్యాయాన్ని కలిసి చదువుదాం.

ముందుగా లూకా మొదటి అధ్యాయమునుండి చదువుదాం: ఆరవ నెలలో గబ్రియేలను దేవదూత గలిలయలోని నజరేతను ఊరిలో దావీదు వంశస్థుడైన యోసేపను ఒక పురుషునికి ప్రధానము చేయబడిన కన్యకయొద్దకు దేవుని చేత పంపబడెను. ఆ కన్యక పేరు మరియ. ఆ దూత లోపలికి వచ్చి ఆమెను చూచిదయాప్రాప్తురాలా నీకు శుభము, ప్రభువు నీకు తోడైయున్నాడని చెప్పెను. ఆమె ఆ మాటకు బహుగా తొందరపడి ఈ శుభవచన మేమిటో అని ఆలోచించు

కొనుచుండగా దూత మరియా, భయపడకుము. దేవునివలన నీవు కృపపొందితివి. ఇదిగో నీవు గర్భము ధరించి కుమారుని కని ఆయనకు యేసు అను పేరు పెట్టుదువు. ఆయన గొప్పవాడై సర్వోన్నతుని కుమారుడనబడును. ప్రభువైన దేవుడు ఆయన తండ్రియైన దావీదు సింహాసనమును ఆయన కిచ్చును.

ఆయన యాకోబు వంశస్థులను యుగయుగములు ఏలును. ఆయన రాజ్యము అంతములేనిదై యుండునని ఆమెతో చెప్పెను. అందుకు మరియ నేను పురుషుని ఎరుగనిదాననే. యిదేలాగు జరుగునని దూతతో అనగా దూత పరిశుద్ధాత్మ నీమీదికి వచ్చును, సర్వోన్నతుని శక్తి నిన్ను కమ్ముకొనును గనుక పుట్టబోవు శిశువు పరిశుద్ధుడై దేవుని కుమారుడనబడును (లూకా 1:26–35).

పరలోకపు దేవునియొద్దనుండి వచ్చిన దూత మరియకు వినిపించిన సందేశమిదే.

గబ్రియేలు దూత తెచ్చిన సందేశం మునుపు చేయబడిన వాగ్దానాన్ని నెరవేర్చిందా అని ఇప్పుడు పరిశీలిద్దాం: యేసుక్రీస్తు జననవిధ మెట్లనగా, ఆయన తల్లియైన మరియ యోసేపునకు ప్రధానము చేయబడిన తరువాత వారేకము కాకమునుపు ఆమె పరిశుద్ధాత్మవలన గర్భవతిగా ఉండెను. ఆమె భర్తయైన యోసేపు నీతిమంతుడైయుండి ఆమెను అవమానపరచనొల్లక రహస్యముగా ఆమెను విడనాడ ఉద్దేశించెను. అతడు ఈ సంగతులను గూర్చి ఆలోచించుకొనుచుండగా, ఇదిగో ప్రభువు దూత స్వప్నమందు అతనికి ప్రత్యక్షమై దావీదు కుమారుడవైన యోసేపూ, నీ భార్యయైన మరియను చేర్చుకొనుటకు భయపడకుము, ఆమె గర్భము ధరించినది పరిశుద్ధాత్మవలన కలిగినది, ఆమె యొక కుమారుని కనును, తన ప్రజలను వారి పాపములనుండి ఆయనే రక్షించును గనుక ఆయనకు యేసు అను పేరు పెట్టుదువనెను. ఇదిగో కన్యక గర్భవతియై కుమారుని కనును ఆయనకు ఇమ్మానుయేలను పేరు పెట్టుదురు అని ప్రభువు తన ప్రవక్తద్వారా పలికిన మాట నెరవేరునట్లు ఇదంతయు జరిగెను. ఇమ్మానుయేలను పేరునకు భాషాంతరమున దేవుడు మనకు తోడని అర్థము. యోసేపు నిద్రమేలుకొని ప్రభువు దూత తనకు ఆజ్ఞాపించిన ప్రకారముచేసి, తన భార్యను చేర్చుకొని ఆమె కుమారుని కను వరకు ఆమెను ఎరుగకుండెను. అతడు ఆ కుమారునికి యేసు అను పేరు పెట్టెను (మత్తయి 1:18–25).

ఈ లేఖనభాగాల్లో నిక్షిప్తమై యున్న నాలుగు గొప్ప సత్యాలను మనం ఇప్పుడు చూద్దాం.

మొదటిది, వాక్యము శరీరధారియై మనమధ్య నివసించాడు. ఇది పాత నిబంధన లేఖనాల్లో ప్రవచించబడింది, దూతలచే ప్రకటించబడింది, దేవునియొద్దనుండి పంపబడింది, ప్రభువైన యేసుక్రీస్తు జీవిత, మరణ, భూస్థాపిత, పునరుత్థానాలలో ఋజువైంది. కన్యక గర్భం ధరించింది. ఆమె గర్భంలో పరిశుద్ధమైనదొకటి రూపుదిద్దుకుంది. ఆ పరిశుద్ధమైనది ఒక దేహము అని బైబిల్ చెబుతోంది (హెబ్రీ 10:5). ఈ దేహం దైవత్వంలోని రెండవ వ్యక్తియైన ప్రభువైన యేసుక్రీస్తు నివసించడానికి సిద్ధపరచబడింది.

రెండవది, ఆయన దేహం నివసించడానికి అనువైన మానవ సాధనంగా మరియ గర్భం రూపొందించబడింది. మరియను సృజించినవాడు దేవుడే. విశ్వాన్ని సృజించినవాడు దేవుడే. మరియ దేవునికి జన్మనివ్వలేదు. దేవుడు ప్రత్యక్షమైన దేహానికి మరియ జన్మనిచ్చింది. మరియకంటె ముందే దేవుడున్నాడు. మరియ తల్లికి, మరియ అమ్మమ్మకంటె ముందే దేవుడున్నాడు. మరియకు ఆది తల్లిదండ్రులైన ఆదాము హవ్వలకు ముందే దేవుడున్నాడు. దేవుడే సృష్టికర్త. ఈ సృష్టికర్త ప్రభువైన యేసుక్రీస్తు. ఆయన సిద్ధపరచబడిన మరియ గర్భంలో శరీరముగా రూపుదిద్దుకున్నాడు. మరియను "దేవుని తల్లి" అని సైతానీయంగా పిలువకండి. ఆమెకు దేవునితో సమాన స్థానానికి లేక త్రిత్వంతో సమాన స్థాయికి హెచ్చించే మూర్ఖపు, శోచనీయ పనులు చేయకండి.

మూడవది, మానవుని పాప సమస్యను పరిష్కరించడానికి దేవుడు ఒక దూతను పంపకపోవడం అద్భుతం కాదా? మానవుని పాప సమస్యను పరిష్కరించడానికి దేవుడు ప్రధాన దూతనో లేక దూతల అధిపతినో పంపలేదు. పాపులను రక్షించడానికి ఆయనే స్వయంగా యేసుక్రీస్తు అను వ్యక్తిగా దిగివచ్చాడు. ఆయన – దేవుడు మనకు తోడని అర్థమిచ్చే ఇమ్మానుయేలు అను పేరును ధరించాడని బైబిల్ చెబుతోంది.

నాలుగవది, యేసుక్రీస్తు శరీరధారి కావడానికి ముందే ఉన్నాడనే నిర్వివాదాంశాన్ని దేవుని పరిశుద్ధ వాక్యం స్థాపిస్తోంది. ఉదాహరణకు యోహాను గ్రంథం తీసుకోండి. యోహాను 1:1 ఇలా చెబుతోంది, ఆదియందు వాక్యముండెను, వాక్యము దేవునియొద్ద ఉండెను, వాక్యము దేవుడై యుండెను. ఆదికాండము 1:1 లో బైబిల్ ఆదియందు దేవుడు ... అని మొదలెడుతోంది.

అలాగే యోహాను 1:2-3 లో మనం ఇలా చదువుతాం, ఆయన ఆదియందు దేవునియొద్ద ఉండెను. సమస్తమును ఆయన మూలముగా కలిగెను, కలిగియున్నదేదియు ఆయన లేకుండ కలుగలేదు.

వాక్యము ఆదినుండే ఉనికి కలిగివుందని మనం చూస్తున్నాం. ఆ వాక్యము ద్వారానే సమస్తం చేయబడ్డాయి. ఆ తరువాత యోహాను 1:14 లో బైబిల్ ఇలా చెబుతోంది, ఆ వాక్యము (అదే వాక్యము) శరీరధారియై, కృపాసత్యసంపూర్ణుడుగా మనమధ్య నివసించెను. తండ్రివలన కలిగిన అద్వితీయకుమారుని మహిమవలె మనము ఆయన మహిమను కనుగొంటిమి.

ప్రియ చదువరీ, ప్రభువైన యేసుక్రీస్తు ఉనికి బేత్లెహేము పశువుల పాకలో ఆరంభం కాలేదు. బేత్లెహేము, దానిలోవున్న పశులపాక ప్రభువైన యేసుక్రీస్తు వలన ఉనికిలోకి వచ్చాయి. ప్రభువైన యేసుక్రీస్తు సృష్టికర్త, వాక్యము, సమస్తాన్ని చేసినవాడు, శరీరధారియైనవాడు.

సమీపింపరాని తేజస్సులో ఆయన మాత్రమే వసించుచు అమరత్వము గలవాడైయున్నాడు. మనుష్యులలో ఎవడును ఆయనను చూడలేదు, ఎవడును చూడనేరడు అని కూడ బైబిల్ 1 తిమోతి 6:16 లో చెబుతోంది. దీనితో ఆయన కలిగియున్న మహిమను యోహాను 1:14 తో ఎలా పోల్చి చూడగలం? మనమాయనను చూచులాగున దేవుడు తన మహిమను మానవ దేహంలో కప్పివుంచాడు.

ప్రభువు ప్రార్థనలోని వాస్తవాన్ని యోహాను 17:1-5 లో మనం చూడగలం: యేసు ఈ మాటలు చెప్పి ఆకాశమువైపు కన్నులెత్తి యిట్లనెను - తండ్రీ, నా గడియ వచ్చియున్నది. నీ కుమారుడు నిన్ను మహిమపరచునట్లు నీ కుమారుని మహిమపరచుము. నీవు నీ కుమారునికిచ్చిన వారికందరికిని ఆయన నిత్యజీవము అనుగ్రహించునట్లు సర్వశరీరులమీదను ఆయనకు అధికారమిచ్చితివి. అద్వితీయ సత్యదేవుడవైన నిన్నును, నీవు పంపిన యేసుక్రీస్తును ఎరుగుటయే నిత్యజీవము. చేయుటకు నీవు నాకిచ్చిన పని నేను సంపూర్ణముగా నెరవేర్చి భూమిమీద నిన్ను మహిమపరచితిని. (మనము ఆయన మహిమను కనుగొంటిమి) అని యోహాను 1:14 లో బైబిల్ చెబుతోందని గుర్తుంచుకోండి. భూమిమీదున్న మనుష్యులు చూచులాగున దేవుని మహిమ భూమిమీదికి వచ్చియున్నది.) తండ్రీ, లోకము పుట్టకమునుపు నీయొద్ద నాకు ఏ మహిమయుండెనో ఆ మహిమతో నన్ను ఇప్పుడు నీయొద్ద మహిమ పరచుము.

మరలా చెబుతున్నాను, ప్రభువైన యేసుక్రీస్తు ఉనికి మరియ గర్భం ధరించడంతో ఆరంభమైనది కాదు. జగత్పునాది వేయబడకమునుపే సమస్తాన్ని ఉనికిలోకి తెచ్చినవాడు ప్రభువైన యేసుక్రీస్తు.

శరీరధారి కావడంకంటె ముందే యేసుక్రీస్తు ఉనికి కలిగియున్నాడని యోహాను 17:24 లో స్పష్టంగా చెప్పబడింది: తండ్రీ, నేనెక్కడ ఉందునో అక్కడ నీవు నాకు అనుగ్రహించిన వారును నాతోకూడ ఉండవలెననియు, నీవు నాకు అనుగ్రహించిన నా మహిమను వారు చూడవలెననియు కోరుచున్నాను. జగత్తు పునాది వేయబడక మునుపే నీవు నన్ను ప్రేమించితివి.

యోహాను 8:51–59 లో ఒక గొప్ప సత్యం చెప్పబడింది. అబ్రాహామును గురించిన చర్చలో యేసుక్రీస్తుకు తన కాలంలోని మతనాయకులతో విభేదం తలెత్తింది. ఆయన ఇలా అన్నాడు, ఒకడు నా మాట గైకొనిన యెడల వాడెన్నడును మరణము పొందడని మీతో నిశ్చయముగా చెప్పుచున్నానని ఉత్తరమిచ్చెను. అందుకు యూదులు నీవు దయ్యము పట్టినవాడవని యిప్పుడెరుగుదుము. అబ్రాహామును ప్రవక్తలును చనిపోయిరి, అయినను ఒకడు నా మాట గైకొనినయెడల వాడు ఎన్నడును మరణము రుచిచూడడని నీవు చెప్పుచున్నావు. మన తండ్రియైన అబ్రాహాము చనిపోయెను గదా. నీవతనికంటె గొప్పవాడవా? ప్రవక్తలును చనిపోయిరి, నిన్ను నీ వెవడవని చెప్పుకొనుచున్నావని ఆయన నడిగిరి. అందుకు యేసు నన్ను నేనే మహిమపరచుకొనినయెడల నా మహిమ వట్టిది. మా దేవుడని మీరెవరినిగూర్చి చెప్పుదురో ఆ నా తండ్రియే నన్ను మహిమపరచుచున్నాడు. మీరు ఆయనను ఎరుగరు, నేనాయనను ఎరుగుదును, ఆయనను ఎరుగనని నేను చెప్పినయెడల మీవలె నేనును అబద్ధికుడనై యుందును గాని, నేనాయనను ఎరుగుదును, ఆయన మాట గైకొనుచున్నాను. మీ తండ్రియైన అబ్రాహాము నా దినము చూతునని మిగుల ఆనందించెను, అది చూచి సంతోషించెను అనెను. అందుకు యూదులు నీకింకను ఏబది సంవత్సరములైన లేవే, నీవు అబ్రాహామును చూచితివా అని ఆయనతో చెప్పగా, యేసు అబ్రాహాము పుట్టకమునుపే నేను ఉన్నానని మీతో నిశ్చయముగా చెప్పుచున్నాననెను. కాబట్టి వారు ఆయనమీద రువ్వుటకు రాళ్లు ఎత్తిరి గాని యేసు దాగి దేవాలయములో నుండి బయటికి వెళ్లిపోయెను.

ఆదికాండము 12 లో బహుకాలం క్రితం జీవించిన అబ్రాహాము అను మనుష్యుని గురించి మనం చదువుతాం. అయినా, ప్రభువైన యేసుక్రీస్తు

అబ్రాహాము పుట్టకమునుపే నేను ఉన్నాను అని చెప్పాడు. గమనించండి, అబ్రాహాము పుట్టకమునుపే నేను ఉంటిని అని ఆయన చెప్పలేదు. అబ్రాహాము పుట్టకమునుపే నేను ఉన్నాను అని చెప్పడంలో ప్రభువైన యేసుక్రీస్తు తన మాటలను జాగ్రత్తగా ఉపయోగించాడు.

నిర్గమకాండము 3:13–14 లో ఈ మాటలను మనం గమనించగలం, మోషే చిత్తగించుము నేను ఇశ్రాయేలీయులయొద్దకు వెళ్లి వారిని చూచి మీ పితరుల దేవుడు మీ యొద్దకు నన్ను పంపెనని వారితో చెప్పగా వారుఆయన పేరేమి అని అడిగిన యెడల వారితో నే నేమి చెప్పవలెనని దేవుని నడిగెను. అందుకు దేవుడు నేను ఉన్నవాడను అనువాడనై యున్నానని మోషేతో చెప్పెను. మరియు ఆయన ఉండుననువాడు మీయొద్దకు నన్ను పంపెనని నీవు ఇశ్రాయేలీయులతో చెప్పవలెననెను.

ప్రభువైన యేసుక్రీస్తు ఇశ్రాయేలు దేశానికి చెందిన మతనాయకులతో అబ్రాహాము పుట్టకమునుపే నేను ఉన్నాను.

నా స్నేహితులారా, ప్రభువైన యేసుక్రీస్తు నిత్యుడు, దేవుని శాశ్వత కుమారుడనడంలో ఎలాంటి సమస్య లేదు. సృష్టికర్తయైన దేవుడు మానవ దేహంలో ప్రత్యక్షమయ్యాడు. యేసుక్రీస్తు వాగ్దానం చేయబడిన పుత్రుడు. దేవుడు ఆదాముకు ఒక రక్షకుని వాగ్దానం చేశాడు. ఇదే వాగ్దానం అబ్రాహాముకు, ఇస్సాకుకు, యాకోబుకు, దావీదుకు కూడ చేయబడింది. ఆయన దావీదు పట్టణమైన బేత్లెహేములో రాచరిక వారసుడుగా జన్మించవలసి ఉంది. ఆయన నజరేయుడని పిలువబడవలసి ఉంది. ఆయన బీదలకు సువార్త ప్రకటించవలసి ఉంది. ఆయన రోగులను స్వస్థపరచవలసి ఉంది. ఆయన గార్ధభ పిల్లమీద యెరూషలేమునకు ఊరేగింపుగా వెళ్లి యూదారాజుగా ప్రజలచే చాటింపబడవలసి ఉంది. ముప్పది వెండి నాణెముల కొరకు తన స్నేహితులలో ఒకరిచే ఆయన అప్పగించబడవలసి ఉంది. ఆ ధనంతో పరదేశులను పాతిపెట్టడానికి ఒక స్థలం కొనవలసి ఉంది. ప్రజల పాపాల కోసం ఆయన మరణించవలసి ఉంది. ఆయన ఎముకలలో ఒకటియు విరువబడకుండ ఆయన దేహము పొడువబడవలసి ఉంది. ఆయన వస్త్రం కోసం చీట్లు వేయబడవలసి ఉంది. ధనవంతుని సమాధిలో ఆయన సమాధిచేయబడి, మృతులలోనుండి తిరిగి లేపబడవలసి ఉంది.

రక్షకుని గురించి ఈ సంగతులు, ఇవిగాక మరెన్నో సంగతులు ముందుగా

చెప్పబడ్డాయి. వాటిలో సమస్తం, ప్రతి ఒక్కటి, ప్రతి సూక్ష్మాంశం, ప్రభువైన యేసుక్రీస్తు అను వ్యక్తిలో నెరవేరింది. అవి మరే మనుష్యునిలోను నెరవేర్చబడలేదు, మరే మనుష్యునిలోను నెరవేర్చబడవు. ఎందుకంటే అలాంటి మరే దైవ-మనుష్యుడు భూమిమీదకు రాడు. దేవుడు మాంసయుక్తమైన దేహంలో ప్రత్యక్షమయ్యాడు.

రోమా పత్రిక ఇలా మొదలవుతుంది: యేసుక్రీస్తు దాసుడును, అపోస్తలుడుగా నుండుటకు పిలువబడినవాడును, దేవుని సువార్త నిమిత్తము ప్రత్యేకింపబడినవాడునైన పౌలు ... వ్రాయునది. దేవుడు తన కుమారుడును మన ప్రభువునైన యేసుక్రీస్తు విషయమైన ఆ సువార్తను పరిశుద్ధ లేఖనములయందు తన ప్రవక్తలద్వారా ముందు వాగ్దానము చేసెను. (దేవుడు పాత నిబంధనలోని ప్రవచనాత్మక రచనలలో ఒక సంగతిని వాగ్దానం చేశాడు. ఆయన సువార్తను, శుభవార్తను, రక్షణాత్మక సందేశాన్ని వాగ్దానం చేశాడు. ఆ సందేశమిదే -) మన ప్రభువైన యేసుక్రీస్తు అను తన కుమారుని గూర్చి, (యేసుక్రీస్తు కేంద్రమై వున్నాడు. ఆయన ఎవరు? ఒకవైపు ఆయన దేవుని కుమారుడు. మరోవైపు, ఆయన మన ప్రభువు. కొనసాగింపుగా -) యేసుక్రీస్తు శరీరమునుబట్టి దావీదు సంతానముగాను, (ఆయన శరీరము దావీదు సంతానముగా చేయబడినది) మృతులలోనుండి పునరుత్థానుడైనందున పరిశుద్ధమైన ఆత్మనుబట్టి దేవుని కుమారుడుగాను ప్రభావముతో నిరూపింపబడెను.

నా స్నేహితుడా, రక్షకుని కొరకు మీ వెదకులాట నేటితో ముగియాలి. మీ రక్షకుడు ప్రభువైన యేసుక్రీస్తే అని బైబిల్ మీకు చూపుతోంది. ఆయన మాంసయుక్తమైన దేహమందు ప్రత్యక్షమైన దేవుడు. బుద్ధుడు గొప్ప వ్యక్తి కావచ్చు. మహమ్మద్ గొప్ప వ్యక్తి కావచ్చు. మోషే గొప్ప వ్యక్తి కావచ్చు. పోప్ గొప్ప వ్యక్తి కావచ్చు. కన్ఫ్యూషియస్ గొప్ప వ్యక్తి కావచ్చు. దలైలామా గురించి తెలుసుకుంటే ఆయనొక అద్భుతమైన వ్యక్తి అని మీకనిపించవచ్చు. కాని వారంతా సాధారణ మానవులకు అతీతమైనవారు కాదు. అందరిలాంటి పాపులే. పాపులుగా వారంతా దేవుడనుగ్రహించు మహిమను పొందలేనివారై, మీవలె దేవుని రక్షణను పొందవలసినవారై యున్నారు.

ఏ భేధమును లేదు. అందరును పాపము చేసి దేవుడనుగ్రహించు మహిమను పొందలేకపోవుచున్నారు అని బైబిల్ చెబుతోంది.

పరలోకానికి ఎక్కిపోవాలని ప్రయత్నించే మతనాయకులను, మతబోధకులను అనుసరించడానికి దేవుడు మిమ్ములను విడిచిపెట్టలేదు. అలా ప్రవేశించడానికి ప్రయత్నించేవారంతా నరకంలో పడిపోతారు. అయితే, మీరు రక్షింపబడడానికి దేవుడు ఒక మార్గం ఏర్పరచాడు. ఆయన మానవ రూపం ధరించాడు. అలా ధరించిన మానవ రూపంలో సిలువపై మీ పాపాన్ని తానే వహించాడు. ఆయన మరణించి, సమాధి చేయబడ్డాడు. మూడు రాత్రింబగళ్ల తరువాత మృతులలోనుండి తిరిగి లేచి, పాపముపై మరణముపై నరకముపై తన శక్తిని ఋజువుపరచుకున్నాడు.

అనంతమైన జీవితశక్తి మీరు కోరుకున్నట్లయితే, ప్రభువైన యేసుక్రీస్తునొద్దకు వచ్చి, పాపియని మీకు మీరే ఆయన ఎదుట ఒప్పుకొని, పాపక్రయధనం చెల్లించడానికి ఆయన మరణించాడని, ఆయనను మీ స్వకీయ రక్షకునిగా ప్రభువుగా మీరు విశ్వసించాలి. మరో రక్షకుడు లేడు కనుక, రక్షణ విషయంలో మీకు మరే నిరీక్షణ లేదు. పాపమునుండి మిమ్మును రక్షించగలవాడు మరెవ్వడూ లేడు.

ప్రభువు నామమునుబట్టి ప్రార్థనచేయు వాడెవడో వాడు రక్షింపబడును కనుక ప్రభువైన యేసునందు విశ్వాసముంచుము అని బైబిల్ చెబుతోంది.

ఓహ్, మీరాయనను ప్రార్థించి, నేడే ఆయనను మీ ప్రభువుగాను రక్షకునిగాను విశ్వసిస్తారని నా ప్రార్థన.

# మాంసయుక్తమైన దేహమందు దేవుడు

## (రెండవ భాగం)

యేసుక్రీస్తు దేహమందు ప్రత్యక్షమైన దేవుడు అని మనం అధ్యయనం చేస్తున్నాం. గత అధ్యాయంలో మనం కన్య గర్భాన ప్రభువు జన్మించడం, ఆ సందర్భంగా చేయబడిన వ్యాఖ్యానాలు భూమ్యాకాశాల సృష్టికర్తయైన దేవుడే కన్య గర్భాన జన్మించాడని తేటపరుస్తున్నాయి. దూతలు చేసిన ప్రకటనలను, దేవుడు మనకు తోడు అను ఇమ్మానుయేలుగా లేఖనాలు ఆయనను ప్రకటించడం మనం చూశాం.

ఈ పాఠంలో ప్రభువైన యేసుక్రీస్తు దైవత్వం గురించిన మరికొంత ఆధారాన్ని మనం పరిశీలించి చూద్దాం. ఈ పర్యాయం ఆయన దైవత్వ లక్షణాలను చూద్దాం. దీనిని మనం తేటగా అర్థం చేసుకుంటే, ప్రభువైన యేసుక్రీస్తు దైవత్వం గురించి మానవుడు లేక సాతాను చేసే అబద్ధ బోధల విషయంలో మనమెలాంటి అయోమయంలో పడిపోయే ప్రమాదం ఉండదు.

1. యేసుక్రీస్తు జీవమిచ్చు శక్తి కలిగి వున్నాడు కనుక ఆయనే దేవుడు అని ఋజువైంది. మానవుడు దేనినీ సృజించలేడు. సాతాను దేనినీ సృజించలేడు. అయితే యేసుక్రీస్తు జీవమిస్తాడు - నిత్యజీవమిస్తాడు. మానవుడు జీవం అనుగ్రహించలేడు లేక జీవం కలిగించలేడు. ఏ స్థాయిలోనూ జీవాన్ని కొనసాగించలేడు. సాతాను కూడ అంతే. వాడు జీవము అనుగ్రహించలేడు. లేశమాత్రం జీవము కలిగించలేడు.

మోషే దేవుని శక్తినిబట్టి ఒక అద్భుతాన్ని చూపగా అందుకు పోటీగా ఫరో తన మాంత్రికులను ప్రవేశపెట్టాడు. వారు కూడ మోషే చేసిన అద్భుతాలు చేశారు. మొదటి పర్యాయంలో మోషే తన కర్రను పడవేయగా అది సర్పమైంది. ఫరో మాంత్రికులు తమ కర్రలను పడవేసినప్పుడు అవి కూడ సర్పాలయ్యాయి.

కాని మోషే కర్ర ఫరో మాంత్రికులు చేసిన సర్పాలను మ్రింగివేశాయి. ఏదిఏమైనా వారు కర్రను సర్పంగా మార్చగలిగారు.

రెండవ పర్యాయంలో, మోషే అహరోనులు ఫరో కన్నుల ఎదుట నదిలోని నీటిని కొట్టగా, నదిలోని నీళ్లు రక్తంగా మారాయి. అది వారి దేశానికి చేటు కలిగించినా, ఐగుప్తు మాంత్రికులు కూడ అదే పని చేశారు.

మూడవ పర్యాయంలో అహరోను తన చేతిని ఐగుప్తు నీటిపై చాపగా, కప్పలు కుప్పలుగా వచ్చి ఆ దేశమంతటిని కప్పివేశాయి. ఐగుప్తు మాంత్రికులు కూడ తమ మంత్రాలతో కప్పలను రప్పించి ఆ దేశమంతటా వ్యాపింపజేశారు. ఇప్పుడు పోటీలో వారి ఫలితం మూడుగా నిలిచింది. ఆ తరువాత మోషే అహరోనులు ఆ కప్పలు చనిపోవాలని చెప్పగా, ఆ దేశంలో ఉన్న కప్పలన్నీ చనిపోయాయి.

అలా ఆ పోటీ కొనసాగింది. ఈసారి ఈగల గుంపు వంతు. ఆ ఈగలు అందరికీ శోకాన్ని మిగిల్చాయి. అక్కడ ఇలా రాయబడి వుంది, అందుకు యెహోవా మోషేతో నీవు నీ కఱ్ఱ చాపి యీ దేశపు ధూళిని కొట్టుము. అది ఐగుప్తు దేశమందంతటను పేలగునని అహరోనుతో చెప్పుమనగా వారు అట్లు చేసిరి. అహరోను తన కఱ్ఱను పట్టుకొని చెయ్యి చాపి ఆ దేశపు ధూళిని కొట్టినప్పుడు పేలు మనుష్యులమీదను జంతువులమీదను ఉండెను ఐగుప్తు దేశమందంతటను ఆ దేశపు ధూళి అంతయు పేలాయెను. శకునగాండ్రు కూడ పేలను పుట్టించవలెనని తమ మంత్రములచేత అట్లు చేసిరి గాని అది వారివలన కాకపోయెను. పేలు మనుష్యులమీదను జంతువులమీదను ఉండగా . . . (నిర్గమకాండము 8:16-18).

ఆదియందు దేవుడు జీవమును ఎలా రూపొందించాడు? నేలమంటినుండి. ఇక పోటీ విషయానికి వస్తే, ఫరో మాంత్రికులు ఆ పోటీలో నిలవలేరు. దేవుడొక్కడే జీవమును సృజించి, దానిని కొనసాగించేవాడు. యేసుక్రీస్తు జీవమును అనుగ్రహించువాడనే సత్యం, ఆయన మాంసయుక్తమైన దేహమందున్న దేవుడు అనే సంగతిని ఋజువు చేస్తోంది.

2. యేసు తన్ను దేవునితో సమానునిగా, దేవుని కుమారునిగా ప్రకటించుకోవడం ద్వారా తాను దేవుడనని చెప్పుకున్నాడు.

తాను దేవుడనని యేసు ఎన్నడూ చెప్పుకోలేదని కొంతమంది అంటుంటారు. కాని అలా చెప్పుకోడానికే ఆయన సిలువ వేయబడ్డాడు.

యోహాను 10:28-30 యేసుక్రీస్తు ఇలా అంటున్నాడు, నేను వాటికి నిత్యజీవమునిచ్చుచున్నాను గనుక అవి ఎన్నటికిని నశింపవు, ఎవడును వాటిని నా చేతిలోనుండి అపహరింపడు. వాటిని నాకిచ్చిన నా తండ్రి అందరికంటె గొప్పవాడు గనుక నా తండ్రి చేతిలోనుండి యెవడును వాటిని అపహరింపలేడు,

నేనును తండ్రియును ఏకమై యున్నామని వారితో చెప్పెను.

మాటలలో స్పష్టత లేకపోవచ్చు. యేసు మాటలను ఒకవేళ ఎవరైనా విశ్వసించకపోవచ్చు, కాని నేనును తండ్రియును ఏకమైయున్నాము అని యేసుక్రీస్తు చెప్పిన మాటలలో ఎలాంటి పొరబాటు లేదు.

ఇలాంటి మాటలనే మత్తయి 26:62-66 లో మనం చూడగలం. యేసు ఊరకుండెను. (ఇది యేసు కయప సమక్షంలో విచారణకు మహాసభకు కొనిపోబడిన సంఘటన) అందుకు ప్రధాన యాజకుడు ఆయనను చూచి నీవు దేవుని కుమారుడవైన క్రీస్తువైతే ఆ మాట మాతో చెప్పుమని జీవముగల దేవుని తోడని నీకు ఆనబెట్టుచున్నాననెను. అందుకు యేసు నీవనట్టే. ఇది మొదలుకొని మనుష్యకుమారుడు సర్వశక్తుని కుడిపార్శ్వమున కూర్చుండుటయు, ఆకాశ మేఘారూఢుడై వచ్చుటయు మీరు చూతురని చెప్పగా ప్రధానయాజకుడు తన వస్త్రము చింపుకొని వీడు దేవదూషణ చేసెను, మనకిక సాక్షులతో పని ఏమి? ఇదిగో ఈ దూషణ మీరిప్పుడు విన్నారు, మీకేమి తోచుచున్నదని అడిగెను. అందుకు వారు వీడు మరణమునకు పాత్రుడనిరి.

ప్రభువైన యేసుక్రీస్తు తాను మాంసయుక్తమైన దేహంలో ప్రత్యక్షమైన దేవుడనని చెప్పుకున్నాడు కనుక ఆయన సిలువ వేయబడ్డాడు. యేసుక్రీస్తు ఇలా చెప్పుకోవడంలో ఎలాంటి ప్రశ్నకు తావులేదు.

యోహాను 5:17-18 లో ఈ మాటలను మనం గమనించగలం, అయితే యేసు నాతండ్రి యిది వరకు పనిచేయుచున్నాడు, నేనును చేయుచున్నానని వారికి ఉత్తరమిచ్చెను. ఆయన విశ్రాంతి దినాచారము మీరుట మాత్రమేగాక, దేవుడు తన సొంత తండ్రి అని చెప్పి, తన్ను దేవునితో సమానునిగా చేసికొనెను గనుక ఇందు నిమిత్తమును యూదులు ఆయనను చంపవలెనని మరి ఎక్కువగా ప్రయత్నము చేసిరి.

రబ్బీనికల్ నాయకులు, శాస్త్రులు, పరిసయ్యులు, ఇశ్రాయేలు దేశపు మత నాయకుల దృష్టిలో దేవుని కుమారుడనని చెప్పుకోవడమంటే తాను దేవుడనని చెప్పుకోవడమే. దేవుని కుమారుడు అనే పదబంధం తన్నుతాను సర్వశక్తిగల

దేవుడనని చెప్పుకోవడానికి సమానం. ప్రభువైన యేసుక్రీస్తు అలానే చెప్పుకున్నాడు. అందుకే వారు పట్టుబట్టి ఆయనను సిలువ మరణానికి గురిచేశారు.

3. తనకు పాపమును క్షమించే అధికారం ఉందని యేసుక్రీస్తు చెప్పుకున్నాడు. మార్కు 2 లో పక్షవాయువుగల వ్యక్తిని యేసు స్వస్థపరచగలడని ఆశించిన అతని స్నేహితులు అతనిని పైకప్పునుండి క్రిందికి దించారు. యేసు వారి విశ్వాసము చూచి కుమారుడా, నీ పాపములు క్షమింపబడియున్నవని పక్షవాయువుగలవానితో చెప్పెను. శాస్త్రులలో కొందరు అక్కడ కూర్చుండియుండిరి. వారు ఇతడు ఇట్లెందుకు చెప్పుచున్నాడు? దేవదూషణ చేయుచున్నాడు గదా, దేవుడొక్కడే తప్ప పాపమును క్షమింపగలవాడెవడని తమ హృదయములలో ఆలోచించుకొనిరి. వారు తమలో తాము ఈలాగున ఆలోచించుకొనుట యేసు వెంటనే తన ఆత్మలో తెలిసికొని మీరీలాటి సంగతులు మీ హృదయములలో ఎందుకు ఆలోచించుకొనుచున్నారు? ఈ పక్షవాయువుగలవానితో నీ పాపములు క్షమింపబడియున్నవని చెప్పుట సులభమా? నీవు లేచి నీ పరుపెత్తికొని నడువుమని చెప్పుట సులభమా? అయితే పాపములు క్షమించుటకు భూమిమీద మనుష్యకుమారునికి అధికారము కలదని మీరు తెలిసికొనవలెనని వారితో చెప్పి పక్షవాయువు గలవానిని చూచి నీవు లేచి నీ పరుపెత్తికొని యింటికి పొమ్మని నీతో చెప్పుచున్నాననెను. తక్షణమే వాడు లేచి, పరుపెత్తికొని, వారందరియెదుట నడచి పోయెను గనుక, వారందరు విభ్రాంతినొంది మనమీలాటి కార్యములను ఎన్నడును చూడలేదని చెప్పుకొనుచు దేవుని మహిమపరచిరి (మార్కు 2:5-12).

దేవుడొక్కడే పాపములు క్షమించగలడని వారికి తెలుసు. దేవుడు మాంసయుక్తమైన దేహములో ప్రత్యక్షమయ్యాడని యేసుక్రీస్తు వారికి స్పష్టం చేశాడు. కనుకనే పాపములు క్షమించే అధికారం తనకు ఉందని ఆయన చెప్పుకున్నాడు. పక్షవాయువుగల అతన్ని బాగు చేయడంద్వారా, అతని శరీరానికి స్వస్థత కలిగించడం ద్వారా ఆ సంగతిని ఋజువు చేసుకున్నాడు.

తూర్పు దేశపు జ్ఞానులు నవజాత శిశువుగా పుట్టిన రాజును చూడడానికి వచ్చారని మత్తయిలో మనం చూడగలం. ఆయన ఎక్కడున్నాడో హేరోదు ద్వారా తెలుసుకుని, యోసేపు ఆయన తల్లియైన మరియ బస చేసిన యింటికి వారు పయనమయ్యారు. వారు యింటిలోనికి వచ్చి, తల్లియైన మరియను ఆ శిశువును

చూచి, సాగిలపడి, ఆయనను పూజించిరి: (వారు మరియ ఎదుట మోకరిల్లలేదని గమనించండి. వారాయన ఎదుట మోకరించి ఆయనను పూజించారు.) తమ పెట్టెలు విప్పి, బంగారమును సాంబ్రాణిని బోళమును కానుకలుగా ఆయనకు సమర్పించిరి. (వాటిని మరియకు కాదు, యేసుక్రీస్తుకు అర్పించారు) మత్తయి 2:11.

ప్రభువైన యేసుక్రీస్తు, తన కౌమార దశలో జ్ఞానులచేత ఆరాధించబడ్డాడు.

ఆ తరువాత, మత్తయిలో ఇలా చదువుతాం, 32 వారు దోనె యెక్కినప్పుడు గాలి అణిగెను. (ఇది యేసు నీళ్లమీద నడుచుకుంటూ పడవలోనికి ప్రవేశించిన సందర్భం). అంతట దోనెలో నున్నవారు వచ్చి నీవు నిజముగా దేవుని కుమారుడవని చెప్పి ఆయనకు మ్రొక్కిరి (మత్తయి 14:32-33).

పడవలో యేసుక్రీస్తు తన శిష్యుల ఆరాధనను అంగీకరించాడు.

యోహాను 9 లో ప్రభువు ఒక పుట్టు గ్రుడ్డివానికి చూపునిచ్చాడు. 35-38 వచనాలలో బైబిల్ ఇలా చెబుతోంది, పరిసయ్యులు వానిని వెలివేసిరని యేసు విని వానిని కనుగొని నీవు దేవుని కుమారునియందు విశ్వాసముంచు చున్నావా అని అడిగెను. అందుకు వాడు ప్రభువా, నేను ఆయనయందు విశ్వాసముంచుటకు ఆయన ఎవడని అడుగగా యేసు నీవాయనను చూచుచున్నావు, నీతో మాటలాడుచున్నవాడు ఆయనే అనెను. అంతట వాడు ప్రభువా, నేను విశ్వసించుచున్నానని చెప్పి ఆయనకు మ్రొక్కెను.

చూపు పొందిన మనుష్యుని ఆరాధనను యేసుక్రీస్తు స్వీకరించాడు. దేవుడు మాత్రమే ఆరాధనను స్వీకరించగలడని ఆయన గతంలోనే సాతానుకు చెప్పాడు (మత్తయి 4:10). ఆయన ఆరాధనను స్వీకరించాడు. అంటే ఆయన దేవుడైనా అయివుండాలి లేదా దేవదూషకుడైనా అయివుండాలి.

ఆయన పునరుత్థానం తరువాత బైబిల్ ఇలా చెబుతోంది, యేసు వారిని ఎదుర్కొని మీకు శుభమని చెప్పెను. వారు ఆయనయొద్దకు వచ్చి, ఆయన పాదములు పట్టుకొని ఆయనకు మ్రొక్కగా యేసు భయపడకుడి, మీరు వెళ్లి, నా సదరులు గలిలయకు వెళ్లవలెననియు వారక్కడ నన్ను చూతురనియు వారికి తెలుపుడనెను (మత్తయి 28:9-10). పునరుత్థానం తరువాత తనను కలిసినవారి ఆరాధనను ప్రభువైన యేసుక్రీస్తు స్వీకరించాడు.

మీ బైబిల్‌లోని చివరి పుస్తకంలోని చివరి అధ్యాయంలో లేఖనం ఇలా చెబుతోంది, యోహానను నేను ఈ సంగతులను వినినవాడను చూచినవాడను,

నేను విని చూచినప్పుడు వాటిని నాకు చూపుచున్న దూతపాదముల యెదుట నమస్కారము చేయుటకు సాగిలపడగా, అతడు వద్దుసుమీ, నేను నీతోను, ప్రవక్తలైన నీ సదరులతోను, ఈ గ్రంథ మందున్న వాక్యములను గైకొనువారితోను సహదాసుడను, దేవునికే నమస్కారము చేయుమని చెప్పెను (ప్రకటన 22:8–9).

చదువరీ, ప్రభువైన యేసుక్రీస్తు ఆరాధనను స్వీకరించాడంటే ఆయన మాంసయుక్తమైన దేహంలో ప్రత్యక్షపరచుకున్న దేవుడై వుండాలి లేదా ఆయన పాపి, వంచకుడు, అబద్ధికుడు, దేవదూషకుడు అయి వుండాలి.

ఆయన మాంసయుక్తమైన దేహంలో ప్రత్యక్షపరచుకున్న దేవుడని మీకెలా తెలుసు? తనకు తగని స్థానానికి ఆయన హెచ్చించుకుని దేవదూషణకు పాల్పడి వుండవచ్చు కదా? అని మీరనవచ్చు. నాకెలా తెలుసో చెబుతాను – దేవుడాయనను మృతులలోనుండి లేపాడు. ఆయన దేవుని దృష్టిలో అంగీకరించబడ్డాడనడానికి ఇది ఋజువు.

ఆయన సిలువ వేయబడడానికి మునుపు తండ్రియైన దేవుడు పరలోకమునుండి మూడు పర్యాయాలు ఆయనను గూర్చి ఇలా పలికాడు, ఈయనే నా ప్రియకుమారుడు, ఈయనయందు నేను ఆనందించుచున్నాను. ప్రియ స్నేహితుడా, దేవుడొక్కడే ఆరాధనకు పాత్రుడు. దేవుడొక్కడే ఆరాధనకు యోగ్యుడు. దేవుని తప్ప మరెవరూ ఆరాధన పొందగలవారు కారు. ప్రభువైన యేసుక్రీస్తు మాంసయుక్తమైన దేహమందు ప్రత్యక్షపరచబడిన దేవుడు కాకున్నట్లయితే, తండ్రియైన దేవుడు పరలోకమునుండి ఆయనను గూర్చి ప్రకటించేవాడు కాదు, ఆయన పొందిన ఆరాధనను అంగీకరించేవాడు కాదు.

4. యేసుక్రీస్తు ఈ లోకాన్ని సృజించాడని లేఖనాలు చెబుతున్నాయి, దేవుడు తప్ప మరెవరూ లోకాన్ని సృజించలేరు. గత పాఠంలో యోహాను 1 అధ్యాయంనుండి, వాక్యము శరీరధారియై మన మధ్య నివసించాడని మనం చూశాం. దైవత్వంలోని రెండవ వ్యక్తియైన అదే వాక్యము, భూమ్యాకాశాలను అందున్న సమస్తాన్ని సృజించాడని మనం చూశాం.

మరో ఋజువు కూడ ఇక్కడ ఉంది: పూర్వకాలమందు నానాసమయములలోను నానావిధములుగాను ప్రవక్తలద్వారా మన పితరులతో మాటలాడిన దేవుడు ఈ దినముల అంతమందు కుమారుని ద్వారా మనతో మాటలాడెను. ఆయన ఆ కుమారుని సమస్తమునకును వారసునిగా

నియమించెను. ఆయన ద్వారా ప్రపంచములను నిర్మించెను (హెబ్రీ 1:1-2).

ప్రభువైన యేసుక్రీస్తు చేతిపనులద్వారా, మహత్తుగల మాట ద్వారా దేవుడు ప్రపంచాలను నిర్మించాడు.

హెబ్రీ 1:10 లో దేవుడు మరల తన కుమారుని గూర్చి మాట్లాడుతున్నాడు, దేవా, నీవు ఆదియందు భూమికి పునాది వేసితివి. ఆకాశములు కూడ నీ చేతి పనులే. కనుక ప్రభువైన యేసుక్రీస్తే సృష్టికర్త అని హెబ్రీ 1 లో మనం చూడగలం.

కొలొస్స 1 లో ఈ మాటలను మనం చూడగలం: తేజోవాసులైన పరిశుద్ధుల స్వాస్థ్యములో పాలివారమగుటకు మనలను పాత్రులనుగా చేసిన తండ్రికి మీరు కృతజ్ఞతాస్తుతులు చెల్లింపవలెననియు దేవుని బతిమాలుచున్నాము. ఆయన మనలను అంధకారసంబంధమైన అధికారములోనుండి విడుదలచేసి, తాను ప్రేమించిన తన కుమారునియొక్క రాజ్యనివాసులనుగా చేసెను. ఆ కుమారునియందు మనకు విమోచనము, అనగా పాపక్షమాపణ కలుగుచున్నది. (గమనించారా? అదృశ్యుడైన దేవునిగా మనమాయనను చూడగలుగులాగున మాంసయుక్తమైన దేహాన్ని ధరించాడు) ఆయన అదృశ్యదేవుని స్వరూపియై సర్వసృష్టికి ఆదిసంభూతుడై యున్నాడు. ఏలయనగా ఆకాశమందున్నవియు భూమియందున్న వియు, దృశ్యమైనవిగాని, అదృశ్యమైనవిగాని, అవి సింహాసనములైనను ప్రభుత్వములైనను ప్రధానులైనను అధికారములైనను, సర్వమును ఆయనయందు సృజింప బడెను, సర్వమును ఆయనద్వారాను ఆయననుబట్టియు సృజింపబడెను. ఆయన అన్నిటికంటె ముందుగా ఉన్నవాడు, ఆయనే సమస్తమునకు ఆధారభూతుడు (కొలొస్స 1:12-17).

ఈ లోకాన్ని యేసుక్రీస్తు సృజించాడని లేఖనాలు చెబుతున్నాయి. ఈ లోకాన్ని దేవుడు సృజించాడని లేఖనాలు చెబుతున్నాయి. దీని ప్రకారం దేవుని వాక్యంలోని బోధను హేతుబద్ధంగా తార్కికంగా ఆలోచించగలిగే వ్యక్తికి మాంసయుక్తమైన దేహమందు ప్రత్యక్షపరచుకున్న దేవుడు యేసుక్రీస్తే అని స్పష్టమవుతుంది.

5. యేసుక్రీస్తును దేవుని కుమారుడని విశ్వసించేవారికి, గమనించండి – విశ్వసించేవారికి మాత్రమే పాపమునుండి రక్షణ అనే వాగ్దానం వర్తిస్తుంది. దేవుడు లోకమును ఎంతో ప్రేమించెను. కాగా ఆయన తన అద్వితీయకుమారునిగా పుట్టిన వానియందు విశ్వాసముంచు ప్రతివాడును నశింపక నిత్యజీవము పొందునట్లు ఆయనను అనుగ్రహించెను (యోహాను 3:16).

ప్రియ చదువరీ, బైబిల్ ప్రకారం మీరు నశిస్తారా లేక నిత్యజీవం పొందుతారా అనేది ప్రభువైన యేసుక్రీస్తు మాంసయుక్తమైన దేహంలో ప్రత్యక్షపరచబడిన దేవుని మరణ భూస్థాపిత పునరుత్థానాలను మీరు విశ్వసిస్తున్నారా లేదా అనే దానిపై ఆధారపడి వుంటుంది.

యేసు మరల వారితో ఇలా చెప్పాడు, మరియొకప్పుడు ఆయన నేను వెళ్లిపోవుచున్నాను, మీరు నన్ను వెదకుదురు గాని మీ పాపములోనే యుండి చనిపోవుదురు, నేను వెళ్లుచోటికి మీరు రాలేరని వారితో చెప్పెను. అందుకు యూదులు నేను వెళ్లుచోటికి మీరు రాలేరని యీయన చెప్పుచున్నాడే, తన్ను తానే చంపుకొనునా అని చెప్పుకొనుచుండిరి. అప్పుడాయన మీరు క్రిందివారు, నేను పైనుండువాడను, మీరు ఈ లోక సంబంధులు, నేను ఈ లోకసంబంధుడను కాను. కాగా మీ పాపములలోనేయుండి మీరు చనిపోవుదురని మీతో చెప్పితిని. నేను ఆయనని మీరు విశ్వసించనియెడల మీరు మీ పాపములోనేయుండి చనిపోవుదురని వారితో చెప్పెను (యోహాను 8:21-24).

అయ్యా, అమ్మా, యువతా! ఆయన యేసుక్రీస్తే అని, ఆయన ఉన్నవాడని, సృష్టికర్తని, రక్షకుడని, మాంసయుక్తమైన దేహములో ప్రత్యక్షపరచుకున్న దేవుడని మీరు విశ్వసిస్తే సరి, లేకుంటే మీరు మీ పాపాలలోనే మరణిస్తారు.

యేసుక్రీస్తు శరీరధారియై వచ్చెనని యొప్పుకొనని వంచకులు అనేకులు లోకములో బయలుదేరి యున్నారు (2 యోహాను 7).

యేసు మరియ గర్భంలో రూపించబడక మునుపే ఉనికి కలిగి వున్నాడని గత పాఠంలో విస్పష్టంగా ఋజువు చేయడం జరిగింది. ప్రభువైన యేసుక్రీస్తు ఆదినుండి ఉన్నాడని బైబిల్ తేటగా చెబుతోంది. అలాగే, లోకంలోనికి వంచకులు బయలుదేరి యున్నారని కూడ బైబిల్ చెబుతోంది. వంచకుడు, అంత్యక్రీస్తు ఎవరో మీరు గ్రహించవచ్చు. (భూత వర్తమాన భవిష్యత్ కాలాల్లో జీవించివున్న) యేసుక్రీస్తు శరీరధారియై వచ్చాడని ఒప్పుకొననివారే సాతానుకు చెందినవారు. గమనించండి, మాంసయుక్తమైన దేహము యేసుక్రీస్తు కాదు, మాంసయుక్తమైన దేహములో యేసుక్రీస్తు వసించాడు. యేసుక్రీస్తు గతంలో దేవుడు, ఇప్పుడు దేవుడు, భవిష్యత్తులోను దేవుడే.

తీతుకు వ్రాసిన పత్రికలో "మన రక్షకుడైన దేవుడు", "మన రక్షకుడైన ప్రభువైన యేసుక్రీస్తు" అను పదబంధాలు పరస్పరం ఉపయోగించబడడం మీరు గమనించాలని నేను కోరుతున్నాను.

తీతు 1:3, వచనం చివరి భాగంలో, మన రక్షకుడైన దేవుని ఆజ్ఞ ప్రకారము

తీతు 1:4, తండ్రియైన దేవునినుండియు మన రక్షకుడైన క్రీస్తుయేసు నుండియు

తీతు 2:13, మహా దేవుడును మన రక్షకుడునైన యేసుక్రీస్తు మహిమయొక్క ప్రత్యక్షత కొరకు ఎదురుచూచుచు,

తీతు 3:4, మన రక్షకుడైన దేవునియొక్క దయయు, మానవులయెడల ఆయనకున్న ప్రేమయు

తీతు 3:6, మన రక్షకుడైన యేసుక్రీస్తు ద్వారా ఆయన మనమీద సమృద్ధిగా కుమ్మరించెను.

యేసుక్రీస్తు ఎవరు? ఆయన మన రక్షకుడు. యేసుక్రీస్తు ఎవరు? ఆయన కనిపించనైయున్న గొప్ప దేవుడు (ఆయన తేటగా, ప్రత్యక్షంగా, దృశ్యుడుగా కనిపిస్తాడు). ఆయన మన రక్షకుడైన యేసుక్రీస్తుగా కనిపించే గొప్ప దేవుడు.

ఇదెంతో ప్రాముఖ్యమైంది: మీ ప్రమాణవాక్యములు నా సన్నిధిని తెలియజేయుడి. జనులు కూడుకొని ఆలోచన చేసికొందురు గాక, పూర్వకాలము మొదలుకొని ఆ కార్యమును తెలియజేసినవాడెవడు? చాలకాలము క్రిందట దాని ప్రకటించినవాడెవడు? యెవానగు నేనే గదా? నేను తప్ప వేరొక దేవుడు లేడు. నేను నీతిపరుడనగు దేవుడను, రక్షించువాడను నేనే. నేను తప్ప మరి ఏ దేవుడును లేడు (యెషయా 45:21).

పాత నిబంధనలోని ప్రభువగు దేవుడైన యెవా తప్ప మరొక దేవుడుగాని, రక్షకుడుగాని లేడు. తీతుకు వ్రాసిన పత్రిక ప్రకారం, ప్రభువగు దేవుడైన యెవాయే ప్రభువైన యేసుక్రీస్తు అను వ్యక్తి. ఆయనే రక్షకుడు. ఆయనే దేవుడు. ఆయన తప్ప మరో రక్షకుడు లేడు. ఆయన తప్ప వేరొక దేవుడు లేడు. మన దేవుడును రక్షకుడునైన యేసుక్రీస్తును మీరు ఎరుగకపోతే, మీరు కూడ అపవాదివలె నశించి నరకపాత్రులవుతారు. యేసునందు విశ్వాసముంచడం మాత్రమే కాదు. దేవునియందు విశ్వాసముంచడం మాత్రమే కాదు. మాంసయుక్తమైన దేహమందు ప్రత్యక్షమైనవాడు యేసు అని మీరు విశ్వసించకపోతే మీరు నశిస్తారు.

యేసుక్రీస్తు ఇలా చెప్పాడు, నేనే ఆయనని మీరు విశ్వసించకపోతే మీరు మీ పాపములలోనే నశిస్తారు. యేసుక్రీస్తు శరీరధారియై వచ్చాడని మీరు ఒప్పుకోకపోతే మీరే వంచకుడు, క్రీస్తు విరోధి అవుతారని 2 యోహాను 7 వచనం చెబుతోంది. ఈ బోధను మీరు అంగీకరించకపోతే మీరు క్రీస్తువారు

కాదు, క్రీస్తు విరోధులవుతారు. ఇది నా అభిప్రాయం కాదు. ఇది నా ఆలోచన కాదు. ఇది దేవుని వాక్యం తేటగా చెబుతున్న బోధ.

యేసుక్రీస్తు చేసిన శుద్ధీకరణ కార్యమును చెల్లుబాటు చేయాలంటే ఆయన దైవత్వాన్ని స్థాపించడం తప్పనిసరి. ప్రభువైన యేసుక్రీస్తు ఒక మానవుడు మాత్రమే అయితే, భూమిమీద జీవించినవారిలో ఆయన ఎంత ఉన్నతుడైనా సరే, పరిశుద్ధ బలియాగముగా ఆయన మరణము ఎవరికీ వర్తించదు. బహుశా బరబ్బావలె మరొకరి స్థానంలో మరణించి ఉండవచ్చు, కాని తక్కినవారివలె ఆయన కూడ పాపియే కనుక సర్వమానవాళి పాపక్షమాపణకై బలియాగముగా ఆయన మరణించడం అసాధ్యం. సమస్త మానవజాతి పాప ఋణాన్ని చెల్లించడానికి యేసుక్రీస్తును దైవత్వపు విలువలతో కూడిన దేవుని న్యాయము మాత్రమే అనుమతిస్తుంది.

ఆయన మనందరి పాపఋణాన్ని సంపూర్ణంగా చెల్లించాడు. ఆయన చెల్లింపును అంగీకరించడం ఒక్కటే మనం చేయవలసింది. ఆయన మన ఋణాన్ని చెల్లించాడు కనుక, ఆయన చెల్లింపును మనం అంగీకరించాలి లేనట్లయితే ఆ లావాదేవి చట్టబద్ధంగా పూర్తయినట్లు కాదు. ఆయన మరణం మనకెలాంటి ప్రయోజనం చేకూర్చదు. అవును, యేసుక్రీస్తు లోకపాపముల కోసం మరణించాడు. అవును, యేసుక్రీస్తు రక్షకుడు. ఎవరైనా తన పాపాలనుండి రక్షించబడగలిగే ఏకైక మార్గం ప్రభువైన యేసుక్రీస్తు అను వ్యక్తి ద్వారా మాత్రమే.

స్నేహితులారా, ప్రభువైన యేసుక్రీస్తు సంపూర్తి చేసిన ప్రాయశ్చిత్తాన్ని విశ్వసించడం ద్వారా మీరు రక్షణ పొందారా? మీ సమస్త అపరాధాలను, అతిక్రమాలను తండ్రి ఆయనపై మోపాడని మీకు తెలుసా? మీ క్రియలు, కార్యాలు, మీ స్వనీతి, మీ మతపరమైన చర్యలు, విధులన్నిటినిబట్టి మీరు మారుమనస్సు పొందాలని ఆయన ఎదురు చూస్తున్నాడు. మీ గర్వంతో, అజ్ఞానంతో, స్వచిత్తంతో మీరు రక్షణ పొందాలని, దేవుని రక్షణ ప్రణాళికలో యోగ్యులు కావాలని చేసిన ప్రయత్నాలన్నిటినుండి మీరు మరలాలని ఆయన ఎదురు చూస్తున్నాడు.

మీ పాపాల విషయమై మారుమనస్సు పొంది, దేవుని రక్షణను, దేవుని సొంత కుమారుని మీ రక్షకునిగా విశ్వసించినప్పుడు మీరు తిరిగి జన్మిస్తారు. లేఖనాల ప్రకారం క్రీస్తు మన పాపాల నిమిత్తం మరణించాడు. సమాధి చేయబడ్డాడు, లేఖనాల ప్రకారం యేసుక్రీస్తు మూడవనాడు తిరిగి లేచాడు.

తనయందు నమ్మికయుంచి, తనను తమ వ్యక్తిగత ప్రభువుగా, రక్షకునిగా విశ్వసించే వారిలో ప్రతి ఒక్కరికి ఆయన సంపూర్ణమైన, ఉచితమైన, పరిపూర్ణమైన క్షమాపణ అనుగ్రహిస్తున్నాడు.

మీరలా చేస్తారా? దేవుని ఎదుట మోకరిల్లి, మీరు పాపియని, మీకు రక్షణ అవసరమని దీనహృదయంతో ఆయన ఎదుట ఒప్పుకోండి. ఇప్పుడు మీరు చూస్తున్నానని, ఇప్పుడు విశ్వసిస్తున్నానని, ఇప్పుడు గ్రహించానని, మీ పాప క్రయధనం చెల్లించడానికి తన్ను తాను బలియాగముగా అర్పించుకున్నాడని అంగీకరించండి.

ప్రభువైన యేసుక్రీస్తునందు విశ్వాసముంచుము, అప్పుడు నీవును నీ యింటివారును రక్షణ పొందుదురు అని బైబిల్ చెబుతోంది.

# మాంసయుక్తమైన దేహమందు దేవుడు

## (మూడవ భాగం)

ఈ అధ్యాయంలో ప్రభువైన యేసుక్రీస్తు దైవత్వం గురించి కొందరి సాక్ష్యాలను మనం ఆలోచిద్దాం.

నిత్యుడగు తండ్రి, బలవంతుడైన దేవుడు మాంసయుక్తమైన దేహమందు ఈ లోకానికి రానున్నాడని ప్రవక్తయైన యెషయా ఇచ్చిన సాక్ష్యాన్ని మనం గత అధ్యాయాలలో ఆలోచించాం. మత్తయి 1, లూకా 1 లలో గబ్రియేలు వంటి దూతలు – మరియకు జన్మించిన శిశువు విషయమై దేవుడు మనకు తోడు అని ఇచ్చిన సాక్ష్యాన్ని కూడ మనం చూశాం.

బైబిల్‌లో యోహాను 5:17–18 వచనాన్ని చూడండి. మాంసయుక్తమైన దేహములో దేవుడైయున్న యేసుక్రీస్తును గురించి దయ్యాలు మొదలుకొని దేవుడే స్వయంగా ఇచ్చిన సాక్ష్యాలను గురించి మనం ఆలోచిద్దాం. యేసు చేసిన అద్భుత కార్యాలు ఆయనను గురించి బలమైన సాక్ష్యం ఇస్తాయి. ఈ అద్భుత కార్యాలను యేసుక్రీస్తు తన దైవత్వంతో కూడిన స్వశక్తితో చేయలేదు, కాని దేవుడు ఆయనయందు ఆనందించాడనడానికి ఋజువుగా దేవుడు క్రీస్తుకు అనుగ్రహించిన పరిశుద్ధాత్మ శక్తినిబట్టి వాటిని జరిగించాడు. యేసు తాను చెప్పుకున్నట్లు మాంసయుక్తమగు దేహమందున్న దేవుడు కానట్లయితే, పాపమును క్షమించక, ఆరాధనను అంగీకరించకపోయినట్లయితే, దేవుడు ఆయనయందు ఆనందించేవాడు కాడు.

అయితే యేసు – నా తండ్రి యిదివరకు పనిచేయుచున్నాడు, నేనును చేయుచున్నానని వారికి (ఈ యూదులే ఆయనను చంపగోరారు) ఉత్తరమిచ్చెను. ఆయన విశ్రాంతి దినాచారము మీరుట మాత్రమేగాక, దేవుడు తన సొంత తండ్రి అని చెప్పి, తన్ను దేవునితో సమానునిగా చేసికొనెను గనుక ఇందు నిమిత్తమును యూదులు ఆయనను చంపవలెనని మరి ఎక్కువగా ప్రయత్నము చేసిరి.

తాను "దేవుని కుమారుడను" అని యేసు చెప్పినప్పుడు, ఇశ్రాయేలు దేశనాయకులకు, యూదానాయకులకు, రబ్బీలకు, పాత నిబంధన శాస్త్రులకు, పరిసయ్యులకు కూడ ఆయన చెప్పింది స్పష్టంగానే అర్థమైంది. దేవుని కుమారుడనని చెప్పుకునేవాడు తనకు దైవత్వం ఉన్నదని చెప్పుకుంటున్నాడని వారికి స్పష్టంగా అర్థమైంది.

దేవుడు తన తండ్రి అని చెప్పడంద్వారా దైవత్వంలో తనకు చోటున్నదని యేసు చెబుతున్నాడు. యేసుక్రీస్తు దేవుని కుమారుడని చెప్పే లేఖనాల్లో ఎలాంటి పొరబాటు లేదు. "దేవుని కుమారుడు" లేక "దేవుని జనితైక కుమారుడు" అంటే తండ్రియైన దేవునితో సమానుడు అని చెప్పుకోవడమే.

మన సాక్ష్యాలను చూద్దాం. మొదటిది, దేవుడు యేసుక్రీస్తు కుమారత్వం గురించి సాక్ష్యమిచ్చాడు. ఆ సమయమున యోహానుచేత బాప్తిస్మము పొందుటకు యేసు గలిలయనుండి యొర్దాను దగ్గరనున్న అతనియొద్దకు వచ్చెను. అందుకు యోహాను నేను నీచేత బాప్తిస్మము పొందవలసినవాడనై యుండగా నీవు నాయొద్దకు వచ్చుచున్నావా? అని ఆయనను నివారింపజూచెను గాని యేసు ఇప్పటికి కానిమ్ము, నీతి యావత్తు ఈలాగు నెరవేర్చుట మనకు తగియున్నదని అతనికి ఉత్తరమిచ్చెను గనుక అతడాలాగు కానిచ్చెను. యేసు బాప్తిస్మము పొందిన వెంటనే నీళ్లలోనుండి ఒడ్డునకు వచ్చెను, ఇదిగో ఆకాశము తెరవబడెను, దేవుని ఆత్మ పావురమువలె దిగి తనమీదికి వచ్చుట చూచెను. మరియు ఇదిగో ఈయనే నా ప్రియ కుమారుడు, ఈయనయందు నేనానందించుచున్నానని యొక శబ్దము ఆకాశమునుండి వచ్చెను (మత్తయి 3:13-17).

ప్రభువైన యేసుక్రీస్తు తన ప్రియ కుమారుడని దేవుడు పరలోకమునుండి సాక్ష్యమిచ్చాడు.

అలాగే మత్తయి 17 లో మనమిలా చదువుతాం, ఆరు దినములైన తరువాత యేసు పేతురును యాకోబును అతని సదరుడైన యోహానును వెంట బెట్టుకొని యెత్తయిన యొక కొండమీదికి ఏకాంతముగా పోయి వారి యెదుట రూపాంతరము పొందెను. ఆయన ముఖము సూర్యునివలె ప్రకాశించెను, ఆయన వస్త్రములు వెలుగువలె తెల్లనివాయెను. ఇదిగో మోషేయు ఏలీయాయు వారికి కనబడి ఆయనతో మాటలాడుచుండిరి. అప్పుడు పేతురు ప్రభువా, మనమిక్కడ ఉండుట మంచిది, నీకిష్టమైతే ఇక్కడ నీకు ఒకటియు మోషేకు ఒకటియు ఏలీయాకు ఒకటియు మూడు పర్ణశాలలు కట్టుదునని యేసుతో చెప్పెను. అతడు

ఇంకను మాటలాడుచుండగా ఇదిగో ప్రకాశమానమైన యొక మేఘము వారిని కమ్ముకొనెను, ఇదిగో ఈయన నా ప్రియకుమారుడు, ఈయనయందు నేనానందించుచున్నాను, ఈయన మాట వినుడని యొక శబ్దము ఆ మేఘములోనుండి పుట్టెను (మత్తయి 17:1–5).

తండ్రియైన దేవుడు పరలోకమునుండి రెండవ పర్యాయం ప్రభువైన యేసుక్రీస్తు తన కుమారుడని ప్రకటించాడు.

యోహాను 12 లో ఈ రెండు మాటలను మనం చూడగలం. ఇప్పుడు నా ప్రాణము కలవరపడుచున్నది, నే నేమందును? తండ్రీ, యీ గడియ తటస్థింపకుండ నన్ను తప్పించుము, అయినను ఇందుకోసరమే నేను ఈ గడియకు వచ్చితిని, తండ్రీ, నీ నామము మహిమపరచుమని చెప్పెను. అంతట నేను దానిని మహిమపరచితిని, మరల మహిమపరతును అని యొక శబ్దము ఆకాశము నుండి వచ్చెను. కాబట్టి అక్కడ నిలుచుండి వినిన జనసమూహము ఉరిమెను అనిరి. మరికొందరు దేవదూత ఒకడు ఆయనతో మాటలాడెననిరి. అందుకు యేసు ఈ శబ్దము నాకొరకు రాలేదు, మీకొరకే వచ్చెను (యోహాను 12:27–30).

తన కుమారుడు ఈ దుష్ట, పాపలోకంలోకి రావడానికి మునుపు ఏ మహిమ కలిగివున్నాడో అలాంటి మహిమనే ఆయన ఇప్పుడు పొందబోతున్నాడని పరలోకమునుండి తండ్రియైన దేవుడు చెప్పాడు.

2 పేతురు 1 లో మరో ఆధారం మనం చూడవచ్చు. మత్తయి 17 లో బైబిల్ ఇలా చెబుతోంది, కొండమీద ప్రభువైన యేసుక్రీస్తు రూపాంతరం చెందినప్పుడు, పేతురు, యాకోబు, యోహాను ఆయనతో ఉన్నారు. తండ్రియైన పరలోకమునుండి మాట్లాడినప్పుడు ఆయన మునుపెన్నడూ లేనివిధంగా మహిమ ప్రకాశంతో వారికి కనిపించాడు. ఏలయనగా చమత్కారముగా కల్పించిన కథలను అనుసరించి మన ప్రభువైన యేసుక్రీస్తుయొక్క శక్తిని ఆయన రాకడను మేము మీకు తెలుపలేదు గాని ఆయన మహాత్మ్యమును మేము కన్నులార చూచినవారమై తెలిపితిమి. ఈయన నా ప్రియకుమారుడు ఈయనయందు నేను ఆనందించుచున్నాను అను శబ్దము మహాదివ్య మహిమనుండి ఆయనయొద్దకు వచ్చినప్పుడు, తండ్రియైన దేవునివలన ఘనతయు మహిమయు ఆయన పొందగా మేము ఆ పరిశుద్ధ పర్వతముమీద ఆయనతోకూడ ఉండినవారమై, ఆ శబ్దము ఆకాశమునుండి రాగా వింటిమి (2 పేతురు 1:16–18).

దేవుడు తన కుమారుని గూర్చి ఇచ్చిన సాక్ష్యాలన్నిటిలో మిన్నయైనది హెబ్రీ 1 లో మనకు కనిపిస్తుంది. ఈ దినముల అంతమందు కుమారుని ద్వారా మనతో మాటలాడెను. ఆయన ఆ కుమారుని సమస్తమునకును వారసునిగా నియమించెను. ఆయన ద్వారా ప్రపంచములను నిర్మించెను. ఆయన దేవుని మహిమ యొక్క తేజస్సును, ఆయన తత్వముయొక్క మూర్తి మంతమునైయుండి, తన మహత్తుగల మాటచేత సమస్తమును నిర్వహించుచు, పాపముల విషయములో శుద్ధీకరణము తానే చేసి, దేవదూతలకంటె ఎంత శ్రేష్ఠమైన నామము పొందెనో వారికంటె అంత శ్రేష్ఠుడై, ఉన్నత లోకమందు మహామహుడగు దేవుని కుడిపార్శ్వమున కూర్చుండెను. ఏలయనగా నీవు నా కుమారుడవు, నేను నేడు నిన్ను కనియున్నాను అనియు, ఇదియుగాక నేను ఆయనకు తండ్రినైయుందును, ఆయన నాకు కుమారుడైయుండును అనియు ఆ దూతలలో ఎవనితోనైన ఎప్పుడైనను చెప్పెనా? (ఆయన దూతలలో ఎవని గూర్చియు ఈ మాట చెప్పలేదు. ఎందుకంటే దేవుని కుమారుడు, ప్రభువైన యేసుక్రీస్తుకు మాత్రమే ఇది వర్తిస్తుంది.) మరియు ఆయన భూలోకమునకు ఆదిసంభూతుని మరల రప్పించినప్పుడు దేవుని దూతలందరు ఆయనకు నమస్కారము చేయవలెనని చెప్పుచున్నాడు. తన దూతలను వాయువులుగాను తన సేవకులను అగ్ని జ్వాలలుగాను చేసికొనువాడు అని తన దూతలనుగూర్చి చెప్పుచున్నాడు గాని తన కుమారుని గూర్చియైతే దేవా, నీ సింహాసనము నిరంతరము నిలుచునది, నీ రాజదండము న్యాయార్థమయినది (హెబ్రీ 1:2-8).

ఆ విషయంలో ఎలాంటి సందేహము లేదు. హెబ్రీ 1:8 లో తండ్రియైన దేవుడు కుమారుడగు దేవుని "దేవా" అని సంబోధించాడు. ఇప్పుడు అపవాది ఏమి చెప్పినా అది అసంగతం. గొప్ప వ్యక్తులు లేక మత నాయకులు ఏమి చెప్పినా అది అసంగతం. తండ్రియైన దేవుడు తన కుమారుని గురించి, దేవా, నీ సింహాసనము నిరంతరము నిలుచునది అని చెప్పాడు.

ప్రభువైన యేసుక్రీస్తు ఇప్పుడు ఎల్లప్పుడు నిరంతరం బలవంతుడగు దేవుడు, సమాధానకర్తయై యున్నాడు.

మన తదుపరి సాక్ష్యాలలో, దూతలు చెప్పిన మాటలను గమనిద్దాం. దూత మరియా, భయపడకుము, దేవునివలన నీవు కృపపొందితివి. దూత పరిశుద్ధాత్మ నీమీదికి వచ్చును, సర్వోన్నతుని శక్తి నిన్ను కమ్ముకొనును గనుక పుట్టబోవు శిశువు పరిశుద్ధుడై దేవుని కుమారుడనబడును (లూకా 1:30,35).

ఇప్పుడు క్రీస్తు శిష్యుల సాక్ష్యాలను చూద్దాం.

అందుకాయన మీరైతే నేను ఎవడనని చెప్పుకొనుచున్నారని వారి నడిగెను. అందుకు సీమోను పేతురు నీవు సజీవుడగు దేవుని కుమారుడవైన క్రీస్తువని చెప్పెను (మత్తయి 16:15–16).

క్రొత్త నిబంధన సంఘానికి పునాది యేసే అను సత్యాన్ని పేతురు యుక్తంగానే చెప్పాడు.

యోహాను 1 లో మనమిలా చదువుతాం, నేను ఆయనను ఎరుగనైతిని గాని ఆయన ఇశ్రాయేలుకు ప్రత్యక్షమగుటకు నేను నీళ్లలో బాప్తిస్మమిచ్చుచు వచ్చితినని చెప్పెను. మరియు యోహాను సాక్ష్యమిచ్చుచు ఆత్మ పావురమువలె ఆకాశమునుండి దిగివచ్చుట చూచితిని, ఆ ఆత్మ ఆయనమీద నిలిచెను. నేను ఆయనను ఎరుగనైతిని గాని నీళ్లలో బాప్తిస్మమిచ్చుటకు నన్ను పంపినవాడు నీవెవనిమీద ఆత్మ దిగివచ్చి నిలుచుట చూతువో ఆయనే పరిశుద్ధాత్మలో బాప్తిస్మమిచ్చువాడని నాతో చెప్పెను. ఈయనే దేవుని కుమారుడని నేను తెలిసికొని సాక్ష్యమిచ్చితిననెను (యోహాను 1:31–34).

బాప్తిస్మమిచ్చు యోహాను సాక్ష్యం నిరాక్షేపమైనది. ప్రభువైన యేసుక్రీస్తు దేవుని కుమారుడు, దేవునితో సమానుడు, మాంసయుక్తమైన దేహములో ప్రత్యక్షమైన దేవుడు.

మన తదుపరి సాక్షులు క్రీస్తును సిలువ వేసిన సైనికులు.

మత్తయి 27 లో బైబిల్ ఇలా చెబుతోంది, యేసు మరల బిగ్గరగా కేకవేసి ప్రాణము విడిచెను. అప్పుడు దేవాలయపు తెర పైనుండి క్రింది వరకు రెండుగా చినిగెను, భూమి వణకెను, బండలు బద్దలాయెను, సమాధులు తెరవబడెను, నిద్రించిన అనేకమంది పరిశుద్ధుల శరీరములు లేచెను. వారు సమాధులలోనుండి బయటికి వచ్చి ఆయన లేచిన తరువాత పరిశుద్ధ పట్టణములో ప్రవేశించి అనేకులకు అగపడిరి. శతాధిపతియు అతనితో కూడ యేసునకు కావలి యున్నవారును, భూకంపమును జరిగిన కార్యములన్నిటిని చూచి, మిక్కిలి భయపడి నిజముగా ఈయన దేవుని కుమారుడని చెప్పుకొనిరి (మత్తయి 27:50–54).

నిజముగా అనుమాటను గమనించండి. వారి మదిలో ఎలాంటి ప్రశ్నలూ లేవు. వారు చూశారు, విశ్వసించారు.

ఆ తరువాత దయ్యాల సాక్ష్యాలను మనం ధైర్యంగా తెలుసుకుందాం.

లూకా 4:41 లో మనమిలా చదువుతాం, ఇంతేకాక దయ్యములు నీవు దేవుని కుమారుడవని కేకలు వేసి అనేకులను వదలిపోయెను, ఆయన క్రీస్తు అని వాటికి తెలిసియుండెను గనుక ఆయన వాటిని గద్దించి వాటిని మాటాడనీయలేదు.

ప్రియ చదువరీ, అంధకార సంబంధమైన అధికారం, దయ్యాలు, అపవిత్రాత్మలు, ప్రభువైన యేసుక్రీస్తు దేవుని కుమారుడని సాక్ష్యమిస్తున్నాయి.

యోహాను 5:17,18 ప్రకారం యేసు దేవునితో సమానుడు. ఆయన దైవత్వం, దేవత్వంలో ఆయనకున్న స్థానం అనే సాక్షుల నోట సాక్ష్యమివ్వబడింది. ప్రభువైన యేసుక్రీస్తు దైవత్వాన్ని విశ్వసించి, ఈ లోకంలో ఒప్పుకోడానికి బలమైన కారణం ఉంది. బైబిల్ యేసును గురించి చెప్పిన మాట ముమ్మాటికీ సత్యం: మాంసయుక్తమైన దేహంలో ప్రత్యక్షమైన దేవుడు.

ఈ పాఠాన్ని ముగించే ముందు, క్రీస్తు అద్భుతాలు ఆయన దైవత్వానికి ఋజువులుగా ఎలా నిలిచాయో ఆలోచిద్దాం.

మృతులను లేపడంనుండి సముద్రాలను నిమ్మళించడం వరకు ప్రభువు చేసిన అద్భుతాలన్నీ ఆయన దైవత్వాన్ని సందేహాతీతంగా ఋజువు చేస్తున్నాయి.

యోహాను సువార్తలో యేసు నాలుగు రోజుల క్రితం సమాధి చేయబడిన వ్యక్తి సమాధివద్దకు వెళుతున్నాడు. అది అప్పటికే కుళ్లు పట్టడం మొదలైవుంటుంది: అంతట వారు ఆ రాయి తీసివేసిరి. యేసు కన్నులు పైకెత్తి తండ్రీ, నీవు నా మనవి వినినందున నీకు కృత జ్ఞతాస్తుతులు చెల్లించుచున్నాను. నీవు ఎల్లప్పుడును నా మనవి వినుచున్నావని నేనెరుగుదును గాని నీవు నన్ను పంపితివని చుట్టు నిలిచియున్న యీ జనసమూహము నమ్మునట్లు వారి నిమిత్తమై యీ మాట చెప్పితిననెను. ఆయన ఆలాగు చెప్పి లాజరూ, బయటికి రమ్మని బిగ్గరగా చెప్పగా చనిపోయినవాడు, కాళ్లు చేతులు ప్రేత వస్త్రములతో కట్టబడినవాడై వెలుపలికి వచ్చెను, అతని ముఖమునకు రుమాలు కట్టియుండెను. అంతట యేసు మీరు అతని కట్లు విప్పి పోనియ్యుడని వారితో చెప్పెను. కాబట్టి మరియయొద్దకు వచ్చి ఆయన చేసిన కార్యమును చూచిన యూదులలో అనేకులు ఆయనయందు విశ్వాసముంచిరి (యోహాను 11:41–45).

తన నోటిమాటతో మృతుని లేపిన దేవుని శక్తి అందరికీ గోచరమైంది.

మరో సందర్భాన్ని చూడండి: ఆయన దోనె యెక్కినప్పుడు ఆయన శిష్యులు ఆయన వెంట వెళ్లిరి. అంతట సముద్రముమీద తుపాను లేచినందున ఆ దోనె అలలచేత కప్పబడెను. అప్పుడాయన నిద్రించుచుండగా వారు ఆయన యొద్దకు

వచ్చి ప్రభువా, నశించిపోవుచున్నాము, మమ్మును రక్షించుమని చెప్పి ఆయనను లేపిరి. అందుకాయన అల్పవిశ్వాసులారా, యెందుకు భయపడుచున్నారని వారితో చెప్పి, లేచి గాలిని సముద్రమును గద్దింపగా మిక్కిలి నిమ్మళమాయెను. ఆ మనుష్యులు ఆశ్చర్యపడి ఈయన ఎట్టివాడో, ఈయనకు గాలియు సముద్రమును లోబడుచున్నవని చెప్పుకొనిరి (మత్తయి 8:23-27).

ఆయన ఎలాంటి మనుష్యుడో చూడండి - ఆయన మానవుడు మాత్రమే కాదు, ఆయన దైవమానవుడు. గాలిని, అలలను, సముద్రాన్ని ఆజ్ఞాపించగలిగినవాడై, మాంసయుక్తమైన దేహంలో ప్రత్యక్షమైన దేవుడు.

దరిమిలా, యేసుక్రీస్తు ఒక పుట్టు గ్రుడ్డివానికి కన్నులు తెరిచాడు. బైబిల్ ఇలా చెబుతోంది, ఆయన ఇట్లు చెప్పి నేలమీద ఉమ్మివేసి, ఉమ్మితో బురదచేసి, వాని కన్నులమీద ఆ బురద పూసి నీవు సిలోయము కోనేటికి వెళ్లి అందులో కడుగు కొనుమని చెప్పెను. సిలోయమను మాటకు పంపబడిన వాడని అర్థము. వాడు వెళ్లి కడుగుకొని చూపు గలవాడై వచ్చెను (యోహాను 9:6-7).

ఇప్పుడు కీర్తన 146:8 లో బైబిల్ ఏమి చెబుతోందో మనం చూద్దాం. ప్రభువు అతని కన్నులు తెరచెను. (పెద్ద అక్షరాలతో ముద్రించబడిన ప్రభువు అనుమాట పాత నిబంధనలోని యెవాను సూచిస్తుంది). దానర్థమేమిటి? పాత నిబంధనలోని యెవాయే వాని కన్నులు తెరిచాడు. యోహాను 9వ అధ్యాయంలోని గ్రుడ్డివాని కన్నులు ఎవరు తెరిచారు? యేసు!

పాత నిబంధనలోని యెవా దేవుడే, క్రొత్త నిబంధనలోని ప్రభువైన యేసుక్రీస్తు. తండ్రియైన దేవుడే అలాగే చెప్పాడు. దూతలు అలాగే చెప్పారు. శిష్యులు అలాగే చెప్పారు. ఆయనను సిలువ వేసిన సైనికులు అలాగే చెప్పారు. దయ్యాలు, అపవిత్రాత్మలు కూడ అలాగే చెప్పాయి. ఆయన అద్భుతాలు అలాగే చెప్పాయి. బైబిల్ కూడ అలాగే చెబుతోంది.

యేసుక్రీస్తు ఎల్లప్పుడు దేవుడని, మాంసయుక్తమైన దేహమందు ప్రత్యక్షమైన దేవుడని చూచి, విశ్వసించి, గ్రహించిన వారి సాక్ష్యాలతో మీ సాక్ష్యాన్ని మీరెప్పుడు జత చేస్తారు?

యేసుకు మరణశిక్ష విధించిన ఆయన శత్రువులుకూడ ఆయనలో ఎలాంటి సత్యారోపణలను కనుగొనలేకపోవడం విస్మయం గొలుపుతుంది. తాను దేవుని కుమారుడనని చెప్పుకున్నాడని ఆయనపై ఆరోపణ చేసి, ఇదే కారణంతో ఆయనను మరణానికి అప్పగించారు.

లూకా 22:70-71 ఇలా చెబుతోంది, అందుకు వారందరు అట్లయితే నీవు దేవుని కుమారుడవా? అని అడుగగా ఆయన మీరన్నట్టు నేనే ఆయనను అని వారితో చెప్పెను. అందుకు వారు మనకిక సాక్షులతో పని ఏమి? మనము అతని నోటిమాట వింటిమిగదా అని చెప్పిరి.

మార్కు 14 లో, 61వ వచనంనుండి మనమిలా చదువుతాం, అయితే ఆయన ఉత్తరమేమియు చెప్పక ఊరకుండెను. తిరిగి ప్రధాన యాజకుడు పరమాత్ముని కుమారుడవైన క్రీస్తువు నీవేనా? అని ఆయన నడుగగా యేసు - అవును నేనే, మీరు మనుష్యకుమారుడు సర్వశక్తిమంతుని కుడిపార్శ్వమున కూర్చుండుటయు, ఆకాశమేఘారూఢుడై వచ్చుటయు చూచెదరని చెప్పెను. ప్రధాన యాజకుడు తన వస్త్రములు చింపుకొని-మనకు సాక్షులతో పని యేమి? ఈ దేవదూషణ మీరు విన్నారు కారా? మీకేమి తోచుచున్నదని అడుగగా వారందరు - మరణమునకు పాత్రుడని ఆయనమీద నేరస్థాపన చేసిరి.

నీవు దేవుని కుమారుడవా అని వారు యేసుక్రీస్తును అడిగినప్పుడు, నేను ఉన్నవాడను అని మండుచున్న పొదలోనుండి మోషేకు చెప్పినట్లుగానే ఆయన వారికి చెప్పాడు. యేసు దేవుడు కానట్లయితే, వారు చేసిన ఆరోపణను ఆయన తిరస్కరించి, శిక్షను తప్పించుకుని వుండేవాడు. కాని అందుకు భిన్నంగా, వారి ఆరోపణ సత్యమే అని ఆయన ఒప్పుకున్నాడు.

యేసుక్రీస్తు ఒక సత్పురుషుడని లేక ఒక గొప్ప ప్రవక్త అని విశ్వసించినందువలన మీ ఆత్మకు రక్షణ కలుగదు. ఆయనను జీవన విధానానికి ఒక మాదిరిగా, మంచి బోధకునికి మాదిరిగా ఎంచినప్పుడే, మీ పాపము మీకు తేటపడుతుంది. రక్షకునిగా, పాపవాహకుడుగా ఆయన మాత్రమే ఈ లోకానికి నిరీక్షణయై ఉన్నాడు.

యేసుక్రీస్తు దేవుడు కానట్లయితే, ఆయన మన పాపాల నిమిత్తం మరణించి ఉండేవాడే కాదు, కాని ఆయన మరణించాడు. ఆయన మన పాపాలను వహించి మరణించాడు. మన పాపాలు ఆయనపై ఉన్నట్లయితే, మన అపరాధాలనుండి మనం విముక్తులమయ్యాం, ఇక మనం స్వాతంత్రం పొందుతాం. ఆయన మన పాపాల కోసం మరణించకున్నట్లయితే, ఆ పాపాలు ఇంకా మనపై నిలిచి వుంటాయి, మన పాపాలలోనే మరణించి, నిత్యనరకంలోనికి ప్రవేశిస్తాం.

నా స్నేహితులారా, మీకున్న ఏకైక నిరీక్షణ దేవుని ఏక కుమారుని మీ స్వకీయ రక్షకునిగా విశ్వసించడమే.

మీ హృదయమును కలవరపడనియ్యకుడి, దేవుని యందు విశ్వాసముంచుచున్నారు నాయందును విశ్వాసముంచుడి. నా తండ్రి యింట అనేక నివాసములు కలవు, లేనియెడల మీతో చెప్పుదును, మీకు స్థలము సిద్ధపరచ వెళ్లుచున్నాను. నేను వెళ్లి మీకు స్థలము సిద్ధపరచినయెడల నేనుండు స్థలములో మీరును ఉండులాగున మరల వచ్చి నాయొద్ద నుండుటకు మిమ్మును తీసికొని పోవుదును. నేను వెళ్లుచున్న స్థలమునకు మార్గము మీకు తెలియునని చెప్పెను. అందుకు తోమా ప్రభువా, యెక్కడికి వెళ్లుచున్నావో మాకు తెలియదే, ఆ మార్గమేలాగు తెలియునని ఆయన నడుగగా యేసు నేనే మార్గమును, సత్యమును, జీవమును, నా ద్వారానే తప్ప యెవడును తండ్రియొద్దకు రాడు. మీరు నన్ను ఎరిగియుంటే నా తండ్రిని ఎరిగియుందురు ఇప్పటినుండి మీరాయనను ఎరుగుదురు, ఆయనను చూచియున్నారని చెప్పెను. అప్పుడు ఫిలిప్పు ప్రభువా, తండ్రిని మాకు కనబరచుము, మాకంతే చాలునని ఆయనతో చెప్పగా యేసు ఫిలిప్పూ, నేనింతకాలము మీ యొద్ద ఉండినను నీవు నన్ను ఎరుగవా? నన్ను చూచిన వాడు తండ్రిని చూచియున్నాడు గనుక తండ్రిని మాకు కనుపరచుమని యేల చెప్పుచున్నావు? తండ్రి యందు నేనును నాయందు తండ్రియు ఉన్నామని నీవు నమ్ముటలేదా? నేను మీతో చెప్పుచున్న మాటలు నా యంతట నేనే చెప్పుటలేదు, తండ్రి నాయందు నివసించుచు తన క్రియలుచేయు చున్నాడు. తండ్రియందు నేనును నాయందు తండ్రియు ఉన్నామని నమ్ముడి లేదా యీ క్రియల నిమిత్తమైనను నన్ను నమ్ముడి. (యోహాను 14:1-11).

తండ్రిని మాకు కనుపరచుమని ఫిలిప్పు అడిగినప్పుడు, నీవు నన్ను చూచియున్నావు అని ప్రభువైన యేసుక్రీస్తు అతనికి చెప్పాడు. ఆయన వచ్చిన ఉద్దేశమదే. మానవుడు దేవుని చూచులాగున ఆయన తన్నుతాను మాంసయుక్తమైన దేహమందు ప్రభువైన యేసుక్రీస్తుగా మనకు ప్రత్యక్షపరచుకున్నాడు.

నా స్నేహితులారా, మీ ఆత్మ రక్షణార్థమై మీరు దేవునియొద్దకు వచ్చి ఆయనయందు విశ్వాసముంచాలి. ఆయన శ్రమనొంది, రక్తము చిందించి, మీ పాపాలకు క్రయధనం చెల్లించడానికి మరణించాడు. ఆయన చెల్లింపుకు ప్రతిఫలంగా మీరు మీ జీవితాన్ని అర్పించాలని ఆయన కోరుతున్నాడు. మీరు మరణించాల్సిన అవసరం లేదు, కాని మిమ్మల్ని మీరు తగ్గించుకోవాలి, యథార్థ

హృదయంతో ఆయనయందు విశ్వాసముంచాలి. మీరు పాపియని గ్రహించి, మీకు రక్షణ అవసరమని యథార్థ హృదయంతో గుర్తించి, ఆయనే రక్షకుడని విశ్వసించి ఒప్పుకోవాలి. ఆయనను విశ్వసించండి!

# మాంసయుక్తమైన దేహమందు దేవుడు

## (నాలుగవ భాగం)

ఈ అధ్యాయంలో యేసుక్రీస్తు దైవత్వానికి సంబంధించి ఆయన పునరుత్థానం గురించి మనం చర్చిద్దాం. గత పాఠాల్లో యేసుక్రీస్తు మాంసయుక్తమైన దేహమందున్న దేవుడు అనడానికి చూపిన ఋజువులన్నీ మహత్తుగా ఉన్నాయి. ఆయన మృతులలోనుండి లేపబడకున్నట్లయితే, కొందరి మనసుల్లో ఇంకా కొన్ని హేతుబద్ధమైన ప్రశ్నలు నిలిచివుండేవి. ఆయన పునరుత్థానం స్థాపించబడడంతో ఆ సత్యం సంపూర్ణమైంది.

పునరుత్థానం గురించిన బోధ మన పునరుత్థానం విషయంలోను ఎంతో ప్రాముఖ్యమైంది. యేసుక్రీస్తు తిరిగి లేపబడినందున, ఆయన దైవత్వం ఋజువు చేయబడింది, ఆయన బోధించిన సత్యం నిరూపణ చేయబడింది, మనలను నడిపించే ఆయన అధికారం శాశ్వతంగా స్థిరపడింది.

విశ్రాంతిదినము గడచిపోయిన తరువాత ఆదివారమున, తెల్లవారుచుండగా మగ్దలేనే మరియయు వేరొక మరియయు సమాధిని చూడవచ్చిరి. ఇదిగో ప్రభువు దూత పరలోకమునుండి దిగివచ్చి, రాయి పొర్లించి దాని మీద కూర్చుండెను. అప్పుడు మహాభూకంపము కలిగెను. ఆ దూత స్వరూపము మెరుపువలె నుండెను, అతని వస్త్రము హిమమంత తెల్లగా ఉండెను. అతనికి భయపడుటవలన కావలివారు వణకి చచ్చినవారివలె నుండిరి. దూత ఆ స్త్రీలను చూచి మీరు భయపడకుడి, సిలువ వేయబడిన యేసును మీరు వెదకుచున్నారని నాకు తెలియును, ఆయన ఇక్కడ లేడు, తాను చెప్పినట్టే ఆయన లేచి యున్నాడు, రండి ప్రభువు పండుకొనిన స్థలము చూచి త్వరగా వెళ్లి, ఆయన మృతులలోనుండి లేచియున్నాడని ఆయన శిష్యులకు తెలియజేయుడి. ఇదిగో ఆయన గలిలయలోనికి మీకు ముందుగా వెళ్లుచున్నాడు, అక్కడ మీరు ఆయనను చూతురు, ఇదిగో మీతో చెప్పితిననెను. వారు భయముతోను మహా

ఆనందముతోను సమాధియొద్దనుండి త్వరగా వెళ్లి ఆయన శిష్యులకు ఆ వర్తమానము తెలుప పరుగెత్తుచుండగా యేసు వారిని ఎదుర్కొని మీకు శుభమని చెప్పెను. వారు ఆయనయొద్దకు వచ్చి, ఆయన పాదములు పట్టుకొని ఆయనకు మ్రొక్కగా యేసు భయపడకుడి, మీరు వెళ్లి, నా సదరులు గలిలయకు వెళ్లవలెననియు వారక్కడ నన్ను చూతురనియు వారికి తెలుపుడనెను (మత్తయి 28:1-10).

ప్రియ చదువరీ, దీని గురించి ఆలోచించండి. ఆయన ఇక్కడ లేడు, ఆయన లేచియున్నాడు. ఆ ఉన్నత ప్రకటన ప్రపంచంలోని ఇతర మతాలన్నిటినుండి బైబిల్ క్రైస్తవ్యాన్ని ప్రత్యేకపరుస్తుంది.

మహమ్మద్ మృతులలోనుండి తిరిగి లేవలేదు. బుద్ధుడు మృతులలోనుండి తిరిగి లేవలేదు. కన్ఫ్యూషియస్ మృతులలోనుండి తిరిగి లేవలేదు. గతించిన వందలకొద్దీ పోప్‌లు మృతులలోనుండి తిరిగి లేవలేదు. మేరీ బేకర్ ఎడీ, ఎలెన్ జి. వైట్, జీనీ డిక్సన్ మృతులలోనుండి తిరిగి లేవలేదు. మోర్మనిజమ్ స్థాపకుడైన జోసఫ్ స్మిత్ మృతులలోనుండి తిరిగి లేవలేదు. యెహోవా సాక్షులు ఉద్యమ స్థాపకులైన జడ్జ్ రసెల్, పాస్టర్ రూథర్ ఫోర్డ్ మృతులలోనుండి తిరిగి లేవలేదు.

మీకు రక్షకుడు కావాలంటే, మీకు విమోచకుడు కావాలంటే, మీకు శాశ్వతమైన నిత్యజీవప్రదాత కావాలంటే మీరు వెదకాల్సింది సమాధిలో కాదు. మృతిచెంది, సమాధి చేయబడిన ఏ మనుష్యుడూ సమాధినుండి తిరిగి రాడు. ఆయన సమాధినుండి తిరిగి లేచివుండకపోతే, మిమ్మల్ని తిరిగి లేపగల శక్తి ఆయనకు ఉండదు.

అయితే ప్రభువైన యేసుక్రీస్తు మృతులలోనుండి తిరిగి లేచాడు. తన పునరుత్థానంద్వారా తాను ఈ లోకరక్షకుడనని ఆయనొక్కడే ఋజువు చేసుకున్నాడు.

1. యేసు తన పునరుత్థానం గురించి ముందుగానే ప్రవచించాడు. తన ప్రవచనల ఆధారంగా తన దైవత్వం సంపూర్ణమవుతుందని చెప్పుకున్నాడు.

మత్తయి 20:18-19 లో యేసు ఇలా చెప్పాడు, ఇదిగో యెరూషలేమునకు వెళ్లుచున్నాము, అక్కడ మనుష్యకుమారుడు ప్రధానయాజకులకును శాస్త్రులకును అప్పగింపబడును, వారాయనకు మరణశిక్ష విధించి ఆయనను అపహసించుటకును కొరడాలతో కొట్టుటకును సిలువవేయబడుటకును అన్యజనులకు ఆయనను అప్పగింతురు, మూడవ దినమున ఆయన మరల లేచును.

మత్తయి 12:38–40 లో మనమిలా చదువుతాం, అప్పుడు శాస్త్రులలోను పరిసయ్యులలోను కొందరు బోధకుడా, నీవలన ఒక సూచకక్రియ చూడగోరుచున్నామని ఆయనతో చెప్పగా ఆయన ఇట్లనెను. వ్యభిచారులైన చెడ్డతరమువారు సూచక క్రియను అడుగుచున్నారు. ప్రవక్తయైన యోనానుగూర్చిన సూచక క్రియయే గాని మరి ఏ సూచక క్రియయైనను వారికి అనుగ్రహింపబడదు. యోనా మూడు రాత్రింబగళ్లు తిమింగలము కడుపులో ఏలాగుండెనో ఆలాగు మనుష్యకుమారుడు మూడు రాత్రింబగళ్లు భూగర్భములో ఉండును.

యోనా గురించి మీరు బైబిల్‌లో చదివివుంటే, అతడు మూడు రాత్రింబగళ్లు తిమింగలం కడుపులో ఉన్నాడని, ఆ తరువాత అది యోనాను ఆరిన నేలపై కక్కివేసిందని, ఆ తరువాత పునరుత్థానుడుగా జీవముగలవాడుగా యోనా నీనెవె పట్టణంలోనికి వెళ్లి దేవుని వాక్యాన్ని ప్రకటించగా, ప్రజలు మారుమనస్సు పొందారని మీరు గ్రహించగలరు.

యేసుక్రీస్తు ఇలా చెప్పాడు, నీనెవెవారు యోనా ప్రకటన విని మారుమనస్సు పొందిరి గనుక విమర్శ సమయమున నీనెవెవారు ఈ తరమువారితో నిలువబడి వారిమీద నేరస్థాపన చేతురు. ఇదిగో యోనాకంటె గొప్పవాడు ఇక్కడ ఉన్నాడు (మత్తయి 12:41).

తిమింగలం కడుపులోనుండి యోనా వెలుపలికి రావడమన్నది ఎంత వాస్తవమో, సమాధిలోనుండి యేసు రానున్నాడనేది కూడ అంతే వాస్తవమని ప్రభువైన యేసుక్రీస్తు చెప్పాడు.

ఆయన మృతులలోనుండి తిరిగి లేపబడకపోయినట్లయితే, ఆయన సత్పురుషుడు కాడు – ఆయన అబద్ధికుడు. ఆయన మృతులలోనుండి తిరిగి లేపబడకపోయినట్లయితే, ఆయన గొప్ప బోధకుడు కాడు – ఆయన అబద్ధ బోధకుడు.

ఆయన మృతులలోనుండి తిరిగి లేపబడకపోయినట్లయితే, గొప్ప నైతికతలో ఆయన మాదిరిగా ఉండడు – ఆయన వంచకుడు, మోసకారి అవుతాడు.

అయితే యేసు మృతులలోనుండి తిరిగి లేచాడు.

2. యేసు పునరుత్థానం తరువాత అపొస్తలుల వైఖరి తీవ్ర నిరాశనుండి ఎల్లలెరుగని ఉత్సాహానికి మారింది. తమ ప్రభువును సజీవంగా చూచిన ఈ అపొస్తలుల అనుభవం వర్ణింప శక్యంకానిది.

యేసు వచ్చినప్పుడు, పండ్రెండుమందిలో ఒకడైన దిదుమ అనబడిన తోమా

వారితో లేకపోయెను గనుక తక్కిన శిష్యులుమేము ప్రభువును చూచితిమని అతనితో చెప్పగా అతడు నేనాయన చేతులలో మేకుల గురుతును చూచి నా వ్రేలు ఆ మేకుల గురుతులో పెట్టి, నా చెయ్యి ఆయన ప్రక్కలో ఉంచితేనే గాని నమ్మనే నమ్మనని వారితో చెప్పెను. ఎనిమిది దినములైన తరువాత ఆయన శిష్యులు మరల లోపల ఉన్నప్పుడు తోమా వారితో కూడ ఉండెను. తలుపులు మూయబడియుండగా యేసు వచ్చి మధ్యను నిలిచిమీకు సమాధానము కలుగును గాక అనెను. తరువాత తోమాను చూచి నీ వ్రేలు ఇటు చాచి నా చేతులు చూడుము. నీ చెయ్యి చాచి నా ప్రక్కలో ఉంచి, అవిశ్వాసివి కాక విశ్వాసివై యుండుమనెను. (యోహాను 20:24-29).

సుతిమెత్తగా చెప్పడమంటే ఏమిటి? తోమా యేసుక్రీస్తును చూచి - నా ప్రభువా, నా దేవా, అన్నప్పుడు ఆయన అతని మాటలను సరిదిద్దలేదు. అతని మాటలలో తప్పులు వెదకలేదు. ఎందుకంటే అతని మాటలు సరైనవి. యేసుక్రీస్తు అతని ప్రభువు, అతని దేవుడు. ఆ సంగతి ఆయన పునరుత్థానంలో ఋజువైంది.

ప్రభువైన యేసుక్రీస్తు ఎవరో తనకు తెలియదని తన్నుతాను శపించుకొని, ఒట్టు పెట్టుకొని, ప్రమాణం చేసిన పేతురు కథ మనకందరికి తెలుసు. ఒక చిన్నది తన్ను అప్పగిస్తుందేమో అని అతడు భయపడ్డాడు. అయినప్పటికీ, అనేక రోజులు గడవకముందే పెంతెకొస్తు రోజున పేతురు నగరం మధ్యన నిలబడి స్వరమెత్తి ఇలా ప్రకటించాడు. అయితే పేతురు ఆ పదునొకరితోకూడ లేచి నిలిచి బిగ్గరగా వారితో ఇట్లనెను యూదయ మనుష్యులారా, యెరూషలేములో కాపురమున్న సమస్త జనులారా, యిది మీకు తెలియుగాక, చెవియొగ్గి నా మాటలు వినుడి. ఇశ్రాయేలువారలారా, యీ మాటలు వినుడి. దేవుడు నజరేయుడగు యేసుచేత అద్భుతములను మహత్కార్యములను సూచకక్రియలను మీ మధ్యను చేయించి, ఆయనను తనవలన మెప్పుపొందినవానిగా మీకు కనబరచెను, ఇది మీరే యెరుగుదురు. దేవుడు నిశ్చయించిన సంకల్పమును ఆయన భవిష్యద్ జ్ఞానమును అనుసరించి అప్పగింపబడిన యీయనను మీరు దుష్టులచేత సిలువ వేయించి చంపితిరి. మరణము ఆయనను బంధించి యుంచుట అసాధ్యము గనుక దేవుడు మరణవేదనలు తొలగించి ఆయనను లేపెను. ఈ యేసును దేవుడు లేపెను, దీనికి మేమందరము సాక్షులము (అపొ.కా. 2:14, 22-24, 32).

ఇలాంటి గణనీయమైన వ్యత్యాసానికి కారణమేమిటి? పేతురు జీవితాన్ని

తీవ్రంగా మార్చినదేమిటి? అది ప్రభువైన యేసుక్రీస్తు పునరుత్థానం గూర్చిన నిశ్చయతే.

3. యేసు పునరుత్థానుడైన తరువాత అనేకులకు అనేకరీతులుగా ప్రత్యక్షం కావడం ఆయన పునరుత్థానానికి ప్రశ్నాతీతంగా నిలిపింది. మరియు సదరులారా, నేను మీకు ప్రకటించిన సువార్తను మీకు తెలియపరచుచున్నాను. మీరు దానిని అంగీకరించితిరి, దానియందే నిలిచియున్నారు. మీ విశ్వా సము వ్యర్థమైతేనే గాని, నేను ఏ ఉపదేశరూపముగా సువార్త మీకు ప్రకటించితినో ఆ ఉపదేశమును మీరు గట్టిగా పట్టుకొనియున్న యెడల ఆ సువార్తవలననే మీరు రక్షణపొందువారై యుందురు. నాకియ్యబడిన ఉపదేశమును మొదట మీకు అప్పగించితిని. అదేమనగా, లేఖనముల ప్రకారము క్రీస్తు మన పాపముల నిమిత్తము మృతిపొందెను, సమాధిచేయబడెను, లేఖనముల ప్రకారము మూడవదినమున లేపబడెను. ఆయన కేఫాకును, తరువాత పండ్రెండుగురికిని కనబడెను. అటుపిమ్మట ఐదు వందలకు ఎక్కువైన సదరులకు ఒక్కసమయమందే కనబడెను. వీరిలో అనేకులు ఇప్పటివరకు నిలిచియున్నారు, కొందరు నిద్రించిరి. తరువాత ఆయన యాకోబుకును, అటుతరువాత అపొస్తలుల కందరికిని కన బడెను. అందరికి కడపట అకాలమందు పుట్టినట్టున్న నాకును కనబడెను (1కొరింథీ 15:1-8).

యేసుక్రీస్తు సిలువ వేయబడిన తరువాత ఆయన సజీవునిగా ఒకేసారి 500 మందికి తన్నుతాను ప్రత్యక్షపరచుకున్నాడు. 1కొరింథీ 15 ప్రకారం, అనేకులు తమ సాక్ష్యాలను జతచేశారు.

ఈ విషయమై మత్తయి 28 లో సైనికులు ఇచ్చిన బలమైన సాక్ష్యాన్ని మనం చూడగలం. ఇలాంటి మరెన్నో ఎదురు చూడని సాక్ష్యాలు వారి వ్యాఖ్యానాలకు బలం చేకూరుస్తున్నాయి. వారు వెళ్లుచుండగా కావలివారిలో కొందరు పట్టణములోనికి వచ్చి జరిగిన సంగతులన్నిటిని ప్రధాన యాజకులతో చెప్పిరి. కాబట్టి వారు పెద్దలతో కూడి వచ్చి ఆలోచనచేసి ఆ సైనికులకు చాల ద్రవ్యమిచ్చి మేము నిద్రపోవుచుండగా అతని శిష్యులు రాత్రివేళవచ్చి అతనిని ఎత్తికొనిపోయిరని మీరు చెప్పుడి, ఇది అధిపతి చెవినిబడినయెడల మేమతని సమ్మతిపరచి మీకేమియు తొందర కలుగకుండ చేతుమని చెప్పిరి. అప్పుడు వారు ఆ ద్రవ్యము తీసికొని తమకు బోధింపబడిన ప్రకారము చేసిరి. ఈ మాట యూదులలో వ్యాపించి నేటివరకు ప్రసిద్ధమైయున్నది (మత్తయి 28:11-15).

యేసు నిజంగా మృతుల్లోనుండి లేవలేదని, యేసు మాటలు నిజమని నమ్మించడానికి శిష్యులు ఆయన దేహాన్ని అపహరించారని నేడు అనేకులు ఆరోపిస్తున్నారు కదా అని ఎవరైనా అనవచ్చు. అవును, యేసుక్రీస్తు పునరుత్థానాన్ని నిరాకరించే అనేక అబద్ధాలు ఉత్పన్నమవుతాయని 2,000 క్రితమే బైబిల్ హెచ్చరించింది. అలాంటి అబద్ధాన్ని నమ్మడమంటే మీ ఆత్మను కోల్పోవడమే.

ఇలాంటి అబద్ధ సమాచారం వ్యాప్తి చేయడానికి వారికి లంచం ఇవ్వబడిందని మీరు తెలుసుకోవాలి. సత్యానికి వ్యతిరేకంగా పోరాటం చేయడానికి వారికి ఎంతో ధనం ముట్టజెప్పవలసి వచ్చింది. నేడు అలాంటి అబద్ధాలను అనేకులు ఉచితంగానే ప్రచారం చేస్తున్నారు. అలాంటివారు తమ అబద్ధాలతో నరకానికి పయనమవడమే కాక, ఈ లోకంలో ఎలాంటి లాభం సంపాదించుకోవడం లేదు.

మనం చేయాల్సిన సరైన పని అబద్ధాలను ఆపడం, మిమ్మల్ని ఇతరులను వంచించడం ఆపడం, యేసుక్రీస్తు పునరుత్థానాన్ని విశ్వసించడమే.

యేసు పునరుత్థానం గురించి కొంతమంది హాస్యాస్పదమైన వ్యాఖ్యలు చేస్తుంటారు. యేసు లేచిన మాట వాస్తవమే, గాని ఆయన శరీరంతో లేవలేదని ఆయన ఆత్మను మాత్రమే చూసిన ప్రజలు ఆయన మృతులలోనుండి లేచాడని భ్రమపడ్డారని అంటుంటారు.

దయచేసి ఒక్క నిమిషం నా మాట వినండి. యేసు భూమిమీదకు రావడానికి ఆయనకొక దేహాన్ని అమర్చడానికి దేవుడు మరియ గర్భాన్ని సిద్ధపరచాడని గత పాఠాలలో మనం అధ్యయనం చేశాం. ఆ దేహంతోనే ఆయన కలువరిలో సిలువ వేయబడ్డాడు, మన పాపాలను భరించాడు. ఆ శరీరంతోనే ఆయన శ్రమనొందాడు, రక్తం చిందించాడు, మరణించాడు. ఆ దేహము బహువిధాలుగా ఛిద్రమైంది. ఆ దేహానికే ముళ్ల కిరీటం పెట్టారు. ఆ దేహాన్ని కొరడాలతో కొట్టారు. ఆ దేహాన్ని పొలంలా దున్నారు. ఆ దేహంపై ఉమ్మివేశారు. ఆ దేహాన్నే కొట్టారు, పిడిగుద్దులు గుద్దారు. ప్రభువైన యేసుక్రీస్తును గ్రుడ్డివానితో పోల్చి నిన్ను కొట్టిందెవరో చెప్పమని పరిహాసం చేశారు. ఆ దేహంలోనే ఆయన చేతులు, కాళ్లలో మేకులు కొట్టారు, ప్రక్కలో బల్లెంతో పొడిచారు. ఈ దేహమే సమాధినుండి వెలుపలికి వచ్చింది.

యేసు తోమాకు కనిపించినప్పుడు ఇలా అన్నాడని బైబిల్ చెబుతోంది, యేసు నీవు నన్ను చూచి నమ్మితివి, చూడక నమ్మినవారు ధన్యులని అతనితో చెప్పెను (యోహాను 20:29).

సమాధినుండి వెలుపలికి వచ్చింది ప్రభువైన యేసుక్రీస్తు ఆత్మ కాదు. ఆయన ఆత్మవలె భూమిమీద నడయాడలేదు. వారు పొడిచింది ఆయన ఆత్మను కాదు. మేకులు కొట్టింది ఆయన ఆత్మకు కాదు. పొడువబడింది, మేకులు కొట్టబడింది ఆయన శరీరమే.

ఇంకా లూకా సువార్త 24:36-48 లో బైబిల్ ఇలా చెబుతోంది, వారు ఈలాగు మాటలాడుచుండగా ఆయన వారి మధ్యను నిలిచి మీకు సమాధానమవుగాకని వారితో అనెను. అయితే వారు దిగులుపడి భయాక్రాంతులై, భూతము తమకు కనబడెనని తలంచిరి. దాన్ని మీరు గ్రహించారా? వారెంతో భయానికి గురయ్యారు. ఏవేవో ఆందోళనలను వారిని ముప్పిరిగొన్నాయి. తామొక భూతాన్ని చూస్తున్నామని తలంచారు. యేసు మృతులలోనుండి లేచి ఉండడని వారి ఆలోచన. అప్పుడాయనమీరెందుకు కలవరపడుచున్నారు? మీ హృదయములలో సందేహములు పుట్టనేల? నేనే ఆయనను అనుటకు నా చేతులను నా పాదములను చూడుడి, నన్ను పట్టి చూడుడి, నా కున్నట్టుగా మీరు చూచుచున్న యెముకలును మాంసమును భూతమున కుండవని చెప్పి తన చేతులను పాదములను వారికి చూపెను. అయితే వారు సంతోషముచేత ఇంకను నమ్మక ఆశ్చర్యపడుచుండగా ఆయన ఇక్కడ మీయొద్ద ఏమైన ఆహారము కలదా అని వారినడిగెను. వారు కాల్చిన చేప ముక్కను ఆయన కిచ్చిరి. ఆయన దానిని తీసికొని వారియెదుట భుజించెను. అంతట ఆయన మోషే ధర్మశాస్త్రములోను ప్రవక్తల గ్రంథములలోను, కీర్తనలలోను నన్నుగూర్చి వ్రాయబడిన వన్నియు నెరవేరవలెనని నేను మీయొద్ద ఉండినప్పుడు మీతో చెప్పిన మాటలు నెరవేరినవని వారితో చెప్పెను. అప్పుడు వారు లేఖనములు గ్రహించునట్లుగా ఆయన వారి మనస్సును తెరచి క్రీస్తు శ్రమపడి మూడవ దినమున మృతులలోనుండి లేచుననియు యెరూషలేము మొదలుకొని సమస్త జనములలో ఆయనపేరట మారుమనస్సును పాపక్షమాపణయు ప్రకటింపబడుననియు వ్రాయబడియున్నది. ఈ సంగతులకు మీరే సాక్షులు.

మంచిది, యేసుక్రీస్తు తన చేతులను, కాళ్లను చూపి వాటిని రక్తమాంసాలు అంటున్నాడు. ఈ శరీరమే విరువబడింది. అది మరణంనుండి లేపబడింది. ఆయన వారి సమక్షంలో భుజించాడు. ఆత్మ భుజించదు. ప్రభువైన యేసుక్రీస్తు, తనకు మానవ దేహముందని వారికి ఋజువు చేయడానికే వారి సమక్షంలో ఆహారం భుజించాడు.

దేవుని వాక్యాన్ని విశ్వసించేవారికి – ప్రభువైన యేసుక్రీస్తు మృతులలోనుండి పునరుత్థానం చెందాడనడంలో ఎలాంటి సందేహం తలెత్తదు.

4. మనుష్యులందరి పునరుత్థానం యేసు పునరుత్థానంపై ఆధారపడివుంది.

ఒకరోజున మీరు కూడ మృతులలోనుండి లేస్తారనే నిరీక్షణ కలిగివున్నారు కదా? మృతులుగానే ఉండిపోవాలనుకోరు కదా? నరకంలో కాలిపోవాలని మీరు ఆశించరు. సమాధిలో కుళ్లిపోవాలనుకోరు. నిరంతరం జీవించాలని మీరు ఆశిస్తారు. నిత్యజీవం గురించిన నిరీక్షణ మీకుంది. మానవులను నడిపించేది అదే.

మీ నిరీక్షణ, విశ్వాసం, నమ్మిక ప్రభువైన యేసుక్రీస్తు అను వ్యక్తిపై ఉన్నట్లయితే, మీరు నిజమైన, జీవముతో కూడిన నిరీక్షణ గలవారు. దానిచేతనే మీరు జీవిస్తారు, దానికొరకే జీవిస్తారు, అదే మిమ్మల్ని నిత్యము జీవింపజేస్తుంది. మీ నిరీక్షణ, విశ్వాసం లేక నమ్మిక (విగ్రహం, ప్రతిమ, మతం, సంఘసభ్యత్వం, నీటిబాప్తిస్మం, మీ వ్యక్తిత్వం, మీ స్వంత సత్క్రియలు) వంటి మరోదానిపై ఉంటే, మీకిక ఎలాంటి నిరీక్షణ ఉండదు. అయితే, పునరుత్థానాన్ని గూర్చిన మీ విశ్వాసం, క్రీస్తు పునరుత్థానంపై ఉంటే, మీకు గట్టి స్వాంతనం కలుగుతుంది.

క్రీస్తు మృతులలోనుండి లేపబడియున్నాడని ప్రకటింపబడుచుండగా మీలో కొందరు మృతుల పునరుత్థానము లేదని యెట్లు చెప్పుచున్నారు? మృతుల పునరుత్థానము లేనియెడల, క్రీస్తుకూడ లేపబడి యుండలేదు. మరియు క్రీస్తు లేపబడియుండనియెడల మేము చేయు ప్రకటన వ్యర్థమే, మీ విశ్వాసమును వ్యర్థమే. దేవుడు క్రీస్తును లేపెనని, ఆయననుగూర్చి మేము సాక్ష్యము చెప్పియున్నాము గదా? మృతులు లేపబడనియెడల దేవు డాయనను లేపలేదు గనుక మేమును దేవుని విషయమై అబద్ధపు సాక్షులముగా అగపడుచున్నాము. మృతులు లేపబడని యెడల క్రీస్తుకూడ లేపబడలేదు. క్రీస్తు లేపబడని యెడల మీ విశ్వాసము వ్యర్థమే, మీరింకను మీ పాపములలోనే యున్నారు. అంతేకాదు, క్రీస్తునందు నిద్రించిన వారును నశించిరి. ఈ జీవితకాలముమట్టుకే మనము క్రీస్తునందు నిరీక్షించువారమైనయెడల మనుష్యులందరి కంటె దౌర్భాగ్యులమై యుందుము. ఇప్పుడైతే నిద్రించినవారిలో ప్రథమఫలముగా క్రీస్తు మృతులలోనుండి లేపబడియున్నాడు. మనుష్యుని ద్వారా మరణము వచ్చెను గనుక మనుష్యుని ద్వారానే మృతుల పునరుత్థానమును కలిగెను. ఆదామునందు అందరు ఏలాగు

మృతిపొందుచున్నారో, ఆలాగుననే క్రీస్తునందు అందరు బ్రదికింపబడుదురు (1కొరింథీ 15:12–22).

యేసుక్రీస్తు మృతులలోనుండి లేపబడకపోయినట్లయితే, మన ఉపదేశమంతా అబద్ధం, బైబిల్ అబద్ధం, మీ నిరీక్షణ వ్యర్థం, ఈ లోకం కాక ఇక మీకేమీ ఉండదు. అయితే, దేవునికి మహిమ కలుగును గాక, ఆయన మృతులలోనుండి తిరిగి లేచాడు. ఆయన మృతులలోనుండి తిరిగి లేపబడ్డాడు. ఆయన నిరంతరం జీవిస్తున్నాడు.

మీరు మీ విశ్వాసాన్ని, అంటే మీ ఆత్మనంతటిని ప్రభువైన యేసుక్రీస్తు అను వ్యక్తిపై ఉంచితే, మీరు కూడ మృతులలోనుండి లేపబడి, మహిమలో ఆయనతో నిరంతరం జీవిస్తారనే నిశ్చయత కలిగివుంటారు. తండ్రి మృతులను ఏలాగు లేపి బ్రదికించునో ఆలాగే కుమారుడును తనకిష్టము వచ్చినవారిని బ్రదికించును (యోహాను 5:21).

మృతులు దేవుని కుమారుని శబ్దము విను గడియ వచ్చుచున్నది, ఇప్పుడే వచ్చియున్నది, దానిని వినువారు జీవింతురని మీతో నిశ్చయముగా చెప్పుచున్నాను. దీనికి ఆశ్చర్యపడకుడి, ఒక కాలము వచ్చుచున్నది, ఆ కాలమున సమాధులలో నున్నవారందరు ఆయన శబ్దము విని మేలు చేసినవారు జీవ పునరుత్థానమునకును కీడు చేసినవారు తీర్పు పునరుత్థానమునకును బయటికి వచ్చెదరు (యోహాను 5:25,28,29).

యేసుక్రీస్తును మీ ప్రభువుగా, స్వకీయ రక్షకునిగా అంగీకరించారా? యేసు మృతులలోనుండి లేపబడినప్పుడు, ఆయన తన దైవత్వం గురించి చెప్పుకున్నవన్నీ అక్షరసత్యాలే అని దేవుడు ప్రకటించాడు. ఆయన మన పాపాలన్నిటిని తనపై వేసుకుని మరణించాడు నుక, మన ఆత్మల రక్షణకు ఆయన శుద్ధీకరణ కార్యం సరిపోయినదని దేవుడు అంగీకరించాడు.

కనుక యేసుక్రీస్తునందు విశ్వాసముంచేవారంతా ఆయన చేసి ముగించిన కార్యాన్నిబట్టి పాపమునుండి నీతిమంతులుగా తీర్చబడ్డారు. మీరు రక్షించబడులాగున ఆయన మీ కోసం మరణించాడు, మీ కోసం సమాధి చేయబడ్డాడు, మీ కోసం తిరిగి లేచాడు.

చరిత్రలో యేసు ఒక్కడే మరణించి, తిరిగి లేచి, ఇక మరెన్నడూ మరణించలేదు. హనోకు, ఏలీయాలు మరణం చూడకుండానే పరలోకానికి కొనిపోబడ్డారు, కాని వారు మరణించలేదు, నిరంతరం జీవించులాగున తిరిగి

లేవలేదు. లాజరు, యాయీరు కుమార్తె, ఐతుకు తదితరులు మరణంనుండి తిరిగి లేచినట్లు బైబిల్ చరిత్ర చెబుతోంది, కాని వారు తిరిగి మరణించి వుంటారు. వారి భౌతిక జీవితం ముగిసింది.

కనుక ప్రభువైన యేసుక్రీస్తు, ఒక ప్రత్యేక స్థితిలో ఉన్నాడు. ఆయన మృతులలోనుండి ప్రథమ ఫలమై యున్నాడు. ఆయన అనేక సదరులలో జ్యేష్ఠుడు గనుక మరణంపై తన విజయోత్సాహంలో పాలుపొందడానికి ఆయనయందు విశ్వాసముంచిన ప్రతి ఒక్కరికి ఆయన అనుమతి ఇస్తున్నాడు. ఆయనయందు విశ్వాసముంచినవారంతా మరణంపై ఆయన పొందిన విజయాన్ని ఆస్వాదించులాగున, నిద్రించినవారిలో ఆయన ప్రథమఫలమై యున్నాడు.

ప్రభువైన యేసుక్రీస్తు ఒక్కడే మరణాన్ని పూర్తిగా, సంపూర్ణంగా, నిర్ద్వందంగా జయించాడు. ఆయన మృతులలోనుండి తిరిగి లేచాడు. ఆయన నిరంతరం జీవిస్తున్నాడు. అద్భుతాలన్నిటిలో పునరుత్థానం అత్యుత్తమమైనది. మన పునరుత్థాన సమయంలో, కనురెప్పపాటులో, విశ్వాసులైన కోట్లాదిమంది దేహాలు ఎక్కడ పాతిపెట్టబడివున్నా, అవన్నీ తిరిగి లేపబడతాయి. ఎందుకంటే ఆ దేహాలన్నీ తమ స్వకీయ రక్షకుడుగా, ప్రభువుగా తామెరిగిన యేసుక్రీస్తుకు చెందినవి.

ప్రకటన గ్రంథంలోని ఈ మాటలను గురించి ఆలోచించండి: మీ సదరుడను, యేసునుబట్టి కలుగు శ్రమలోను రాజ్యములోను సహనములోను పాలివాడనునైన యోహానను నేను దేవుని వాక్యము నిమిత్తమును యేసును గూర్చిన సాక్ష్యము నిమిత్తమును పత్మాసు ద్వీపమున పరవాసినైతిని. ప్రభువు దినమందు ఆత్మవశుడనై యుండగా బూరధ్వనివంటి గొప్పస్వరము నీవు చూచుచున్నది పుస్తకములో వ్రాసి, ఎఫెసు, స్ముర్న, పెర్గము, తుయతైర, సార్దీస్, ఫిలదెల్ఫియ, లవొదికయ అను ఏడు సంఘములకు పంపుమని చెప్పుట నావెనుక వింటిని. ఇది వినగా నాతో మాటలాడుచున్న స్వరమేమిటో అని చూడ తిరిగితిని. తిరుగగా ఏడు సువర్ణ దీపస్తంభములను, ఆ దీపస్తంభములమధ్యను మనుష్యకుమారునిపోలిన యొకనిని చూచితిని. ఆయన తన పాదములమట్టునకు దిగుచున్న వస్త్రము ధరించుకొని రొమ్మునకు బంగారుదట్టి కట్టుకొనియుండెను. ఆయన తలయు తలవెంట్రుకలును తెల్లని ఉన్నిని పోలినవై హిమమంత ధవళముగా ఉండెను. ఆయన నేత్రములు అగ్ని జ్వాలవలె ఉండెను. ఆయన పాదములు కొలిమిలో పుటము వేయబడి మెరయుచున్న అపరంజితో సమానమై యుండెను. ఆయన కంఠ స్వరము విస్తార జలప్రవాహముల ధ్వనివలె ఉండెను.

ఆయన తన కుడిచేత ఏడు నక్షత్రములు పట్టుకొని యుండెను. ఆయన నోటినుండి రెండంచులుగల వాడియైన ఖడ్గమొకటి బయలు వెడలుచుండెను. ఆయన ముఖము మహా తేజస్సుతో ప్రకాశించుచున్న సూర్యునివలె ఉండెను. నేనాయనను చూడగానే చచ్చినవానివలె ఆయన పాదముల యొద్ద పడితిని. ఆయన తన కుడిచేతిని నామీద ఉంచి నాతో ఇట్లనెనుభయపడకుము. నేను మొదటివాడను కడపటివాడను జీవించువాడను, మృతుడనైతిని గాని ఇదిగో యుగయుగములు సజీవుడనై యున్నాను. మరియు మరణముయొక్కయు పాతాళలోకము యొక్కయు తాళపుచెవులు నా స్వాధీనములో ఉన్నవి (ప్రకటన 1:9–18).

ప్రియ నేస్తమా, ఉండువాడనను గొప్పవానిని మీ స్వకీయ రక్షకునిగా మీరు తెలుసుకున్నారా? నేనే మార్గమును సత్యమును జీవమును, అల్ఫాయు ఓమెగయు నేనే, మృతుడనైతినిగాని ఇదిగో జీవించుచున్నాను, జీవాహారము నేనే, నేను లోకమునకు వెలుగై యున్నాను, నేను గొఱ్ఱెలకు మంచి కాపరిని – అని చెప్పినవానిని మీరు తెలుసుకున్నారా?

ఆయనను మీరెరుగుదురా? మీ రక్షకుని మీరెరుగుదురా? మీకున్న ఏకైక రక్షకుడు ఆయనే. ఆయనను మీరు విశ్వసిస్తే, ఆయన మిమ్మును రక్షిస్తాడు. ఆయనను మీరు నిరాకరిస్తే, మీరు నరకప్రాయులవుతారు, కాని ఆయన మీ రక్షకుడు. మీకున్న ఏకైక రక్షకుడు ఆయనే. నిరాక్షేపముగా దైవభక్తిని గూర్చిన మర్మము గొప్పదైయున్నది, ఆయన సశరీరుడుగా ప్రత్యక్షుడయ్యెను. ఆత్మవిషయమున నీతిపరుడని తీర్పునొందెను. దేవదూతలకు కనబడెను రక్షకుడని జనములలో ప్రకటింపబడెను లోకమందు నమ్మబడెను ఆరోహణుడై తేజోమయుడయ్యెను (1తిమోతి 3:16).

# క్రీస్తు మానవత్వం

గత నాలుగు పాఠాలలో మనం ప్రభువైన యేసుక్రీస్తు దైవత్వం గురించి చర్చించాం. ఇప్పుడు మనం గేర్లు వేగంగా మార్చి, యేసుక్రీస్తు మానవత్వం గురించి చర్చించబోతున్నాం.

నా ఉద్దేశాన్ని వివరిస్తాను. యేసుక్రీస్తు దేవుడు అని ఎలా ఋజువు చేయబడిందో, అలాగే ఆయన మానవుడు అని కూడ ఋజువు చేయబడవలసి ఉంది. మానవుల పాపాలనుబట్టే ఆయన మరణించాల్సి వచ్చింది. ఎందుకంటే మానవునికి ప్రత్యామ్నాయంగా ఆయన తానే మానవుడుగా అవతరించాడు.

అంతేగాక, ఆయన పాపములేని మానవుడు కావలసి వచ్చింది. ఎందుకంటే పాపియైన మానవుడు తన పాపాల కోసం మరణించవలసి ఉంది కనుక అతడు ఇతరుల కోసం మరణించడం సాధ్యపడదు.

మానవుడు దేవుని ధర్మశాస్త్రాన్ని పాటించగలడని మానవులకు కనుపరచడం ఆవశ్యకం. ఎందుకంటే ధర్మశాస్త్రాన్ని పాటించడంలో దేవుని పరిశుద్ధత బలంగా నిరూపించబడుతుంది. చేయబడుతుంది. ధర్మశాస్త్రాన్ని ఎవరూ పాటించి ఉండకపోతే, బహుశా ధర్మశాస్త్రాన్ని ఎవరూ పాటించలేరని, కనుక మానవుని పాపానికి అతని బాధ్యత ఉండదని చెప్పినట్లవుతుంది.

యేసుక్రీస్తు పాపరహితమైన జీవితం జీవించాడు. ఆయన ధర్మశాస్త్రాన్ని సంపూర్ణంగా నెరవేర్చాడు. దానిని ఆయన ఒక మానవునిగా నెరవేర్చాడా లేక దేవునిగానా? ఆయన దేవునిగా నెరవేర్చి వుంటే, మానవుడు ధర్మశాస్త్రాన్ని నెరవేర్చగలడని ఋజువు చేయడంలో విఫలమయ్యాడని అర్థం. అయితే యేసుక్రీస్తు నిజంగా దేవుడని, అదే సమయంలో ఆయన మానవుడు కూడ అని ఈ అధ్యయనంలో మనం చూస్తాం.

1. యేసుక్రీస్తు నిజంగా మానవుడు. ఇది మనం గ్రహించగలం ఎందుకంటే ఆయన మానవునిలానే భుజించాడు, నిద్రించాడు, అలసిపోయాడు, ఏడ్చాడు, మరణించాడు. మన ప్రభువు జీవితంలోని ఈ సంఘటన గురించి ఆలోచించండి.

అక్కడ యాకోబు బావి యుండెను గనుక యేసు ప్రయాణమువలన అలసియున్న రీతినే ఆ బావి యొద్ద కూర్చుండెను, అప్పటికి ఇంచుమించు పండ్రెండు గంటలాయెను. సమరయ స్త్రీ ఒకతె నీళ్ళు చేదుకొనుటకు అక్కడికి రాగా యేసు నాకు దాహమునకిమ్మని ఆమె నడిగెను (యోహాను 4:6-7).

ఇక్కడ క్రీస్తుయేసు అను ఒక మానవుడు ఉన్నాడు, ఆయన ప్రయాణం చేసి అలసిపోయి, తన దాహానికి నీళ్లిమ్మని సమరయనుండి వచ్చిన ఒక స్త్రీని అడిగాడు.

మరో సందర్భాన్ని చూడండి: అంతట సముద్రముమీద తుపాను లేచి నందున ఆ దోనె అలలచేత కప్పబడెను. అప్పుడాయన నిద్రించుచుండగా వారు ఆయన యొద్దకు వచ్చి ప్రభువా, నశించిపోవుచున్నాము, మమ్మును రక్షించుమని చెప్పి ఆయనను లేపిరి (మత్తయి 8:24-25). ఇక్కడ క్రీస్తుయేసు అను నరుడు పడవ అమరమున విశ్రాంతి తీసుకుంటూ నిద్రిస్తున్నాడు.

దానిని ఒక సారూప్యతతో మనం చదువుదాం, ఇశ్రాయేలును కాపాడువాడు కునుకడు నిద్రపోడు. యెవాయే నిన్ను కాపాడువాడు నీ కుడిప్రక్కను యెవా నీకు నీడగా ఉండును (కీర్తన 121:4-5).

ఇప్పుడు ప్రజల మనసుల్లో ఒక వైరుధ్యం తలెత్తుతుంది, ఎందుకంటే వారి హృదయాలు దేవుని వాక్యంపట్ల పాపముతో నిండిన దురభిప్రాయం కలిగి వుంటాయి. ఎందుకంటే ప్రకృతి సంబంధియైన మనుష్యులు ఆత్మసంబంధమైన సంగతులను పొందలేరు, వాటిని గ్రహించనూ లేరు. ఆత్మసంబంధమైన సంగతులు వారికి వెఱ్ఱితనంగా ఉంటాయి. అయితే వాస్తవమేమిటంటే, క్రీస్తుయేసు అను నరుడు అలసి నిద్రపోయాడు. ఆయన మాంసయుక్తమైన దేహమందు ప్రత్యక్షమైన దేవుడు, కాని దేహమందు ఆయన నిజంగా మనుష్య కుమారుడు.

2. వాస్తవానికి, ఆయన తన్ను మనుష్య కుమారునిగా చెప్పుకోడానికే ఇష్టపడతాడు. ఈ మాటను ఆయన ఎనభైసార్లకు పైగా ఉపయోగించాడు. మానవునిగా ఆయన మరియ కుమారుడు. అందుకు యేసు నక్కలకు బొరియలును ఆకాశపక్షులకు నివాసములును కలవు గాని మనుష్యకుమారునికి తలవాల్చుకొనుటకైనను స్థలములేదని అతనితో చెప్పెను (మత్తయి 8:20). ఈ పేరు ఆయనకు మనుష్యరీతిగా, జాతికి సంబంధించిందిగా పెట్టబడింది.

ఇదే భావన 1కొరింథీ 15:45-47 లో వ్యక్తం చేయబడింది: ఇందు విషయమై ఆదామను మొదటి మనుష్యుడు జీవించు ప్రాణి ఆయెనని

వ్రాయబడియున్నది. కడపటి ఆదాము జీవింపచేయు ఆత్మ ఆయెను. ఆత్మసంబంధమైనది మొదట కలిగినది కాదు, ప్రకృతిసంబంధమైనదే మొదట కలిగినది, తరువాత ఆత్మసంబంధమైనది. మొదటి మనుష్యుడు భూసంబంధియై మంటినుండి పుట్టినవాడు, రెండవ మనుష్యుడు పరలోకమునుండి వచ్చినవాడు. ప్రభువు పరలోకమునుండి రెండవ ఆదాముగా దిగివచ్చి, తన్నుతాను మనుష్య కుమారునిగా చెప్పుకున్నాడు.

ఇంకా ఇలా చదువుతాం, అయినను పాపములు క్షమించుటకు భూమిమీద మనుష్యకుమారునికి అధికారము కలదని మీరు తెలిసికొనవలెను అని చెప్పి, ఆయన పక్షవాయువుగలవాని చూచి నీవు లేచి నీ మంచమెత్తికొని నీ యింటికి పొమ్మని చెప్పగా వాడు లేచి తన యింటికి వెళ్లెను (మత్తయి 9:6-7). కనుక యేసుక్రీస్తు ఈ స్థానాన్ని తనకు తాను తీసుకుంటున్నట్లు మనం చూస్తున్నాం.

గలతీ 4:4-5 లో ఇలా వ్రాయబడి వుంది, అయితే కాలము పరిపూర్ణమైనప్పుడు దేవుడు తన కుమారుని పంపెను,ఆయన స్త్రీయందు పుట్టి, మనము దత్తపుత్రులము కావలెనని ధర్మశాస్త్రమునకు లోబడి యున్నవారిని విమోచించుటకై ధర్మశాస్త్రమునకు లోబడినవాడాయెను.

ఆథరైజ్డ్ కింగ్స్ జేమ్స్ బైబిల్‌లోని లూకా 2వ అధ్యాయంలో, ఒక విశేష విలక్షణాన్ని మనం చూడగలం. అది నూతన, ఆధునిక అనువాదాలను వక్రంగా, చెడుగా మార్చివేసింది. లూకా 2:33 లో బైబిల్ ఇలా చెబుతోంది, యోసేపును ఆయన తల్లియు ఆయననుగూర్చి చెప్పబడిన మాటలను విని ఆశ్చర్యపడిరి. ప్రభువైన యేసుక్రీస్తు కన్య గర్భాన జన్మించాడని ఈ వచనం స్పష్టంగా పేర్కొంటోంది, కాని అది యేసు ద్వైదీ స్వభావాన్ని కూడ పేర్కొంటోంది. ఆయన దేవుని కుమారుడు, మనుష్యకుమారుడు కూడ.

దాదాపు అన్ని ఆధునిక బైబిల్ అనువాదాలు ఉటంకించిన "ఆయన తండ్రియు తల్లియు" అను మాటలను, సాతాను వక్రీకరించాడు. నా స్నేహితులారా, యోసేపు యేసుక్రీస్తుకు తండ్రి కాదు. సర్వశక్తిగల దేవుడే యేసుక్రీస్తుకు తండ్రి. యేసు తల్లి మరియ. దేవుడు ఆయన తండ్రి కనుక ఆయన దేవుడై యున్నాడు. దేవుడు నివసించిన మానవ దేహానికి మరియ తల్లి కనుక ఆయన మనుష్యకుమారుడు. మరియ వంశావళిని అనుసరించి యేసు మానవుడు, అయినప్పటికీ దేవుని కుమారుడుగా ఆయన దైవత్వం గలవాడు.

3. ఆయన మనవలెనే అన్ని విషయాలలో శోధింపబడినప్పటికీ, ఆయన

పాపము లేనివాడుగా జీవించాడు. ఆయన మానవుడుగానే శోధింపబడ్డాడనడం వాస్తవం. లేకుంటే ఆయన మనవలెనే శోధింపబడ్డాడు అని చెప్పబడి వుండదు. మనం మానవులవలె శోధింపబడ్డాం. దేవునివలె శోధింపబడలేదు, ఎందుకంటే మనం దేవుడు కాదు. మనం మానవులం, మానవులుగానే శోధనకు గురయ్యాం.

హెబ్రీ 4:15 లో బైబిల్ ఇలా చెబుతోంది, మన ప్రధానయాజకుడు మన బలహీనతలయందు మనతో సహానుభవము లేనివాడు కాడు గాని, సమస్త విషయములలోను మనవలెనే శోధింపబడినను, ఆయన పాపము లేనివాడుగా ఉండెను.

యాకోబు 1:3 లో మనమిలా చదువుతాం, దేవుడు కీడు విషయమై శోధింపబడనేరడు, ఆయన ఎవనిని శోధింపడు గనుక ఎవడైనను శోధింపబడినప్పుడు నేను దేవునిచేత శోధింపబడుచున్నానని అనకూడదు.

కనుక ప్రభువైన యేసుక్రీస్తు మనుష్యుని వలె శోధింపబడ్డాడనేది వాస్తవం. అలాగే దేవుడు కీడువలన శోధింపబడడని బైబిల్ పేర్కొంటోంది. ఇది యేసుక్రీస్తు మానవత్వాన్ని స్పష్టంగా తెలియజేస్తోంది.

4. అమరత్వముగల దేవుడు మరణమగునంతగా, అనగా సిలువ మరణమగునంతగా తన్ను తాను తగ్గించుకున్నాడు.

దీన్ని గొప్పగా ఆలోచిద్దాం. ఫిలిప్పీ 2 లోని ఈ ప్రామాణిక భాగంలో క్రీస్తుయేసునకు కలిగిన యీ మనస్సు మీరును కలిగియుండుడి. ఆయన దేవుని స్వరూపము కలిగినవాడైయుండి, దేవునితో సమానముగా ఉండుట విడిచిపెట్టకూడని భాగ్యమని యెంచుకొనలేదు అని వుంది. (యేసుక్రీస్తు దొంగిలించలేదు, తస్కరించలేదు. తండ్రితో తన సమానత్వాన్ని పేర్కొన్నప్పుడు తనది కానిదానిని కోరుకోలేదు. వాస్తవానికి తండ్రితో తనకున్న సమానత్వాన్ని కోరుకునే సంపూర్ణ హక్కు ఆయనకుంది, ఎందుంటే ఆయన ఎల్లప్పుడు తండ్రితో సమానుడే.) అయితే అది విడిచి పెట్టకూడని భాగ్యమని ఎంచుకోక, దాసుని స్వరూపము ధరించుకొని, మనుష్యుల పోలికెలో పుట్టాడు (ప్రభువైన యేసుక్రీస్తు శరీరధారి కావడానికి ముందే ఉనికిలో ఉన్నాడు. అయితే తన అవతరణలో భాగంగా, ఆయన మానవ దేహంలో, మానవుల పోలికెలో జన్మించాడు.) తన్ను తాను రిక్తునిగా చేసుకుని, మరణమగునంతగా, అనగా సిలువ మరణము పొందునంతగా ఆయన తన్ను తాను తగ్గించుకున్నాడు (ఫిలిప్పీ 2:5-8).

కనుక నాలుగో అంశాన్ని పునరుద్ఘాటించాలంటే, అమరత్వముగల దేవుడు

మరణమగునంతగా, అనగా సిలువ మరణమగునంతగా తన్ను తాను తగ్గించుకున్నాడని మనం చూస్తున్నాం.

5. ఆయన చేసిన అద్భుతాలు తన దైవిక శక్తినిబట్టి కాక, పరిశుద్ధాత్మ అభిషేక శక్తినిబట్టే చేశాడు. ఇది ఎంతో ప్రాముఖ్యం. దీని గురించిన కొన్ని ఉదాహరణలను బైబిల్‌లోనుండి నేను మీకు చూపుతాను. లూకా 4:14-19 లో ఇలా చెప్పబడింది: అప్పుడు యేసు, ఆత్మ బలముతో గలిలయకు తిరిగి వెళ్లెను, ఆయనను గూర్చిన సమాచారము ఆ ప్రదేశమందంతటా వ్యాపించెను. ఆయన అందరిచేత ఘనతనొంది, వారి సమాజమందిరములలో బోధించుచు వచ్చెను. తరువాత ఆయన తాను పెరిగిన నజరేతునకు వచ్చెను. తన వాడుక చొప్పున విశ్రాంతిదినమందు సమాజమందిరము లోనికి వెళ్లి, చదువుటకై నిలుచుండగా ప్రవక్తయైన యెషయా గ్రంథము ఆయన చేతికియ్యబడెను, ఆయన గ్రంథము విప్పగా ప్రభువు ఆత్మ నామీద ఉన్నది బీదలకు సువార్త ప్రకటించుటకై ఆయన నన్ను అభిషేకించెను చెరలోనున్న వారికి విడుదలను, గ్రుడ్డివారికి చూపును, (కలుగునని) ప్రకటించుటకును నలిగి ప్రభువు హితవత్సరము ప్రకటించుటకును ఆయన నన్ను పంపియున్నాడు. అని వ్రాయబడిన చోటు ఆయనకు దొరకెను.

యేసు అద్భుతాల వెనుక ప్రభువగు ఆత్మ శక్తి ఉన్నదని లేఖనాల్లోని ఈ వాక్యభాగాలు రెండుసార్లు చెప్పడం గమనించండి. ఆయన తన్ను తాను తగ్గించుకుని, ఆత్మ కార్యం జరుగులాగున, ప్రాముఖ్యంగా ఆయన అద్భుతాలు కార్యరూపం దాల్చు స్థితికి దిగివచ్చాడు.

అపో.కా. 10 లో మనమిలా చదువుతాం, దేవుడు పక్షపాతి కాడని నిజముగా గ్రహించి యున్నాను. ప్రతి జనములోను ఆయనకు భయపడి నీతిగా నడుచుకొనువానిని ఆయన అంగీకరించును. యేసుక్రీస్తు అందరికి ప్రభువు. ఆయనద్వారా దేవుడు సమాధానకరమైన సువార్తను ప్రకటించి ఇశ్రాయేలీయులకు పంపిన వర్తమానము మీరెరుగుదురు. యోహాను బాప్తిస్మము ప్రకటించిన తరువాత గలిలయ మొదలుకొని యూదయ యందంతట ప్రసిద్ధమైన సంగతి మీకు తెలియును. అదేదనగా దేవుడు నజరేయుడైన యేసును పరిశుద్ధాత్మతోను శక్తితోను అభిషేకించెనను నదియే. దేవుడాయనకు తోడైయుండెను గనుక ఆయన మేలు చేయుచు, అపవాదిచేత పీడింపబడిన వారినందరిని స్వస్థపరచుచు సంచరించుచుండెను. ఆయన యూదుల దేశమందును యెరూషలేమునందును

చేసినవాటికన్నిటికిని మేము సాక్షులము. ఆయనను వారు మ్రానున వ్రేలాడదీసి చంపిరి. దేవుడాయనను మూడవ దినమున లేపి . . . ఆయన ప్రత్యక్షముగా కనబడునట్లు అనుగ్రహించెను (అపొ.కా. 10:34-40).

కనుక పేతురు పరిశుద్ధాత్మ ప్రేరేపణ ద్వారా పేతురు ప్రసంగిస్తూ, యేసుక్రీస్తు జరిగించిన అద్భుతాల శక్తికి విశేషతను ఆపాదిస్తూనే, అవి పరిశుద్ధాత్మ అభిషేకం వలన జరిగిన అద్భుత కార్యాలని వివరించాడు. యేసు ఇలా చెప్పాడు, దేవుని ఆత్మవలన నేను దయ్యములను వెళ్లగొట్టుచున్న యెడల నిశ్చయముగా దేవుని రాజ్యము మీ యొద్దకు వచ్చి యున్నది (మత్తయి 12:28).

దైవ-మానవ మర్మము అనంత జ్ఞానానికి మించినది. మీ ప్రజ్ఞతో దాన్ని మీరు గ్రహించలేరు. మీ తార్కిక సామర్థ్యంతో దానిని మీరు అర్థం చేసుకోలేరు. కొన్ని సంగతులు చాలా తేటగా ఉంటాయి, వాటిని మీరు అంగీకరించాలి. దేవుడు మీతో అబద్ధమాడడు. దేవుడు మిమ్మల్ని వంచించడు. ప్రభువైన యేసుక్రీస్తు ముమ్మాటికీ దేవుడు, అదే సమయంలో ముమ్మాటికీ మనుష్యుడు. ఆయన తన మానవతలో మరణించాడు. ఆయన మనుష్యుల పాపాల కోసం మరణించులాగున మానవతను ధరించుకున్నాడు. ఆత్మ-నిండిన మానవత్వంలో యేసుక్రీస్తు కనుపరచిన మాదిరిని అనుసరించి, క్రైస్తవులుగా మనం ఆదర్శప్రాయంగా జీవించగలం. మానవులుగా ఇలాంటి అద్భుత జీవితం జీవించనట్లయితే, మనం దాని పట్టును కోల్పోతాం. పరిశుద్ధ జీవితంలో, త్యాగపూరితమైన సేవలో మనం సాధించగలిగేవి ఏమిటి? ఏమీ లేవు.

క్రీస్తులో ఆత్మ నిండిన మానవత్వాన్ని ఉన్నత ఆదర్శంగా, మాదిరిగా చూచినప్పుడు, ఆత్మ నడిపింపుకు మనలను అప్పగించుకుని, యేసును వెంబడిస్తాం.

పాపులకు అన్ని విధాల ప్రత్యామ్నాయంగా యేసుక్రీస్తు దైవ-మానవునిగా న్యాయబద్ధమైన విధిని నిర్వర్తించాడు. పాపులకు పరిపూర్ణమైన ప్రత్యామ్నాయం క్రీస్తు యేసను నరుడు. పాపానికి అతిక్రమానికి ఆయన సంపూర్ణమైన క్రయధనం చెల్లించాడు. ఏలయనగా ధర్మశాస్త్ర సంబంధమైన క్రియలమూలముగా ఏ మనుష్యుడును ఆయన దృష్టికి నీతిమంతుడని తీర్చబడడు, ధర్మశాస్త్రమువలన పాపమనగా ఎట్టిదో తెలియబడుచున్నది (రోమా 3:20).

నా మిత్రులారా, మానవుడు రక్షింపబడు నిమిత్తం దేవుడు ఆజ్ఞలు, కట్టడలు, శాసనాలు, విధివిధానాలు అనుగ్రహించాడు. కాని వాటివలన ఏ మానవుడూ

రక్షింపబడలేదు, అందుకు కారణం - మానవుడు వాటిని ఏ మాత్రం గైకొనలేకపోవడం. ధర్మశాస్త్రం వలన పాపమంటే ఏమిటో తెలుస్తుంది. దేవుని పరిశుద్ధ ప్రమాణానికి అనుగుణంగా జీవించడానికి ప్రయత్నించినా, అలా జీవించలేరని మీరు గ్రహిస్తారు. మీరు పాపులు. అయితే ఇప్పుడు దేవుని నీతి (గమనించండి, అది మానవుని నీతి కాదు, దేవుని నీతి) ఇట్లుండగా ధర్మశాస్త్రమునకు వేరుగా దేవుని నీతిబయలుపడుచున్నది (అంటే, మనం చూడగలుగునట్లు దేవుడు మాంసయుక్తమైన దేహమందు ప్రత్యక్షమయ్యాడు, దేవుడు దృశ్యుడయ్యాడు) దానికి ధర్మశాస్త్రమును ప్రవక్తలును సాక్ష్యమిచ్చుచున్నారు, అది యేసుక్రీస్తునందలి విశ్వాసమూలమైనదై, నమ్మువారందరికి కలుగు దేవుని నీతియైయున్నది. (ధర్మశాస్త్రాన్ని పాటించేవారికే కాదు. నూతన ప్రయత్నం చేసేవారికే కాదు. పరిశుద్ధ జీవితం జీవించేవారికే కాదు. బాప్తిస్మం పొందినవారికే కాదు. అంతము వరకు సహించినవారికే కాదు. సమస్తం దేవుని మార్గంలో జరిగించేవారికే కాదు. తమ జీవితాల్లో దేవుని ఆశ్రయించేవారికే కాదు. తమ జీవితాలను దేవుని చేతికి అప్పగించుకునేవారికే కాదు. కాని విశ్వసించే వారికందరికీ వర్తిస్తుంది. విశ్వసించేవారు దేనిని విశ్వసించాలి? ఇప్పుడు చదువుదాం.) ఏ భేదమును లేదు, అందరును పాపముచేసి దేవుడు అనుగ్రహించు మహిమను పొందలేక పోవుచున్నారు. కాబట్టి నమ్మువారు ఆయన కృపచేతనే, క్రీస్తుయేసునందలి విమోచనము ద్వారా ఉచితముగా నీతిమంతులని తీర్చబడుచున్నారు. (ఎలాంటి రుసుము లేదు, ఎలాంటి అర్హత అవసరం లేదు, దానిని మీరు సంపాదించలేరు, దానికి మీరు మూల్యం చెల్లించలేరు, మిమ్మల్ని మీరు యోగ్యులుగా చేసుకోలేరు. సరే, నేను పాపిని. నా పాపాలకు మూల్యం ఎవరో చెల్లించారు. ఆ చెల్లించినదెవరు? తన కృపచేత దేవుడు ధర్మశాస్త్రాన్ని నెరవేర్చడానికి పాపమెరుగని, ధర్మశాస్త్రాన్ని అతిక్రమించని తన కుమారుడగు ప్రభువైన యేసుక్రీస్తును నా విమోచనార్థమై పంపించాడు. పూర్వము చేయబడిన పాపములను దేవుడు తన ఓరిమివలన ఉపేక్షించినందున, ఆయన తన నీతిని కనువరచవలెనని క్రీస్తుయేసు రక్తమునందలి విశ్వాసము ద్వారా ఆయనను కరుణాధారముగా బయలుపరచెను. దేవుడిప్పటి కాలమందు తన నీతిని కనబరచు నిమిత్తము, తాను నీతిమంతుడును యేసునందు విశ్వాసముగలవానిని నీతిమంతునిగా తీర్చువాడునై యుండుటకు ఆయన ఆలాగు చేసెను (రోమా 10:20-26).

మీరు నీతిమంతులా? కాదు. మీరు ధర్మశాస్త్రాన్ని గైకొనగలరా? లేదు. మీరు పాపము చేశారా? అవును. మీరు దేవుని కృపను పొందలేక తప్పిపోయారా? అవును. మీ పాపాలకు మూల్యం ఎలా చెల్లించగలరు? మీరు చెల్లించలేరు. మీ పాపాలను ఎలా పోగొట్టుకోగలరు? పోగొట్టుకోలేరు. అయితే మీ ఆత్మను ప్రేమించిన దేవుడు మీ పాపాలకు పరిహారం చెల్లించడానికి తన కుమారుని పంపాడు. మీరు కృపచేత, దేవుని ఎదుట నీతిమంతులుగా తీర్చబడులాగున, ఆయన ఆ విలువను చెల్లించాడు.

దేవుని బిడ్డగా మారడానికి మీరేమి చేయాలి?

"పాపక్షమాపణ నిమిత్తం బాప్తిస్మం పొందాలి." అని మీరనవచ్చు. సువార్త సందేశమది కాదు.

"గతాన్ని మరచి, నా పాపాలను విడిచిపెట్టాలి." అది సరిపోదు.

"పాపాన్ని విడిచి, దేవుని మార్గంలో జీవించాలి." అది ప్రయోజనం కలిగించదు.

దేవుడు యేసుక్రీస్తును పాపపరిహారంగా అనుగ్రహించాడని, ఆయన రక్తమందలి విశ్వాసాన్ని ప్రకటించడంద్వారా పాపక్షమాపణ పొంది నీతిమంతులుగా తీర్చబడతామని బైబిల్ చెబుతోంది.

ఎవరు నీతిమంతులుగా తీర్చబడ్డారు? దేవుడెవరిని నీతిమంతులుగా తీర్చాడు?

యేసునందు విశ్వాసముంచినవారిని.

ఇప్పుడు దానిని మరోసారి చదువుదాం. మిమ్మల్ని కించపరచడం నా ఉద్దేశం కాదు. మీ మనోభావాలను దెబ్బతీయడం నా ఉద్దేశం కాదు. కాని అనేకులు తాము చూడలేని తమ గర్వం, స్వనీతి, తమ మతం, ఎవరో చెప్పిన మాటలను యథార్థంగా విశ్వసించడం వంటివాటిచేత అంధులవుతున్నారు. మిమ్మల్ని మీరు రక్షించుకునే నిరీక్షణ లేదు. మిమ్మల్ని మీరు రక్షించుకోడానికి మీరేదో చేయడం వలన నిరీక్షణ కలుగదు. దేవుడు తన ప్రభువైన యేసుక్రీస్తు అను తన కుమారుని రక్షకునిగా నియమించాడు. ఆయన మీ పాపాలకు మూల్యం చెలించాడని విశ్వసించినప్పుడు, యేసుక్రీస్తు సంపూర్తి చేసిన రక్తప్రోక్షణ ద్వారా దేవుడు మిమ్మల్ని నీతిమంతులుగా తీరుస్తాడు.

అన్యనిరీక్షణ, అన్యవిశ్వాసం మిమ్మల్ని నరకంలో పడవేస్తుంది. క్రీస్తుయేసు అను నరుడు, మాంసయుక్తమైన దేహమందు ప్రత్యక్షమైన దేవుడు, తన రక్తంద్వారా మీ పాపాలకు మూల్యం చెల్లించాడు.

యేసుక్రీస్తు రక్తమువలన మాత్రమే తప్ప మరేవిధంగానూ మీరు దేవుని ఎదుట నీతిమంతులుగా తీర్చబడలేరని విశ్వసించినప్పుడు, మీరు ఉచితంగా నీతిమంతులుగా తీర్చబడగలరు. అంతే!

"నేను ధర్మశాస్త్రాన్ని పాటిస్తాను" అని మీరనవచ్చు.

ధర్మశాస్త్రమంటే మీకు తెలియదు. దానిని పాటించాలనే ప్రయత్నంలో మీరు విఫలమవుతారు.

"నేను ఆజ్ఞలను పాటిస్తాను" అని మీరనవచ్చు.

వాటిలో కొన్ని మీకు అనుకూలంగా ఉన్నాయనిపించడం లేదా? ఆజ్ఞలను పాటించడానికి శతవిధాల ప్రయత్నించినా అందులో మీరు విఫలమవుతారు.

అందరు పాపము చేసి దేవుడనుగ్రహించు మహిమను పొందలేకపోతున్నారు. రక్షణ అంగీకారయోగ్యం కావడానికి ఒకే ఒక నీతిమార్గముంది. అది సంపూర్ణ నీతి. అది ప్రభువైన యేసుక్రీస్తు అను ఒక వ్యక్తిలో మాత్రమే అనుగ్రహించబడుతుంది. మీ విశ్వాసం, నిరీక్షణ, నమ్మిక, మీ నిబ్బరం అంతా యేసుక్రీస్తు తన రక్తంతో సంపూర్తి చేసిన ప్రాయశ్చిత్తంలోనే ఉందని మీరు యథార్థంగా చెప్పగలరా?

మీరలా యథార్థంగా చెప్పగలిగితే, మీరు దేవుని బిడ్డ అవుతారు. మీరు యథార్థంగా చెప్పలేకపోతే, మీకేదైనా సందేహముంటే, ఏదైనా భిన్నాభిప్రాయముంటే లేక మీరేమైనా తర్కించగోరితే, ఒక విషయంలో జాగ్రత్త వహించండి: మిమ్మల్ని మీరు తగ్గించుకుని, యేసుక్రీస్తునందు నమ్మికయుంచకపోతే, నరకం మీ కోసం నోరు తెరచుకుని ఆశగా ఎదురు చూస్తుంది.

ప్రభువైన యేసుక్రీస్తునందు విశ్వాసముంచండి, అప్పుడు మీరు రక్షింపబడతారు.

# దేవుని కృప

ఈ పాఠాలను అధ్యయనం చేసే క్రమంలో మనమెంతో దూరం ప్రయాణం సాగించాం. బైబిల్‌లోని దేవుని గురించి మీరు మొదట ఈ చిన్న సంపుటాన్ని ఆరంభించినప్పటికంటె ఇప్పుడు మరెంతో అవగాహన పెంపొందించుకుని ఉంటారని ఆశిస్తున్నాను, ప్రార్థిస్తున్నాను.

ఈ పాఠంలో దేవుడు తన కృపనుబట్టి లోకంతో ఎలా వ్యవహరిస్తున్నాడో మనం చర్చించబోతున్నాం. దేవుడు ఈ లోకంతో మాత్రమే కాదు, సాతానుతోను పడిపోయిన వాని దూతలతో కూడ కృపతో వ్యవహరించడం అత్యంత విస్మయం గొలుపుతుంది.

కృపాసువార్త సత్యం తేటగా ఉన్నందున దానిని సంపూర్ణంగా అర్థం చేసుకోవడం లేక గ్రహించడం ఎప్పటికీ సాధ్యం కాదు. దీనిని అర్థం చేసుకోవడంలో కలిగే వైఫల్యం దేవుని అనుగ్రహం గురించి ఎన్నో ప్రశ్నలు తలెత్తుతున్నాయి. సాతాను పాపము చేసినప్పుడు దేవుడు కృప చూప, అప్పుడే తీర్పు తీర్చివుంటే, వానికి స్వాతంత్ర్యం లభించక అప్పుడే నశించి వుండేవాడు, ఇతరులను శోధనకు గురి చేయక ఉండేవాడు. ప్రతిగా, పాపము చేసిన మనుష్యులందరికీ అలాంటి దుర్గతే పట్టివుండేది. అలా పాపము కనిపించిన వెంటనే అది నిర్మూలం చేసివుండేది. అప్పుడు అన్యాయాన్నిబట్టి దేవునిపై ఎన్నటికీ ఆరోపణ ఉండేది కాదు.

దేవుడు ఎందుకిలా చేయలేదు?

1. చెడుతో రెండు విధాలుగా మాత్రమే వ్యవహరించే అవకాశముంది – తీర్పు లేక కృప. రెండు ఎంపికలు మాత్రమే ఉన్నాయి. అయితే దేవుడు నిష్పక్షపాతి. ఆయన అందరికీ కృప అనుగ్రహిస్తాడు లేదా ఎవరికీ కృప అనుగ్రహించడు. దేవుడు కొందరికి మాత్రమే కృప అనుగ్రహించి, మరికొందరికి కృప అనుగ్రహించకుంటే, అది అన్యాయం, అనీతి అవుతుంది. అది అసమంజసం.

దేవుడు కొందరిని నాశనానికి, మరికొందరిని రక్షణకు ముందే

నియమించాడని కొందరు బోధించడం నేను గమనించాను. అంటే దేవుడు కొందరిని రక్షించడానికి వారికి తన చిత్తాన్ని బయలుపరచి, తక్కిన వారికి ఆ వెలుగును చూపకపోవడం అనే బోధను కొందరు బోధిస్తున్నారు. దేవుడు అన్యాయస్తుదని, ఆయన కృపగలవాడు కాడని కొందరు బోధించడం నేను గమనిస్తున్నాను.

బైబిల్ బోధిస్తున్న దేవుని గురించి ఆలోచిద్దాం. కీర్తన 98:8-9 లేఖనం ఇలా బోధిస్తోంది: ఆయన సన్నిధిని నదులు చప్పట్లు కొట్టును గాక. కొండలు కూడి ఉత్సాహధ్వని చేయునుగాక. భూమికి తీర్పు తీర్చుటకై నీతినిబట్టి లోకమునకు తీర్పు తీర్చుటకై న్యాయమునుబట్టి నజములకు తీర్పు తీర్చుటకై యెవా వేంచేయుచున్నాడు.

దేవుడు న్యాయాధిపతియా? అవును, ఆయన న్యాయాధిపతే. అవును, ఆయన న్యాయం తీరుస్తాడు. దేవుడు ప్రజలకు తీర్పు తీరుస్తాడా? అవును, ఆయన తీర్పు తీరుస్తాడు. ఎలా? ధర్మబద్ధంగా.

రోమా 2:11 ఇలా చెబుతోంది, దేవునికి పక్షపాతము లేదు. మనిషి ఎవరు అనేదాన్నిబట్టి దేవుడు అతనితో వ్యవహరించడు. మీరు సంపన్నులైతే, విద్యావంతులైతే, ప్రజ్ఞావంతులైతే, బలవంతులైతే, మీకు మంచి ఇల్లుంటే, మంచి ఉద్యోగముంటే, మంచి ఆదాయముంటే, మీ కుటుంబానికి మీరు అన్నీ సమకూర్చగలిగే స్థితిలో ఉంటే, మంచిదే. అయితే దేవుడు తన వాక్యాన్నిబట్టి, మీ విధేయతనుబట్టే మీతో వ్యవహరిస్తాడు గాని మీరెవరు అనేదాన్నిబట్టి కాదు. ప్రతి ఒక్కరి విషయంలోనూ దేవుడు ఇలాగే వ్యవహరిస్తాడు.

రోమా 2:12 ఇలా ప్రకటిస్తోంది, ధర్మశాస్త్రము కలిగినవారై పాపము చేసినవారందరు ధర్మశాస్త్రానుసారముగా తీర్పు నొందుదురు.

యోహాను 1:17 లో మనమిలా చదువుతాం, ధర్మశాస్త్రము మోషేద్వారా అనుగ్రహింపబడెను, కృపయు సత్యమును యేసు క్రీస్తుద్వారా కలిగెను.

మంచిది, దేవుడు న్యాయాధిపతి. ఆజ్ఞాతిక్రమం దేవుని తీర్పుకు గురి చేస్తుంది, కాని ప్రభువైన యేసుక్రీస్తు తన ప్రవేశంతో కృప సత్యం ఆయనను అనుసరించి వస్తున్నాయి.

2. బైబిల్‌లో కృప ఒక ప్రభుత్వ విధానంగా ప్రస్తావించబడింది. కృప అనేది ప్రభుత్వ విధానంగా మనుష్యులు పాపము చేసినప్పటికీ, కొంత కాలం వరకు అది దానిని అనుమతిస్తుంది. ఈ సందేశం అపొ.కా. 17:24-31 లో

దాఖలు చేయబడింది. ఇందులో అపొస్తలుడైన పౌలు మార్స్ కొండమీద తమకు తెలియని దేవునికి ఒక బలిపీఠం కట్టి ఆయనను ఆరాధించే మూఢనమ్మకస్తులైన ప్రజలకు బోధిస్తున్నాడు. వాస్తవానికి, ఆ బలిపీఠం మీద తెలియబడని దేవునికి అని కూడ వ్రాయబడివుంది.

ఈ ప్రజలను గూర్చి గొప్ప మిషనరీ ఇలా ఆక్రందన చేస్తున్నాడు, జగత్తును అందలి సమస్తమును నిర్మించిన దేవుడు తానే ఆకాశమునకును భూమికిని ప్రభువైయున్నందున హస్తకృతములైన ఆలయములలో నివసింపడు. ఆయన అందరికిని జీవమును ఊపిరిని సమస్తమును దయచేయువాడు గనుక తనకు ఏదైనను కొదువ యున్నట్టు మనుష్యుల చేతులతో సేవింపబడువాడు కాడు. మరియు యావద్భూమిమీద కాపురముండుటకు ఆయన యొకనినుండి ప్రతి జాతిమనుష్యులను సృష్టించి, వారు ఒకవేళ దేవునిని తడవులాడి కనుగొందురేమోయని, తన్ను వెదకునిమిత్తము నిర్ణయకాలమును వారి నివాసస్థలముయొక్క పొలిమేరలను ఏర్పరచెను. ఆయన మనలో ఎవనికిని దూరముగా ఉండువాడు కాడు. మనమాయనయందు బ్రదుకుచున్నాము, చలించుచున్నాము, ఉనికి కలిగియున్నాము. అటువలె మనమాయన సంతానమని మీ కవీశ్వరులలో కొందరును చెప్పుచున్నారు. కాబట్టి మనము దేవుని సంతానమైయుండి, మనుష్యుల చమత్కార కల్పనలవలన మల్చబడిన బంగారమునైనను వెండినైనను రాతినైనను దేవత్వము పోలియున్నదని తలంపకూడదు. (గమనించండి – ఇది చదువుతున్న మీలో కొందరు మీ తల్లిదండ్రులు చెప్పారని, విగ్రహారాధన చేయడం లేక అంతటా బొమ్మలు చెక్కిన చర్చిలకు వెళుతూ, ఆరాధనకు అవి తోడ్పాటు అని బోధించబడి వుంటారు. దేవుడు దీనిని అజ్ఞానం అంటున్నాడు. తానెవరో తెలియని మీరు అజ్ఞానులు అని దేవుడు అంటున్నాడు, ఎందుకంటే, నిజదేవుడు ఎవరో మీకు తెలిస్తే, ఇలాంటి ప్రతిమలను మీరు రూపొందించుకోరు, చెక్కించుకోరు, మీ ఆరాధనకు వాటిని తోడ్పాటు ఉపయోగించుకోరు.) ఆ అజ్ఞానకాలములను దేవుడు చూచి చూడనట్టుగా ఉండెను, ఇప్పుడైతే అంతటను అందరును మారుమనస్సు పొందవలెనని మనుష్యులకు ఆజ్ఞాపించుచున్నాడు. ఎందుకనగా తాను నియమించిన మనుష్యునిచేత నీతి ననుసరించి భూలోకమునకు తీర్పుతీర్చ బోయెడి యొక దినమును నిర్ణయించి యున్నాడు. మృతులలోనుండి ఆయనను లేపినందున దీని నమ్ముటకు అందరికిని ఆధారము కలుగజేసియున్నాడు.

ఇప్పటికీ కొన్ని సంవత్సరాల క్రితం, దేవుడు సాతానుతోను పడిపోయిన వాని దూతలతోను వ్యవహరించడానికి మునుపే దేవుడు ఎన్నో ఘోరమైన సంగతులను అనుమతించాడు. మానవుడు చేసే క్రియలు ఘోర చెడుతనానికి చెందినప్పటికీ, తనకు తోచిన దానిని చేయడానికి ఆయన వానికి స్వాతంత్ర్యమిస్తున్నాడు.

రోమా 5:20-21 లో బైబిల్ ఇలా చెబుతోంది, మరియు అపరాధము విస్తరించునట్లు ధర్మశాస్త్రము ప్రవేశించెను. పాపమెక్కడ విస్తరించెనో అక్కడ కృప అపరిమితముగా విస్తరించెను. పాపము ఎంత తీవ్రమైనదైతే, దేవుడు అంతగా కృపను విస్తరింపజేస్తున్నాడని గుర్తుంచుకోండి. ఘోరమైన పాపులపట్ల దేవుడు మరెంతో గొప్ప కృపను చూపుతున్నాడు.

అయితే ఒక నిర్మాణం చేపట్టడానికి ముందు, అందుకు తగిన పునాది మనం వేయాల్సిన అవసరముంది. దానికి ముందు దానికి తుదిరూపం ఇవ్వాల్సి ఉంది.

3. కృప అనే లక్ష్యం రెట్టింపుగా ఉంటుంది: మనుష్యులు తమ క్రియలు మంచివో చెడ్డవో అనుభవపూర్వకంగా ఋజువు చేసుకునే అవకాశం కల్పించడం. తాము చేసేది తప్పని గ్రహించినప్పుడు వారికి కృప అనుగ్రహించడం.

అంటే, మీరు తప్పు చేసినప్పుడు దేవుడు మిమ్మల్ని ఆపడు, కాని మీరు తప్పు చేసినప్పుడు మీరు పాపియని, మీరు చేసింది తప్పు అని మీరు ఖచ్చితంగా, హృదయపూర్వకంగా తెలుసుకోవాలని ఆయన మిమ్మల్ని కోరుతున్నాడు. మీ ఆత్మ రక్షణార్థమై మీరు ఆయనను విశ్వసించి ఆయన చెంతకు రావాలని ఆయన మిమ్మల్ని కోరుతున్నాడు. మీరు తన చెంతకు రావాలని ఆయన మిమ్మల్ని బలవంతపెడితే మీరు ఆయనను ప్రేమించరని, ఆయనను విశ్వసించరని ఆయనకు తెలుసు. పాపము చేయవద్దని, మీ చెడు జీవితాన్ని విడిచి పెట్టమని ఆయన మిమ్మల్ని బలవంతం చేస్తే, మీరు ఆయనను ప్రేమించరని ఆయనకు తెలుసు. మీ అభీష్టం ప్రకారం మీరు ఆయనవద్దకు రాకపోతే, మీరు ఆయనయందు నమ్మిక యుంచలేరని ఆయనకు తెలుసు. అలాంటప్పుడు ఆయన మీనుండి ఏదో లాక్కున్నట్టుగా మీరు ఆయనను అసహ్యించుకుంటారు, ఆయనపట్ల తీక్షణంగా ఉంటారు.

కనుక, మీరు మీ అభీష్టానుసారంగా జీవించడానికి, మీరు కోరుకున్నవాటిని జరిగించడానికి ఆయన మీకు అనుమతి ఇస్తున్నాడు. మీరు

త్రాగుతారు, జారత్వానికి పాల్పడతారు, అబద్ధమాడతారు, మోసగిస్తారు, దొంగిలిస్తారు, గాలికి తిరుగుతారు, ఉద్యోగం చేయడానికి నిరాకరిస్తారు – ఇవన్నీ చేస్తూ, "దేవుడు వీటికి వ్యతిరేకం కాదు, లేకుంటే దేవుడు నాకు తీర్పు తీర్చేవాడు. దేవుడు వీటికి వ్యతిరేకం కాదు, అందుకే ఆయన నాకు శిక్ష విధించలేదు. నేను చేసింది తప్పయితే, మీరు చెప్పినట్లుగా దేవుడు వీటిని అసహ్యించుకునేవాడయితే, ఈ పాటికి దేవుడు నన్ను చంపివుండేవాడు, నన్ను నరకంలోకి పడద్రోసి వుండేవాడు" అని మీరు అంటారు.

కాని వాస్తవానికి దేవుడు మీకు కనుసైగ చేస్తున్నాడు. మద్యపానం మిమ్మల్ని నాశనం చేస్తుందని, ఆ పాపము మీ జీవితాన్ని నాశనం చేసి, దేవుని వాక్యంపై తిరుగుబాటు చేసి, మీకు సమాధానం, సంతోషం, ఆనందం దక్కకుండ చేస్తుందని మీరు గ్రహించేవరకు దేవుడు మీ పనులను అనుమతిస్తాడు.

మీరిలా చెడుగా జీవించినప్పటికీ, దేవుని వాక్యాన్ని నిరంతరం అతిక్రమిస్తున్నప్పటికీ, ఆయన ఇంకా మిమ్మల్ని ప్రేమిస్తున్నాడని, మీపట్ల ఓర్పు సహనం చూపుతున్నాడని గ్రహించినప్పుడు అది మీకెంతో విస్మయం కలిగిస్తుంది. అప్పుడు మీరు ఆయనను ప్రేమిస్తారు, ఆయనయందు నమ్మికయుంచుతారు, మీ పాపక్షమాపణ కోసం ఆయన చెంతకు వస్తారు.

ఇదే దేవుని జ్ఞానం, కార్యసిద్ధి కలిగించే దేవుని గొప్ప కృప.

మరలా చెబుతున్నాను, దేవుని కృప రెట్టింపు లక్ష్యాలతో కూడినది: మనుష్యులు తమ క్రియలు మంచివో చెడ్డవో తమ అనుభవపూర్వకంగా ఋజువు చేసుకునే అవకాశం కల్పించడం. తాము చేసేది తప్పని గ్రహించినప్పుడు వారిపట్ల కృప అనుగ్రహించడం.

గలతీ 6:7-8 లో బైబిల్ ఇలా చెబుతోంది, మోసపోకుడి, దేవుడు వెక్కిరింపబడడు. మనుష్యుడు ఏమివిత్తునో ఆ పంటనే కోయును. ఏలాగనగా తన శరీరేచ్ఛలనుబట్టి విత్తువాడు తన శరీరమునుండి క్షయమను పంట కోయును, ఆత్మనుబట్టి విత్తువాడు ఆత్మనుండి నిత్యజీవమను పంట కోయును.

ప్రియ నేస్తమా, మీ మనస్సు, మీ ఆరోగ్యం, మీ బలం, మీ భవిష్యత్తు, మీ జీవితం చేజారిపోతుండడం, క్షయమై, శిథిలం కావడం, శూన్యంగా మారడం, సమాధివైపు పరుగెడడం మీరు గమనించినప్పుడు, దేవుడు వెక్కిరించబడడు అని మీరు ఎట్టకేలకు గ్రహించాలి. మీకెంతో ప్రియమైనవన్నీ నిత్యత్వంతో పోలిస్తే, ఎందుకూ కొరగావని, దేవుని లేని, నిరీక్షణలేని స్థితిలో

లోకంలో ఒంటరివారవుతారని, మీకు లాభకరమైనదేదీ లేదని మీకు అర్థమవుతుంది. మీరు కొన్ని విత్తనాలు నాటారు, అవి మొలకెత్తాయి. మీరు నాటిన వాటి పంటను ఇప్పుడు కోయబోతున్నారు.

దేవుడు కృపగలవాడు. ఆయన మిమ్మును క్షమిస్తాడు. ఆయన మిమ్మును రక్షిస్తాడు. ఆయన మిమ్మల్ని మన్నిస్తాడు. ఆయన మిమ్మల్ని శుద్ధి చేస్తాడు. అయితే, మీరు ఆయనవైపు తిరగాలి. మీరు ఏదో ఒక విధంగా తప్పించుకుంటారని, దేవుడు పాపాన్ని ద్వేషించడని సాతాను మీతో అబద్ధమాడతాడు. మీరు ఏ విధంగానూ తప్పించుకోలేరు. మీరు తన చెంతకు పరుగెత్తుకొని వచ్చే సమయం వరకు మీ పరుగును కొనసాగించడానికి దేవుడు మిమ్మల్ని అనుమతిస్తాడు.

4. అందరూ పాపులే కనుక దేవుడు ఎలాంటి పక్షపాతం లేకుండ అందరికి కృప అనుగ్రహిస్తున్నాడు.

రోమా 3:23 లో, అందరును పాపముచేసి దేవుడు అనుగ్రహించు మహిమను పొందలేక పోవుచున్నారు అని బైబిల్ తేటగా చెబుతోంది. మనుష్యులందరూ పాపము చేసినట్లయితే, దేవుడు అందరికీ కృపను అనుగ్రహించి వారిని రక్షించి, క్షమించి, శుద్ధి చేసి, మన్నిస్తాడు. ప్రియ నేస్తమా, దేవుడు పక్షపాతి కాదు. ఆయన అన్యాయస్తుడు కాదు. మనుష్యులందరూ పాపము చేశారు కనుక ఆయన అందరిపట్ల పరిపూర్ణంగా న్యాయం తీరుస్తాడు.

"దేవుడు న్యాయవంతుడై, సమస్త పాపముపై ఒకేసారి తీర్పు తీరిస్తే, ఆయన సత్యవంతుడని ఋజువవుతుంది" అని జనులు అంటారు.

దేవుడు న్యాయవంతుడని ఆయన కృప కూడ ఋజువు చేస్తుంది. ఆయన న్యాయవంతుడు మాత్రమే కాక, పాపములో పడిపోయిన మానవునిపట్ల ప్రేమామయుడు, దయామయుడు, కనికరం గలవాడు.

రోమా 11:26-36 లో బైబిల్ ఇలా చెబుతోంది, వారు ప్రవేశించునప్పుడు విమోచకుడు సీయోనులోనుండి వచ్చి యాకోబులో నుండి భక్తిహీనతను తొలగించును. నేను వారి పాపములను పరిహరించినప్పుడు నావలన వారికి కలుగు నిబంధన ఇదియే అని వ్రాయబడినట్టు ఇశ్రాయేలు జనులందరును రక్షింపబడుదురు. సువార్త విషయమైతే వారు మిమ్మునుబట్టి శత్రువులు గాని, యేర్పాటు విషయమైతే పితరులనుబట్టి ప్రియులై యున్నారు. ఏలయనగా, దేవుడు తన కృపావరముల విషయములోను, పిలుపు విషయములోను పశ్చాత్తాపపడడు.

మీరు గతకాలమందు దేవునికి అవిధేయులై యుండి, యిప్పుడు వారి అవిధేయతనుబట్టి కరుణింపబడితిరి. అటువలెనే మీ యెడల చూపబడిన కరుణనుబట్టి వారును ఇప్పుడు కరుణ పొందు నిమిత్తము, ఇప్పుడు వారు అవిధేయులై యున్నారు. అందరియెడల కరుణ చూపవలెనని, దేవుడు అందరిని అవిధేయతాస్థితిలో మూసివేసి బంధించియున్నాడు. ఆహా, దేవుని బుద్ధి జ్ఞానముల బాహుళ్యము ఎంతో గంభీరము, ఆయన తీర్పులు శోధింప నెంతో అశక్యములు, ఆయన మార్గములెంతో అగమ్యములు. ప్రభువు మనస్సును ఎరిగినవాడెవడు? ఆయనకు ఆలోచన చెప్పిన వాడెవడు? ముందుగా ఆయనకిచ్చి, ప్రతిఫలము పొందగలవాడెవడు? ఆయన మూలమునను ఆయన ద్వారాను ఆయన నిమిత్తమును సమస్తము కలిగియున్నవి. యుగముల వరకు ఆయనకు మహిమ కలుగును గాక. ఆమేన్.

కనుక దేవుడు ఏమి చేస్తాడు? ఆయన ఇశ్రాయేలు ప్రజలను కొంతకాలం తమ స్వంత మార్గంలో నడవనిచ్చాడు. చివరకు, ఇశ్రాయేలు పాపఫలితంగా, అన్యజనాంగాలు దేవుని చెంతకు వచ్చి, దేవుని కృపను కనికరాన్ని, ఆయన రక్షణను పొందుకున్నారు.

ఆ తరువాత ఏమి జరిగింది? అన్యదేశాలు పాపములో పడిపోయి, మార్గం తప్పిపోయినప్పుడు, దాని పర్యవసానంగా, ఇశ్రాయేలీయులు దేవుని చెంతకు వచ్చి దేవుని కృపను, కనికరాన్ని, రక్షణను పొందుకున్నారు.

అందరూ అవిశ్వాసులని, అందరూ పాపము చేశారని, అందరూ అతిక్రమించారని, ఇప్పుడు అందరూ కనికరం పొందవచ్చని బైబిల్ చెబుతోంది. ఎందుకంటే దేవుడు అందరిపట్ల కనికరం చూపులాగున అందరూ అవిశ్వాస స్థితిలో బంధించబడివున్నారని దేవుడు ముక్తాయించాడు.

దేవుని జ్ఞానంలోని లోతుపాతులను, ఐశ్వర్యసంపదలను మీరు చూడగలరా? అవి శోధింపశక్యం కానివి. ఆయన మార్గాలు గ్రహింపశక్యం కానివి. ఇది దేవుడు లోకంపట్ల ఎంతటి ఆశ్చర్యమైన కృపతో వ్యవహరిస్తున్నాడో చూడండి.

5. తీర్పు, కనికరం అనేవి పరస్పరం వ్యతిరేకమైన తీవ్రతలు, కాని కృప కార్యరూపం దాల్చినప్పుడు ఈ రెండూ ఏకమవుతాయి.

కీర్తన 85:1-2 లో ఇది ఎంతో సొగసుగా చెప్పబడింది. యెహోవా, నీవు నీ దేశము ఎడల కటాక్షము చూపి యున్నావు చెరకుపోయిన యాకోబు సంతతిని

నీవు వెనుకకు రప్పించియున్నావు. నీ ప్రజల దోషమును పరిహరించియున్నావు వారి పాపమంతయు కప్పివేసి యున్నావు. 10వ వచనంలో మనమిలా చదువుతాం, కృపాసత్యములు కలిసికొనినవి, నీతి సమాధానములు ఒకదానినొకటి ముద్దు పెట్టుకొనినవి.

దేవుని కృపాకనికరములనుబట్టి ప్రధాన పాపి కూడ రక్షణ పొందుతాడు.

"అయితే అది సాధ్యం కాదు, అలా జరగడం న్యాయం కాదు. దేవుని తీర్పు పాపక్రయధనానికి త్యాగపూరితమైన మూల్యం కోరుతుంది" అని మీరనవచ్చు.

పాత నిబంధన త్యాగాలన్నీ ఒకరోజున రానున్న త్యాగాన్ని దృశ్యంగా చూపుతున్నాయి: లోకపాపములను మోసుకొని పోవు దేవుని గొఱ్ఱెపిల్ల.

నేరస్థుడైన పాపిని విమోచించడానికి యేసుక్రీస్తు వచ్చి అతని స్థానం తాను తీసుకున్నాడు.

ఏలయనగా ఎడ్లయొక్కయు మేకలయొక్కయు రక్తము పాపములను తీసివేయుట అసాధ్యము. కాబట్టి ఆయన ఈ లోకమందు ప్రవేశించునప్పుడు ఈలాగు చెప్పుచున్నాడు. బలియు అర్పణయు నీవు కోరలేదుగానినాకొక శరీరమును అమర్చితివి. యేసుక్రీస్తుయొక్క శరీరము ఒక్కసారియే అర్పింపబడుటచేత ఆ చిత్తమునుబట్టి మనము పరిశుద్ధపరచబడియున్నాము. ఒక్క అర్పణచేత ఈయన పరిశుద్ధపరచబడు వారిని సదాకాలమునకు సంపూర్ణులనుగా చేసియున్నాడు (హెబ్రీ 10:4–5, 10, 14).

మనము పాపముల విషయమై చనిపోయి, నీతివిషయమై జీవించునట్లు, ఆయన తానే తన శరీరమందు మన పాపములను మ్రానుమీద మోసి కొనెను. ఆయన పొందిన గాయములచేత మీరు స్వస్థత నొందితిరి (1పేతురు 2:24).

పితృపారంపర్యమైన మీ వ్యర్థప్రవర్తనను విడిచిపెట్టునట్లుగా వెండి బంగారములవంటి క్షయ వస్తువులచేత మీరు విమోచింపబడలేదుగాని అమూల్యమైన రక్తముచేత, అనగా నిర్దోషమును నిష్కళంకమునగు గొఱ్ఱెపిల్లవంటి క్రీస్తు రక్తముచేత, విమోచింపబడితిరని మీరెరుగుదురు గదా (1పేతురు 1:18–19).

యేసు బలియాగం దేవుని నీతిని నెరవేర్చిందనే బైబిల్ సత్యాన్ని ఈ వచనాలు స్పష్టం చేస్తున్నాయి. ప్రభువైన యేసుక్రీస్తు లోకపాపాలను తనపై వేసుకున్న కల్వరిలో, పాపముపై దేవుని తీర్పు నెరవేరింది. ఆయన బలియాగం

సర్వకాలాలకు ప్రామాణికమవుతుంది. పాపిపై పడవలసిన ప్రభావాన్ని యేసుక్రీస్తు తన బలియాగంలో భరించాడు. పాపిపై పడవలసిన ఉగ్రత ఆయనపై పడింది.

పాపఋణంనుండి పాపిని ఆయన ఒక విమోచకునిగా మరల కొనుగోలు చేశాడు. ప్రియ నేస్తమా, దేవుడు తన కృపను మనపై క్రుమ్మరించులాగున తన నీతిని ఆలాగు నెరవేర్చాడు.

ఒక గొప్ప దినాన పిలిప్పు నపుంసకునికి అరణ్యమార్గంలో యేసుక్రీస్తును గురించి మాట్లాడుతూ యెషయా 53:3-11 నుండి చదివి వివరించిన వాక్యభాగాన్ని మీ కోసం చదువుతాను. అతడు తృణీకరింపబడినవాడును ఆయెను మనుష్యులవలన విసర్జింపబడినవాడును వ్యసనాక్రాంతుడుగాను వ్యాధి ననుభవించినవాడు గాను మనుష్యులు చూడనొల్లనివాడుగాను ఉండెను. అతడు తృణీకరింపబడినవాడు గనుక మనము అతనిని ఎన్నికచేయకపోతిమి. నిశ్చయముగా అతడు మన రోగములను భరించెను మన వ్యసనములను వహించెను అయినను మొత్తబడినవానిగాను దేవునివలన బాధింపబడినవానిగాను శ్రమనొందినవానిగాను మనమతనిని ఎంచితిమి. మన యతిక్రమక్రియలనుబట్టి అతడు గాయపరచబడెను మన దోషములనుబట్టి నలుగగొట్టబడెను మన సమాధానార్థమైన శిక్ష అతనిమీద పడెను అతడు పొందిన దెబ్బలచేత మనకు స్వస్థత కలుగు చున్నది. మనమందరము గొఱ్ఱలవలె త్రోవ తప్పిపోతిమి. మనలో ప్రతివాడును తనకిష్టమైన త్రోవకు తొలిగెను యెహోవా మన యందరి దోషమును అతనిమీద మోపెను. అతడు దౌర్జన్యము నొందెను బాధింపబడినను అతడు నోరు తెరవలేదు వధకు తేబడు గొఱ్ఱపిల్లయు బొచ్చు కత్తిరించువానియెదుట గొఱ్ఱయు మౌనముగా నుండునట్లు అతడు నోరు తెరువలేదు. అన్యాయపు తీర్పునొందినవాడై అతడు కొనిపోబడెను అతడు నా జనుల యతిక్రమమునుబట్టి మొత్తబడెను గదా. సజీవుల భూమిలోనుండి అతడు కొట్టివేయబడెను అయినను అతని తరమువారిలో ఈ సంగతి ఆలోచించినవారెవరు? అతడు మరణమైనప్పుడు భక్తిహీనులతో అతనికి సమాధి నియమింపబడెను ధనవంతునియొద్ద అతడు ఉంచబడెను నిశ్చయముగా అతడు అన్యాయమేమియు చేయలేదు అతని నోట ఏ కపటమును లేదు. అతని నలుగగొట్టుటకు యెవాకు ఇష్టమాయెను ఆయన అతనికి వ్యాధి కలుగజేసెను. అతడు తన్ను తానే అపరాధపరిహారార్థబలిచేయగా అతని సంతానము చూచును. అతడు దీర్ఘాయుష్మంతుడగును, యెవా ఉద్దేశము అతనివలన సఫలమగును. అతడు

తనకు కలిగిన వేదనను చూచి తృప్తినొందును. నీతిమంతుడైన నా సేవకుడు జనుల దోషములను భరించి తనకున్న అనుభవజ్ఞానము చేత అనేకులను నిర్దోషులుగా చేయును.

నా స్నేహితులారా, దేవుడు తన కుమారుని వేదనను చూశాడు. దేవుడు తన కుమారుని శ్రమను చూశాడు. దేవుడు తన కుమారుడు కల్వరి సిలువపై చెల్లించిన త్యాగపూరితమైన ఋణాన్ని చూశాడు. పాపము విషయమై దేవుని న్యాయతీర్పునకు చెల్లించాల్సిన ఋణం, ప్రభువైన యేసుక్రీస్తు అను వ్యక్తిలో తీర్చబడింది.

మీరు దేవుని కృపను పొందులాగున ఆయన దేవుని తీర్పును ఎదుర్కొన్నాడు.

దేవుని కుమారుడు మీ కోసం మరణం అనుభవించి, మీ పాపఋణాన్ని చెల్లించాడు కనుక, ఇక మీ పాపాల కోసం మీరెందుకు నరకంలో మరణం అనుభవించాలి?

మనకు రక్షకుడు అనుగ్రహించబడడమంటే అదే. రక్షణ పొందడమంటే అదే. అది దేవుని కోసం చేసే కార్యం కాదు. దేవుని కోసం కష్టపడడం కాదు. ఇవేవీ మీకు రక్షకుని అనుగ్రహించవు.

దేవుడు ఒక కార్యం చేశాడు. మీరు ఉచితంగా రక్షింపబడులాగున దేవుడు ఒక కార్యం జరిగించాడు, ఒక రక్షకుని అనుగ్రహించాడు. నిత్యజీవం దేవుని వరం.

దేవుడు విమోచకుని పంపకపోతే, మానవునికి నిరీక్షణ లేదు. మీరిప్పుడు రక్షింపబడి ఉండకపోతే, మీ జీవితంలో పాపప్రభావం మీలో పనిచేస్తుంది, మీ పాపఋణం ఎప్పుడో ఒకప్పుడు నిత్యమరణంలో ముగుస్తుంది. మీ మనస్సాక్షిలోను, బైబిల్‌లోను అపరాధభావం ప్రశ్నాతీతంగా స్థాపించబడింది. ఏ విధమైన మానవ ప్రయత్నంతో మీరు దానిని పునరుద్ధరించలేరు. అలాంటి స్థితి ప్రేమతో కూడిన ఉన్నత త్యాగాన్ని కోరుతుంది. ఇక్కడ దేవునిలో తప్పు లేదు. ఆయన ఏకకుమారునిలో కూడ ఎలాంటి తప్పు లేదు. ప్రేమ దానిని బలవంతం చేస్తుంది.

ఇందులో ఎలాంటి నిస్సార తర్కానికి లేక వెఱ్ఱి భావాలకు తావు లేదు. "క్రీస్తు మీ జీవితంలోకి వస్తాడులే" అనుకోడానికి లేదు. మీకు జీవితమంటూ ఉండదు. తీవ్రమైన వాస్తవాలను మీరు ఎదుర్కోవలసి ఉంటుంది. సిలువపై యేసు వేదనను, రక్తాన్ని, అంధకారాన్ని ఎదుర్కొన్నాడు. పాపశ్రమను ఎవరో

ఒకరు ఎదుర్కోవలసి ఉంది. యేసుక్రీస్తు శ్రమనొందాడు. అనీతిమంతుని కోసం నీతిమంతుడు – మీ పాపాల కోసం పాపరహితుడైన క్రీస్తు మరణించాడు. సమాప్తమైనది అని ఆయన యోహాను 19:30 లో కేక వేశాడు.

యేసుక్రీస్తు మీ పాపాల కోసం సంపూర్ణంగా చెల్లించిన ఋణాన్ని మీరు పొందుకున్నారా? మీ ఆత్మ రక్షణ పొందడానికి మరో నిరీక్షణ ఏదీ లేదు. దేవుని రాజ్యాన్ని మీరు చూడగలిగే మరో మార్గమేదీ లేదు. మీరు తిరిగి జన్మిస్తే తప్ప దేవుని రాజ్యంలోనికి ప్రవేశించే అవకాశం లేదు. ప్రభువైన యేసుక్రీస్తునందు విశ్వాసముంచడం తప్ప మరేవిధంగానూ మీరు నూతన జన్మను పొందలేరు.

ఆయన మీ పాపఋణం చెల్లించడానికి మరణించాడు. మిమ్మల్ని నీతిమంతులుగా తీర్చడానికి ఆయన తిరిగి లేచాడు. మీరాయనయందు విశ్వాసముంచితే, మీరు రక్షింపబడతారు.

ఆయన మీ కోసం చేసిన దానికి స్పందనగా మీరు ఆయన నామములో ఆయన కొరకు ఏదైనా చేయాలని ప్రయత్నించే కార్యాలు, మీకు రక్షణ కలిగించవు. అవి మిమ్మల్ని రక్షించజాలవు. మిమ్మల్ని మీరు రక్షించుకోండి అని దేవుడు మీకు చెప్పలేదు. ***లోకపాపములను మోసికొనిపోవు దేవుని గొఱ్ఱెపిల్లయందు విశ్వాసముంచుము*** అని ఆయన చెబుతున్నాడు. విశ్వసించి రక్షణ పొందండి!